సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 191

మంగళవారం 1-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



దాదాకు ఫాల్కే

బాలీవుడ్‌లో తెల్లరంగు హీరోల మధ్య మొదటిసారి ఒక నల్లరంగు హీరో జెండా ఎగరేశాడు. 'డిస్కో డాన్సర్'తో మిథున్ చక్రవర్తి డాన్సింగ్ సూపర్‌స్టార్ అయ్యాడు. ఇండస్ట్రీకి అతను 'మిథున్‌దా'! దాదాకు దాదాసాహెబ్ ఫాల్కే!!

- వివరాలు 13లో▶



సిద్దూపై ఈడీ కేసు

'ముడా' కేసులో కర్ణాటక సీఎం సిద్దరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది.

వివరాలు 6లో ▸



ఆ దళిత విద్యార్థికి సీటివ్వండి

సమయానికి ఫీజు కట్టలేక ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు కోల్పోయిన నిరుపేద దళిత విద్యార్థికి సర్వోన్నత న్యాయస్థానం దన్నుగా నిలిచింది.

వివరాలు 6లో ▸



కవలలే గానీ.. గర్భాశయాలు వేరు

వారు కవలలే. ఒక తల్లి పిల్లలే. కాకపోతే చెరో గర్భాశయం నుంచి పుట్టుకొచ్చారు. అదెలా సాధ్యమంటారా?

వివరాలు 6లో ▸



కాన్పూర్ టెస్టులో భారత్ జోరు

బంగ్లాదేశ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285/9 డిక్లేర్డ్.. 52 పరుగుల ఆధిక్యం. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 26/2.

వివరాలు 14లో ▸

ఎలాంటి ఆధారాల్లేవ్

చంద్రబాబు 'కొవ్వు' ప్రకటనపై సుప్రీంకోర్టు కన్నెర్ర

కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తుందని తెలియదా?

మీ రాజకీయాలకు దేవుడిని దూరంగా ఉంచండి

- వాస్తవాలు నిర్ధారణ కాక ముందే రాజకీయ ప్రకటనలు ఎలా చేస్తారు?
- అసలు ఆ నెయ్యిని వాడనే లేదని టీటీడీ ఈవో స్వయంగా చెప్పారుగా?
- లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు ఉందని ముఖ్యమంత్రి ఎలా చెబుతారు?
- ఆధారాల్లేకపోయినా రాజ్యాంగ పదవిలో ఉన్న సీఎం అలా ఎలా ప్రెస్ ముందు మాట్లాడతారు?.. ఆ వ్యాఖ్యలతో 'సిట్' దర్యాప్తు ప్రభావితం కాదా?
- ఎన్‌డీడీబీ రిపోర్టులోనే తమ నివేదిక తప్పు కూడా కావచ్చని చెబుతోంది కదా?
- ఎన్‌డీడీబీ నివేదికపై సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదు?
- అదొక్కటే కాదు.. దేశంలో పేరుమోసిన ల్యాబ్‌లు ఎన్నో ఉన్నాయి
- సిట్ దర్యాప్తు కొనసాగించాలా? లేక స్వతంత్ర సంస్థకు అప్పగించాలా?
- ఏదో ఒక విషయం చెప్పండి.. కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రకటనల విషయంలో నియంత్రణ పాటించాలని మీ క్లయింట్‌లకు చెప్పండి
- సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు ధర్మాసనం మౌఖిక ఆదేశం
- సుప్రీంకోర్టులో తదుపరి విచారణ అక్టోబర్ 3 మధ్యాహ్నానికి వాయిదా

12లో

జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్

జస్టిస్ కేవీ విశ్వనాథన్



ముఖ్యమంత్రి ప్రకటనకు పూర్తి విరుద్ధంగా.. టీటీడీ ఈవో ప్రకటన ఉంది. కల్తీ నెయ్యి విషయంలో మీ (టీటీడీ) వైఖరి చాలా స్పష్టంగా ఉంది. సీఎం చేసిన ప్రకటనలకు ఎలాంటి ఆధారాల్లేవ్. దర్యాప్తునకు ఆదేశించినప్పుడు పదాల గారడీ ఎంత మాత్రం అవసరం లేదు.

ఎన్‌డీడీబీ నివేదిక జూలైలో వస్తే ముఖ్యమంత్రి సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడినట్లు? జూలైలో వచ్చిన నివేదికపై అప్పుడే ఎందుకు మాట్లాడలేదు? నెయ్యిలో జంతు కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. అసలు ఈ ప్రకటన చేయడానికి ఆయన వద్ద ఉన్న ఆధారాలు ఏమిటి? ఆ లడ్డూలను పరీక్షల నిమిత్తం ఎందుకు పంపలేదు? ప్రెస్ ముందుకు వెళ్లే ముందు లడ్డూలను పరీక్షించడం సరైనదని మీరు (సీఎం) భావించలేదా? బహిరంగ ప్రకటనలు ఎందుకు చేయాలి? బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు అలాంటి ప్రకటనలు చేయవచ్చా? దాని వల్ల సిట్ దర్యాప్తు ప్రభావితం కాదా? అది కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని తెలియదా? లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారనేందుకు ప్రస్తుతం ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి.

ఏపీ సీఎం చంద్రబాబునుద్దేశించి 'సుప్రీం' ఘాటు వ్యాఖ్యలు

హైకోర్టునూ కూల్చేస్తారా?

తహసీల్దార్ ఏది చెబితే అది చేస్తారా?

హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో నిర్మాణం కూల్చివేతపై న్యాయమూర్తి విచారణ
- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు అమీన్‌పూర్ తహసీల్దార్ రాధపై ప్రశ్నల వర్షం
- మీకు చట్టం తెలియదా? స్టే ఉన్న ఆస్తిని సెలవు రోజు ఎందుకు కూల్చారు?
- విస్తృత ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు పాటించరా?
- రాజకీయ నాయకులు చెప్పింది వింటే ఇబ్బందులు పడేది మీరేనన్న న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్
- నిర్మాణంపై స్టేటస్ కో.. విచారణ 15కు వాయిదా

- వివరాలు 2లో



9న టీచర్ నియామక పత్రాలు

- ఎల్‌బీ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించి అందజేస్తాం: సీఎం రేవంత్
- డీఎస్సీ–2024 ఫలితాలను విడుదల చేసిన సీఎం
- త్వరలోనే గ్రూప్–1 పరీక్షల ఫలితాలను విడుదల చేస్తామని ప్రకటన

3లో

జిల్లాలకు డీఎస్సీ మెరిట్ జాబితాలు

న్యూస్‌రీల్

మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వు బ్యాంకు



మూసీ ప్రాజెక్టు పేరుతో అతిపెద్ద కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కాంగ్రెస్ రిజర్వుబ్యాంకులా వాడుకోవాలని చూస్తోందన్నారు.

- వివరాలు 2లో▶

మీ మేనిఫెస్టోల్లో పెట్టలేదా?



మూసీ ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటుంటే బీఆర్‌ఎస్, బీజేపీ రాద్ధాంతం చేస్తున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను ఆ పార్టీలు ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టలేదా అని నిలదీశారు.

- వివరాలు 2లో▶

కనురెప్పలను కాపాడుకుందాం..

- లోపలి పేజీల్లో..

క్లుప్తంగా...

ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం రాత్రి ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల అస్వస్థతకు గురయిన నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు రేవంత్ ఢిల్లీ వెళ్లారని, మంగళవారం రాత్రికల్లా తిరిగి హైదరాబాద్ వస్తారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

జపాన్ చేరుకున్న భట్టి



సాక్షి, హైదరాబాద్: వారం రోజుల అమెరికా పర్యట న ముగించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సోమవారం జపాన్‌కు చేరుకున్నారు. మూడు రోజుల పాటు జపాన్‌లో పర్యటించి ఈనెల 4న హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మంత్రితో పాటు జపాన్‌కు వెళ్లారు. పర్యావరణహిత పరిశ్రమలు, అత్యాధునిక మైనింగ్ సంబంధిత టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలపై అధ్యయనంలో భాగంగా అక్కడి పరిశ్రమలను సందర్శించనున్నారు. దిగ్గజ కంపెనీలతో సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలో పెట్టుబడులను పెట్టాలని ఆహ్వానించనున్నారు. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుదుత్పత్తి, ఇతర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అక్కడి పారిశ్రామికవేత్తలతో చర్చించనున్నారు.

సీఎస్‌కు హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నేరుగా లేదా అడ్వొకేట్ ద్వారా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అలాగే డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిగుప్తాకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ అక్టోబర్ 25కు వాయిదా వేసింది. ఈ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పాటించడం లేదంటూ హైకోర్టులో ఫోరం యాంటీ కరప్షన్ పిటిషన్ దాఖలు చేసింది. 'ఐజీ, డీఐజీ, ఎస్పీ, సీఐ ర్యాంక్ అధికారులకు కనీసం రెండేళ్ల సర్వీస్ వ్యవధిని అమలు చేయడం లేదు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయడం లేదు. కావాలనే కోర్టు ఆదేశాలు పాటించని సీఎస్, డీజీపీ, హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి రూ.5 లక్షల జరిమానా విధించాలి'అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నారాయణ అలిశెట్టి ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఒకే రోజు 12.37 లక్షల కేసులు పరిష్కరించాం

టీఎస్ఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి పంచాక్షరి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒకే రోజు 12,37,349 కేసులను పరిష్కరించామని టీఎస్ఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి పేర్కొన్నారు. వీటిలో ప్రీ-లిటిగేషన్ కేసులు 6,32,900, వివిధ కేటగిరీల్లోని పెండింగ్ కేసులు 6,04,449 ఉన్నాయన్నారు. లబ్ధిదారులకు రూ.224 కోట్లు పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి పర్యవేక్షణలో రికార్డు స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసులను పరిష్కరించుకుని సత్వర న్యాయం పొందిన కక్షిదారులను అభినందించారు. ఇప్పుడు లబ్ధిపొందని వారు భవిష్యత్‌లోనూ ఇలాంటి కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. సివిల్ కేసుల్లో ఏళ్లగా కోర్టు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా న్యాయం పొందవచ్చని వివరించారు.

ఇదండీ సంగతి






అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

కంటికి రెప్పలా కాపాడుకునేలా టెక్నాలజీ

సాక్షి, హైదరాబాద్: వయోవృద్ధులు అంటే చిన్న పిల్లలతో సమానం. చిన్న పిల్లలను చూసుకున్నట్టే వారినీ చూసుకోవాలి, కాపాడుకోవాలి. ఇప్పుడున్న బిజీ ప్రపంచంలో చాలా మందికి తమ కుటుంబాల్లోని పెద్ద వయసువారిని చూసుకోవడం ఇబ్బందిగా మారుతోంది. ప్రతి క్షణం కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఉన్నా.. అది ప్రాక్టికల్‌గా సాధ్యపడకపోవచ్చు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ వేరే ప్రాంతాలు, దేశాల్లో ఉండేవారు.. ఇంట్లోనే ఉన్నా పొద్దస్తమానం పనుల ఒత్తిడితోనే సతమతం అయ్యేవారు.. పెద్దవారి ఆరోగ్యం, ఆలనాపాలనా చూసుకోవడానికి 'టెక్నాలజీ'సాయం చేస్తోంది. వృద్ధుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మానిటర్ చేసే స్మార్ట్ వాచీలు, పరికరాలు మార్కెట్లోకి వచ్చాయి. రక్తపోటు, గుండె వేగం, షుగర్ లెవల్స్ వంటి వివరాలను ఎప్పటికప్పుడు గమనించి.. 'మెషీన్ లెర్నింగ్ ప్రోగ్రామ్'ల సాయంతో ఆరోగ్యాన్ని విశ్లేషించి హెచ్చరించే పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఏదైనా ఇబ్బంది ఏర్పడితే వెంటనే.. చికిత్స అందించేందుకు, పెద్దలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు వీలు ఏర్పడుతోంది.

పెద్దల కోసం 'అన్వయ'!..: హైదరాబాద్ కేంద్రంగా 'అన్వయ కిన్ కేర్ టెక్నాలజీ'వృద్ధులకు అవసరమైన సేవలు అందిస్తుంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వయోవృద్ధులను స్మార్ట్ వాచ్ సాయంతో గమనిస్తూ ఉండవచ్చు. అందులో ప్రత్యేక యాప్ పెద్దల ఆరోగ్యాన్ని గమనించడమే కాదు.. ఒకవేళ జారిపడినా, ఏదైనా ప్రమాదం జరిగినా వెంటనే పిల్లలకు అలర్ట్ పంపుతుంది. పిల్లలు గనుక దగ్గర లేకపోతే అన్వయ కేర్ సెంటర్ తమ సిబ్బందిని వెంటనే పంపి అవసరమైన సాయం అందిస్తుంది. అంతే కాదు.. వయోవృద్ధుల్లో చాలా మందికి 'డిమెన్షియా (మతిమరుపు)'వ్యాధి వస్తుంటుంది. ఏం చేస్తున్నామో కూడా తెలియని, అర్థంకాని స్థితిలోకి వెళ్లిపోతుంటారు. అలాంటి వారికోసం కూడా 'అన్వయ'లో సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేశారు. జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ వంటివాటితో పెద్దలను మానిటర్ చేస్తారు. నిర్ధారిత ప్రాంతం వదిలి పెద్దవారు బయటకి వెళ్తే.. వెంటనే పిల్లలకు మెసేజ్ వెళ్తుంది. ఎక్కడున్నారో ఆచూకీ చూపుతుంది.



హైకోర్టునూ కూల్చేస్తారా?

తహసీల్దార్ ఏది చెబితే అది చేస్తారా?

హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేత ఘటనపై హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'హైకోర్టును కూల్చివేయాలని తహసీల్దార్ లేఖ రాస్తే సిబ్బందిని, యంత్రాలను ఏర్పాటు చేస్తారా? మీకు చట్టం తెలియదా? ఆదివారం, సూర్యాస్తమయం తరువాత కూల్చివేత చేపట్టవద్దని విస్తృత ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు పాటించరా? చట్టం తెలియకపోతే ప్రభుత్వ న్యాయవాదులను అడిగి తెలుసుకోరా? మీడియాతో మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తారా?'అంటూ మండిపడింది. స్టే ఇచ్చిన ఆస్తిని సెలవు రోజు ఎందుకు కూల్చాల్సి వచ్చిందన్న దానికి సమాధానం ఉందా అని ప్రశ్నించగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్, అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ సమాధానం చెప్పలేదు. హైడ్రా ఏర్పాటు అభినందనీయమే అయినా పని తీరు మాత్రం అసంతృప్తికరమని వ్యాఖ్యానించింది. రాజకీయ నాయకులు చెప్పింది వింటే ఇబ్బందులు పడేది మీరే అన్న విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేస్తూ, అలోగా కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రా, తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసింది. అప్పటి వరకు ఆస్తిపై స్టేటస్ కో విధించింది.

కమిషనర్, తహసీల్దార్ హాజరు

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామపంచాయతీ పరిధి సర్వే నంబర్ 165, 166లోని 270 గజాల స్థలంలో నిర్మాణానికి 2022, నవంబర్ 10న మహ్మద్ రఫీ భవన నిర్మాణ అనుమతి పొందారు. అయితే ఆ స్థలం సర్వే నంబర్ 164లో ఉందని, అది ప్రభుత్వ భూమి అంటూ అధికారులు అనుమతి రద్దు చేశారు. ఈ క్రమంలో నోటీసులు జారీ చేసి ఆదివారం ఆ స్థలంలోని నిర్మాణాన్ని కూల్చివేశారు. దీన్ని సవాల్ చేస్తూ రఫీ, గణేశ్ నిర్మాణ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్ హాజరు కావాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో సోమవారం తహసీల్దార్ నేరుగా, కమిషనర్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు వారు సరైన సమాధానాలు చెప్పలేకపోయారు.



ఆదివారం ఇంట్లో ఉండకుండా ఇదేంటీ?

'వివాదాస్పద ఆస్తి సర్వే నంబర్ 165, 166లో ఉందని పిటిషనర్లు పేర్కొంటున్నారు. బిల్డింగ్ పర్మిషన్ 2022 నవంబర్‌లో తీసుకున్నారు. కానీ వాస్తవంగా అది సర్వే నంబర్ 164లో ఉంది. ఈ విషయం 2024 మార్చిలో తెలిసింది. ఏప్రిల్ 1న సర్వే చేశాం. ఏప్రిల్ 24న కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కూడా సర్వే చేశారు. ఏప్రిల్ 2న పిటిషనర్లకు నోటీసులిచ్చాం. దానికి వారు ఏప్రిల్ 15, 18 తేదీల్లో వివరణ ఇచ్చారు. అనంతరం సెప్టెంబర్ 20న నోటీసులు జారీ చేశాం. 22న ఉదయం హైడ్రా సాయంతో కూల్చివేత చేపట్టాం..'అని తహసీల్దార్ చెప్పారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'పిటిషనర్ల వాదనలు విన్నారా? బిల్డింగ్ అనుమతి రద్దుపై, విద్యుత్ తొలగింపుపై స్టే ఉంది తెలుసా? చట్ట ప్రకారం ముందుకు వెళ్లమని చెప్పాం కదా? శనివారం సాయంత్రం 6.30 గంటలకు నోటీసులు అందితే.. ఆదివారం ఉదయం 7.30 గంటలకు కూల్చివేస్తారా? అసలు ఆదివారం మీకు సెలవు కదా.. ఇంట్లో ఉండకుండా, అత్యవసరంగా విధులకు హాజరై మరీ కూల్చివేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఐదు నెలలుగా ఆగుతూ వచ్చి ఒక్క రోజులో కూల్చివేత ఎందుకు? సెప్టెంబర్ 20న ఇచ్చిన ఆదేశాల్లో ఖాళీ చేయడానికి 48 గంటల సమయం ఇచ్చారు కదా. ఆ గడువు పూర్తయ్యే వరకు ఎందుకు ఆగలేదు? కలెక్టర్ ఆదేశాలిస్తే చెప్పండి ఆయననూ పిలుస్తాం. ప్రజాస్వామ్య దేశంలో సహజ న్యాయ సూత్రాలను పాటించాలని మీకు తెలియదా?..'అంటూ ప్రశ్నల వర్షం కురిపించగా, తహసీల్దార్ సమాధానం చెప్పలేకపోయారు.

అనుమతులిస్తున్న అధికారులపై చర్యలేంటి?

సబ్ రిజిస్ట్రార్ ఎందుకు రిజిస్ట్రేషన్ చేశారు? పంచాయతీ/ మున్సిపల్ అధికారులు ఎందుకు అనుమతి ఇస్తున్నారు? విద్యుత్, నల్లా కనెక్షన్లు ఎలా ఇస్తున్నారు? ఆస్తి పన్ను ఎందుకు వసూలు చేస్తున్నారు? ఇంతమంది అధికారులు ఇలా ఇష్టారాజ్యంగా అనుమతి ఇస్తూ పోయిన తర్వాత అది చట్టవిరుద్ధమని ప్రజలకు చెప్పేదెవరు? సదరు అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారు? ఎక్కడికక్కడ అక్రమ మార్గంలో అనుమతులిస్తారు. కొన్నేళ్ల తర్వాత వచ్చి ఇది అక్రమమంటూ చట్టాన్ని పాటించకుండా కూల్చివేస్తారు. చివరకు ప్రజలను బాధితులను చేస్తారా?'అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు.

తహసీల్దార్ లేఖ మేరకు కూల్చివేతకు సిబ్బందిని, యంత్రాలను అందజేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టుకు తెలిపారు. దీంతో.. 'తహసీల్దార్ హైకోర్టు, చార్మినార్‌ను కూల్చివేయాలన్నా అలాగే పంపిస్తారా? చట్టాన్ని అమలు చేయరా? మీ స్టేటస్ ఏంటి? ఆదివారం కూల్చివేత చేపట్టవచ్చా? తహసీల్దార్ అడిగితే మీరు చట్టవిరుద్ధంగా సమకూరుస్తారా? సహకరిస్తారా? కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా? అక్రమ నిర్మాణాలను మేం సమర్థించడం లేదు. కానీ చట్టాన్ని పాటించాలి కదా? హైడ్రా తీరు సంతృప్తికరంగా లేదు. కమిషనర్‌గా మీకే అవగాహన లేకపోతే ఎలా? జీవో 99 ప్రకారం హైడ్రాకు ఏం పాలసీ ఉంది?'అంటూ జడ్జి ప్రశ్నించారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, ఔటర్ రింగ్ రోడ్డు లోపలే తమ పరిధి అని, ఇందులో దాదాపు 2,500 చెరువులు ఉన్నట్లు రంగనాథ్ తెలిపారు. కాగా 'ఒక్క చెరువుకైనా తుది నోటిఫికేషన్ ఇచ్చి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారించారా? మూసీపై మీ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏంటి? పిటిషనర్ ఈ నెలలోనే హైడ్రాపై రిట్ పిటిషన్ వేశారు? మేం జోక్యం చేసుకోవడం లేదని మీ (హైడ్రా) కౌన్సిల్ చెప్పారు. అయినా కూల్చివేత చేపట్టారు. ప్రజలే అన్నీ విచారణ చేసుకుని కొనుగోలు చేయాలి.. వారికి చట్టాలపై అవగాహన ఉండాలంటే ఎలా?

ప్రజలే అన్నీ తెలుసుకోవాలంటే ఎలా?

జైలుకు పంపిస్తేనే దారికొస్తారు

హైడ్రా కార్యాలయం ఎక్కడని సంస్థ కౌన్సిల్ కటికం రవీందర్‌రెడ్డిని న్యాయమూర్తి ప్రశ్నించారు. 'డిజాస్టర్ అంటే ఒక్క కూల్చివేతలే కాదు కదా.. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు హైడ్రా చేపడుతోందా? బతుకమ్మ కుంట, నల్లకుంట పరిస్థితి ఏంటి? ఒక్క రాత్రిలో ఈ సిటీని మార్చలేం. చెరువులకు సంబంధించిన మెమైరీలను (చిత్రపటాలను) పరిశీలించి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని చెప్పాం. రెండేళ్లుగా కోరుతున్నా ఒక్క చెరువుకు కూడా ఎఫ్‌టీఎల్ తుది నోటిఫికేషన్ ఇవ్వలేదు. మీరు పబ్లిక్ సర్వెంట్స్ అనేది మర్చిపోవద్దు. చట్టాన్ని ఉల్లంఘిస్తామంటే మాత్రం కోర్టులు చూస్తూ కూర్చోవు. అక్రమాలకు పాల్పడిన, చట్టాన్ని గౌరవించని అధికారులను చంచల్‌గూడ, చర్లపల్లికి పంపిస్తే అప్పుడు దారికొస్తారు. కూల్చివేతలు చేపట్టేటప్పుడు పాటించాల్సిన విధానం ఏంటీ అనేది ప్రభుత్వ న్యాయవాదులను అడిగి తెలుసుకోవచ్చు కదా.. అది కూడా చేయరు. ఆదివారం కూల్చడం ముగ్గురు జడ్జిల తీర్పుకు విరుద్ధం..'అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాలంటే తహసీల్దార్‌కు లెక్కలేదని పిటిషనర్ న్యాయవాది నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం.. అదీ ఉదయం 7.30 గంటలకే కావడంతో హౌస్ మోషన్ కూడా దాఖలు చేయలేకపోయామన్నారు. రెవెన్యూ శాఖ తరఫున జీపీ మురళీధర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి విచారణ వాయిదా వేశారు.

యుద్ధ ప్రాతిపదికన తొలగించడం లేదు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతే ముందుకు

మూసీలో ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం లేదని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీనిపై కమిటీని ఏర్పాటు చేశామని, బాధితులతో చర్చలు జరుపుతోందని ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వెల్లడించారు. ఇళ్లు కోల్పోయిన పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాత చట్టపరంగా ముందుకు వెళ్తామని చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతం వెంట ఉన్న ఇళ్లకు 'రివర్ బెడ్'అంటూ రెడ్ కలర్‌తో మార్కింగ్ చేశారని, కూల్చివేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని పేర్కొంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. లంచ్ మోషన్ రూపంలో దాఖలైన ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఆక్రమణల తొలగింపునకు ఏదైనా పాలసీ ఉందా? అని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ బయట నిర్మించుకున్న వారికి నోటీసులు ఎలా ఇస్తారని, ఎలాంటి చర్యలు చేపట్టినా చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఏఏజీ వాదనల అనంతరం.. ఎఫ్‌టీఎల్ నిర్ధారించిన తర్వాతే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా వేశారు.

మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వు బ్యాంకు

- దేశ వ్యాప్త ఎన్నికల నిధుల కోసం భారీ కుంభకోణానికి శ్రీకారం: కేటీఆర్
- వివేక్, కేవీపీ లాంటి వారి ఇళ్లతోపాటు మీ సోదరుడి ఇంటిని కూల్చండి
- మూసీ బాధితులపాలిట రేవంత్‌రెడ్డి కాలయముడిలా మారారు



కేటీఆర్ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న నిర్వాసితురాలు

సాక్షి, హైదరాబాద్/అత్తాపూర్: మూసీ ప్రాజెక్టు పేరుతో దేశంలోనే అతిపెద్ద కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కాంగ్రెస్ రిజర్వు బ్యాంకులా వాడుకోవాలని చూస్తోందన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ ఎన్నికల నిధుల కోసమే ఈ ప్రాజెక్టు చేపట్టిందన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాలయముడిలా మారారన్నారు. ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లు కూలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రయోజనం లేని మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే గోపీనాథ్ తదితరులతో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 2400 కిలోమీటర్ల 'నమామీ గంగే'ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చయితే 55 కిలోమీటర్ల మూసీ ప్రక్షాళనకు రూ.లక్షన్నర కోట్లు ఎందుకని ప్రశ్నించారు.

కూల్చివేత బాధలు మాకు తెలుసు

'పేద మధ్య తరగతి ప్రజలకు సొంతిళ్లు ఒక భావోద్వేగం. అప్పర్, మిడ్ మానేరు నిర్వాసితులుగా కూల్చివేత బాధ ఏంటో మాకు తెలుసు. చట్టబద్ధంగా అనుమతులు పొందిన వారిని కూడా ఆక్రమణదారులుగా కాంగ్రెస్ ప్రచారం చేయిస్తోంది. నాలాల మీద నిర్మించిన హైడ్రా, జీహెచ్ఎంసీ భవనాలు కూల్చకుండా పేదల ఇళ్ల మీదకు బుల్డోజర్లు పంపిస్తున్నారు. కేసీఆర్ ఆనవాళ్ల లేకుండా చేసేందుకు సచివాలయాన్ని కూడా సీఎం రేవంత్ కూల్చివేస్తారేమో? రేవంత్‌ను ప్రజలు తిడుతున్న తిట్లు గతంలో ఎప్పుడూ నేను వినలేదు. రేవంత్ మీడియాకు ముఖం చాటేసి మంత్రులకు బదులు గా అధికారులను ముందు పెట్టి రాజకీయాలు చేస్తున్నాడు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీల్లో ప్రజల ఆక్రందనలు ఇలాగే ఉంటాయి. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లు కూల్చిన తర్వాతే పేదల మీదకు రావాలి. చిత్తశుద్ధి ఉంటే కొడంగల్‌లోని తన ఇంటితోపాటు హైదరాబాద్‌లో తన సోదరుడు ఇంటిని కూడా రేవంత్ కూల్చివేయాలి. బాధితులకు భరోసా ఇచ్చేందుకు మూసీ పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తాం. బుల్డోజర్లకు మేము అడ్డుగా నిలబడతాం. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం' అని కేటీఆర్ అన్నారు.

మీ సోదరుడి ఇంటిని కూల్చండి

కేటీఆర్ అత్తాపూర్ డివిజన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలోని లక్ష్మీనగర్ పార్కులో నిర్వాసితులను కలిసి వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. గృహ నిర్మాణాలు చేసుకున్నందుకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల పర్మిషన్లు పొందుతూ రూ.లక్షలు బ్యాంకుల ద్వారా అప్పుగా తీసుకుని ఇళ్లు కట్టుకుంటే ఎలా కూలుస్తారని నిలదీశారు. పర్మిషన్ ఇచ్చిన అధికారులను వదిలేసి సామాన్య ప్రజలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. దుర్గంచెరువు బఫర్ జోన్ ప్రాంతంలో వివేక్, కేవీపీ లాంటి వారి ఇళ్లతోపాటు మీ సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటిని బుల్డోజర్లతో నేలమట్టం చేయాలన్నారు. అనంతరం కేటీఆర్ కిషన్‌బాగ్ మహమూద్‌నగర్‌లో మూసీ బాధితులను కలిసి మీ వెంట తాము ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

చెరువుల పునరుద్ధరణ హైడ్రా లక్ష్యం

- కేవలం కూల్చివేతలే కాదన్న కమిషనర్ రంగనాథ్
- పేదలు, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూల్చివేయబోమని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: చెరువుల పునరుద్ధరణ హైడ్రా లక్ష్యమని, కేవలం కూల్చివేతలే కాదని కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజల ఇళ్లను హైడ్రా కూల్చివేయదని సోమవారం 'ఎక్స్'ద్వారా వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. హైడ్రా పరిధి కేవలం ఔటర్ రింగ్ రోడ్ వరకే అని, అయితే సామాజిక మాధ్యమాలు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో జరిగిన కూల్చివేతలనూ హైడ్రాకు ఆపాదిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని రంగనాథ్ పేర్కొన్నారు. కూల్చివేతలన్నీ హైడ్రా చేసేవే కాదని ప్రజలు, సామాజిక మాధ్యమాలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటం, వర్షాలు/వరదల సమయంలో రహదారులు, నివాస ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు చేపట్టడం హైడ్రా బాధ్యతలని తెలిపారు.

మూసీ సర్వేతో సంబంధం లేదు

మూసీ నదికి ఇరువైపులా జరుగుతున్న సర్వేతో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అక్కడ నివాసితులను సైతం హైడ్రా తరలించట్లేదని పేర్కొన్నారు. అక్కడి ఇళ్లపై హైడ్రా మార్కింగ్ చేయట్లేదని, మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఇవన్నీ చేపడుతున్నట్లు రంగనాథ్ వివరించారు.

నిరంకుశ పాలనకు ప్రతీక బుల్డోజర్

- నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు
- రాహుల్‌గాంధీకి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం బుల్డోజర్ నిరంకుశ పాలనకు ప్రతీకగా మారిందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో పౌర హక్కులను నిరంతరం ధిక్కరిస్తోందన్నారు. తెలంగాణలో బుల్డోజర్ పాలన ఆపాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు సోమవారం బహిరంగలేఖ రాశారు. రాష్ట్రంలో అధికార దుర్వినియోగంతో దుష్టపాలన నడుస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం, న్యాయాన్ని బుల్డోజర్ కింద తొక్కి అణచివేస్తూ రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతుందని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా ప్రాజెక్టుల విషయంలో హైకోర్టు సోమవారం చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనంగా పేర్కొన్నారు. 'హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల పేరిట పేద, మధ్యతరగతి కుటుంబాలను రేవంత్ రోడ్డున పడేస్తున్నారు. ఏళ్లుగా అన్ని చట్టపరమైన పత్రాలతో నివసిస్తున్న వారి ఇళ్లను లక్ష్యంగా చేసుకొని భయభ్రాంతులకు గురి చేస్తూ బుల్డోజర్ పాలన నడుపుతున్నారు. బుల్డోజర్ విధానం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ క్రూరత్వానికి ప్రతిరూపంగా మారింది. అడుగడుగునా చట్టాలను తుంగలో తొక్కుతూ, సహజ న్యాయ సూత్రాలను కాలరాస్తూ మీ పార్టీ ముఖ్యమంత్రి పాలన కొనసాగుతోంది. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, గుజరాత్, అస్సాం, మహారాష్ట్రలో పేదలు, మధ్య తరగతి ప్రజలపై బీజేపీ బుల్డోజర్లను ప్రయోగించిన రీతిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణలో అదే దారిలో నడుస్తోంది. బుల్డోజర్ కూల్చివేతలపై సుప్రీం ఆదేశాలు ఉన్నా సర్వేలు, సరైన విధానాలు అనుసరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై విరుచుకుపడుతోంది. రాజ్యాంగంలో పొందుపరిచిన సహజ న్యాయ సూత్రాలు, చట్టాలను గౌరవించే విధంగా మీ ముఖ్యమంత్రికి సలహా ఇచ్చి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి'అని రాహుల్‌కు రాసిన లేఖలో కోరారు.

క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా

ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లుతూ వికృత రాజకీయాలకు తెరలేపిందని హరీశ్‌రావు ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రభుత్వ వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారాన్ని ఆశ్రయిస్తోందన్నారు. తనకు గోల్కొండ కోట, చార్మినార్‌లోనూ వాటాలు ఉన్నాయనే రీతిలో కాంగ్రెస్ ప్రచారం చేస్తోందన్నారు. అబద్ధపు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. పశు వైద్య సంచార వాహన సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, 1962 అంబులెన్స్ సేవల సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. మూగజీవాల వద్దకు పశు వైద్య సిబ్బంది వెళ్లి తక్షణ సేవలు అందించేందుకు కేసీఆర్ ప్రారంభించిన కార్యక్రమం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని చెప్పారు. వాహన డ్రైవర్, డాక్టర్, ఇతర సిబ్బందికి వేతనాలు అందక కుటుంబపోషణ భారంగా మారిందన్నారు.

మీ మేనిఫెస్టోల్లో పెట్టలేదా?

మూసీ ప్రక్షాళన చేస్తామని బీఆర్ఎస్, బీజేపీ చెప్పలేదా?: టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

- హైదరాబాద్‌ను బీఆర్ఎస్, బీజేపీ నేతలు కబళించారు
- 1500 చెరువుల కబ్జాల్లో 80 శాతం బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలవే
- అవసరమైనప్పుడు వారి పేర్లు కూడా బయటకు వస్తాయి
- బీజేపీలో ప్రజానాయకులెక్కడున్నారు? ఆ పార్టీలో 80 శాతం నాయకులే కాదు



సాక్షి, హైదరాబాద్: మూసీ ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటుంటే బీఆర్ఎస్, బీజేపీ రాద్ధాంతం చేస్తున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్‌గౌడ్ మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను ఆ పార్టీలు ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టలేదా అని నిలదీశారు. మూసీపై ఒక్క గుడిసె కూడా ప్రభుత్వం తొలగించలేదని, అలాంటి ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరూ గ్లోబల్ వార్మింగ్ గురించి మాట్లాడుతుంటే బీఆర్ఎస్ నేతల మెదళ్లకు మాత్రం ఆ ఆలోచన రావడం లేదని వ్యాఖ్యానించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదిక ప్రకారం దేశంలో అత్యంత కలుషితమైన నదిగా మూసీ గుర్తింపు పొందిందని, ఇలాంటి పరిస్థితుల్లో మూసీని ప్రక్షాళన చేయడం వల్ల రంగారెడ్డి, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 26 లక్షల మందికి మేలు జరుగుతుందన్నారు.

వందల కోట్లు ఖర్చు పెడుతున్నారు

సోషల్‌మీడియాను ఉపయోగించి ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారని మహేశ్‌కుమార్ విమర్శించారు. సోషల్‌మీడియా కోసం బీఆర్ఎస్ వందల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోందని ఆరోపించారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సైబర్‌క్రైమ్ అధికారులను కోరామన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అంటే ప్రగతి భవన్, జన్వాడ ఫామ్‌హౌజ్‌ల చుట్టూ కాదని, చార్మినార్, మూసీలో జరగాలని అన్నారు. గత పదేళ్లలో 1,500 చెరువులు కబ్జాకు గురయ్యాయని ఇందులో 80 శాతం రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు చేసినవేనని ఆరోపించారు. హైదరాబాద్‌ను బీఆర్ఎస్, బీజేపీ నేతలు కబళించారని, ఈ భూబకాసురులే తమ టార్గెట్ అని, పేద ప్రజలు కాదని స్పష్టంచేశారు. సమయం వచ్చినప్పుడు ఈ భూబకాసురుల పేర్లు బయటకు వస్తాయని, వారు వెళ్లే జైలు పేరు కూడా తెలుస్తుందని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. హైడ్రాతో భయభ్రాంతులకు గురవుతున్నది బీఆర్ఎస్ నేతలే తప్ప సామాన్య ప్రజలు కాదని అన్నారు.

తలో దిక్కు దోచుకున్నారు

రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ మల్లన్నసాగర్ కట్టేందుకు సీఆర్పీఎఫ్ జవాన్లతో కొట్టించి మరీ ప్రజలను ఖాళీ చేయించిందని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్ల అరాచకాలను ప్రజలు మర్చిపోలేదని, తండ్రి, కొడుకు, కూతురు, అల్లుడు తలోదిక్కు దోచుకున్న విషయాన్ని గమనించిన తర్వాతే పార్లమెంటు ఎన్నికల్లోనూ ఆ పార్టీకి సున్నా సీట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇక, బీజేపీ నేతల్లో ప్రజానాయకులు ఎవరున్నారని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. నిజామాబాద్ ఎంపీ అరవింద్ కంటే రైతు మోసగాడు ఎవరుంటారని ప్రశ్నించారు. మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ చేసిన ట్రోలింగ్‌లతో పద్మశాలీల గుండెలు పగిలిపోతున్నాయని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల క్రితం పెట్టిన ఆ పోస్టింగ్‌పై కేటీఆర్, హరీశ్‌రావులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అసలు ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ఎక్కడున్నాడో చెప్పాలని మహేశ్‌గౌడ్ దుయ్యబట్టారు. సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ నేతలు సామా రామ్మోహన్‌రెడ్డి, సంధ్యారెడ్డి, భవానీరెడ్డి, బండారి శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కుప్తంగా...

రైతుల కోసం బీజేపీ దీక్ష చేస్తే ఆశ్చర్యం కలుగుతోంది

కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీజేపీకి, రైతులకు ఏం సంబంధం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ నేతలు రైతుల కోసం దీక్ష చేస్తుంటే తనకు ఆశ్చర్యం కలుగుతోందని వ్యాఖ్యానించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెట్టుబడిదారుల పార్టీగా గుర్తింపు పొందిన బీజేపీ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉందని, ఈ పదేళ్లలో రైతుల సంక్షేమం కోసం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయాలన్న ఆలోచన కూడా ఆ పార్టీకి రాదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా మద్దతు ధరపై బోనస్ ఇస్తున్నారా? అసలు రైతు బీమా, పంటల బీమాలు ఆ ప్రభుత్వాలకు తెలుసా? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా రుణమాఫీ కోసం బీజేపీ నేతలు ఢిల్లీలోని పార్టీ కార్యాలయం ముందు ధర్నాలు చేయాలని, దీక్ష అంటే ప్రచారం కోసమే కాదన్న వాస్తవాన్ని బీజేపీ నేతలు తెలుసుకోవాలని హితవు పలికారు.

'అఖిల భారత ప్రజాతంత్ర మహిళ' రాష్ట్ర అధ్యక్షురాలిగా పుష్ప



అంగడి పుష్ప

వరంగల్ చౌరస్తా: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) నూతన కార్యవర్గాన్ని సోమవారం వరంగల్‌లో ఎన్నుకున్నారు. రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశానికి కేంద్ర కమిటీ సభ్యులు కుంభం సుకన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా అంగడి పుష్ప, ప్రధాన కార్యదర్శిగా వంగల రాగసుధ, కోశాధికారిగా తాంద్ర కళావతిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వస్కుల సైదమ్మ, మాస్ సావిత్రి, కనకం సంధ్య, శివానీ, గటికె మమ త, పేరబోయిన రమ, ప్రేమలత, చంద్రకళ, జ్యోతి రమణ, సుకన్య, విమల, పుష్పలత, అనిత, అమీనా, ఇందిర, ఇందు వలిపిరెడ్డి, సరోజన తోపాటు కోఆప్షన్ సభ్యులుగా పది ఉమ్మడి జిల్లాల మహిళా నాయకురాళ్లకు ప్రాధాన్యం కల్పించినట్లు ప్రకటించారు.



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

పెద్దలే పెన్నిధి...

సాక్షి, హైదరాబాద్: వయసు మీదపడిన పెద్దలు ఇంట్లో ఉంటే భారమని యువతరం భావిస్తున్న కాలం ఇది. న్యూక్లియర్ ఫ్యామిలీ సంస్కృతి రోజురోజుకూ విస్తరిస్తున్న తరుణం ఇది. అయితే అందరూ అలా అనుకోవడం లేదు. పెంచి పెద్ద చేసిన పెద్దలను పెన్నిధిలా కొలుస్తున్న వారు కూడా ఉన్నారు. తమ పిల్లల పెంపకంలో వయోజనుల మార్గదర్శకత్వం తప్పనిసరని నమ్ముతున్నవారు కూడా ఉన్నారు.

'అమ్మే మమ్మల్ని అట్టిపెట్టుకుంది..': పెద్దల మాట చద్దన్నం మూట అని మియాపూర్‌లో నివసించే శ్రీరామ్ ఈశ్వర అన్నారు. తల్లిదండ్రుల మార్గదర్శకత్వమే తమకు విజయాలను చేరువ చేసిందని చెబుతున్నారు. తాను హైదరాబాద్ వచ్చినప్పటి నుంచి దాదాపు 17 ఏళ్లపాటు తల్లిదండ్రులిద్దరూ తనతోనే ఉన్నారని ఆయన చెప్పారు. దురదృష్టవశాత్తూ తండ్రి దూరమయ్యాక తల్లి బాలాత్రిపుర సుందరి తమ పిల్లలకు నానమ్మ ప్రేమను పంచుతోందని తెలిపారు. పండుగల ఆచార వ్యవహారాలను తల్లి చెప్పిన ప్రకారమే చేస్తుంటామని వివరించారు. తాను ఎంత బిజీ వ్యాపారవేత్త అయినప్పటికీ తల్లితో కలిసి వాకింగ్‌కు వెళ్లడం మొదలు తీర్థయాత్రలకు వెళ్లడం వరకు సమయాన్ని కేటాయించడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు. 'అమ్మను మేం మా దగ్గర ఉంచుకోవడం ఏమిటండి? అమ్మే మమ్మల్ని తన దగ్గర అట్టిపెట్టుకుంది' అంటూ శ్రీరామ్ వ్యక్తం చేసిన మాతృప్రేమను గమనిస్తే అవకాశం ఉన్నా తల్లులకు దూరంగా ఉంటున్న కొడుకులకు సిగ్గు కలగకమానదు.



మానసిక వైద్యుల మాట ఇదీ..: నేటి సమాజంలో చాలా కుటుంబాలు మానసిక సమస్యలతో సతమతమవుతున్నాయని... ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నమే అందుకు కారణమని మానసిక వైద్యులు చెబుతున్నారు. జీవితం విసిరిన కష్టనష్టాలు, ఆటుపోట్లను ఎదుర్కొన్న అనుభవంగల పెద్దలు ఉన్న కుటుంబాల్లో మాత్రం ఇలాంటి సమస్యలకు పరిష్కారం సులభం అవుతుందని అంటున్నారు. ముఖ్యంగా వయోజనులు కుటుంబ సభ్యులుగా ఉండటం అటు పెద్దలకు, ఇటు పిల్లలకు ఉభయకుశలోపరిగా ఉపకరిస్తుందనేది వైద్యుల మాట.

9న టీచర్ నియామక పత్రాలు

ఎల్‌బీ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించి అందజేస్తాం: సీఎం రేవంత్

- 65 రోజుల్లోనే డీఎస్సీ పూర్తి చేశాం.. విద్యా రంగానికి నిధులు పెంచాం
- నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం
- విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా బడులను కొనసాగిస్తామని వెల్లడి
- డీఎస్సీ–2024 ఫలితాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి
- త్వరలోనే గ్రూప్–1 పరీక్షల ఫలితాలను విడుదల చేస్తామని ప్రకటన



ఫలితాలను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, దామోదర, తుమ్మల, ప్రభుత్వ సలహాదారుకేకే, సీఎస్ శాంతికుమారి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తదితరులు

సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ–2024 కింద ఎంపికయ్యే ఉపాధ్యాయులకు అక్టోబర్ 9న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దసరా నాటికి టీచర్ల నియామక ప్రక్రియ పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ మేరకు 65 రోజుల్లోనే డీఎస్సీ పూర్తి చేశామని.. విద్యను పేదవాడి ముంగిటకు చేర్చడమే ధ్యేయంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. డీఎస్సీ రాసిన వారి మెరిట్ జాబితాల్లోంచి ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపిక చేస్తామని.. ఆ జాబితాలను జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ)కి పంపుతామని సీఎం చెప్పారు. అక్కడ తుది ఎంపిక జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకే ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని.. అదీ 7,857 మంది టీచర్లనే నియమించిందని పేర్కొన్నారు. అదే తాము అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే వివిధ ప్రభుత్వ శాఖల్లో 30 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. పది నెలల్లోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు అడుగులు వేశామని చెప్పారు.

ఉపాధ్యాయులంటే.. ఓ భావోద్వేగం

ఉపాధ్యాయులు అంటే ఉద్యోగి కాదని, ఓ భావోద్వేగమని సీఎం అభివర్ణించారు. కీలకమైన ఈ రంగం గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. విద్యా రంగానికి భవిష్యత్‌లో మరిన్ని నిధులు ఇస్తామని.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని ప్రకటించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, వివాదాలకు తావివ్వకుండా పరీక్షలు నిర్వహించామని సీఎం తెలిపారు. గ్రూప్–1 పరీక్ష ఫలితాలను త్వరలోనే విడుదల చేస్తామన్నారు.

నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్

రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించినట్టు సీఎం రేవంత్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఒకే చోట ఉంచి విద్యను అందించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ప్రతీ రెసిడెన్షియల్ స్కూల్‌ను 20 నుంచి 25 ఎకరాల్లో రూ.125 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా వీటిని చేపడుతున్నామని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీల మీడియాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గత పదేళ్ల ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తే ఎందుకు ప్రశ్నించలేదన్నారు. విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ బడులను కొనసాగిస్తామని ఓ ప్రశ్నకు బదులుగా చెప్పారు. తాము జాతీయ నూతన విద్యా విధానం కన్నా.. రాష్ట్ర విద్యా విధానం పైనే దృష్టి పెట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేం దర్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నిద్రిస్తున్న ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రామారావు పాటిల్, పాల్వాయి హరీశ్‌బాబు తదితర నాయకులు

సర్కారు మెడలు వంచి హామీలు అమలు చేయిస్తాం

ధర్నాచౌక్‌లో 24 గంటల 'రైతు హామీల సాధన దీక్ష'లో బీజేపీ డిమాండ్



ఏలేటి మహేశ్వరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ రైతులకిచ్చిన గ్యారంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని 'రైతు హామీల సాధన దీక్ష'లో బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రైతులకు ఇస్తామన్న రూ. 2 లక్ష ల రుణమాఫీతోపాటు రైతు భరోసా, రైతుబీమా, వడ్లకు బోనస్ వంటి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. రైతులకు అనేక రకాల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటిదాకా ఆ వాగ్దానాలేవీ నెరవేర్చకుండా మోసం, దగా చేయడంతో రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతోందని మండిపడ్డారు. మోసకారి కాంగ్రెస్ సర్కారు మెడలు వంచి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయించేలా బీజేపీ ఒత్తిడి తీసుకొస్తుందని ప్రకటించారు. సోమవారం ఉదయం ఇందిరాపా ర్కు ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన 24 గంటల దీక్షలో (మంగళవారం ఉదయం 11 గంటలదాకా) పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ముఖ్యనేతలు, రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేవంత్.. గజినీ అయ్యావా: ఏలేటి

బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్ గజినీ అయ్యావా? గతం మరిచిపోయావా అని నిలదీశారు. 'వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్ సమక్షంలో రైతులను ఆదుకుంటామని రేవంత్ హామీ ఇచ్చారు. దాదాపు రూ.81 వేల కోట్లు ఖర్చు చేసి ప్రతి ఏటా రైతులను ఆదుకుంటామని చెప్పిన మాట మరిచిపోయారా? మరిచిపోయినట్టు నటిస్తున్నారా? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. జూలై 30వ తేదీ వరకు 870 మంది ఆత్మహత్య చేసుకున్నారు. సెప్టెంబర్ 30 వరకు లెక్క వెయ్యికి చేరింది. రైతులు ఓట్లేస్తేనే కాంగ్రెస్ గద్దె ఎక్కింది. కేవలం రైతులు ఉన్నచోటనే కాంగ్రెస్ గెలిచింది. రైతులకు అండగా మేముంటాం..కాంగ్రెస్ మెడలు వంచుతాం'అని ఏలేటి హెచ్చరించారు. ఈ సందర్భంగా చనిపోయిన రైతుల ఆత్మకు శాంతి చేకూరాలని బీజేపీ నేతలు మౌనం పాటించారు.

రుణమాఫీ అమలు చేయాల్సిందే : డీకే అరుణ

'ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తే కేసులు పెడతారా.. వేధిస్తారా? మిస్టర్ రేవంత్‌రెడ్డి ఖబడ్దార్.. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి ఆటలు ఇక సాగవు'అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ హెచ్చరించారు. 'రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ మాటేంటి. మహిళలకు రూ.2500, నిరుద్యోగులకు భృతి ఎక్కడ? ఏదీ రైతు భరోసా..రుణమాఫీ ఎక్కడ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతు రాజ్యం రావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, గోడెం నగేష్, ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ, రామారావు పాటిల్, మాజీ ఎంపీలు బీబీ పాటిల్, బూర నర్సయ్య గౌడ్, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, కృష్ణాయాదవ్, పార్టీనేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కె.శ్రీధర్, ప్రేమేందర్‌రెడ్డి, ఎస్.మల్లారెడ్డి, కేఎస్.రత్నం పాల్గొన్నారు.

మోసానికి దగాకు మారుపేరు రేవంత్: ఎంపీ ఈటల రాజేందర్

బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ 'సీఎం రేవంత్ రెడ్డికి అధికారం నెత్తికెక్కి ఎవరినీ లెక్కచేయడం లేదు. ఈ పరిస్థితి రావడానికి కేసీఆర్‌కు ఆరేళ్లు పడితే.. రేవంత్‌కు మూడు నెలలే పట్టింది. మోసానికి దగాకు రేవంత్ మారుపేరు. హైడ్రా బూచి చూపుతూ బిల్డర్ల దగ్గర వసూలు చేసేది హైకమాండ్‌కు పంపడానికే. మూసీ ప్రక్షాళన పేరుతో రూ. లక్షన్నర కోట్లలో వచ్చే కమీషన్ కోసమే రేవంత్ తాపత్రయమంతా. హైడ్రాపై హైకోర్టు తప్పు పట్టింది అధికారులను కాదు రేవంత్‌రెడ్డిని. రేవంత్ నీకు రోషం ఉంటే దిగిపో. మూసీ, హైడ్రా బాధితులకు మేము అండగా ఉంటాం. హామీల అమలుకు సర్కార్ వెంటనే రోడ్ మ్యాప్ ప్రకటించాలి. ఇప్పటివరకు ఎంత రుణమాఫీ అయ్యిందో.. పబ్లిక్ పోర్టల్‌లో పెట్టాలి. పేదల కన్నీళ్లలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది బీ కేర్ ఫుల్'అని ఈటల హెచ్చరించారు. 'రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. ఈ విషయంలో రాహుల్‌గాంధీని కూడా బోల్తా కొట్టించారు. కేసీఆర్ అలవి కాని హామీలు ఇచ్చారు. అడ్రస్ లేకుండా పోయారు. మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఇంత పెద్ద నిర్ణయం తీసుకొనే ముందు ప్రజాప్రతినిధులను సంప్రదించావా ? ఇళ్లను కూల్చి పేదల ఉసురు పోసుకున్న సంజయ్‌గాంధీ వారసుడే ఈ రేవంత్'అని ఈటల మండిపడ్డారు.

అన్నం తినలేదు.. నిద్రపోలేదు

- మెడలో నూలు దండ వేస్తే సోషల్ మీడియాలో పిచ్చి ట్రోలింగ్ చేశారు
- గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో కంటతడి పెట్టిన మంత్రి సురేఖ



విలేకరుల సమావేశంలో కంటతడి పెడుతున్న మంత్రి సురేఖ

సాక్షి, హైదరాబాద్: చేనేత కార్మికుల సమస్యలను వివరిస్తూ ఒక అన్నగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తన మెడలో నూలు దండ వేసిన విషయాన్ని బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోల్ చేశారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని తప్పుగా చిత్రీకరించి పెట్టిన పోస్టింగ్ కారణంగా తాను అన్నం తినలేకపోతున్నానని, నిద్ర కూడా పోవడం లేదంటూ కంటనీరు పెట్టుకున్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేతలు మచ్చ వరలక్ష్మి, గూడూరి శ్రీనివాస్, సామా రామ్మోహన్‌రెడ్డి తదితరులతో కలిసి ఆమె మాట్లాడుతూ, అధికారం పోయిందనే పిచ్చితో బీఆర్‌ఎస్ నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు.

తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

కొండా సురేఖపై సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు అనుచిత పోస్టులు పెట్టారంటూ తెలంగాణ భవన్ వద్ద కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. దీంతో తెలంగాణభవన్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. నినాదాలు చేస్తూ కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలు తగులబెట్టేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలపైకి బీఆర్‌ఎస్ కార్యకర్తలు దూసుకెళ్లి దిష్టిబొమ్మలు లాక్కున్నారు. పలువురిపై పిడిగుద్దులు కురిపించారు. కాగా, దాడిపై కాంగ్రెస్ ఫిర్యాదు మేరకు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

బీఆర్‌ఎస్ క్షమాపణలు చెప్పాలి: సీతక్క

మహిళా మంత్రులు, మహిళా నేతల వెంటపడి మరీ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా బృందం వేధింపులకు పాల్పడుతోందని పీఆర్ మంత్రి సీతక్క మండిపడ్డారు. ఈ పరిణామాలపై బీఆర్‌ఎస్ నేతలు వెంటనే క్షమాపణలు చెప్పి, తమ సోషల్ మీడియా వింగ్‌ను కట్టడి చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

జిల్లాలకు డీఎస్సీ మెరిట్ జాబితాలు

- ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపిక.... 5వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన
- అన్ని అంశాల పరిశీలన తర్వాత 7న ఎంపిక...
- కొత్త టీచర్లకు ముందుగా శిక్షణ.. తర్వాతే పోస్టింగ్

సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ ఫలితాల విడుదల నేపథ్యంలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. డీఎస్సీ మెరిట్ జాబితాలను ఇప్పటికే రూపొందించారు. అందులో మెరిట్ ప్రకారం ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేశారు. ఈ జాబితాలను జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ)లకు పంపుతున్నట్టు సీఎం ప్రకటించారు కూడా. ఆ జాబితాల ఆధారంగా జిల్లాల్లో అక్టోబర్ 5వ తేదీ వరకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. 7వ తేదీ నాటికి అన్నిరకాల పరిశీలన, విచారణలు పూర్తి చేసి, నియామకాలను ఖరారు చేస్తారు. 9వ తేదీన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేయనున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం.. భర్తీ చేయనున్న టీచర్ పోస్టులు హైదరాబాద్, పరిసర జిల్లాల్లో ఎక్కువగా, ఇతర జిల్లాల్లో తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్, ఇతర జిల్లాల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నారు.

శిక్షణ తర్వాతే పోస్టింగ్..

రాష్ట్రవ్యాప్తంగా 11,062 టీచర్ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహించారు. దీనికి 2,79,838 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,46,584 మంది (88.11 శాతం) హాజరయ్యారు. 33 జిల్లాల్లోని 54 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకూ పరీక్ష నిర్వహించారు. తాజాగా ఫలితాలు విడుదల చేశారు. మెరిట్ అభ్యర్థుల్లో 33,186 మందిని (ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున) ఎంపిక చేశారు. వీరిలో 11,062 మంది టీచర్లుగా ఎంపికవుతారు. భర్తీ చేయనున్న పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్స్ 2,629, భాషా పండితులు 727, పీఈటీలు 182, ఎస్జీటీలు 6,508, స్కూల్ అసిస్టెంట్స్ (స్పెషల్ ఎడ్యుకేషన్) 220, ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులు 796 ఉన్నాయి. నియామక ప్రక్రియ పూర్తవగానే.. కొత్త టీచర్లందరికీ తాజా పరిణామాలు, విద్యా రంగంలో వస్తున్న మార్పులపై నిపుణులతో శిక్షణ ఇప్పించాలని ప్రభుత్వం భావిస్తోందని.. శిక్షణ తర్వాతే స్కూళ్లకు టీచర్లుగా పంపే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

ఓబీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించండి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో ఓబీసీల జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. దేశవ్యాప్తంగా దాదాపు 60–70 కోట్ల మంది ఓబీసీలున్నారని వీరికి రాజకీయంగా అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తేనే ఓబీసీలకు సమన్యాయం దక్కుతుందన్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఓబీసీ వర్గానికి చెందిన ఒకే ఒక వ్యక్తి జడ్జిగా ఉన్నారని, ఆయన కూడా త్వరలో రిటైర్డ్ అవుతున్నట్లు చెప్పారు. ప్రధాన మంత్రి, రాష్ట్రపతి ఈ విషయంపై దృష్టిసారించి సుప్రీం కోర్టులో ఓబీసీల జడ్జిల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రైవేటు సెక్టార్‌లో కూడా ఓబీసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

మోదీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తూ చట్టవిరుద్ధంగా ఆర్డినెన్స్ ద్వారా పార్లమెంట్ రద్దు చేసి జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కుట్రలు చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. 'వన్ నేషన్, వన్ రేషన్, వన్ ఓట్, వన్ ఎలక్షన్'పేరుతో ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ తీసుకుంటున్న ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా సీపీఐ దేశవ్యాప్త ఉద్యమాలు చేపట్టనున్నట్టు నారాయణ చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ సీఎం నితీష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణాలకు సీపీఐ అభ్యంతరం చెప్పడం లేదని, అవి అందరికీ ఉపయోగపడే విధంగా నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



నువ్వు నేర్చుకుంటూనే నేర్చుకుంటూనే ఉంటే,
త్వరలోనే ఇంతకుముందెవరూ నేర్చుకోనిది నువ్వు నేర్చుకుంటావు.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
మంగళవారం, 1 అక్టోబర్ 2024

ప్రమాదకర యుద్ధక్రీడ

ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడితో ఏడాది క్రితం అక్టోబర్ 7న పశ్చిమాసియాలో చెలరేగిన హింసాత్మక సంఘర్షణ ఇప్పుడు మరో మలుపు తీసుకుంది. ముస్లిమ్‌లలోని షియా వర్గానికి చెందిన తీవ్రవాద హెజ్బొల్లా బృందానికి 32 ఏళ్ళుగా సారథ్యం వహిస్తున్న అధినేత హసన్ నస్రల్లాను భీకర గగనతల దాడుల ద్వారా ఇజ్రాయెల్ మట్టుబెట్టిన తీరు ఒక్కసారిగా అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. లెబనాన్‌లోని ఇటీవలి పేజర్లు, వాకీటాకీల పేలుళ్ళ ఉదంతం మరువక ముందే ఇజ్రాయెల్ మరోసారి తన గూఢచర్య, సైనిక సత్తా చాటిన వైనం ముక్కున వేలేసుకొనేలా చేసింది. లెబనాన్‌లో తాత్కాలిక కాల్పుల విరమణకు అమెరికా, ఫ్రాన్స్‌లు గురువారం పిలుపునిచ్చినప్పుడు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ దాన్ని సమర్థిస్తున్నారనే అందరూ భావించారు. ఒక్క రోజు గడిచిందో లేదో... ఒకపక్క న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశం సాగుతుండగానే, మరోపక్క నెతన్యాహూ మాత్రం బీరుట్‌పై వైమానిక దాడికీ, హెజ్బొల్లా అధినేతను మట్టుబెట్టడానికీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఎవరెన్ని చెప్పినా, ఐరాసలో ఎన్ని తీర్మానాలు చేసినా ఘర్షణను కొనసాగించాలనే ఇజ్రాయెల్ మంకుపట్టుతో ముందుకు పోతున్నట్టు తేటతెల్లమైంది.

చిత్రమేమిటంటే, లెబనాన్‌లో కాల్పుల విరమణను బయట తోసిపుచ్చిన నెతన్యాహూ ప్రైవేటుగా మాత్రం అందుకు అంగీకరించారు. అమెరికా, ఫ్రాన్స్ అధికారులు సైతం చెప్పినమాట అదే. తీరా దాడులు మాత్రం నెతన్యాహూ కొనసాగించారు. కొన్ని నెలలుగా ఆయన తీరు అంతే. అమెరికాకు నచ్చే మాటలు పైకి చెబుతారు. కానీ, చివరకు మాత్రం తాను ఏదనుకుంటే అదే చేస్తున్నారు. అమెరికా సైతం పైకి శాంతి వచనాలు చెబుతున్నా, ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరా ఆపలేదు. ఆ ఆయుధాలను వాడుకుంటూ ఇజ్రాయెల్ పేట్రేగిపోతుంటే ఆపుతున్నదీ లేదు. ఇప్పటికే కొన్ని వేల మంది గాజాలో ప్రాణాలు కోల్పోయారు. గత వారంలో లెబనాన్‌లోనూ వెయ్యిమంది మరణించారు. అక్కడి జనాభాలో దాదాపు అయిదోవంతు మంది నిర్వాసితులయ్యారు. భవనాలపై బాంబు దాడులకు జడిసి, ప్రజలు వీధుల్లో నిద్రిస్తున్న పరిస్థితి. గగనతలం నుంచి బాంబులు ఆగలేదు. భూమార్గంలోనూ ముప్పు తప్పదన్న భయం తప్పడం లేదు. మరోపక్క ఇజ్రాయెల్ చేపట్టిన పని ఇంకా పూర్తి కాలేదని ఆ దేశ ప్రధాని ప్రకటించడంతో ఈ తలనొప్పి తగ్గేలా లేదు.

అలాగని హెజ్బొల్లా అధినేత మరణానికి యావత్ లెబనాన్ బాధపడుతోందని అనలేం. తీవ్ర హింసకు పాల్పడి, ఎందరి మరణానికో కారణమైన నస్రల్లా పట్ల లెబనాన్, ఇజ్రాయెల్, సిరియా సహా పలు ప్రాంతాల్లో ప్రజానీకానికి పెద్దగా ప్రేమ ఏమీ లేదు. అరబ్ ప్రపంచంతో పాటు సాక్షాత్తూ లెబనాన్‌లో సైతం ఆయన మరణానికి సోషల్ మీడియాలో పెద్దయెత్తున ఆనందం వ్యక్తం కావడం గమనార్హం. సిరియన్ నియంత బషర్ అల్–అసద్‌తో చేతులు కలిపి తమ వద్ద ప్రజాస్వామ్య ఉద్యమాన్ని హెజ్బొల్లా అణిచివేయడంతో వారిలో ఆగ్రహం నెలకొంది. అందుకే ఈ రకమైన భావన వ్యక్తమైంది. లెబనీస్ ప్రభుత్వం ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించి, తద్వారా లెబనీస్ సైన్యం హెజ్బొల్లా చేతుల్లోని దక్షిణ లెబనాన్‌పై నియంత్రణ సాధించి, సరిహద్దు వెంట శాంతి నెలకొల్పాలనేది వారి అభ్యర్థన. నిజానికి, ఇజ్రాయెల్‌తో యుద్ధం తాము కోరుకోకపోయినా, ఇరాన్ ఆదేశాలతో లెబనీస్‌ను నస్రల్లా దీనిలోకి లాగారని వారి వాదన. ఇలాగే సాగితే గాజా భూఖండం లాగా బీరుట్ సైతం ధ్వంసమవుతుందనీ, అంతర్యుద్ధం మళ్ళీ వస్తుందనీ లెబనీయుల భయం.

ముందు ఇజ్రాయెల్, సౌదీ అరేబియా మధ్య సంబంధాలు సాధారణస్థితికి రావడం ముఖ్యం. అందుకు సౌదీలూ సిద్ధమే! కాకపోతే, రెండు దేశాల ఏర్పాటనే పరిష్కార సూత్రంతో పశ్చిమ తీరంలోని పాలెస్తీనా అథారిటీతో చర్చలు జరిపేందుకు ఇజ్రాయెల్ ముందుకు రావాలన్నది వారి షరతు. వ్యవహారం అక్కడే పీటముడి పడింది. ఇరాన్‌కు నెతన్యాహూ హెచ్చరిక, హెజ్బొల్లా నేత హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామంటూ ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతొల్లా ఖమేనీ ప్రతిజ్ఞ, ఇరాన్ అండతో పెచ్చరిల్లుతున్న ఇతర వర్గాల వ్యవహారం... అంతా చూస్తుంటే ఇక ఇది అంతులేని కథే! నిజానికి, లెబనాన్, గాజాల్లోని తీవ్రవాద వర్గాలను హతమార్చాలనే ఇజ్రాయెల్ సైనిక విధానం వల్ల తాత్కాలిక లాభాలే తప్ప, శాశ్వత ప్రయోజనం ఉండదు. ఆ మధ్య సాక్షాత్తూ ఇరాన్ రాజధాని టెహరాన్‌లో హమాస్ నేత ఇస్మాయిల్ హనీయే, ఇప్పుడు బీరుట్‌లో హెజ్బొల్లా అధినేత, వెంటనే అదే గ్రూపులోని మరో కీలక నేత నబిల్ కౌక్... ఇలా పలువురిని ఇజ్రాయెల్ చంపేసింది. కానీ ఇలాంటి సంస్థల్లో ఒకరు పోతే మరొకరొస్తారు. పైగా ఇజ్రాయెల్ దూకుడు వల్ల ఇరాన్‌లోని కొత్త సంస్కరణవాద సర్కారూ చేసేదేమీ లేక, తీవ్రంగా ప్రతిస్పందించక తప్పదు. అప్పుడు ముడి మరింత బిగుస్తుంది.

అగ్రదేశాల స్వార్థం, ప్రపంచ శాంతికి కృషి చేయాల్సిన అంతర్జాతీయ సంస్థల సంపూర్ణ వైఫల్యం ఈ దీర్ఘకాలిక సమస్యకూ, ఏడాదిగా ఆగని మారణహోమానికీ కారణం. పాలెస్తీనాలో ఇజ్రాయెల్ దురాక్రమణకు వచ్చే ఏడాదిలోగా ముగింపు పలకాలని ఐరాస తీర్మానించిన కొద్దిరోజులకే ఇలా జరిగిందంటే ఏమనాలి! ఐరాసకు కోరలు లేని పరిస్థితుల్లో... ప్రపంచానికి సరికొత్త శాంతిసాధన వ్యవస్థ అవసరం కనిపిస్తోంది. నెతన్యాహూ ఇలాగే తన దూకుడు కొనసాగిస్తే, పశ్చిమాసియాలో పరిస్థితి మరింత దిగజారుతుంది. లెబనాన్‌లో సైతం మరో గాజాను ఇజ్రాయెల్ సృష్టించక ముందే ప్రపంచ దేశాలు కళ్ళు తెరవాలి. నిర్బంధంగానైనా కాల్పుల విరమణను సాధించాలి. లేదంటే, పశ్చిమాసియాపై యుద్ధ మేఘాలు మరింత విస్తరిస్తాయి. ప్రపంచాన్ని చీకటితో కమ్మేస్తాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.8.46 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** పుబ్బ ఉ.9.56 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** సా.5.54 నుండి 7.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.40 నుండి 11.28 వరకు, **అమృతఘడియలు:** తె.4.26 నుండి ఉ.6.11 వరకు (తెల్లవారితే బుధవారం).

సూర్యోదయం: 5.53
సూర్యాస్తమయం: 5.49
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

కల్తీ రాజకీయ శాల్తీలు

అత్యంత పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం 'లడ్డూ వివాదం'పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు నీచ రాజకీయానికి చెంప పెట్టు. అసలు లడ్డూ కల్తీ జరిగింది అనడానికి ఆధారాలు ఎక్కడున్నాయంటూ సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా ఈ విషయాన్ని జనానికి ఎలా చెప్పారని నిలదీసింది. జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా అంతం చేసేందుకు స్వామివారి ప్రసాదానికి మచ్చ తేవడానికి కూడా చంద్రబాబు అండ్ కో తెగబడింది. జగన్‌పై వేసిన నిందారోపణలన్నీ అసత్యాలని ఇప్పుడు ప్రజలకు అర్థమైపోయింది.

అది ముమ్మాటికీ చెంప దెబ్బే!

అభిప్రాయం



పూనూరు గౌతమ్ రెడ్డి

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారత దేశ ప్రజలు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ధర్మం నాలుగు పాదాల నడుస్తున్నదని చెప్పడానికి నిదర్శనంగా నిలిచాయి. సుప్రీం వ్యాఖ్యలు ముమ్మాటికీ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలకు చెంపపెట్టు లాంటివే. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి నిజం చేయాలంటే కుదరదని సుప్రీం వ్యాఖ్యలు రుజువు చేశాయి. ఇక ప్రాయశ్చిత్త దీక్ష నాటకాలు అన్నీ వట్టివేనని కుండబద్దలు కొట్టినట్లయింది. కల్తీ నెయ్యి జరిగినట్లు సాక్ష్యాలు లేవన్న సుప్రీం... సిట్ విచారణ ఎందుకంటూ నిలదీసింది. ఈ క్రమంలోనే వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై వేసిన నిందారోపణలన్నీ అసత్యాలని ప్రజలకు అర్థమైంది. ఒక వ్యక్తిని రాజకీయంగా హత్య చేసేందుకు పరమ పవిత్రమైన ఏడు కొండల వాడిని వాడుకున్న నీచ రాజకీయం 'చంద్రబాబు అండ్ కో'దని అందరికీ అర్థమైంది.

సెప్టెంబరు 18న ఏపీ సీఎం చంద్రబాబు లడ్డూ ప్రసాదంపై చేసిన వ్యాఖ్యలు రోజుకో మలుపు తిరుగుతూ వస్తున్నాయి. నిజంగా జంతువుల కొవ్వు కలిపి ఉంటే ప్రసాదం నిల్వ ఉండదనీ, వెంటనే పాడైపోవడం, వాసన రావడం ... ఇలా అనేక సమస్యలు ఎదురవుతాయని నిపుణులు పదే పదే చెబుతూ వచ్చారు. అదీకాకుండా అసలు ఈ తతంగమంతా చంద్రబాబు పాలనా పగ్గాలు చేపట్టాకే జరిగింది. దానిని వదిలేసి అదేదో జగన్ హయాంలో జరిగిందంటూ మసిపూసి మారేడుకాయను చేసే ప్రక్రియను తలకెత్తుకున్న చంద్రబాబు తలదించుకొనేలా సుప్రీం వ్యాఖ్యలు చేసింది. అసలు కల్తీ జరిగింది అనడానికి ఆధారాలెక్కడున్నాయంటూ ప్రశ్నించింది. ఇప్పుడు దీనికి చంద్రబాబు ప్రజలకు ఏం సమాధానం చెబుతారో చూడాలి.

ఒక బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ప్రపంచ దేశాల్లో భక్తులు కలిగిన తిరుమల తిరుపతి దేవస్థానంపైన, ఆలయ ప్రతిష్ఠపైన, లడ్డూ ప్రసాదం చరిత్రపైన మాయని మచ్చ వేయగలిగారు. ఆయన వ్యాఖ్యలు నిజమా, కాదా అని తెలుసుకోకుండా జనసేనాని పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష పేరుతో హడావిడి చేశారు. జనాన్ని నమ్మించేందుకు దుర్గమ్మ గుడికి వెళ్లి మెట్లపూజ చేశారు. చంద్రబాబు రాజకీయ వ్యూహంలో బలైపోయారు. వాస్తవానికి జనసేనాని ఈ వ్యాఖ్యలు చేయలేదు. చేసింది చంద్రబాబు. కానీ, ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించడానికి కారకులైంది పవన్. ఇప్పుడు పవన్ ప్రజలకు సమాధానం చెప్పుకునేందుకు ఏం చేయాలన్నదానిపై మల్లగుల్లాలు పడాల్సిన దుఃస్థితి నెలకొంది. ఇప్పటికైనా పవన్ తొందరపడకుండా నింపాదిగా రాజకీయాలు చేస్తేనే చంద్రబాబు వ్యూహాల నుండి తప్పించుకుని తనదైన శైలిలో తన అభిమానుల మనసులో ముద్ర వేసుకోగలుగుతారు. ఇక బీజేపీ పెద్దలు అచ్చంగా చంద్రబాబు మౌత్ పీస్‌లుగా మారినట్లు కనిపించింది. ఆ పార్టీ ఏపీ అధ్యక్షురాలిగా ఉన్న పురంధేశ్వరి భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశంపై స్పందించిన తీరు ఆ పార్టీ నేతలనే ఆశ్చర్యానికి గురిచేసింది. హిందూ ధర్మ పరిరక్షణకు బీజేపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందంటూ చెబుతూనే, లడ్డూలో వాడిన నెయ్యి కల్తీ జరిగిందంటూ వ్యాఖ్యానించారు. దీనికి ఆ పార్టీ నేతలు కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలవడం అనేది ఏ విధంగానూ జరిగే అవకాశం లేదు. పాలకులు ఎవరున్నా అంతటి నీచ పరిస్థితికి దిగజారే అవకాశాలు ఉండవు. చంద్రబాబు మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా నాణ్యత లేని నెయ్యి ట్యాంకర్లను వెనక్కు పంపిన దాఖలాలు ఉన్నాయి కదా! కేవలం 2014–19 మధ్యే ఆయన హయాంలో 14 సార్లు వెనక్కు పంపారు కదా! అంతమాత్రం చేత చంద్రబాబు హయాంలో జంతు కొవ్వు కలిపిన లడ్డూలు తయారైనట్లు భావించాలా? ఇది ఏమాత్రం సహేతుకం?

ముస్లింలకు 4 శాతం ఉన్న రిజర్వేషన్లు రద్దుచేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ముస్లిం ఓటు బ్యాంకుకు పూర్తిగా దూరమైనట్లు చంద్రబాబు గ్రహించి ఈ కుట్రకు తెరలేపినట్లు కనిపిస్తోంది. దీనివల్ల హిందువుల ఓట్లను కన్‌సాలిడేట్ చేసుకోవచ్చని ఆయన భావించి ఉంటారని అనుకోవాల్సి వస్తోంది. లేకపోతే ఆ నివేదికను ఒక రాజకీయ వేదిక మీద ఎందుకు చంద్రబాబు చదువుతారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. తమ ఇలవేల్పు అయిన వేంకటేశ్వరుని లడ్డూ ప్రసాదం కల్తీ జరిగింది అంటే ఎవరికైనా ఇట్టే ఆగ్రహావేశాలు వస్తాయి. ఇక్కడ కూడా అదే జరిగింది. కానీ, జగన్ ప్రధానికి లేఖ రాయడం, సీజేఐకి కూడా రాస్తానని చెప్పడం, నేషనల్ మీడియాకు వాస్తవాలు వివరించడం, సుబ్బారెడ్డి లాంటి వారు సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడం, కరుణాకర్ రెడ్డి లాంటి వారు ప్రమాణాలు చేయడం ఇలా అనేకానేక కార్యక్రమాల నేపథ్యంలో సామాన్య మానవుల్లో ఆలోచన రేకెత్తింది.



కల్తీ జరిగిందని తిరస్కరించిన నెయ్యి ట్యాంకర్లు 2024 జూలై 12న తిరుమలకు వచ్చాయి. ఆ ట్యాంకర్లలోని నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదు. ఏది ఏమైనప్పటికీ తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ఇప్పుడు సామాన్య జనాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారాయి. నిజానిజాలు నిగ్గు తేల్చేలా సీబీఐతో విచారణ చేయించాలని సుప్రీం కోర్టు ఆదేశిస్తే ప్రజలు స్వాగతిస్తారు. దేశ ప్రధాని కూడా ఈ అంశం మీద నోరు విప్పాలి. ప్రజల్లో దెబ్బతిన్న మనోభావాలను తిరిగి ప్రతిష్ఠించేలా చర్యలు తీసుకోవాలి.

వ్యాసకర్త ఏపీ అధ్యక్షులు, వైయస్సార్ టీయూసీ

సనాతనానికి చీడ పురుగులు

అభిప్రాయం



నందమూరి లక్ష్మీపార్వతి

"గుణం లేనివాడు కులం గొడుగు పడతాడు/ మానవత్వం లేనివాడు మతం ముసుగు వేస్తాడు / జనులంతా ఒక కుటుంబం – జగమంతా ఒక నిలయం"

– జాషువా

ఈ మాటలు ఎంత సందర్భోచితంగా ఉన్నాయో, ఆంధ్ర రాష్ట్ర రాజకీయ రంగాన్ని చూస్తే అర్థమవుతుంది. నిజమైన మతవాదులైతే వారితో ఇబ్బంది లేదు. అది వారి ప్రగాఢ నమ్మకంగా భావించవచ్చు. కానీ కుహనా మతవాదులు వేషాలు వేసుకుని, అవకాశవాద రాజకీయాల కోసం మతాన్ని, కులాన్ని వాడుకోవటం వల్లనే అసలు ఇబ్బంది వస్తున్నది.

వారం రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సనాతన మతవాదుల అవతారం ఎత్తారు. హిందూ మతానికి వీళ్లే అసలైన వారసులన్నట్లుగా ఉపన్యాసాలిస్తున్నారు. ఇక పచ్చ మీడియా రచ్చ సరేసరి.

'అసలే అనలుడు. అతనికి సైదోడు అనిలుడు' అని ఒక మహాకవి చెప్పినట్లు, చంద్రబాబు అబద్ధాలకు తింగరి పవన్ కల్యాణ్ దొరికాడు. ఇద్దరూ ఒకరికొకరు తీసిపోకుండా చెప్పిన డైలాగ్‌నే చెబుతూ, మెట్లను కడుగుతూ ఓవర్ యాక్షన్ చేస్తున్నారు.

అసలు ఇప్పుడు అర్జంట్‌గా హిందూమతాన్ని ఈ గురుశిష్యులు అంతగా తలకెత్తుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని సామాన్యుడి ప్రశ్న. అందులో ఒకరికి దేవుడన్నా, మతమన్నా ఏ సెంటిమెంట్లూ లేవు. బూట్లతో పూజలు చేస్తాడు, దేవాలయాలు పడగొడతాడు, ఆలయాల్లో క్షుద్ర పూజలు భార్య చేస్తే ఊరుకుంటాడు. ఇక రెండవ వారు చెప్పులు ధరించే స్వామి దీక్షలు నిర్వహిస్తాడు. తలక్రిందులుగా తపస్సు చేసినా వీళ్ళను నమ్మే జనాలున్నారా?

అసలెందుకు హఠాత్తుగా ఈ రచ్చ లేవదీశారు? ఢిల్లీ పెద్దలేమయినా హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల కోసం వీళ్ళిద్దరినీ సెంటిమెంట్ రోల్స్ చెయ్యమన్నారా? లేక ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, విజయవాడ వరద బాధితులకు సమాధానం చెప్పలేక, ప్రజల వద్దకు 100 రోజుల మంచి పాలన అంటూ పోవాలనుకున్నా జనాలెక్కడ తిరగబడి 'సూపర్ సిక్స్'లు అడుగుతారో అనే భయం చేతనా? ప్రజలు ఆలోచించే లోపలే పచ్చ మీడియా మూకుమ్మడిగా జనాలకు అర్థం కాని భాషలో వ్యాఖ్యానాలు చేయిస్తూ చివరకు హిందూ ధర్మం జగన్ గారి వల్లనే నాశనమైందని తెలుస్తుంది.

సెంటిమెంట్ బాగా పండాలంటే కలియుగ దైవం, ఆయన ప్రసాదం వీరికి అక్కరకొచ్చాయి. జగన్ గారి పాలనలో లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులు కలిశాయని చెప్పాలనుకున్నారు. కానీ వాటికి ఆధారాలు దొరక్క చివరకు వీళ్ళ ప్రభుత్వం మెడకు చుట్టుకోవటంతో దానిని ఎలా మలపాలో అర్థం కాక 'యూటర్న్' బాబు... 20 సార్లు తిరుమలకు వెళ్ళిన మాజీ ముఖ్యమంత్రిగారి డిక్లరేషన్ పేరుతో దానిని డైవర్ట్ చేయటానికి ప్రయత్నించారు. 'నాతిని చెయ్యబోతే కోతిగా తయారయ్యిందన్న' సామెతగా చివరకు సనాతన ధర్మానికే కళంకాన్ని తెచ్చే విధంగా ఈ దుర్మార్గపు ప్రభుత్వం స్వామివారి ప్రసాదాన్నే కళంకితంగా మార్చింది. ఈ చర్యలు క్షమార్హం కాదు.

జగన్‌మోహన్ రెడ్డి తిరుపతి వెళ్తారని ప్రకటించటంతో ఖంగుతిన్న చంద్రబాబు... పార్టీల మాటున గూండాలను తిరుపతికి తరలించారు. వారిలో కొంతమంది బహిరంగంగానే 'జగన్ మోహన్‌రెడ్డి తిరుపతి వస్తే చంపేస్తాం' అంటూ చెప్పారు. అంటే ఆయనను చంపాలనేదే కదా వీళ్ళ కుట్ర! వాళ్ళే నిందలేస్తారు. వాళ్ళే నిందిస్తారు. ఎంత నిస్సిగ్గుగా ఆయన మతాన్ని తెర మీదకు తెచ్చి డిక్లరేషన్ బోర్డు పెట్టారు!

అందుకు జగన్‌మోహన్ రెడ్డిగారు ప్రెస్ మీట్‌లో చాలా చక్కటి సంస్కారవంతమైన సమాధానం చెప్పారు. అసలైన హిందూ ధర్మతత్వం ఆయన మాటల్లో వినిపించింది. హిందూ ధర్మాన్ని సుప్రతిష్ఠం చేసిన ఉపనిషత్తులు ఏం చెప్పాయో మత ఛాందసులు కూడా తెలుసుకోవాలి.

"యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవాభూద్విజానతః / తత్ర కో మోహః కశ్శోకః ఏకత్వ మను పశ్యతః"

(ఈశావాస్యోపనిషత్తు)

ఎవరయితే సమస్త జీవుల ఆత్మలను తన ఆత్మగా భావించి గౌరవిస్తాడో అతడు శోకమోహములను దాటి ఒకే ఆనంద స్థితిని అనుభవిస్తాడు. ఇది సనాతన ధర్మం చెప్పేమాట. అలాగే హిందువులందరూ పరమ ప్రామాణికంగా భావించే భగవద్గీతలో కూడా ఆ కృష్ణ పరమాత్మ –

యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహం! / మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః॥

ఏ రూపంలో ఆరాధిస్తారో ఆ రూపంలో నేనే ఉంటాను అన్నాడు.

అంటే అన్ని మతాలను, దేవుళ్ళను గౌరవించాలనే కదా మన హిందూ ధర్మం చెబుతున్నది. మరి ఈ మతానికి ఈ చాదస్తపు రంగులు పూసి ఎందుకిలా ధర్మాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు?

ఇప్పటికయినా ఢిల్లీ బీజేపీ పెద్దలు తమ కూటమి ఆంధ్రలో చేస్తున్న కోతి చేష్టలను ఆపించకపోతే అది తమకే నష్టం అని గమనించాలి. ప్రజల్ని అంత తక్కువగా అంచనా వెయ్యొద్దు.

"నీకు మతం కావాలా లేక అన్నం కావాలా?" అని అడిగితే ముందు అన్నమే ఇవ్వమంటాను. ఆకలితో బాధపడేవాళ్ళ కడుపు నింపి తర్వాత బోధలు చెయ్యి" అంటారు స్వామి వివేకానంద.

ఈరోజు ఆంధ్ర రాష్ట్ర పాలకులకు జగన్ మోహన్ రెడ్డి చెప్పేది అదే. ముందు పేదవాళ్ళను ఆదుకోండి, మీరిచ్చిన హామీలు నిలబెట్టుకోండి. మీ నీచ రాజకీయానికి పవిత్ర ప్రసాదాన్ని బలి చేయకండి.

వ్యాసకర్త వైసీపీ నాయకురాలు

వృద్ధులకు చేయూతనిద్దాం!

ప్రస్తుత సమాజంలో మనందరినీ కలవరపెడుతోన్న అంశం వృద్ధాప్యం. ఇది అందరికీ అనివార్యమైనప్పటికీ, కొందరికి మాత్రం వేదనా భరితమవుతోంది. వృద్ధులకు ఏం సమస్యలు ఉన్నాయి? పనా, పాటా? ఎవరో ఒకరు ఇంత చేసి పెడితే తిని, కాలక్షేపం చేయడమే కదా! అనే భావన చాలామందికి ఉంటుంది. ఈ భావనే వృద్ధుల్ని మానసికంగా, శారీరకంగా కుంగదీస్తున్నది.

పూర్వపు రోజుల్లో వృద్ధులకు ఇన్ని ఆరోగ్య సమస్యలు లేవు. పరిశుభ్రమైన గాలి, నీరు, అన్నిటికీ మించి ఆప్యాయతను పంచే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేది. మరి ఈ రోజుల్లో టెక్నాలజీ, వైద్య సౌకర్యాలు పెరగటం వల్ల వృద్ధుల జీవన ప్రమాణం పెరిగింది. దాంతో వారి సంఖ్యా పెరుగుతోంది. ఎన్ని వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, వయసు రీత్యా వచ్చే బీపీ, షుగర్, గుండెపోటు, దృష్టి లోపం, జ్ఞాపక శక్తి తగ్గిపోవడం, మానసిక ఒత్తిడికి గురికావడం లాంటి ఆరోగ్య సమస్యలతో ఎంతో మంది వృద్ధులు సతమతమవుతూనే ఉన్నారు.



అన్నిటికీ మించి కన్న బిడ్డల నిరాదరణకు గురై వృద్ధాశ్రమాల్లో శేష జీవితం గడపాల్సి రావటం వారిని బాధిస్తున్న మరో పెద్ద సమస్య.

ఉమ్మడి కుటుంబాలు ఉన్న రోజుల్లో వృద్ధుల్ని ఆస్తిగా భావించేవారు. పిల్లలకు అమ్మమ్మ, బామ్మ, తాతయ్యల ప్రేమ పుష్కలంగా లభించేది. పెద్దలు కూడా మనవళ్ళు, మనవరాళ్ళతో ఎంతో సంతోషంగా గడిపే వారు. పిల్లల్ని ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర ప్రముఖంగా ఉండేది. నేటి తరం తల్లిదండ్రుల్లో కొంతమంది అయితే... ఇంట్లో ఉన్న పెద్దవాళ్ళతో పిల్లల్ని కలవనీయకుండా ఆంక్షలు విధించటం, ఏమన్నా అంటే 'వాళ్ళకి చదువుతోనే సరిపోతుంది, మీతో మాట్లాడే టైమ్ ఎక్కడిది?' అనడం, 'మీ చాదస్తమంతా పిల్లలకి అంటగడుతున్నారు' అంటూ సూటిపోటి మాట లతో బాధ పెట్టడం పెద్దల పట్ల పిల్లలకున్న అయిష్టాన్ని చెప్పకనే చెబుతాయి.

డబ్బు కోసం పిల్లల మీద ఆధారపడాల్సి రావడం, వైద్యానికి డబ్బు లేకపోవడం, పిల్లల చదువుకి, పెళ్ళిళ్ళకి చేసిన అప్పులు తీర్చలేకపోవడం, ఇవన్నీ వృద్ధుల్ని ఆర్థిక పరంగా కుంగదీస్తున్న సమస్యలు. ఇక ఎలాంటి ఆదాయమూ లేనివాళ్ళ సంగతి అయితే చెప్ప నవసరం లేదు. వయసురీత్యా శుభకార్యాలకు, సమావేశాలకు వెళ్లే వృద్ధుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. ఏ వ్యాపకము లేక వారికి కోపం, చిరాకు, మానసిక ఒత్తిడి పెరిగిపోవడం, సర్దుబాటు చేసుకునే తత్వం తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇన్ని సమస్యల మధ్య నేటి వృద్ధులు క్షణమొక యుగంలా రోజులు వెళ్ళదీస్తున్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు నిస్వార్థమైన ప్రేమను అందిస్తారు. పిల్లల నుండి కూడా అలాంటి ప్రేమనే ఆశిస్తారు. నిరంతరం శ్రమించి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న తల్లిదండ్రుల జీవితం ఏ చీకూ చింతా లేకుండా సాగిపోయేటట్టు కుటుంబ సభ్యులందరూ సహకరించాలి.

– అయాచితం ప్రమీల, పాత్రికేయురాలు
(నేడు 'ప్రపంచ వృద్ధుల దినోత్సవం')

అమెరికా ఎన్నికల్లో ట్రంప్ ప్రహేళిక

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

డొనాల్డ్ ట్రంప్ రాజకీయాలు, వ్యక్తిత్వం, విధానాలు, వీటన్నిటితో కూడిన గందరగోళం పట్ల అమెరికన్లు ఎలా స్పందిస్తారు అనేది 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అతి పెద్ద చిక్కుప్రశ్న. ట్రంప్ పతనం నుంచి ఉత్థానం చెందారు. అలాగని ఆయన ప్రజాదరణకు తీవ్రమైన పరిమితులున్నాయి. ప్రధానంగా 4 అంశాల్లో ట్రంప్ వైఖరిని పరిశీలించాలి.

1. ట్రంప్ నిలకడతనం: కొద్ది నెలల కాలంలోనే ఆయన రెండుసార్లు మరణానికి చేరువగా వెళ్లివచ్చారు. ప్రజారంగంలో బలంగా ఉండటానికి అవసరమైన స్పష్టమైన భౌతిక ధైర్యం ఆయనకు ఉంది. 2015లో ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినప్పటినుంచీ రాజకీయ ప్రత్యర్థులు, అమెరికా రాజకీయ పండితులు కనీసం ఎనిమిది సార్లు ట్రంప్ రాజకీయ సంస్మరణను ఖాయం చేసేశారు. రిపబ్లికన్ అభ్యర్థిగా ట్రంప్ 2016లో గెలుస్తారని ఎవరూ అనుకోలేదు. హిల్లరీ క్లింటన్‌ను అధ్యక్ష రేసులో ఓడించగలరని అసలు అనుకోలేదు. ఆయన అభ్యర్థిత్వానికి రష్యా మద్దతు విషయంలో సాగిన దర్యాప్తు నుండి బయట పడతారనీ ఎవరూ అనుకోలేదు. కోవిడ్ మహమ్మారిపై ఆయన అశాస్త్రీయ నిర్వహణను అమెరికన్లు క్షమిస్తారని కొద్దిమందే భావించారు.

2020 ఎన్నికల ఫలితాల చట్టబద్ధతను అంగీకరించడానికి నిరాకరించిన తర్వాత, యునైటెడ్ స్టేట్స్ కాపిటల్‌పై దాడికి ఒక గుంపును పంపిన తర్వాత కూడా ట్రంప్ ఆధిపత్యం చలాయించే ఆటగాడిగా ఉంటారని ఎవరూ భావించలేదు. రిపబ్లికన్లు సెనేట్‌ను కోల్పోయిన తర్వాత, 2022 మధ్యంతర ఎన్నికలలో హౌస్‌ను గెలవలేకపోయిన తర్వాత అందరూ ట్రంప్ పనయిపోయిందని వ్యాఖ్యానించారు. పైగా ఆయన నేరారోపణ కేసుల నుండి బయట పడతారని ఎవరూ నమ్మలేదు. కానీ ట్రంప్ ప్రతిసారీ విమర్శకుల అంచనాలను తారుమారు చేశారు. మరింత ప్రజాదరణ పొందారు. రిపబ్లికన్ పార్టీని నియంత్రిస్తున్నారు.

2. ట్రంప్ ప్రజాదరణకు పరిమితులు: 2016 నవంబర్‌లో ఆయన అధ్యక్షుడిగా గెలిచిన తర్వాత, ఆయన నాయకత్వంలో పాల్గొన్న అన్ని ఎన్నికలనూ రిపబ్లికన్ పార్టీ ఓడిపోయింది. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రిపబ్లికన్లు హౌజ్‌ను కోల్పోయిన 2018 మధ్యంతర ఎన్నికలు ఇందులో ఉన్నాయి. 2021 జనవరిలో జార్జియా సెనేట్ ఎన్నికల్లో ఓటమి కూడా ఇందులో భాగం. అంతెం



దుకు, ట్రంప్ స్వయంగా ఓడిపోయిన 2020 అధ్యక్ష ఎన్నికలు కూడా దీంట్లో ఉన్నాయి. ఆయన ఆధ్వర్యంలో రిపబ్లికన్ పార్టీ స్థిరంగా ఓడిపోయింది. విస్తృతమైన ఓటర్లలో దాని ఆకర్షణ తగ్గింది.

3. ట్రంప్ ఎన్నికల ప్రచారంలో జాత్యహంకారం: 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అని ట్రంప్ చేసే ప్రచారం 'మేక్ అమెరికా వైట్ ఎగైన్' అని స్పష్టమైపోయింది. ఆయన వ్యాఖ్యానాలు పక్షపాతాన్ని, ద్వేషాన్ని, భయాన్ని కలిగించేలా ఉన్నాయి. ఒహాయో పట్టణంలోని అక్రమ హైతియన్ వలసదారులు పెంపుడు జంతువులను తింటున్నారని ట్రంప్, జేడీ వాన్స్ (రిపబ్లికన్ ఉపాధ్యక్ష అభ్యర్థి) నిరాధారమైన వ్యాఖ్యలు చేశారు. నిజానికి పట్టణంలోని వలసదారులు ఎవరూ చట్టవిరుద్ధంగా ఉండటం లేదు. వాళ్లెవరూ పెంపుడు జంతువులను తినడమూ లేదు. ఇక ట్రంప్ గట్టి మద్దతుదారు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ లారా లూమర్ 9/11 స్మారక స్థూపం వద్దకు ట్రంప్‌తో పాటు విమానంలో వెళ్లి, డెమోక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ భారతీయ మూలాలపై జాత్యహంకార దాడిని ప్రారంభించారు. ట్రంప్ స్వయంగా హారిస్‌పై జాత్యహంకార వ్యాఖ్యలను ప్రయోగించారు. ట్రంప్ గెలుపును వేడుకగా జరుపుకొనే భారత మితవాద శక్తులు దీనిని గుర్తుంచుకోవాలి.

4. ట్రంప్ విదేశాంగ విధానం: డెమొక్రాట్లు, పాత రిపబ్లికన్ల కంటే కూడా సంకుచిత భావన కలిగిన అమెరికా గురించి ట్రంప్ మాట్లాడుతున్నారు. నిజానికి, ట్రంప్ తన మొదటి హయాంలో 'అబ్రహం ఒప్పందాల'కు మధ్యవర్తిత్వం వహించారు. చైనాకు వ్యతిరేకంగా అమెరికా వైఖరిని పెంచారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలను ఆమోదించారు. ఉత్తర కొరియాతో చర్చలు జరిపారు. ఇవన్నీ ఆయన ప్రపంచవ్యాప్త వ్యవహారాలు జరపగలరని సూచించాయి. కానీ అంతర్జాతీయ వ్యవస్థలో ప్రబలమైన ప్లేయర్‌గా ఉన్న అమెరికా ఆర్థిక, సైనిక బాధ్యతలను ట్రంప్ అసహ్యించుకుంటారు. దానితో వచ్చే ప్రయోజనాలను ఆయన చూడలేరు లేదా ఈ ప్రయోజనాలు లేవని నటిస్తారు. ప్రపంచీకరణ వల్ల, ప్రపంచంలో అమెరికా పాత్ర వల్ల అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోయారనీ, అసమానతలు పెరిగాయనీ వాదిస్తారు.

ట్రంప్‌కు జనాదరణ ఉందనేది నిజం. అదే సమయంలో ఆయన ఆధిపత్యం కొనసాగడం లేదన్నదీ నిజమే. ఎన్నికల ఫలితాలను కచ్చితంగా అంచనా వేయడం ఎందుకు కష్టమో దీన్నిబట్టి అర్థమవుతోంది. గుర్తింపు ఆధారిత రాజకీయాలను ఆయన మితవాదం నుండి స్వీకరించారు. పాత వామపక్షీయుల ఉదారవాద ఆర్థిక శాస్త్రం, విదేశాంగ విధాన విమర్శలనూ స్వీకరించారు. ట్రంప్‌ను సైద్ధాంతికంగా ఒక వర్గంలోకి చేర్చడం ఎందుకు కష్టమో ఇది వివరిస్తుంది. అమెరికన్లు ఆయన వ్యక్తిత్వాన్ని, విధాన మిశ్రమాన్ని, దానితో వచ్చే గందరగోళాన్ని ఇష్టపడతారా లేదా అనేది 2024 ఎన్నికలకు సంబంధించిన ప్రధాన ప్రశ్నగా మిగిలిపోయింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

క్లుప్తంగా...

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చందనా ఖాన్ మృతి



సాక్షి, హైదరాబాద్: ఏపీ కేడర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చందనా ఖాన్ సోమవారం కన్నుమూశారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల న్యుమోనియా బారినపడి కోలుకున్న ఆమె గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈస్ట్ పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లోని మియాపూర్‌లో 1954లో జన్మించిన ఆమె కుటుంబంతో పాటు కోల్‌కతాకు వలస వచ్చారు. జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఆంగ్ల సాహిత్యంలో పీజీ చేశారు. 1979 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన చందనా.. ఉమ్మడి ఏపీలో పాఠశాల విద్యాశాఖ, పర్యాటక తదితర శాఖల కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ కేడర్‌కు వెళ్లిన ఆమె అక్కడ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో 2014 చివరలో పదవీ విరమణ చేశారు. పర్యాటక శాఖలో సుదీర్ఘ సేవలందించిన ఆమె హైదరాబాద్ నగరంలో పర్యాటక అభివృద్ధికి విశేష కృషి చేశారు. నగరంలోని చరిత్రాత్మక ప్రాంతాలైన గోల్కొండ, తారామతి బారాదరి, కులీకుతుబ్‌షా సమాధుల వద్ద హోటళ్లు, ఇతర సదుపాయాలను కల్పించడం వంటి చర్యలు తీసుకున్నారు. ఐమాక్స్, జలవిహార్, స్నోవరల్డ్ ఏర్పాటు కావడంలో కూడా చందనా కృషి ఉంది. ఐఏఎస్ అధికారిగానే కాకుండా ఆమె బెంగాలీ రచయితగా, చిత్రకారిణిగా గుర్తింపు పొందారు. చందనా కుమారుడు నగరంలోని ప్రముఖ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్



మహేశ్‌గౌడ్‌ను అభినందిస్తున్న జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటుందని, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల కోసం తన వంతు కృషి చేస్తానని టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన వైద్య సాయం అందించడంతోపాటు సంఘం భవన నిర్మాణం గురించి కూడా మాట్లాడతానని హామీ ఇచ్చారు.

పీసీసీ చీఫ్‌కు జగ్గారెడ్డి అభినందనలు

పీసీసీ కొత్త అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కలిశారు. సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన మహేశ్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహేశ్‌గౌడ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు.

ఉద్యోగ సమస్యలపై కలిసిన హర్ష

డీఎస్సీ నియామకాలు చేపడితే జీవో 317 సమస్య మరింత జటిలమవుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌తో సమావేశమై ఉద్యోగ సమస్యల గురించి వివరించారు. అక్టోబర్ 2న జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల చలో గాంధీభవన్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కచ్చితమైన హామీని ఇప్పించాలని కోరారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

చివరి మజిలీలో ఒంటరి బతుకేనా?





"నా కొడుకు అమెరికా వెళ్లి పదేళ్లు దాటిపోయింది. ఇన్ని రోజులు డబ్బులు పంపించేవాడు. ఆ డబ్బులతోనే అమీర్‌పేట్‌లో ఇంటి అద్దె కడుతూ నెట్టుకొచ్చాను. గత 6 నెలల నుంచి డబ్బులు పంపడం మానేశాడు. కనీసం ఫోన్ చేసినా తీయట్లేదు. నాకున్న ఒక్కగానొక్క దిక్కు నా కొడుకే. తనే నన్ను వదిలేసే సరికి అంతా శూన్యమైపోయింది. ఇంటి అద్దె కట్టలేను. నిత్యావసరాలు కొనలేను. ఏం చేయలేని అయోమయ స్థితిలో రోడ్డున పడ్డాను. ఎస్ఆర్ నగర్ రోడ్ల మీద ఉన్న నన్ను పోలీసులు చూసి, నారపల్లిలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేర్చారు. నాకు షుగర్, థైరాయిడ్.. ఓ వైపు మానసిక వేదన, మరోవైపు అనారోగ్యం. ఉండటానికి చోటు, ఆహారం, మందులు అందుతున్నా.. కానీ నా కొడుకుపై ఆశ చావట్లేదు. ఏదేమైనా తాను బాగుంటే చాలనే కోరుకుంటున్నా. ఏనాడైనా నన్ను చూడాలనిపించి వస్తాడని ఎదురుచూస్తున్నా.."

.. కన్నవాళ్లు కానక జీవిత చివరి మజిలీలో ఒంటరి బతుకైపోయిన వృద్ధురాలి దీనగాథ ఇది. కంటికి రెప్పగా పెంచుకుని, పెద్ద చేసిన పిల్లలే చరమాంకంలో తమను పట్టించుకోక కన్నీళ్లు పెడుతున్న ఇలాంటి వయోవృద్ధులు ఎందరో. ఇప్పుడు కాకుంటే ఇంకొన్నేళ్లకైనా ఆ పిల్లలకూ వయసు మీద పడకమానదని.. వృద్ధాప్యంలో తోడు కోసం ఎదురుచూడక తప్పదన్న విషయాన్ని గుర్తుపెట్టుకుంటే.. వయోవృద్ధుల పట్ల వ్యవహరించే తీరు మారుతుందని సామాజికవేత్తలు చెప్తున్నారు.

"జీవితంలో చివరి దశకు చేరుకున్నవారు ఎన్నో దుర్భర పరిస్థితులు దాటుకుని మా ఓల్డ్ ఏజ్ హోమ్‌కు వస్తారు. అనాథలై కొందరు, కన్నవారు పట్టించుకోక మరికొందరు మా వద్దకు వచ్చారు. వారి మానసిక వేదనను పూర్తిగా పోగొట్టలేం. కానీ సాంత్వన అందించగలం. ఇక్కడ చేరిన వృద్ధులు కుటుంబ సభ్యుల్లా కలిసి చిన్న చిన్న పనులు చేసుకుంటారు. సాటి వారి ఆలనా పాలనా చూసుకుంటారు. వారి ప్రేమ, ఆప్యాయతలు చూస్తుంటే ఇదో పెద్ద కుటుంబం అనిపిస్తుంది.."అని లహరి ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహకురాలు లహరి చెప్పారు.

గోదావరిలో 4,561.60 టీఎంసీల లభ్యత

- తాజా అధ్యయనంలో తేల్చిన కేంద్ర జలసంఘం
- 38 ఏళ్ల ప్రవాహాల ఆధారంగా నిర్ధారణ
- గత అధ్యయనాలతో పోలిస్తే పెరిగిన నీటి లభ్యత



సాక్షి, హైదరాబాద్: గోదావరి నది పరీవాహక ప్రాంతం (బేసిన్)లో ఏటా సగటున 4,561.60 టీఎంసీల జలాల లభ్యత ఉందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చింది. 1985–86 నుంచి 2022–23 మధ్య 38 ఏళ్ల ప్రవాహాలను ఆధారంగా చేసుకొని నిర్వహించిన కొత్త అధ్యయనంలో నీటి లభ్యతను నిర్ధారించింది. గోదావరిలో ఇప్పటివరకు నిర్వహించిన ఏడు అధ్యయనాల్లో తేల్చినదాని కంటే అధిక లభ్యత ఉందని తాజా అధ్యయనంలో సీడబ్ల్యూసీ వెల్లడించింది. ఈ మేరకు 'అసెస్మెంట్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్ ఆఫ్ ఇండియా' పేరుతో దేశంలోని అన్ని ప్రధాన నదుల్లో నీటి లభ్యతపై నివేదికను ప్రచురించింది. గేజింగ్ స్టేషన్ల నుంచి సేకరించిన ప్రవాహాలను ప్రామాణికంగా తీసుకొని నీటి లభ్యతను నిర్ధారించడం ఆనవాయితీగా వస్తుండగా తాజా నివేదికలో మాత్రం ఉపగ్రహ చిత్రాల ఆధారంగా పరీవాహక ప్రాంతంలోని నీటి లభ్యతను సీడబ్ల్యూసీ నిర్ధారించింది. దీంతో ఈ అధ్యయనానికి విశ్వసనీయత కొరవడిందని నీటి పారుదల శాఖలోని అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నీటి లభ్యతను శాస్త్రీయంగా అంచనా వేయాలంటే వందేళ్లు లేదా కనీసం 50 ఏళ్ల ప్రవాహాలను ఆధారంగా తీసుకోవాలని.. బేసిన్‌లో కొంత కాలం అధిక వర్షపాతం కురవడం.. ఆ సమయంలో ఒకేసారి గరిష్టంగా వరద రావడం తదితర కారణాల వల్లే గోదావరిలో నీటి లభ్యత పెరగడానికి కారణమని నీటిపారుదలరంగ నిపుణులు చెబుతున్నారు.

గరిష్ట లభ్యత 8,664 టీఎంసీలు..

గోదావరిలో 1985–86 నుంచి 2022–23 వరకు ఏటా సగటున 4,561.60 టీఎంసీల లభ్యత ఉంది. 2013–14లో గరిష్టంగా 8,664.82 టీఎంసీల లభ్యత ఉండగా, 2009–10లో కనిష్టంగా 2,066.62 టీఎంసీల లభ్యత ఉంది. బేసిన్‌లో సగటున 116.7 సెంటీమీటర్ల మేర వర్షం కురుస్తుంది. దీనివల్ల గోదావరిలో ఏటా సగటున 12,869.74 టీఎంసీల ప్రవాహం ఉంటుంది. 1994–95లో గరిష్టంగా 148.4 సెం.మీ. వర్షపాతం కురవడంతో ఆ సంవత్సరంలో గరిష్టంగా 17,054.89 టీఎంసీల ప్రవాహం వచ్చింది. 2015–16లో బేసిన్‌లో కనిష్టంగా 91.4 సెం.మీ.ల వర్షపాతం కురవడం వల్ల ఆ ఏడాది గోదావరిలో నీటి ప్రవాహం కనిష్టంగా 9,608.43 టీఎంసీలుగా నమోదైంది.

గోదావరిలో నీటి లభ్యతపై వివిధ అధ్యయనాల్లో తేలింది ఇదీ..

సంవత్సరం	అధ్యయనం చేసిన సంస్థ	నీటి లభ్యత (టీఎంసీల్లో)
1. 1901–03	ఫస్ట్ ఇరిగేషన్ కమిషన్	4,122.80
2. 1949	ఖోస్లా ఎంపిరికల్ ఫార్ములా	4,432.70
3. 1960	సీడబ్ల్యూ అండ్ పీసీ	4,072.85
4. 1962	కృష్ణా, గోదావరి కమిషన్	4,166.79
5. 1988	సీడబ్ల్యూసీ	4,166.79
6. 1993	సీడబ్ల్యూసీ	3,903.69
7. 2019	సీడబ్ల్యూసీ	4,157.96
8. 2024	సీడబ్ల్యూసీ	4,561.60

వాడుకున్నది 850 టీఎంసీలే..

గోదావరిలో సగటున 4,561.60 టీఎంసీల వార్షిక నీటి లభ్యత ఉన్నా 1985–2023 మధ్య సగటున 850.38 టీఎంసీలనే సాగునీటి అవసరాలకు వినియోగించుకున్నారు. 2022–23లో గృహ, పారిశ్రామిక, పశువుల తాగునీటికి 70.28 టీఎంసీలను ఉపయోగించారు. బేసిన్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న కాళేశ్వరం, ఎస్సారెస్పీ–2, సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క–సారక్క, పోలవరం వంటి ప్రాజెక్టులు పూర్తయితే నీటి వినియోగం గణనీయంగా పెరగనుంది. బేసిన్‌లోని రిజర్వాయర్లలో ఆవిరి నష్టాలు ఏటా సగటున 181.52 టీఎంసీలుగా సీడబ్ల్యూసీ లెక్కగట్టింది.

బీజేపీ రాష్ట్రాల్లో రుణమాఫీ చూపించగలరా?

- బీజేపీ నాయకులకు మంత్రి తుమ్మల సవాల్



సాక్షి, హైదరాబాద్: 'బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా రుణమాఫీ చేసినట్లు చూపించగలరా? ప్రభుత్వానికి కొన్ని లక్షల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన పారిశ్రామిక వేత్తలనుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు రుణమాఫీ చేయగల నిబద్ధత మీకుందా?' అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్ర బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మీద విమర్శలు చేయడం.. వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి కాశీకి పోయినట్లు ఉందని తుమ్మల ఎద్దేవా చేశారు. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాల గురించి, రాష్ట్ర రైతాంగ సమస్యల గురించి మాట్లాడని వారు, ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికస్థితి అంతంత మాత్రంగా ఉన్నా కూడా మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలు నెరవేరుస్తుంటే, అక్కసు వ్యక్తం చేయడం సరికాదన్నారు. రుణమాఫీలో అక్కడక్కడా ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ వస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క రైతు కుటుంబానికి రుణమాఫీ వర్తింపచేసే విధంగా చర్యలు తీసుకొంటున్నామని, దానిమీద ఏమైనా సందేహాలు ఉంటే బీజేపీ పెద్దలు స్వయంగా వచ్చి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఇప్పటివరకు 22.18 లక్షల మందికి రుణ మాఫీ చేశామన్నారు. అదేవిధంగా ఆధార్ వివరాలు సరిగాలేని ఖాతా వివరాలు కూడా సరిచేశామని తెలిపారు. ఇంకా మిగిలిన 2 లక్షలకు పైన ఉన్న కుటుంబాలకు రుణమాఫీ చేస్తామని మంత్రి వివరించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల బాహాబాహీ

- హనుమకొండలో నయీంనగర్ వంతెన నిర్మాణంపై రచ్చ రచ్చ
- మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అరెస్టు, పోలీసులను అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు



బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తోపులాట

సాక్షిప్రతినిధి, వరంగల్: హనుమకొండలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం చినికిచినికి గాలివానగా మారింది. నయీంనగర్ వంతెన నిర్మాణానికి సంబంధించి ఘనత 'తమదంటే.. తమదని' విసురుకున్న సవాళ్లు తారస్థాయికి చేరుకున్నాయి. బ్రిడ్జి వద్దే బహిరంగ చర్చకు సిద్ధమన్న సవాళ్లు సోమవారం ఉద్రిక్తతకు దారి తీశాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణం జరిపితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాలాభిషేకాలు చేయించుకుంటున్నారని ఇటీవల జిల్లా పర్యటనలో మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు దీనికి ఆజ్యం పోశాయి. స్థానిక ప్రజల మధ్యే ఈ విషయం తేల్చుకుందామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం బీఆర్ఎస్ నాయకులకు బహిరంంగ సవాల్ విసిరారు. దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు నయీంనగర్ బ్రిడ్జి వద్దకు రావాలని అన్నారు. కాళోజీ కళాక్షేత్రంతో పాటు నయీంనగర్ వంతెనలకు తమ ప్రభుత్వమే నిధులిచ్చిందని వెల్లడించారు. రోజంతా నాయిని రాజేందర్‌రెడ్డి బ్రిడ్జి వద్ద వేచి చూసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులతోపాటు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై స్పందించిన దాస్యం వినయభాస్కర్ సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి నయీంనగర్ బ్రిడ్జిపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే బ్రిడ్జికి టెండర్లు పిలిచి పనులను ప్రారంభించామని, ఎన్నికలు రావడంతో కొంత ఆలస్యం జరిగిందని, తాము చేసిన అభివృద్ధి పనులనే కాంగ్రెస్ నాయకులు వల్లె వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు సైతం బహిరంగ విచారణకు వస్తామంటూ నయీంనగర్ బ్రిడ్జి వద్దకు చేరుకోవడంతో ఘర్షణకు దారి తీసింది. పరస్పరం బాహాబాహీకి తలపడ్డారు. దీంతో పరిస్థితి అదుపు తప్పి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో వినయ్ భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు వినయ్ భాస్కర్ అరెస్టును అడ్డుకుంటూ రోడ్డుపై ధర్నాకు దిగారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. వినయ్ భాస్కర్‌తోపాటు మాజీ 'కుడా' చైర్మన్ సుందరరాజ్‌లతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని మొదట నగరంలోనే బస్సుల్లో తిప్పిన పోలీసులు.. ఆ తర్వాత హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హైడ్రాకు కర్త, కర్మ, క్రియ సీఎం రేవంత్‌రెడ్డే

- శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: హైడ్రాకు కర్త, కర్మ, క్రియ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఎమ్మెల్సీలు ఎల్.రమణ, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నవీన్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో తక్షణమే కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజలు అనేక బాధలు పడుతున్నారని, ఇలాంటి సమయంలో హైడ్రా పేరిట మరో బాధ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1976లో ఇందిరమ్మ పాలనలో తుర్క్‌మన్‌గేటులో పేదల ఇళ్లపై బుల్డోజర్లు ఎక్కించారని, మళ్లీ ఇప్పుడు తెలంగాణలో ఇందిరమ్మ పాలన అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తన పాలనా వైఫల్యం కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ చర్యలు మొదలుపెట్టారని, ఫోర్త్ సిటీ పేరుతో మరో రాజకీయం మొదలుపెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వమే ప్రజలకు సమస్య కాకూడదని, పర్మిషన్లు ప్రభుత్వమే ఇచ్చి ఇళ్లను కూలిస్తే ఎలా అని నిలదీశారు. రవీందర్‌రావు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు అసలు చదువుకున్నారా? ప్రజల ఆవేశాన్ని డబ్బులతో ముడిపెడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆవేశం ఎలా ఉందో ఇంటెలిజెన్స్‌ను పంపి తెలుసుకోవాలని హితవు పలికారు. రమణ మాట్లాడుతూ హైడ్రా పేరుతో పేదల గుండెల్లో గునపాలు గుచ్చుతోందని, రాజ్యాంగ సూత్రాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మంట గలుపుతున్నదని, ఇందిరమ్మ పాలనలో ఇళ్లు కడతారనుకుంటే కూల్చుతున్నారన్నారు. దీనిపై శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

శక్తి అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: మహిళా రాజకీయ సాధికారత కోసం ఇందిరా ఫెలోషిప్ ఉమెన్ పని చేస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఇందిరా ఫెలోషిప్ ఉమెన్ ఆధ్వర్యంలో పని చేసే శక్తి అభియాన్ పోస్టర్‌ను సోమవారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఇందిరా ఫెలోషిప్ ఉమెన్ చైర్మన్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి చేయూత

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వైద్య విద్యార్థిని జి.సంజనకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ చేయూత అందించింది. కామారెడ్డి మెడికల్ కాలేజీలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్న జి.సంజన ప్రియ తండ్రికి అనారోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ట్యూషన్ ఫీజు చెల్లించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గైక్వాడ్ తులసీదాస్ మాంగ్ సోమవారం సచివాలయంలో రూ.25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి దేవేందర్, కోశాధికారి బి.గుణవంత్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

- సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పకడ్బందీ చర్యలు: మంత్రి జూపల్లి



మోర్తాడ్‌లో ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

బాల్కొండ /ఆర్మూర్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తమ ప్రభుత్వం అక్రమ మద్యం, గంజాయి, కల్తీ కల్లు నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి, అల్ప్రాజోలం, గుడుంబా వంటి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సోమవారం నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్, భీంగల్ మండల కేంద్రాల్లో, ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని, ఇందుకు అధికారుల పాత్ర చాలా కీలకమన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో భాగంగా తనిఖీల కోసం హైదరాబాద్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేక బృందాలను పంపుతామని చెప్పారు. తనిఖీల్లో ఎక్కడైనా గంజాయి, మాదక ద్రవ్యాలు పట్టుబడితే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలు మద్యానికి బానిసలయ్యారని, వేలాది కుటుంబాలు ఆగమైపోయాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అనధికార మద్యం షాపులను ప్రోత్సహించారని, వేలాదిగా బెల్టు షాపులు వెలిశాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణ వ్యాప్తంగా ప్రతి పల్లెలో గంజాయి, ఆల్ప్రాజోలం, గుడుంబా వంటి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల ఆనవాళ్లు లేకుండా ఉక్కుపాదం మోపాలని మంత్రి ఆదేశించారు.



ఆ విద్యార్థికి సీటివ్వండి



ఐఐటీ ధన్‌బాద్‌కు సుప్రీంకోర్టు ఆదేశం ● దళిత విద్యార్థికి భారీ ఉపశమనం

న్యూఢిల్లీ: నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివినా సమయానికి ప్రవేశరుసుం కట్టలేక ప్రతిష్టాత్మక ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు కోల్పోయిన దళిత విద్యార్థికి సర్వోన్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. వెంటనే ఆ విద్యార్థి అతుల్ కుమార్‌కు సీటు ఇవ్వాలని ఐఐటీ ధన్‌బాద్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం ఆదేశించింది. జూన్ 24వ తేదీ సాయంత్రం ఐదింటిలోపు అడ్మిషన్ ఫీజు రూ.17,500 కట్టలేకపోవడంతో బీటెక్ సీటు కోల్పోయిన తనకు న్యాయం చేయాలంటూ విద్యార్థి సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెల్సిందే. '' విద్యార్థి ఆరోజు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు కోసం మధ్యాహ్నం మూడు గంటలకే లాగిన్ అయ్యాడు. తర్వాత పదేపదే ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లో రిమైండర్లతో గడువును గుర్తుచేశాం'' అని ఐఐటీ సీట్ల కేటాయింపు విభాగం వాదించింది. దీంతో సీజేఐ కలగజేసుకుని ''మీరెందుకంతగా వ్యతిరేకిస్తున్నారు?. ఈ పిల్లాడికి ఏమైనా చేయగలవేమో చూడండి. ఆ డబ్బులే ఉంటే కట్టకుండా ఎందుకుంటాడు? అణగారిన వర్గాలకు చెందిన రోజువారీ కూలీ కుమారుడు. పైగా అతనిదిదారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబం. ఐఐటీలో సీటు కోసం ఎంత కష్టపడాలో అంత కష్టపడ్డాడు. ప్రతిభగల ఇలాంటి విద్యార్థిని మనం ఊరకనే వదిలేయలేం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ద్వారా సుప్రీంకోర్టుకు సంక్రమించిన అసాధారణ అధికారంతో మిమ్మల్ని ఆదేశిస్తున్నాం. ఇదే ఏడాది అదే బ్యాచ్ ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్ కోర్సులో విద్యార్థికి సీటివ్వండి. హాస్టల్ వసతి సహా అర్హతగల అన్ని ప్రయోజనాలు అతనికి అందేలా చూడండి'' అని ఐఐటీ కాలేజీ విభాగాన్ని కోర్టు ఆదేశించింది. కిక్కిరిసిన కోర్టు హాలులో అంతసేపూ చేతులు కట్టుకుని నిలబడిన విద్యార్థితో '' ఆల్ ది బెస్ట్. బాగా చదువుకో'' అని సీజేఐ అన్నారు. బాగా చదువుతూ ఇంజనీరింగ్ చేస్తున్న అతని ఇద్దరు అన్నల బాగోగులు తదితరాల గురించి కూడా ఆయన ఆరాతీశారు.

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌జిల్లా టిటోరా గ్రామానికి చెందిన అతుల్ ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు వచ్చినా పేదరికం కారణంగా డబ్బులు కట్టలేక నిస్సహాయుడయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తలో చేయి వేసి నగదు సర్దినా చివరి నిమిషంలో ఆన్‌లైన్ చెల్లింపు విఫలమై ఫీజు కట్టలేకపోయాడు. జార్ఖండ్ హైకోర్టు లీగ్ సర్వీసెస్ అథారిటీని ఆశ్రయించగా పరీక్షను ఐఐటీ మద్రాస్ నిర్వహించినందున మద్రాస్ హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. దీంతో మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు. అక్కడ విచారణ నెమ్మదించడంతో ఈసారి నేరుగా సుప్రీంకోర్టు తలుపు తట్టారు.

ఇది కాఫీ షాప్ కాదు..



'యా' అంటూ బదులిచ్చిన పిటిషనర్‌పై సీజేఐ ఆగ్రహం ● 'ఎస్' అని వ్యాఖ్యానించాలని సూచన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట కాస్తంత మర్యాద తగ్గించి మాట్లాడిన పిటిషనర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషనర్ ధోరణిని తీవ్రంగా తప్పుబట్టారు. సోమవారం విచారణ సందర్భంగా 'ఎస్' అనడానికి బదులుగా 'యా' అని సమాధానమిచ్చిన పిటిషనర్‌పై సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. ''యా. యా. యా' అని అనకండి. 'ఎస్' అని మాట్లాడండి. యా అంటూ పిచ్చాపాటీగా మాట్లాడటానికి ఇది కాఫీ షాప్ కాదు. సుప్రీంకోర్టు. 'యా' అని పలికే వ్యక్తులంటే నాకు కొంచెం పడదు. మీ నుంచి ఇలాంటి మాటలను కోర్టు అనుమతించబోదు'' అని సీజేఐ వ్యాఖ్యానించారు. దీంతో పిటిషనర్ వెంటనే తన భాషను సరిదిద్దుకున్నారు. మాజీ చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ తనను చట్టవిరుద్ధంగా విధుల నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టేయడాన్ని పిటిషనర్ మళ్లీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ రిట్ పిటిషన్‌ను సోమవారం సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. గొగోయ్‌పై విచారణ జరిపించాలని పిటిషనర్ కోరారు. గొగోయ్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఉన్న విషయం తెలిసిందే. ''ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలపై సుప్రీంకోర్టుకు నేరుగా అప్పీళ్లను అనుమతించే ఆర్టికల్ 32 కింద ఈ అప్పీల్ చేయొచ్చా? ఈ అప్పీల్‌ను ఆ ఆర్టికల్ కింద పరిగణనలోకి తీసుకోవచ్చా? అనే ప్రశ్నలను కోర్టు లేవనెత్తింది. న్యాయమూర్తిని ప్రతివాదిగా చేర్చి పిల్‌ను ఎలా దాఖలు చేశారు?'' అని సీజేఐ ప్రశ్నించారు. దీంతో పిటిషనర్ స్పందిస్తూ.. ''యా. యా. అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్. క్యూరేటివ్ దాఖలు చేయమని నాకు సూచించారు'' అంటూ యథాలాపంగా సాధారణ భాషలో మాట్లాడారు. దీంతో సీజేఐ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''జస్టిస్ గొగోయ్ ఈ కోర్టు మాజీ న్యాయమూర్తి. ఒక న్యాయమూర్తిపై ఇలాంటి పిటిషన్ దాఖలు చేసి అంతర్గత విచారణ కోరలేరు. ఎందుకంటే గతంలోనే ఇదే విషయంలో మీరు కేసు ఓడిపోయారు'' అని సీజేఐ అన్నారు. అప్పుడు పిటిషనర్ స్పందిస్తూ, ''కానీ జస్టిస్ గొగోయ్ నేను సవాలు చేసిన ప్రకటనను బట్టి నా పిటిషన్‌ను తిరస్కరించారు. నా తప్పేమీ లేదు. కార్మిక చట్టాలపై అవగాహన ఉన్న ధర్మాసనం ముందు నా రివ్యూ పిటిషన్‌ను పరిశీలించాలని నాటి సీజేఐ ఠాకూర్‌ను కోరా. కానీ నా అభ్యర్థనను తోసిపుచ్చారు'' అంటూ కేసు నేపథ్యాన్ని వివరించారు. సీజేఐ, పిటిషనర్ కొద్దిసేపు మరాఠీలో మాట్లాడుకున్నారు. తర్వాత ''జస్టిస్ గొగోయ్ పేరును పిటిషన్ నుంచి తొలగించండి. అప్పుడు ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ పరిశీలిస్తుంది'' అని సీజేఐ సూచించారు.

రిషి వారసుడెవరో?!

టోరీల సారథ్య రేసులో నలుగురు ● ముందంజలో జెన్రిక్ ● గట్టి పోటీ ఇస్తున్న కేమీ

బ్రిటన్‌లో రిషి సునాక్ వారసునిగా విపక్ష కన్జర్వేటివ్ పార్టీ పగ్గాలు చేపట్టబోయేది ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. సూటి వ్యాఖ్యలకు పెట్టింది పేరైన 44 ఏళ్ల కేమీ బేడ్‌నాక్ మొదలుకుని పార్టీకి పరమ విధేయుడైన జేమ్స్ క్లెవర్లీ దాకా నలుగురు నేతలు రేసులో ఉన్నారు. ఎన్నికల్లో దారుణ పరాజయంతో నైరాశ్యంలో కూరుకుపోయిన శ్రేణుల్లో నూతన జవసత్వాలు నింపగల నేత వీరిలో ఎవరన్న దానిపై బహుశా బుధవారం స్పష్టత వచ్చే అవకాశముంది.

గత జూలైలో జరిగిన సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ చేతుల్లో ఘోర పరాజయంతో కన్జర్వేటివ్ (టోరీ) పార్టీ కకావికలైంది. దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్న అనంతరం టోరీలు ఘోర ఓటమి చవిచూశారు. పార్టీ 190 ఏళ్ల చరిత్రలోనే అత్యంత దారుణ ఓటమిగా అది రికార్డులకెక్కింది. పార్లమెంటులో టోరీ ఎంపీల సంఖ్య 365 నుంచి ఏకాయెకి 121కి పడిపోయింది. ఈ నేపథ్యంలో తిరిగి జనాదరణ పొందేందుకు ఏం చేయాలన్న దానిపై నాయకులంతా వర్గాలుగా విడిపోయి వాదులాడుకుంటున్నారు. వారందరినీ ఒక్కతాటిపైకి తెచ్చి పార్టీకి నూతన దిశానిర్దేశం చేయడం కొత్త నాయకునికి పెను సవాలే కానుంది. భారత మూలాలున్న మాజీ హోం మంత్రి ప్రీతీ పటేల్, మెల్ స్ట్రైడ్ తొలి రౌండ్లలోనే వైదొలిగి రేసులో నలుగురు మిగిలారు. వారిలో క్లెవర్లీకే మొగ్గున్నట్టు పలు సర్వేలు తేల్చినా టోరీ ఎంపీలు, నేతలు జెన్రిక్ వైపే మొగ్గుతున్న సూచనలు కన్పిస్తున్నాయి.

కేమీ బేడ్‌నాక్ (44)

నైజీరియా తల్లిదండ్రులకు లండన్‌లో జన్మించారు. 2017, 2022ల్లో ఎంపీగా గెలిచారు. బోరిస్ జాన్సన్ తప్పుకున్నాక పార్టీ నేత పదవికి తొలిసారి పోటీ పడి నాలుగో స్థానంలో నిలిచారు. ముక్కుసూటి నాయకురాలిగా పేరు. దివంగత ప్రధాని మార్గరెట్ థాచర్ తనకు ఆదర్శమంటారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు మొదలుకుని ప్రతి అంశంపైనా మాట్లాడుతూ నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. సమర్థులకు కీలక బాధ్యతలివ్వడం ద్వారా పార్టీలో సమూల ప్రక్షాళనే లక్ష్యమని చెబుతున్నారు.

జేమ్స్ క్లెవర్లీ (54)

పార్టీకి అత్యంత నమ్మకస్తునిగా పేరు తెచ్చుకున్నారు. కొంతకాలం సైన్యంలో పని చేశారు. పార్టీలో చేరి ఎంపీగా అయ్యాక హోం, విదేశాంగ మంత్రిగా చేశారు. బ్రెగ్జిట్‌కు గట్టి మద్దతుదారు. పార్టీకి బ్రిటన్‌లోని నల్లజాతీయుల మద్దతు సాధించి పెట్టే ప్రయత్నంలో తలమునకలుగా ఉన్నారు. పార్టీలో ఇటు వామపక్ష, అటు రైట్‌వింగ్ నేతల ఆదరణ సాధించేందుకు సెంట్రిస్ట్ ఇమేజీ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రజల్లో మంచి ఆదరణ ఉన్న నేత. పలు సర్వేల్లో ముందంజలో ఉన్నారు.

రాబర్ట్ జెన్రిక్ (42)

పార్టీలో అతివాద నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. వలసలపై మరింత కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు. వాటి కట్టడికి ఉద్దేశించిన రువాండా స్కీం ఆశించిన ఫలితాలివ్వడం లేదంటూ గత డిసెంబర్‌లో వలసల మంత్రి పదవి నుంచి తప్పుకున్నారు. మిగతా నేతలకు గట్టి పోటీ ఇస్తున్నారు.



రాబర్ట్ జెన్రిక్ జేమ్స్ క్లెవర్లీ కేమీ బేడ్‌నాక్ టామ్ టూగన్‌హాట్

ఎంపిక ఇలా...

టోరీల సారథి ఎంపిక ప్రక్రియ కాస్త సంక్లిష్టంగా ఉంటుంది. తుది రేసులో ఉన్న నలుగురు నేతలు పార్టీ ఎంపీలు, ముఖ్య నేతల మద్దతు గెలుచుకోవడం కీలకం. అందుకోసం పలు అంశాలపై తమ వైఖరిని వారి ముందుంచాలి. ఈ ప్రక్రియ తుది దశకు చేరింది. టోరీ ఎంపీలు, నేతల 4 రోజుల కీలక సదస్సు బర్మింగ్‌హాంలో ఆదివారం మొదలైంది. అభ్యర్థులను వారు మంగళవారం దాకా ఇంటర్వ్యూ చేస్తారు. చివరి రోజైన బుధవారం అభ్యర్థులకు ప్రధాన పరీక్ష ఎదురవుతుంది. ఒక్కొక్కరు 20 నిమిషాల పాటు చేసే ప్రసంగం కీలకం కానుంది. ఎంపీలు, నేతలను ఆకట్టుకునే వారి ఎన్నిక దాదాపు లాంఛనమే అవుతుంది. అక్టోబర్ 9, 10 తేదీల్లో జరిగే టోరీ ఎంపీల ఓటింగ్ ప్రక్రియ అనంతరం చివరికి ఇద్దరు అభ్యర్థులు రేసులో మిగులుతారు. వారి నుంచి తమ నాయకున్ని ఎన్నుకునేందుకు 1.7 లక్షల పై చిలుకు టోరీ సభ్యులు అక్టోబర్ 15 నుంచి 31 దాకా ఆన్‌లైన్ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొంటారు. విజేత ఎవరన్నది నవంబర్ 2న తేలుతుంది.

టామ్ టూగన్‌హాట్ (51)

మాజీ సైనికుడు. ఇరాక్‌లో పని చేశారు. అరబిక్‌లో ధారాళంగా మాట్లాడగలరు. సెంట్రిస్ట్ నాయకుడు. 2022లో పార్టీ నేత పదవికి జరిగిన పోరులో లిజ్ ట్రస్ చేతిలో ఓడారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అక్టోబర్ 27న పార్లమెంట్ ఎన్నికలు

జపాన్ కాబోయే ప్రధాని షిగెరు ఇషిబా ప్రకటన



టోక్యో: అధికార పగ్గాలు చేపట్టేలోపే జపాన్ కాబోయే ప్రధాని షిగెరు ఇషిబా వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు పిలుపునిచ్చారు. నేడు ప్రధానిగా ప్రమాణం చేయనున్న ఇషిబా సోమవారం మాట్లాడారు. '' నేను ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక అక్టోబర్ 27న పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తా'' అని అన్నారు. శుక్రవారం జరిగిన అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్ష ఎన్నికల్లో ఇషిబా విజయం సాధించడం తెల్సిందే. దీంతో ఫుమియో కిషిద వారసుడిగా ఇషిబా ఎంపికయ్యారు. మంగళవారం ప్రమాణస్వీకారం కోసం ఎల్‌డీపీ ముఖ్యనేతలంతా సిద్ధమవుతున్న వేళ ఇషిబా తదుపరి ఎన్నికలపై ముందే ఒక ప్రకటనచేయడం గమనార్హం.

నెతన్యాహుతో మాట్లాడిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో ఫోన్‌లో సంభాషించారు. పశ్చిమాసియాలో ఇటీవలి పరిణామాలపై ఆయన చర్చించారు. ప్రస్తుత ప్రపంచంలోనే ఉగ్రవాదానికి చోటులేదని తేల్చిచెప్పారు. ప్రాంతీయ ఉద్రిక్తతలను నివారించడం ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. అదే సమయంలో బందీలందరినీ సురక్షితంగా విడుదలయ్యేలా చూడాలన్నారు. పశ్చిమాసియాలో సాధ్యమైనంత త్వరగా శాంతి, సుస్థిరతలను నెలకొల్పే ప్రయత్నాలకు భారత్ మద్దతుగా నిలుస్తుందని నెతన్యాహూకు హామీ ఇచ్చినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్'లో తెలిపారు. అయితే, ప్రత్యేకంగా ఏ సంఘటననూ ప్రధాని మోదీ ప్రస్తావించలేదు.

అప్పుడు హిట్లర్..ఇప్పుడు నెతన్యాహు!

పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ



శ్రీనగర్: పాలస్తీనా, లెబనాన్‌లను గ్యాస్ చాంబర్లుగా మార్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు..అడాల్ఫ్ హిట్లర్ తర్వాత అతిపెద్ద ఉగ్రవాది అని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. 'నెతన్యాహుకు వ్యతిరేకంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు కూడా తీర్పు ఇచ్చింది. లెబనాన్‌పై దాడుల తర్వాత ఆయనే నిజమైన నేరగాడని రుజువైంది. ఇప్పటికే వేలాదిగా పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకున్న నెతన్యాహు ఇప్పుడు లెబనాన్‌లో మారణ హోమం సృష్టిస్తున్నాడు. ఇతడి నేరాలను ఖండించడంతో సరిపోదు'అని ఆమె పేర్కొన్నారు. నాజీ నియంత హిట్లర్ ప్రజల్ని చంపేందుకు గ్యాస్ చాంబర్లను ఏర్పాటు చేశాడు. నెతన్యాహు పాలస్తీనా, లెబనాన్‌లను గ్యాస్ చాంబర్లుగా మార్చి మారణ హోమం సృష్టిస్తున్నాడు'అని ఆమె పేర్కొన్నారు.

నిర్మలకు ఊరట

దర్యాప్తుపై హైకోర్టు స్టే



బెంగళూరు: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఊరట లభించింది. ఈడీని అడ్డం పెట్టుకొని వ్యాపారవేత్తలను బెదిరించి ఎలక్టోరల్ బాండ్ల పేరిట కోట్లాది రూపాయలు వసూలు చేశారనే కేసులో నిర్మల, ఇతరులపై సాగుతున్న దర్యాప్తుపై కర్నాటక హైకోర్టు సోమవారం స్టే విధించింది. నిందితుల్లో ఒకరైన బీజేపీ నేత నళిన్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎం.నాగప్రసన్న దర్యాప్తుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి విచారణను అక్టోబరు 22కు వాయిదా వేశారు. ఆదర్శ్ ఆర్ అయ్యర్ చేసిన ఫిర్యాదు మేరకు.. స్పెషల్ కోర్టు ఆదేశాలతో నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఈడీ అధికారులపై శనివారం ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయసంహిత సెక్షన్ 384 (బెదిరించి డబ్బు గుంజడం), 120బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 34 కింద వీరిపై కేసు నమోదైంది.

సిద్ధూపై ఈడీ కేసు

- ● లోకాయుక్త ఎఫ్ఐఆర్ ఆధారంగా నమోదు
- ● ముడా ప్లాట్ల కేటాయింపులో మనీలాండరింగ్ కేసు

న్యూఢిల్లీ/బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని లోకాయుక్త నమోదు చేసిన ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) ఆధారంగా ఈ చర్యకు దిగింది. సిద్ధరామయ్య, భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి తదితరులపై కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేసింది. పార్వతి నుంచి 3.16 ఎకరాలను సేకరించిన ముడా ప్రతిగా 50:50 నిష్పత్తిలో ఖరీదైన ప్రాంతంలో ఆమెకు 14 ప్లాట్లను కేటాయించింది. దీంట్లో అవినీతి, అధికార దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఈ కేసులో సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అనుమతి మంజూరు చేశారు. దీన్ని సిద్ధూ హైకోర్టులో సవాల్ చేసినా చుక్కెదురైంది. అనంతరం బెంగళూరులోని ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు ఆయనపై లోకాయుక్త పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దాని ఆధారంగా సిద్ధరామయ్య తదితరులపై ఈడీ సోమవారం కేసు నమోదు చేసింది.



విచారణకు రావాలంటూ ఆయనకు సమన్లు జారీ చేసే వీలుంది. అలాగే ఆస్తులను కూడా అటాచ్ చేయవచ్చు.

14 ప్లాట్లను వెనక్కి ఇచ్చేస్తా

ముడా కమిషనర్‌కు పార్వతి లేఖ

మైసూరు: భూపరిహారంగా ముడా తనకు కేటాయించిన 14 ప్లాట్లను వెనక్కి ఇచ్చేందుకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి ముందుకు వచ్చారు. ఈ మేరకు ముడా కమిషనర్‌కు సోమవారం ఆమె లేఖ రాశారు. మైసూరు కేసరే గ్రామంలో తనకు చెందిన 3.16 ఎకరాల భూమిని ముడా తీసుకొని.. విజయనగర లేఔట్ ఫేజ్-3, ఫేజ్-4లో తనకు 14 ప్లాట్లను కేటాయించిందని ఆమె వివరించారు. 'సేల్ డీడ్‌ను రద్దు చేయడం ద్వారా నేనీ 14 ప్లాట్లను తిరిగి ఇచ్చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ముడా ఈ ప్లాట్లను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాను. ఈ దిశగా సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని పార్వతి ముడా కమిషనర్‌ను కోరారు. ముడా కేటాయింపుల్లో సిద్ధరామయ్యపై దర్యాప్తునకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, లోకాయుక్త పోలీసుల కేసు నమోదు, తాజాగా సోమవారం ఈడీ కేసు నమోదు నేపథ్యంలో.. ప్లాట్లను తిరిగి ఇచ్చేయాలని పార్వతి నిర్ణయం తీసుకున్నారు.

పోరు ఆపం

హెజ్‌బొల్లా తాత్కాలిక చీఫ్ ప్రకటన



బీరుట్: ఇజ్రాయెల్‌తో తమ పోరాటం కొనసాగుతుందని హెజ్‌బొల్లా తాత్కాలిక చీఫ్ నయీం కస్సెమ్ స్పష్టం చేశారు.చీఫ్ హస్సన్ నస్రల్లాతో పాటు ఇతర టాప్ కమాండర్లను పోగొట్టుకున్నా సరే తాము వెనక్కి తగ్గేది లేదని కుండబద్దలు కొట్టారు. లెబనాన్‌లో భూతల దాడులు జరపాలని ఇజ్రాయెల్ నిర్ణయించుకున్న పక్షంలో అందుకు తమ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. పోగొట్టుకున్న కమాండర్ల స్థానాలను భర్తీ చేశామని వెల్లడించారు. ఈ మేరకు ఆయన చేసిన ప్రకటన టీవీల్లో ప్రసారమైంది. 'మా పోరాట సామర్థ్యాన్ని దెబ్బతీయడం ఇజ్రాయెల్ వల్లకాదు. డిప్యూటీ కమాండర్లు సిద్ధంగా ఉన్నారు. కమాండర్ ఎవరైనా గాయపడితే వారితో భర్తీ చేస్తాం. 2006లో ఇజ్రాయెల్‌తో నెలపాటు పోరాడాం. ఈసారి అంతకంటే ఎక్కువ కాలమే పోరు సాగుతుందని అనుకుంటున్నాం'అని నయీం కస్సెమ్ పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ యుద్ధాలను కోరుకుంటోంది

జోర్డాన్ విదేశాంగ మంత్రి మండిపాటు



అమ్మాన్: లెబనాన్‌పై దాడులను జోర్డాన్ విదేశాంగ మంత్రి అయామన్ సఫాదీ తీవ్రంగా ఖండించారు. 'ఇజ్రాయెల్ కేవలం యుద్ధాలనే కోరుకుంటుంది. అవి ముగిసిపోవాలని అస్సలు భావించదు. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన సాధ్యమని ఇక్కడి వాళ్లను నమ్మించడానికి 30 సంవత్సరాలు పట్టింది. ఇప్పుడున్న ఇజ్రాయెల్ ప్రభుత్వం అలాంటి నమ్మకాన్ని ఒక్కదాడితో వమ్ముచేసింది. 57 ముస్లిం-అరబ్ దేశాలు శాంతిని కోరుకుంటున్నాయి. కానీ ఇజ్రాయెల్ యుద్ధకాంక్షతో రగిలిపోతోంది. పరిష్కారాన్ని ఇజ్రాయెల్ ఇష్టపడదని అర్థమైంది. లెబనాన్‌పై దురాక్రమణకు, దానిపై నిరంతర దాడికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు బాధ్యత వహించాలి'' అని అన్నారు. 'మన చుట్టూ శత్రువులు ఉన్నారు' అని ఇటీవల నెతన్యాహు వ్యాఖ్యానించడంతో సఫాదీ స్పందించారు.

ఇజ్రాయెల్‌కు సాయపడతాం

మధ్యప్రాచ్యంలో మా బలగాలు సిద్ధంగా ఉన్నాయి: అమెరికా




వాషింగ్టన్: లెబనాన్‌లో వందలాది లక్ష్యాలపై ఇజ్రాయెల్ గురిపెట్టాక మధ్యప్రాచ్యంలో తమ సైనిక సంసిద్ధత, సామర్థ్యాలను మరింత పెంచుకున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ మేరకు అమెరికా అధ్యక్ష భవనంలో జాతీయ భద్రతా అధికార ప్రతినిధి జాన్ కిర్బీ మాట్లాడారు. '' తన నేలకు, ప్రజలకు పొంచి ఉన్న ముప్పును తొలగించే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. మనల్ని మనం రక్షించుకోవడానికి, ఇజ్రాయెల్‌ను రక్షించడంలో సహాయపడటానికి ఇప్పటికే మధ్యప్రాచ్యానికి అదనపు బలగాలను పంపాం. సైనిక సంసిద్ధత, సామర్థ్యాలను ఆ రీజియన్‌లో మరింత పెంచుకున్నాం. ఏప్రిల్‌లో ఇరాన్ ఇజ్రాయెల్‌పై వందలాది క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినప్పటి నుంచి మరిన్ని దళాలను పంపాం. అప్రమత్తంగా ఉండాలని తూర్పు మధ్యధరా సముద్రంలోని విమాన వాహక నౌక, నావికా దళాలను ఆదేశించాం''అని కిర్బీ అన్నారు.

వైమానిక దళాధిపతిగా ఏపీ సింగ్



న్యూఢిల్లీ: భారత వైమానిక దళం(ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు 5 వేల గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అనుభవముంది. 1964లో జన్మించిన అమర్ ప్రీత్ సింగ్ 1984లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా చేరారు. 40 ఏళ్ల సర్వీసులో కమాండ్, స్టాఫ్, ఇన్‌స్ట్రక్షనల్ విధులతోపాటు విదేశాల్లోనూ బాధ్యతలు నిర్వర్తించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లలో చదివారు. ఫ్రంట్‌లైన్ ఎయిర్‌బేస్‌తోపాటు ఫైటర్ స్క్వాడ్రన్‌కు సారథ్యం వహించారు. పరమ్ విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు.



ఐఎస్ఎస్ చేరిన డ్రాగన్

వాషింగ్టన్: వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను వెనక్కు తీసుకొచ్చేందుకు బయల్దేరిన స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుంది. సోమవారం ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. కాసేపటికే అందులోని వ్యోమగాములు నిక్ హేగ్, అలెగ్జాండర్ గోర్బునోవ్ ఐఎస్ఎస్‌లో ప్రవేశించారు. సునీత, విల్మోర్ తదితరులతో కలిసి ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. స్పేస్ ఎక్స్ క్రూ-9 మిషన్‌ను అమెరికాలో ఫ్లోరిడాలోని కేప్‌కెనవెరల్ నుంచి శనివారం ప్రయోగించడం తెలిసిందే. జూన్‌లో బోయింగ్ తొలిసారి ప్రయోగాత్మకంగా పంపిన స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో సునీత, విల్మోర్ ఐఎస్ఎస్ చేరుకున్నారు. 8 రోజుల్లో వారు తిరిగి రావాల్సి ఉండగా స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలతో అక్కడే చిక్కుబడిపోయారు. చివరికి స్టార్‌లైనర్ ఖాళీగానే భూమికి తిరిగొచ్చింది. సునీత, విల్మోర్ డ్రాగన్ క్యాప్సూల్‌లో ఫిబ్రవరిలో తిరిగి రానున్నారు. వారికి చోటు కల్పించేందుకు వీలుగా నాలుగు సీట్ల సామర్థ్యమున్న డ్రాగన్ క్యాప్సూల్‌లో హేగ్, గోర్బునోవ్‌లను మాత్రమే పంపడం తెలిసిందే.

కవలలే గానీ... గర్భాశయాలు వేరు

పండంటి పాప, బాబు జననం ● చైనాలో అరుదైన ఘటన

వారు కవలలే. ఒక తల్లి పిల్లలే. కాకపోతే చెరో గర్భాశయం నుంచి పుట్టుకొచ్చారు. అదెలా సాధ్యమంటారా? వాళ్లమ్మకు రెండు గర్భాశయాలున్నాయి! ఎంచక్కా ఒక్కోదాంట్లో ఒక్కొక్కరు పురుడు పోసుకున్నారన్నమాట. వైద్యపరంగా అత్యంత ఈ అరుదైన ఘటన చైనాలో జరిగింది. ఇది అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లోకెక్కింది. పది లక్షల జననాల్లో ఒక్కసారి మాత్రమే ఇలా జరిగేందుకు అవకాశం ఉంటుందట.

చైనాలోని షాంగ్జీ ప్రావిన్స్‌లో లీ అనే మహిళ సెప్టెంబర్ తొలి వారంలో పండంటి కవలలకు జన్మనిచ్చింది. పిల్లాడు 3.3 కిలోలు, పాప 2.4 కిలోల బరువుతో పుట్టారు. అయితే వారిద్దరూ చెరో గర్భాశయంలో పెరిగారు! లీకి రెండు గర్భాశయాలుండటమే ఇందుకు కారణం. లీకి గర్భాశయాలు రెండూ సంపూర్ణంగా ఎదగడమే గాక పూర్తి ఆరోగ్యంగా ఉన్నాయని ఆమెకు పురుడు పోసిన సీనియర్ డాక్టర్ కై యింగ్ చెప్పుకొచ్చారు. పైగా ఆ రెండింట్లోనూ సహజ పద్ధతిలో గర్భధారణ జరగడం మరీ అరుదని వివరించారు. తమకు తెలిసి గతంలో కేవలం రెండు కేసుల్లో మాత్రమే ఇలా జరిగిందని చెప్పారు. ఇలా జంట గర్భాశయాలుండటాన్ని వైద్య పరిభాషలో యుటెరస్ డైడెల్ఫిస్‌గా పిలుస్తారు. కేవలం 0.3 శాతం మంది మహిళల్లో మాత్రమే ఇందుకు అవకాశముంటుంది. కారణమేమిటో తెలియకపోయినా, లీకి ఇంతకుముందు వచ్చిన గర్భం నిలవలేదు. 27 వారాల తర్వాత అబార్షన్ అయింది. దాంతో గత జనవరిలో మళ్లీ గర్భం దాల్చాక వైద్యులు పక్కాగా ముందుజాగ్రత్తలు తీసుకున్నారు. అన్నీ సజావుగా జరిగి కాన్పు తేదీ సమీపించాక రిస్కు తీసుకోకుండా సిజేరియన్ చేశారు. గతేడాది అమెరికాలోని అలబామాలో కూడా ఇలాంటి ఉదంతం జరిగినట్టు తెలుస్తోంది. రెండు గర్భాశయాలున్న మహిళ డిసెంబర్‌లో ఇలాగే ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చింది. గత కాన్పులో ఆమెకు ముగ్గురు పిల్లలు పుట్టారు. కానీ వారంతా ఒకే గర్భాశయంలో పురుడు పోసుకోవడం విశేషం!

- బీజింగ్

ఎందుకిలా...?

- ➤ గర్భావస్థలో పిండం ఎదిగే క్రమంలో గర్భాశయానికి సంబంధించిన రెండు కీలకమైన ట్యూబులు సకాలంలో కలిసిపోని పక్షంలో అవి రెండు గర్భాశయాలుగా ఏర్పడతాయి.
- ➤ కొన్ని కేసుల్లో ఒక్కో గర్భాశయానికి విడిగా ఒక్కో ముఖద్వారం ఉంటుంది. యోని గుండా ఏర్పడే సన్నని కణజాల ద్వారం వాటిని విడదీస్తుంది.
- ➤ ముందస్తు పరీక్షలు చేయించుకుంటే తప్ప గర్భధారణ జరిగేదాకా జంట గర్భాశయాలు ఉనికి ఇతరత్రా బయటపడే అవకాశం చాలా తక్కువ.
- ➤ ఇలాంటి మహిళలకు గర్భస్రావం జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుంది. అంతేగాక పిండం సరిగా ఎదగకపోవడం, ముందస్తు కాన్పు, కాన్పు సందర్భంగా విపరీతమైన రక్తస్రావం వంటి సమస్యలు తలెత్తవచ్చు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం ၊ 1 ၊ అక్టోబర్ ၊ 2024



మృత్యు వేగం

అతి వేగం ఇద్దరు యువకుల ఉసురు తీసింది. వీరిలో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, మరొకరు నేత్ర వైద్యుడు. -8లో



ఫీల్ గుడ్..స్ట్రీట్ ఫుడ్!

నగరంలో స్ట్రీట్ ఫుడ్‌కు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు.. ఉత్తరాది, దక్షిణాది రుచులను నగరవాసులు ఆస్వాదిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.



బతుకమ్మ వచ్చింది.. సంబరాలు తెచ్చింది

సిటీలో బతుకమ్మ సందడి రెండు రోజుల ముందే ఆరంభమైంది. సోమవారం సంప్రదాయం ప్రకారం కూకట్‌పల్లిలో ఎంగిలిపూల బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. అమావాస్యకు ముందురోజే బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించటం కూకట్‌పల్లి ప్రజల ఆనవాయితీ. ఈసారి అమావాస్యకు ముందు రోజు మంగళవారం రావటంతో సోమవారం రోజే బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. మొదటి రోజు మహిళలు భారీ ఎత్తున బతుకమ్మలతో హనుమాన్ చౌరస్తాకు తరలివచ్చారు. అక్కడే ఆట పాటలతో బతుకమ్మను పూజించారు. అనంతరం రంగధాముని చెరువు వద్దకు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. - కూకట్‌పల్లి

3 నుంచి పెద్దమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా శ్రీశరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని సర్వాంగ సుదరంగా ముస్తాబు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా మూడో తేదీన ఉదయం 3 గంటలకు పెద్దమ్మ తల్లి అభిషేకంతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 6 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతిస్తారు. 9 గంటలకు నవరాత్రి ఉత్సవ పూజలు ప్రారంభమవుతాయి. 10వ తేదీన చండీహోమం, 11న పూర్ణాహుతి, శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీలలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహిస్తారు. ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తి పల్లకీ సేవ ఊరేగింపు, పవళింపు సేవ ఉంటాయి. అన్నప్రసాద వితరణ కూడా మధ్యాహ్నం ఒంటి గంటకు ఉంటుంది. శ్రీ అమ్మవారి దివ్యాలంకారాలను ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు దర్శించుకోవచ్చని అధికారులు తెలిపారు. కాగా గురువారం నవరాత్రుల్లో తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా, శుక్రవారం శ్రీగజలక్ష్మీదేవి, శనివారం శ్రీఅన్నపూర్ణాదేవి, ఆదివారం శ్రీగాయత్రీదేవి, సోమవారం శ్రీలలితాదేవి, మంగళవారం శ్రీరాజరాజేశ్వరీ దేవి, బుధవారం శ్రీసరస్వతీదేవి, గురువారం శ్రీ దుర్గాదేవి, శుక్రవారం శ్రీ మహిషాసురమర్దిని, శనివారం శ్రీ పెద్దమ్మతల్లిగా భక్తులకు దర్శనమిస్తారు.

'సంపుల' సంగతి సంతకే..

- ఈ ఏడాది 50 చోట్ల నిర్మించాలనుకున్నా.. 10 ప్రాంతాల్లోనే పనులు ప్రారంభం
- ఒక్కటీ పూర్తవని వైనం.. నగరవాసికి తప్పని వాన కష్టాలు

వాటర్ లాగింగ్ ఏరియాల్లో ప్రహసనంగా నీటి సంపుల నిర్మాణం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఏమాత్రం వాన కురిసినా రోడ్లు చెరువులుగా మారుతున్నాయి. ట్రాఫిక్ చిక్కులతో పాటు రోడ్లు గుంతలమయమై వాహనదారులు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ పరిస్థితి నివారణకు ఎన్నో ఏళ్లుగా ఎన్నో ప్రయత్నాలు చేస్తున్న జీహెచ్ఎంసీ ఎస్ఎన్‌డీపీ వంటి ప్రాజెక్టుల కింద దాదాపు వెయ్యికోట్లతో పనులు చేపట్టింది. వరద కాలువల ఆధునీకరణ తదితర పనులు వాటిల్లో ఉన్నాయి. ఇక తాజాగా ఈ ఏడాది రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ (రోడ్ల కింద పెద్ద సంపులు) నిర్మించేందుకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. వర్షాలతో రోడ్లపై భారీగా నిలుస్తున్న నీరు భూమి లోపల..రోడ్ల కింద నిర్మించే పెద్ద సంపుల్లోకి వెళ్లేలా పనులు చేయాలనుకున్నారు. ఈ మేరకు వాటర్‌లాగింగ్ సమస్యలెక్కువగా ఉన్న 50 ప్రాంతాల్లో రోడ్ల కింద సంపులు నిర్మించాలనుకున్నారు. తొలుత జోన్‌కు రెండు చొప్పున కనీసం 12 ప్రాంతాల్లోనైనా ఈ వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా చేయాలని వర్షాకాలానికి ముందే నిర్ణయించారు. వర్షాకాలం లోపునే వాటిని నిర్మిస్తే చాలా వరకు సమస్యలు తగ్గగలవని భావించారు. కానీ ఇంతవరకు ఒక్కచోట కూడా సదరు నిర్మాణాలు పూర్తికాలేదు. పనులు పురోగతిలో ఉన్న ప్రాంతాల్లో వర్షం వచ్చినప్పుడు కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. సదరు ప్రాంతాలు ప్రమాదకరంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆయా నిర్మాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు హెచ్చరిక బోర్డులు వంటివి ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులను ఆదేశించారు.

23 సంపులకు టెండర్లు పిలిచినా..

ఈ సీజన్‌లో 23 సంపుల నిర్మాణం పూర్తి చేయాలని పనులకు టెండర్లు పిలిచారు. వివిధ కారణాల వల్ల పనులు పూర్తికాలేదు. కొన్నింటికి టెండర్లే పూర్తి కాలేదు. కొన్ని చోట్ల పనులు కుంటుతున్నాయి. వర్షాలు కురుస్తుండటం కూడా ఇందుకు ఒక కారణం. మరోవైపు జీహెచ్ఎంసీలో నిధుల లేమి కూడా పనులు కుంటుతుండటానికి ఒక కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వర్షాకాల సీజన్‌కు ఆశించిన సంపుల వల్ల ప్రయోజనం నెరవేరలేదు. వర్షాలు పూర్తిగా ఆగిపోయాక కానీ పనులు ముందుకు సాగేలా లేవు. సో.. ఈ సంవత్సరానికి ఎప్పటిలాగే రోడ్లు చెరువులయ్యే పరిస్థితి మారలేదు.



ఖైరతాబాద్ జోన్‌లో నిర్మాణంలో ఉన్న ఓ సంపు

సంపులకు సంబంధించిన పనులు జరుగుతున్న ప్రాంతాలు

- చిలుకానగర్, బైరామల్‌గూడ, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్‌నెంబర్ 264, కేసీపీ జంక్షన్, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్, సెక్రటేరియట్, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45, ఖాజాగూడ– నానక్‌రామ్‌గూడ మధ్య పనులు జరుగుతున్నాయి.
- వీటిల్లో 5 లక్షల లీటర్ల నుంచి 10 లక్షల లీటర్ల వాననీటి నిల్వ సామర్థ్యమున్నవి ఉన్నాయి. మరోవైపు.. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురిస్తే ఈ సంపుల వల్ల కూడా ఆశించిన ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలున్నాయి. పది నిమిషాల్లోనే సంపు పూర్తిగా నిండితే ఆతర్వాత నీరు రోడ్లపైనే నిలుస్తుందని చెబుతున్నారు.
- సంపుల పనులు పూర్తయ్యాక కానీ వీటి ప్రయోజనం వెల్లడి కానుంది.
- **టెండర్లు ముగిసి పనులు ప్రారంభం కావాల్సిన ప్రాంతాలు:** లంగర్‌హౌస్ నేతాజీ నగర్, సోమాజిగూడ రాజీవ్‌గాంధీ విగ్రహం, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్, మైత్రీవనం, శిల్పారామం.
- **టెండర్లు పూర్తి కావాల్సిన ప్రాంతాలు:** లక్డీకాపూల్ ద్వారకా హోటల్, పంజగుట్ట జాయ్అలుక్కాస్, అమీర్‌పేట ఇమేజ్ హాస్పిటల్, గౌలిగూడ రంగమహాల్ జంక్షన్ తదితర ప్రాంతాలు.

మూసీ 'ఆందోళన' ఉధృతం!

కలెక్టరేట్, తహసీల్ ఆఫీసుల ముట్టడి

కూల్చివేతలు లేకుండా మూసీ అభివృద్ధి చేయండి

- ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తి లేదంటున్న బాధితులు
- ఆందోళనకు మద్దతిస్తున్న రాజకీయ పక్షాలు



కలెక్టరేట్ ఎదుట మూసీ నిర్వాసితుల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక నివాసితుల ఆందోళన ఉధృతమవుతోంది. ఏకంగా కలెక్టరేట్, తహసీల్ ఆఫీసుల ముందు ధర్నాలకు దిగుతున్నారు. ఇళ్ల కూల్చివేతలకు పాల్పడకుండా మూసీ అభివృద్ధి చేయాలంటూ ప్ల కార్డులు ప్రదర్శిస్తున్నారు. సీఎం, ప్రజాప్రతినిధులపై దుమ్మెత్తి పోస్తున్నారు. హైడ్రాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. వారి ఆందోళనకు రాజకీయ పక్షాలు కలిసి వచ్చి బాసటగా నిలుస్తున్నాయి. రెండు రోజుల క్రితం వరకు ఇళ్లపై మార్కింగ్‌కు వచ్చిన అధికారులను అడ్డుకున్న నివాసితులు..తాజాగా మూసీ నిర్వాసితుల సంఘాల పేరిట ఏరియాల వారీగా ఆందోళనలనకు దిగుతున్నారు.

కలెక్టరేట్ ముందు..

మూసీ సుందరీకరణ పేరుతో ఇళ్ల కూల్చివేత ప్రతిపాదనను విరమించుకోవాలని మూసీ నిర్వాసితుల సంఘం పేరుతో సోమవారం లక్డీకాపూల్ లోని హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు సీపీఎం మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో తమ ఇళ్లను కూల్చి అభివృద్ధి చేస్తామనడం సరికాదని వారు ఆరోపిస్తున్నారు. అష్టకష్టాలు పడి డబ్బులు పెట్టి ఇండ్లను నిర్మించుకున్నామని, రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని వారు వాపోతున్నాయి. కానీ ప్రభుత్వం హైడ్రా పేరుతో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, మూసీరివర్ బెడ్ అని చెప్పి తమ ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నగర నడిబొడ్డు నుంచి సుమారు 300 కిలోమీటర్ల దూరంలో పునరావాసం పేరిట డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అప్పులు చేసి కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తారా? అని ఆగ్రహావేశాలు ప్రదర్శిస్తున్నారు.

బహదూర్‌పురాలో..

బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం ముందు మూసీ నివాసితులు మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. హైడ్రా హటావో..ఘర్ బచావో అనే నినాదంతో పెద్ద ఎత్తున ధర్నాకు దిగి నినాదాలు చేశారు. ఫలితంగా రోడ్డుపై భారీ ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మజ్లిస్ కార్పొరేటర్లను అదుపులోకి తీసుకున్నారు.

మూసీపై రీ సర్వే చేస్తే సహకరిస్తాం - మజ్లిస్ ఎమ్మెల్యేలు



బాపూఘాట్‌లో కలెక్టర్‌తో మాట్లాడుతున్న మజ్లిస్ ఎమ్మెల్యేలు

లంగర్‌హౌస్: ఏరియల్ సర్వే కాకుండా రివర్ బెడ్ ఆధారంగా మరోసారి సర్వే చేస్తే తామంతా మూసీ ప్రక్షాళనకు సహకరిస్తామని మజ్లిస్ ఎమ్మెల్యేలు తెలిపారు. లంగర్‌హౌస్ బాపూఘాట్‌ను సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. విషయం తెలుసుకున్న మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, మీర్ జుల్ఫీకర్ అలీ, మహమ్మద్ ముబిన్‌లు అక్కడకు వచ్చి కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కలెక్టర్‌తో మాట్లాడుతూ నిజాం నవాబులకు ముందు కాలంలో మూసీ సరిహద్దులు, రివర్ బెడ్‌కు సంబంధించి పాతిన రాళ్లు ఇప్పటికీ మూసీలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం మూసీ ప్రక్షాళనకు చేసిన ఏరియల్ సర్వే వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉందన్నారు. మూసీలో రివర్ బెడ్ ఆధారంగా మరోసారి సర్వే నిర్వహిస్తే తాము మూసీ ప్రక్షాళనకు పూర్తిగా సహకరిస్తామన్నారు. నేరుగా జరిపే ఈ సర్వేకు ఏరియల్ సర్వేకు 15 నుండి 20 మీటర్ల వ్యత్యాసం కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా సర్వే చేస్తే చాలా కుటుంబాలకు మేలు చేసిన వారమవుతామన్నారు. తమ డిమాండ్ మేరకు సర్వే చేయకుండా బుల్డోజర్‌లు పంపిస్తే తమ ప్రాణాలు అడ్డుపెడతామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ విషయమై చర్చించి నిర్ణయం వెల్లడిస్తామన్నారు.

మజ్లిస్‌కు తలనొప్పి!

దుమ్మెత్తి పోస్తున్న మూసీ బాధితులు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరిధిలోని ఇళ్ల మార్కింగ్, కూల్చివేతల వ్యవహారం మజ్లిస్ పార్టీకి తలనొప్పిగా మారింది. మజ్లిస్ పార్టీ ప్రాతినిధ్యంవహిస్తున్న నియోజకవర్గాల పరిధిలోనే మూసీ పరీవాహక ప్రాంతాలు అధికంగా ఉండటంతో నివాసితుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. మూసీ ప్రక్షాళన పేరుతో నదీ గర్భం, బఫర్ జోన్ పరిధిలోని ఇళ్ల కూల్చివేత కోసం అధికార యంత్రాంగం రెడ్‌మార్క్ సూచిక వేయడంతో నివాసితులు ఆందోళనకు దిగి అధికారులును అడుగడుగునా అడ్డుకున్నారు. ఇళ్లపై రెడ్‌మార్క్ వేసే సమయంలో మజ్లిస్ పార్టీ బాధ్యులెవరూ అటువైపు కన్నెత్తి చూడక పోవడంతో బాధితుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఏకంగా మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ స్థానిక ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితుల ఆవేదన సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో మజ్లిస్ పార్టీ మూసీ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించింది. మజ్లిస్ ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూమ్ అందే విధంగా ప్రయత్నిస్తామని భరోసా కల్పించడంలో కొంత సఫలీకృతమయ్యారు.

14 మండలాల్లో సగానికి పైగా ఇక్కడే..

మూసీ పరీవాహక పరిధిలోని మొత్తం 14 మండలాల్లో సగానికిపైగా మండలాలు పాతబస్తీ పరిధిలోనే ఉన్నాయి. మజ్లిస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల పరిధిలో ఆసిఫ్‌నగర్, బహదూర్‌పురా, చార్మినార్, గోల్కొండ, నాంపల్లి, సైదాబాద్, రాజేంద్రనగర్ తదితర మండలాలు ఉన్నాయి. అధికార యంత్రాంగం గుర్తించిన 12 వేల గృహాల్లో 70 శాతం వరకు వీటిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నివాసితులకు మద్దతుగా మజ్లిస్ కార్పొరేటర్లు తహసీల్ ఆఫీసుల ముందు ఆందోళనకు దిగుతున్నారు.

పార్కింగ్‌పై వెనక్కి తగ్గిన మెట్రో

- నామమాత్రపు రుసుంతో పార్కింగ్ సదుపాయం
- సూపర్ సేవర్, స్టూడెంట్ పాస్‌ల ఆఫర్లు పొడిగింపు

సాక్షి, సిటీబ్యూరో: నాగోల్, మియాపూర్ మెట్రోస్టేషన్‌ల వద్ద ఇటీవల పెంచిన పార్కింగ్ రుసుముపైన ఎల్అండ్‌టీ మెట్రో రైల్ వెనకడుగు వేసింది. అక్టోబర్ 6వ తేదీ నుంచి నామమాత్రపు రుసుముతో అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మెట్రో ప్రయాణికులపైన పార్కింగ్ ఫీజు పెంపుతో ఇటీవల విద్యార్థి, యువజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ప్రయాణ చార్జీల్లో భాగంగానే ఉచితపార్కింగ్ సదుపాయాన్ని కల్పించవలసి ఉండగా, అందుకు భిన్నంగా వాహనాల పార్కింగ్ పైన కూడా రుసుము వసూలు చేయడం పట్ల ప్రయాణికుల్లో వ్యతిరేకత వెల్లువెత్తింది. దీంతో ప్రస్తుతం నామమాత్రపు రుసుముతోనే పార్కింగ్ వసతి కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక ఆఫర్ల పొడిగింపు....

నగరంలోని వివిధ మార్గాల్లో ప్రయాణిస్తున్న లక్షలాది మంది ప్రయాణికులు వినియోగించుకొనే సూపర్‌సేవర్ ఆఫర్ -59 పథకాన్ని వచ్చే సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు పొడిగించారు. ప్రయాణికులు కేవలం రూ.59 టిక్కెట్ చార్జీలతో రోజంతా ప్రయాణం చేయవచ్చు. ప్రత్యేకంగా ఎంపిక చేసిన సెలవు రోజుల్లో మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. అలాగే విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన స్టూడెంట్ పాస్‌లను కూడా కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పాస్‌లపైన విద్యార్థులు 20 ట్రిప్పులకు మాత్రమే చార్జీలు చెల్లించి 30 ట్రిప్పులు ప్రయాణం చేయవచ్చు. మరోవైపు స్మార్ట్ కార్డులపైన 10 శాతం రాయితీ లభించనుంది. ఆఫర్‌ల పొడిగింపుపైన హైదరాబాద్ ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ, పార్కింగ్ సదుపాయాలను పెంచడంతో పాటు, ఆఫర్‌లను పొడిగించడం సంతోషంగా ఉందన్నారు.

ఉదయం 6.30కే బాపూఘాట్‌కు గవర్నర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

లంగర్‌హౌస్: గాంధీ జయంతి రోజున బుధవారం ఉదయం 6.30 గంటలకే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌కు విచ్చేస్తారని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం బాపూఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మహాత్ముడికి గవర్నర్ మొదట నివాళులర్పిస్తారని, ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 10.30 గంటలకు బాపూఘాట్‌కు వస్తారని తెలిపారు. కాగా బాపూఘాట్ వద్ద ఏర్పాట్లు, పనులు సరిగా చేయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఎక్స్' ఫిర్యాదులూ పరిష్కరించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ చేయాల్సిన పనులకు సంబంధించి ప్రజావాణి ద్వారా అందే ఫిర్యాదులతోపాటు ఆన్‌లైన్ లో మైజీహెచ్ఎంసీ యాప్ ద్వారా, ఎక్స్ (ట్విట్టర్) ద్వారా అందిన ఫిర్యాదుల్ని సైతం పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి సందర్భంగా ఆమె ఈ సూచన చేశారు. ప్రతివారం ప్రజావాణి ఫిర్యాదుల్ని పరిష్కరించాలని కమిషనర్ ఆదేశిస్తున్నప్పటికీ, పరిష్కారం మాత్రం కావడం లేదని కార్యక్రమానికి హాజరైన కొందరు ఆరోపించారు.



దేవీ నవరాత్రుల కోసం..

నగరంలో దేవీ నవరాత్రుల సందడి షురూ అయింది. గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రుల కోసం ఆయా ఆలయాలు, కాలనీల్లో ఏర్పాట్లు భారీగా చేపట్టారు. ఈమేరకు అమ్మ వారి విగ్రహాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ధూల్‌పేట, ఎర్రగడ్డ, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో దేవీ మాత విగ్రహాలు విక్రయిస్తున్నారు. వీటిని భక్తులు కొనుగోలు చేసి వాహనాల్లో తరలిస్తున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో



ధూల్‌పేటలో..



ఎర్రగడ్డలో..

శంకర్‌పల్లి కేంద్రంగా భారీ భూ దందా!

- శేరిగూడలోని 50 ఎకరాల భూములు స్వాహా
- కొండకల్ బిలాదాఖ్ల భూములు అన్యాక్రాంతం
- కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు..
- ప్రభుత్వ భూములను కాపాడాలంటూ స్థానికుల ధర్నా

సాక్షి, రంగారెడ్డిజిల్లా

ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఘోరంగా విఫలమవుతోంది. రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ విభాగాల అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై పరోక్షంగా వారికి సహకరిస్తున్నారు. కళ్లముందే రూ.కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం అవుతున్నా...పట్టించుకున్న నాథుడు లేక పోవడంతో స్థానికులే ఆయా భూములను రక్షించుకునేందుకు రోడ్డెక్కాల్సిన దుస్థితి తలెత్తింది. క్షేత్ర స్థాయిలో ఇంత జరుగుతున్నా..జిల్లా యంత్రాంగం అటు వైపు దృష్టి సారించక పోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వైపు అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కానియ్యొద్దని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిస్తుండగా. మరో వైపు కళ్లముందే ఖాళీ భూములు కబ్జా అవుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం, పరోక్షంగా వారికి సహకరిస్తుండటంపై అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మోకిల–కొండకల్ మధ్యలో

ఈ రెండు గ్రామాల మధ్య 76.26 ఎకరాల బిలాదాఖ్ల భూములు ఉన్నాయి. ఏళ్లుగా ఈ భూములను 45 మంది స్థానిక పేద రైతులు సాగు చేసుకుంటున్నారు. ఏ అడ్రస్, సర్వే నంబర్ లేని ఈ భూములకు 555 సర్వే నంబర్ నమోదు చేశారు. కోకాపేటకు అతి సమీపంలో ఉన్న ఈ భూములపై కొందరు పెద్దల కన్ను పడింది. ఎకరం రూ.15 కోట్లకుపైగా విలువ చేసే ఈ భూములను రైతుల నుంచి చాలా తక్కువ ధరకు కొట్టేశారు. వీటిలో ఇప్పటికే 27 ఎకరాలకు పైగా భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. ఓ మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన రియల్ ఎస్టేట్ సంస్థ ఈ భూములను అప్పనంగా కొట్టేసింది.

రెండు జిల్లాల సరిహద్దులోని భూములు

తాజాగా జిల్లా సరిహద్దులోని శేరిగూడ గ్రామ కంఠం భూములపై కూడా పెద్దల కన్ను పడింది. ఇక్కడ 50 ఎకరాలకుపైగా(నద్దినాలా) ప్రభుత్వ భూములు ఉన్నాయి. దీనిలో 8 ఎకరాలు స్మశాన వాటిక, రెండు ఎకరాలు పల్లె ప్రకృతి వనం, మరో పది ఎకరాలు గుడి ఆధీనంలో ఉన్నాయి. మిగిలిన భూమిలో కొంత భాగాన్ని స్థానిక రైతులు సాగు చేసుకుంటున్నారు. రెండు జిల్లాల సరిహద్దుల్లో ఈ భూములు విస్తరించి ఉండటం, వీటికి సర్వే నంబర్ కూడా లేక పోవడం ఆక్రమణ దారులకు కలిసి వచ్చిన అంశం. శేరిగూడలోని ఇద్దరు వ్యక్తులు... కొండకల్‌లోని ఓ రియల్టర్ సహకారంతో ఈ భూములకు బై నం బర్ సృష్టించి గుట్టుగా విక్రయించేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే భారీ మొత్తం చేతులు మారినట్లు తెలిసింది. ఈ భూములను కాపాడాలని ఆ గ్రామస్తులు ఇటీవల శంకర్‌పల్లి తహశీల్దార్ ఆఫీసు ఎదుట ధర్నాకు దిగడం కొసమెరుపు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్: రోడ్డు పక్కన ఆగిన కారులోని వారు ఒక్కసారిగా కారు డోర్ తెరవడంతో బైక్‌పై వెళుతున్న వ్యక్తి కిందపడి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగంపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి(53) సోమవారం రాత్రి రఘువర్దన్ అనే వ్యక్తితో కలిసి బైక్‌పై మేడ్చల్‌వైపు వెళ్తుండగా గోయల్ పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన కారు నిలిచి ఉంది. వీరు ప్రయాణిస్తున్న బైక్ కారు సమీపంలోకి చేరుకోగా అదే సమయంలో కారులో ఉన్న వారు డోర్ తెరవడంతో వెంకట్‌రెడ్డి, రఘువర్దన్ రెడ్డి కిందపడ్డారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చి లారీ వెంకట్‌రెడ్డి మీదుగా వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలపాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పల్టీ కొట్టిన కారు

మృత్యు వేగం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మరొకరు డాక్టర్
- మాసబ్‌ట్యాంక్ వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్ పరిస్థితి విషమం
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై మూడు కార్లు ధ్వంసం

అతి వేగం ఇద్దరు యువకుల ఉసురు తీసింది. వీరిలో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, మరొకరు నేత్ర వైద్యుడు. మాసబ్‌ట్యాంక్ వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పై జరిగిన ప్రమాదంలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఈ మూడు ప్రమాదాలకూ అతి వేగమే కారణంగా పోలీసులు పేర్కొన్నారు..



మసబ్‌ట్యాంక్ పై ఓవర్‌పై నుజ్జునుజ్జయిన క్యాబ్

నాంపల్లి: అతివేగం ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రాణాన్ని బలితీసుకుంది. మరో ఐదుగురిని ఆస్పత్రి పాల్జేసింది. బైక్‌ను తప్పించబోయే క్రమంలో క్యాబ్ డ్రైవర్ ఫ్లెటైర్ గోడను ఢీకొట్టిన సంఘటన నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ పై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. క్యాబ్ డ్రైవర్ సాయి వంశి సోమవారం ఉదయం హయత్‌నగర్‌లో సాయితేజ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పికప్ చేసుకుని మార్గమధ్యలో సందీప్, మాధురి, సాయి కిషన్, సాయి సుధలను క్యాబ్‌లో ఎక్కించుకుని గచ్చిబౌలికి బయలుదేరాడు. మసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్‌పై అతను బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పిన ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో జెన్‌ప్యాక్ కంపెనీ ఉద్యోగి సాయితేజ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అత్తాపూర్‌లోని శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. వారిలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కార్లు ధ్వంసం..

రాజేంద్రనగర్: పీవీనరసింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు పిల్లర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం స్ట్రీట్ పోల్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న రోడ్డుపైకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో కారులోని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కారు వేగానికి డివైడర్ దాటి మరో మూడు కార్లను ఢీకొట్టింది. దీంతో పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. కాగా ఘటనా స్థలానికి కొద్ది దూరంలో డివైడర్‌కు రంగులు వేస్తున్న కూలీలు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. బాధితులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఓఆర్‌ఆర్‌పై కారు అదుపుతప్పి వైద్యుడి దుర్మరణం

రాజేంద్రనగర్: వారం రోజుల్లో విదేశాలకు వెళ్లాల్సిన ఓ యువ వైద్యుడు రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లో ఉంటున్న డాక్టర్ నీలేశ్ రెడ్డి (29) ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నాడు. ఏడాది క్రితమే అతడికి వివాహం జరిగింది. ఆదివారం రాత్రి తన స్నేహితులను కలిసేందుకు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి అతడి భార్య ఫోన్ చేయగా శంషాబాద్‌లో స్నేహితుడిని డ్రాప్ చేసి వస్తానని చెప్పాడు. తెల్లవారుజామున శంషాబాద్ నుంచి వస్తున్న అతను ఔటర్ రింగ్ హిమాయత్‌సాగర్ ఎగ్జిట్ గేట్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన దిమ్మెలను ఢీకొంది. కారు డోర్ తెరుచుకోవడంతో నీలేశ్ రెడ్డి పక్కనే ఉన్న పొదల్లో పడిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పొదల్లో పడివున్న నీలేశ్‌ను తాళ్ల సహాయంతో పైకి తీశారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.



నీలేశ్ రెడ్డి మృతదేహం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

వర్షంలో రోడ్డు కనబడక...

- ఓఆర్‌ఆర్‌పై డివైడర్‌ను ఢీ కొట్టిన కారు
- మహిళ మృతి

శామీర్‌పేట్: వర్షం కారణంగా రోడ్డు కనబడక కారు డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలైన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్‌ఆర్ 7వ ఎగ్జిట్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి నుంచి నిజాంపేట్‌కు వస్తున్న కారు వర్షం కారణంగా రోడ్డు కనబడక అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో పుష్పలత (48) అనే మహిళ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రశ్మిత, ఆమె కుమార్తె రియాన్షికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి

- రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల వినతి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రంలోనూ ఇతర రాష్ట్రాల మాదిరిగా న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్లకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు వనమల సత్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం త్యాగరాజ గానసభ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్ల సహకార పరపతి సంఘం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 15 జరగబోయే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడాలి రాంప్రసాద్ రావు, అశోక్ కుమార్, మధు, ప్రసాద్, శ్రీను రాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

చైతన్యపురి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేశ్వర ప్రసాద్ (60) కొంతకాలంగా దిల్‌సుఖ్‌నగర్ కోదండరాంనగర్ కాలనీలో ఉంటూ కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన అతను సోమవారం తన భార్య లత (55), కుమారులు సందీప్ (30), వంశీకృష్ణ (26), సాయి స్వరూప్ (28)తో కలిసి కలిసి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని గుర్తించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి జిమ్ ట్రైనర్ దుర్మరణం

మేడ్చల్‌రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన మద్ది శ్రీకాంత్(28) జిమ్ ట్రైనర్‌గా పని చేసేవాడు. సోమవారం అతను తన స్నేహితుడు నరేశ్‌తో కలిసి బైక్‌పై కామారెడ్డికి వెళుతుండగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి మజీద్ సమీపంలో వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నరేశ్‌ను స్థానిక మెడినోవా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కేసులతో పాటు క్యాన్సిల్!

- నగరంలో జోరుగా 'కండల స్టెరాయిడ్స్' దందా
- జిమ్‌లకు సరఫరా చేస్తున్న పలు మెడికల్ షాపులు
- నగర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల నిఘా
- దాడులు చేసి గతంలో కేసులు మాత్రమే నమోదు
- తాజాగా మందుల దుకాణం లైసెన్సు సైతం రద్దు

సాక్షి, సిటీబ్యూరో: లోబీపీ సమస్యతో బాధపడుతున్న వారిలో రక్తపోటు నియంత్రణతో పాటు వైద్య రంగంలో అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజెక్షన్లను స్టెరాయిడ్స్‌గా విక్రయిస్తున్న ముఠాలు నగరంలో పెరిగిపోయాయి. ఈ గ్యాంగ్‌లపై నిఘా ముమ్మరం చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను పట్టుకోవడంతో పాటు వారిపై కేసులు నమోదు చేసేలా చేస్తున్నారు. అయితే ఈ దందాను పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి మరిన్ని కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఇంజెక్షన్లను అక్రమ మార్గంలో విక్రయిస్తున్న వారి వివరాలను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. ఈ విభాగం అవసరమైన నోటీసులు జారీ చేసి దుకాణాల లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేస్తోంది. తాజాగా మలక్‌పేట జడ్జెస్ కాలనీలోని ఆదిల్ ఫార్మసీ అండ్ జనరల్ స్టోర్స్ లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. మలక్‌పేటకు చెందిన మహ్మద్ ఆదిల్ ఈ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇండియా మార్ట్ యాప్ ద్వారా ఉత్తరాదికి చెందిన సరఫరాదారుల నుంచి మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు ఖరీదు చేస్తున్న అతను వాటిని జిమ్ నిర్వాహకులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. వారు తమ జిమ్‌లకు వస్తున్న యువత నిర్ణీత బరువు కంటే ఎక్కువ వెయిట్స్ ఎత్తడానికి, ఎక్కువ సమయం వ్యాయామం చేయడానికి స్టెరాయిడ్‌గా వాడటానికి వీటికి విక్రయిస్తున్నారు. ఒక్కో ఇంజెక్షన్ రూ.2000 వరకు అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం వీటిని కేవలం మెడికల్ షాపుల్లో, వైద్యుడి చీటీ ఆధారంగానే విక్రయించాలి. ఆదిల్ వ్యవహారంపై సమాచారం అందుకున్న దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి.అనిల్‌రెడ్డితో కలిసి దుకాణంపై దాడి చేశారు. అతడి వద్ద నుంచి 30 మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షను స్వాధీనం చేసుకున్నారు. లోతుగా ఆరా తీసిన అధికారులు పక్షం రోజుల ముందే సదరు దుకాణంపై దాడి చేసిన అధికారులు 10 ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఇలా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆదిల్ ఫార్మసీ అండ్ జనరల్ స్టోర్‌కు డీసీఏ నోటీసులు జారీ చేసింది. యజమాని ఆదిల్ సమాధానంతో సంతృప్తి చెందని అధికారులు దుకాణం లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇలాంటి ఇంజెక్షన్లు, టాబ్లెట్స్‌ను స్టెరాయిడ్‌గా వాడటం వల్ల అనేక దుష్పరిణామాలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీన్ని వైద్యుల చీటీ లేనిదే అమ్మడం అక్రమం అని స్పష్టం చేస్తున్నారు. వీటిని సుదీర్ఘకాలం వాడితే రక్తపోటు, గుండె సమస్యలతో పాటు మానసిక ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేస్తున్నారు. వీటి విక్రయంపై ఎలాంటి సమాచారం ఉన్నా తమకు అందించాలని కోరుతున్నారు. ఈ తరహా దందాలకు పాల్పడుతున్న మరికొన్ని మందుల దుకాణాలపై సమాచారం ఉందని చెబుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాటి పైనా దాడులకు సన్నాహాలు చేస్తున్నారు.



మహ్మద్ ఆదిల్

జల్సాల కోసం చోరీలు

- ఐదుగురు నిందితులకు రిమాండ్
- రూ.9 లక్షల విలువైన 23 బైక్‌ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

యాచారం: జల్సాలకు అలవాటు పడిన యువకులు బైక్ చోరీల బాటపట్టారు. పగలు రెక్కీ నిర్వహించి, రాత్రిళ్లు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను మాయం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను యాచారం పోలీస్ స్టేషన్‌లో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సోమవారం వెల్లడించారు. తలకొండపల్లి మండలం, వెంకట్రావ్‌పేటకు చెందిన దుబ్బ హర్షవర్ధన్ ఐటీఐ పూర్తి చేశాడు. జల్సాలకు అలవాటుపడిన అతను సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మహబూబ్‌నగర్, నగరంలోని అఫ్జల్‌గంజ్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, యాచారం, మంచాల, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణాల పరిధిలో పార్క్ చేసిన 23 బైక్‌లను చోరీ చేశాడు. వీటిని నందివనపర్తి గ్రామానికి చెందిన ఎడ్ల రాజు, మహమ్మద్ అమీర్ అలీ, నక్కర్తమేడిపల్లికి చెందిన బేత జంగయ్య, జాల నాగరాజు సహకారంతో అమాయకులకు విక్రయించేవాడు. వచ్చిన డబ్బులతో ఐదుగురు కలిసి జల్సా చేస్తున్నారు. దొంగిలించిన వాటిలో కొన్నింటిని విక్రయించగా, మరికొన్ని వారి ఇళ్లల్లోనే దాచి ఉంచారు. ఈ విషయమై ఇటీవల ఓ వ్యక్తి హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు నేతృత్వంలో సీఐ నర్సింహారావు, ఎస్‌ఐ తేజంరెడ్డి.. ప్రధాన నిందితుడైన హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వివరాలు వెల్లడించాడు. హర్షవర్ధన్‌తో పాటు అతడికి సహకరించిన నలుగురిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించామన్నారు. రూ.9 లక్షల విలువైన 23 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు, చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

వివాహిత దారుణ హత్య

మియాపూర్: ఓ మహిళను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్యచేసిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వైజాగ్‌కు చెందిన బండి స్పందన(29)దీప్తీ శ్రీనగర్ కాలనీలోని సీబీఆర్ ఎస్టేట్‌లో అపార్ట్‌మెంట్‌లో తల్లి నమ్రత, సోదరుడితో కలిసి నివాసముంటోంది. ఆమెకు 2022లో వారణాసి వినయ్ కుమార్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో వారు వేర్వేరుగా ఉంటున్నారు. ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న స్పందన తల్లి నమ్రత సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బయటి నుంచి తాళం వేసి ఉంది. దీంతో ఆమె కుమార్తెకు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లిచూడగా బెడ్‌రూమ్‌లో స్పందన రక్తపు మడుగులో కనిపించింది. ఆమె తలకు, ముఖానికి తీవ్ర గాయాలు ఉన్నాయి. దీంతో ఆమె మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



స్పందన (ఫైల్)

మధ్యంతర బెయిల్ కోసం జానీ మాస్టర్ పిటిషన్

రంగారెడ్డి కోర్టులు: లైంగికదాడి ఆరోపణల నేపథ్యంలో చంచల్‌గూడా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న నృత్య దర్శకుడు జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ కోరుతూ రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో, 9వ అదనపు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఢిల్లీలో జరగనున్న కార్యక్రమానికి తాను తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉన్నందున మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసాడు. ఈ పిటిషన్‌పై మంగళవారం ప్రాథమిక విచారణ జరగనుంది. కాగా జానీ మాస్టర్ దాఖలు చేసిన సాధారణ బెయిల్ పిటిషన్‌ను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

అక్కపై తమ్ముడి లైంగికదాడి

ఉప్పల్: అక్కపై తమ్ముడు అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిలుకానగర్ ప్రాంతంలో ఓ యువతి (19), తన సోదరుడు (17) తండ్రితో కలిసి నివాసముంటోంది. 2022లో అనారోగ్యంతో తల్లి మృతి చెందింది. అప్పటినుంచి ఆమె తండ్రి మద్యానికి బానిసయ్యాడు. దీంతో సదరు యువతి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ నెల 27న ఇంట్లో ఒంటరిగా ఉన్న అక్కపై తమ్ముడు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ విషయాన్ని తండ్రికి చెప్పినా అతను పట్టించుకోకపోవడంతో ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం


వీడ్కోలు పలుకుతున్న బీరప్ప తదితరులు

లక్డీకాపూల్: రిటైర్మెంట్ అనేది వ్యక్తి జీవితంలో ఒక ప్రధాన అంశమని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగి పదవీ విరమణ చెందడమంటే వర్కింగ్ ప్రొఫెషనల్ జీవితం నుంచి వైదొలగడమన్నారు. సోమవారం నిమ్స్ డేటా బేస్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ఫణి కుమార్, టెక్నికల్ ఆఫీసర్ రేష్మ శెట్టి, సీనియర్ సెక్రెటీరియల్ అసిస్టెంట్ యాదయ్య, అసిస్టెంట్ సెక్యూరిటీ అధికారి తిరుపతి రెడ్డి, థెటర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రావులు పదవీ విరమణ చెందారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వీరిని ఘనంగా సన్మానించి గౌరవంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్‌లో సుదీర్ఘకాలం పాటు విధుల్లో నిబద్ధతతో సేవలందించిన వీరంతా తమ శేష జీవితం ప్రశాంతంగా సాగిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లక్ష్మి భాస్కర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్. శాంతివీర్, పారా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ అధ్యక్షులు గిరిజా మనోహర్, శ్రీనివాసులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం నగర అధ్యక్షుడు రాజ్ కుమార్, నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ మార్త రమేష్, మీడియా ఇన్‌చార్జి సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడి భార్య దారుణ హత్య

బంజారాహిల్స్: ఆర్‌ఎంపీ వైద్యుడి భార్యను గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. ఎల్లారెడ్డిగూడ నవోదయకాలనీలో నివాసం ఉండే ఉమామహేశ్వరరావు ఆర్‌ఎంపీ వైద్యుడు. ఎల్లారెడ్డిగూడెం దేవాలయం పక్కన అమ్మ పేరిట క్లినిక్ నిర్వహిస్తున్నాడు. నవోదయ కాలనీలోని ప్లాట్ నెంబర్ 36లో రెండో అంతస్థులో భార్య సుధారాణి(44), కుమార్తె రుద్రారాణి, కుమారుడు శ్రీకర్ చంద్రతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం పిల్లలు స్కూల్ నుంచి వచ్చి పక్క వీధిలో ట్యూషన్‌కు వెళ్లారు. భర్త ఉమామహేశ్వర రావు క్లినిక్‌కు వెళ్ళాడు. ట్యూషన్‌కు వెళ్లిన పిల్లలు తిరిగి వచ్చేసరికి సుధారాణి రక్తపుమడుగులో పడి ఉంది. వెంటనే పక్క ఫ్లాట్ వాళ్లకు చెప్పారు. అనంతరం తండ్రికి ఫోన్ చేసి తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా సుధారాణి అప్పటికే మరణించి ఉంది. కత్తితో గొంతు కోసి హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ పథకం కింద దుర్వినియోగమైన నిధులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోటార సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిధుల దుర్వినియోగంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ విషయంలో సీబీఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కులగణన జరిపి ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 30 శాతంకు పెంచాలని, ఎస్టీ రిజర్వేషన్లను ఏడున్నర శాతం నుంచి 15 శాతంకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ వర్కింగ్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



ఫిలింనగర్: గుండెపోటుకు గురైన సమయాల్లో సీపీఆర్‌తో ప్రాణాలు నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లి అన్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల కోసం సోమవారం కార్డియోపల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భగా డైరెక్టర్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో సీపీఆర్‌పై అవగాహన కలిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ ఎంతో ముఖ్యమో విద్యార్థులు తెలుసుకోవడం జరిగిందన్నారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో సీపీఆర్‌పై శిక్షణ అందించినట్లు వివరించారు. సీపీఆర్‌పై వర్క్‌షాప్‌కు ముందుకువచ్చిన అపోలో హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు సామాజిక బాధ్యతగా భావించాలి

కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్



బోరబండ: సీసీ కెమెరాల ఏర్పాటును ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ సూచించారు. డివిజన్‌లోని మధురానగర్ సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన యూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. బోరబండ డీఐ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ సీసీ ఏర్పాటుకు బస్తీవాసులు ముందుకు రావాలని కోరారు. అనంతరం బస్తీ అధ్యక్షుడు చెట్టి దేవేందర్ రూ. 20 వేల చెక్కును బాబా ఫసిముద్దీన్ చేతుల మీదుగా డీఐ భూపాల్‌గౌడ్‌కు అందించారు. సెక్టార్ ఎస్ఐ నాగూల్ మీరా, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, వీరయ్య, ప్రతాప్, శంకర్, ఆంజనేయులుగౌడ్, జంహగీర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ ఇళ్లను కేటాయించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సీఎన్‌రెడ్డి వినతి



రహమత్‌నగర్: అర్హులైన వారందరికీ కమలానగర్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ కమలానగర్ బస్తీలో నివాసాలు కోల్పోయిన వారందరికీ డబుల్‌బెడ్ రూం ఇళ్ల కేటాయించాలని ఆయన కోరారు. తాను చేసిన విజ్ఞప్తిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని సీఎన్‌రెడ్డి చెప్పారు.

బీసీ కులగణనను వెంటనే చేపట్టాలి

కాచిగూడ: హైకోర్టు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తూ తక్షణమే బీసీ కులగణనను చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్ అమృత ఎస్టేట్స్‌లో తెలంగాణ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షులు పగిళ్ల జోజీ అధ్యక్షతన రజక వృత్తిదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో బీసీ కులగణనను చేపట్టకపోవడం వల్ల నిధుల కేటాయింపులో, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బీసీలు పురోగతి సాధించడానికి కులగణన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బీసీ పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి విడనాడకుంటే బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి. చుక్కయ్య, నరసింహరావు, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంగళరావునగర్: ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌లో సోమవారం డ్వాక్రా గ్రూపు మహిళలతో ఆమె ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు మహిళలు ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలను తీసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రతి ఇంట్లో భర్తతో పాటుగా భార్య కూడా సంపాదించినట్టయితే ఆర్థిక సమస్యలను అధిగమించవచ్చునన్నారు. అదేవిధంగా గ్రూపుల నిర్వహణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం తదితర విషయాల్లో ఏవైనా అవకతవకలు జరిగినట్టయితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీ.ఓ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు ఇంజక్షన్లు తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

పంజగుట్ట: మత్తు ఇంజక్షన్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట కమ్మసంఘం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక యాక్టివా వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా రావడాన్ని పోలీసులు గమనించారు. వారి వాహనాన్ని ఆపి విచారించగా యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌కు చెందిన ఎమ్.డీ నయీముద్దీన్ (39), సైనిక్‌పురికి చెందిన ఎన్.మహేష్ (32)గా గుర్తించారు. వాహనాన్ని తనిఖీ చెయ్యగా అందులో 7 పెంటాజోన్ ఇంజక్షన్ బాటిల్స్, రూ. 4900 నగదు దొరికాయి. ఇంజక్షన్ల వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు గూగుల్‌లో సెర్చ్‌గా చేయగా అవి తీవ్రమైన నొప్పికి వాడే ఇంజక్షన్లుగా చూపించింది. దీంతో వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తనిఖీ చెయ్యగా అది నార్కోటిక్ డ్రగ్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

ఆహార భద్రతపై చిగురించిన ఆశలు..!

- లక్షన్నర మంది ఎదురుచూపులు
- 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ..?
- కొత్త పేర్ల చేర్పుపై స్పష్టతనివ్వని ప్రభుత్వం



బంజారాహిల్స్: అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామని, ఇందుకు అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ఇటీవల నగరంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలోని అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చాలాకాలంగా ఊరిస్తున్న కొత్త కార్డుల జారీపై ప్రభుత్వం స్పష్టతనివ్వడంతో ఇప్పటికే ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలోనూ, కొత్తగా చేసుకోబోయే వారిలోనూ ఆనందం వ్యక్తమవుతుంది. పథకాల జారీపై స్పష్టత రావడంతో చాలా మంది సంబంధిత ధ్రువ పత్రాలను సమకూర్చుకునే పనిలోపడ్డారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు తెల్లకార్డును లింక్ చేయడంతో చాలామంది అర్హులు ఈ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని చేర్చడం..అనుకున్నట్లే కొలువుదీరడం.. ఇటీవల సీఎం నుంచి ప్రకటన వెలువడిన నేపథ్యంలో పేదవర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే కుటుంబ సభ్యుల పేర్ల చేర్పుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

లక్షన్నర మంది ఎదురుచూపులు..

రేషనింగ్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 81 రేషన్‌షాపులు ఉండగా, వీటి పరిధిలో గతంలోనే చాలామంది తెల్లరేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు తాజా ప్రకటనతో ఇంకొంత మంది కూడా దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. మొత్తంగా సర్కిల్–7 పరిధిలో తెల్లరేషన్‌కార్డులకు సుమారుగా లక్షన్నర మంది అర్హులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది ఆరంభంలో నిర్వహించిన ప్రజాపాలనలో వేలల్లో దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే కార్డులు ఉన్నవారు తమ పిల్లలు, వివాహమై అత్తింటికి వచ్చిన కోడళ్ల పేర్లు చేర్చేందుకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలని కోరుతున్నారు. ఆహార భద్రత కార్డులకు జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం కార్డులు ఉన్న ప్రతి సభ్యునికి నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో 2.34 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. తాజా కార్డుల జారీతో మరింత మంది చేరనున్నారు.

రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో 83,051 కార్డులు

రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో 81 రేషన్‌షాపులు ఉండగా ఇందులో తెల్ల రేషన్‌కార్డులు 83,051 ఉన్నాయి. అదేవిధంగా అంత్యోదయ అన్నయోజన (ఏఏవై) 3,533, అన్నపూర్ణ కార్డులు 1 ఉన్నాయి. ఈ కార్డులన్నింటి ద్వారా ప్రతినెలా 18 లక్షల 20 వేల 789 కిలోల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు.

జేఎన్‌ఎఫ్‌ఏయూకు కేటాయించొద్దు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి సంబంధించిన పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వ విద్యాలయానికి (జేఎన్‌ఎఫ్‌ఏయూ) కేటాయించవద్దని పూర్వ విద్యార్థుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఉన్నత విద్యా వ్యాప్తిలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులు, మహిళలకు తక్కువ ఫీజులతో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విశ్వవిద్యాలయ భూమిని వేరే విశ్వవిద్యాలయానికి కేటాయించడాన్ని అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. అలాగే జాయింట్ యాక్షన్ కమిటీ తీసుకునే నిర్ణయాలకు తమ అసోసియేషన్ పూర్తి మద్దతు ఇవ్వనున్నట్లు సమావేశంలో తీర్మానించారు పదెకరాల భూమి కేటాయింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బానోత్‌ధర్మ, అసోసియేషన్ అధ్యక్షులు సాకా వెంకటేశ్వరరావు, సెక్రటరీ డాక్టర్ ఉదయిని, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘన సత్కారం


టీపీసీసీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న అస్మ తున్నీసా

బంజారాహిల్స్: టీపీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ అస్మ తున్నీసా గాంధీభవన్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నీతి, నిజాయితీ, సమర్థవంతమైన నాయకత్వానికి మారుపేరైనా మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఈ పదవికి ఎంపిక చేసినందుకు ఈ సందర్భంగా ఆమె కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధాన్ని మహేష్‌గౌడ్‌కు వివరించారు. రాష్ట్ర కమిటీలో చోటు ఇస్తే పార్టీకి, ప్రజలకు సేవ చేస్తానని ఆమె పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకువచ్చారు. పార్టీని నమ్ముకుని, పార్టీ కోసం కష్టపడి ప్రజల్లో నిలబడి ఇన్నాళ్లుగా పార్టీ కోసం శ్రమిస్తున్న అస్మతున్నీసాను అభినందించి కమిటీలో చోటు విషయంలో సానుకూలంగా స్పందించారు. అంతకముందు ఆమె జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని గాయత్రీ హిల్స్ నుంచి కార్యకర్తలతో కలిసి గాంధీభవన్‌కు తరలివెళ్ళారు.

ఆన్‌లైన్‌లో నగదు వేస్తానని మోసం

వెంగళరావునగర్: అకౌంట్‌లో నగదు వేస్తానని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌లో నివాసం ఉండే డ్యాన్స్ మాస్టర్ నీలకంఠ ఈనెల 26న మధురానగర్ ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు వెళ్ళారు. తన అకౌంట్‌లో రూ.40 వేలు వేయడానికి నిలబడగా ఓ యువకుడు వచ్చి తనకు నగదు ఇస్తే తాను ఆన్‌లైన్ ద్వారా మీ అకౌంట్‌కు పంపుతానని చెప్పాడు. నీలకంఠ అతనికి రూ.40 వేలు ఇచ్చాడు. ఆ తరువాత ఆ యువకుడు నీలకంఠకు డబ్బు పంపినట్టుగా మెసేజ్ చూపి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అయితే నీలకంఠకు మాత్రం నగదు ఎంతకూ రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కేసు వెనక్కు తీసుకోవాలని దాడి

వెంగళరావునగర్: గతంలో పెట్టిన కేసు వెనక్కు తీసుకోవాలంటూ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథ నం ప్రకారం... ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే ఏ.నారాయణ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. గత జూన్‌లో పవన్ అర్ధరాత్రి నారాయణ ఇంట్లోకి ప్రవేశించి అతని కుమారుడు, కుమార్తెను కొట్టాడు. దీంతో నారాయణ అతనిపై కేసు పెట్టగా జైలుకు వెళ్లి ఇటీ వల తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో ఈనెల 29వ తేదీన నారాయణ తన సోదరుని ఇంటికి వెళ్ళి వస్తుండగా పవన్ అతని స్నేహితుడితో కలిసి తనపై పెట్టిన కేసును వెనక్కు తీసుకోవాలంటూ మరోసారి దాడి చేశాడు. దీంతో బాధితుడు నారాయణ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటన



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 1 ప్రధాన జంక్షన్ నుంచి జలమండలి కార్యాలయం మీదుగా చీఫ్ జస్టిస్ ఇంటి వరకు సెంట్రల్ మీడియన్ ఏర్పాటుతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి వీధిదీపాల విభాగం ఏఈ సుష్మతో పాటు ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఇక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడ వీధి దీపాల అవసరం ఉందో, ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై అధికారులతో సమీక్షించారు. మరో రెండు రోజుల్లో ఇక్కడ పనులు పూర్తవుతాయన్నారు. ఈ రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేయడంతో అక్రమ పార్కింగ్‌లకు చెక్ పడుతుందన్నారు. అలాగే సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌తో రాత్రి వేళల్లో కాంతులు విరజిమ్ముతాయని తెలిపారు.

మాజీ లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన రవిశేఖర్‌రెడ్డి



శ్రీనగర్‌కాలనీ: మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమారిని సోమవారం కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి శనివారం ఢిల్లీలోని ఆమె నివాసంలో కలిశారు. ఇటీవలే అనారోగ్యంతో కోలుకున్న మీరాకుమారి ఆయురారోగ్యాలతో ఉండాలని తిరుమల వేంకటేశ్వర స్వామి కళ్యాణ శాలువా, తీర్థ ప్రసాదాలను అందించారు.

అద్దెలు చెల్లించకపోతే తాళాలు తెరవం

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు పూర్తయ్యేలోపు తమ అద్దె బకాయిలు చెల్లించకపోతే గురుకులాల భవనాల తాళాలు తియ్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం డిమాండ్ చేసింది. మొత్తం రాష్ట్రంలో 950 గురుకులాలు, 150 హాస్టల్స్ ప్రైవేటు అద్దె భవనాల్లో ఉన్నాయని వీరికి అద్దె బకాయిలు సుమారు రూ. 500 కోట్ల వరకు రావాల్సి ఉందని వాటిని వెంటనే చెల్లించకపోతే తమ భవనాలకు తాళం వేసుకోవడం తప్ప వేరే మార్గం లేదని వారు హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం అధ్యక్షులు ఎ.దేవేందర్ రెడ్డి, సలహాదారులు కొండా దేవయ్య పటేల్, కార్యదర్శి బండి కుమారస్వామి మాట్లాడుతూ కొన్ని గురుకులాలకు 20 నెలల అద్దె బాకీ ఉన్నారని, ఒక మైనార్టీ గురుకులానికి 12 నెలల అద్దె బాకీ ఉన్నారని తాము కూడా లక్షల రూపాయలు బ్యాంకులో రుణాలు తీసుకుని వాటి కిస్తీలు చెల్లించలేక ఇంట్లో బంగారం అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దసరా సెలవులు ఈ నెల 15తో ముగుస్తుండడం వల్ల గురుకులాల, హాస్టల్స్‌ల తాళాలు తెరవమని, జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో సతీష్, కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి

– బీఆర్ఎస్ నాయకులపై కేసు

బంజారాహిల్స్: మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ భవన్ వద్దకు వచ్చిన కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల మంత్రి కొండా సురేఖకు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక కార్యక్రమంలో భాగంగా నూలుతో తయారు చేసిన దండను వేసి నేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కోరారు. ఈ ఫొటోను కొంతమంది బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు అభ్యంతరకర రీతిలో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో సోమవారం మధ్యాహ్నం పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ వద్దకు వచ్చి ముట్టడికి ప్రయత్నించడంతోపాటు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తెలంగాణ భవన్ లోనికి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్పటికే భారీ సంఖ్యలో అక్కడ ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని అడ్డుకోవడంతో పాటు చితకబాదారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. కాసేపటికి పోలీసులు అక్కడకు చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఇదిలా ఉండగా నిరసన తెలిపేందుకు వచ్చిన తమపై బీఆర్ఎస్ పార్టీ నేతలు దాడికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాము, కార్తీక్, హరి తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిలింనగర్‌లో స్వచ్ఛతా హీ సేవా



ఫిలింనగర్: స్వచ్ఛ హీ సేవా–2024లో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గ్రామర్ స్కూల్ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నేను చెత్త వేయను..ఇతరులకు చెత్త వేయనివ్వను.. నేను, నా కుటుంబం, నా ప్రాంతంలో పరిశుభ్రత పాటిస్తామంటూ ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యమన్నారు. సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే భావిపౌరులు అవగాహనతో ముందుకు సాగాలన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం


సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో జూబ్లీహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని జూబ్లీహిల్స్ ఏసీపీ గిరి అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని వెంకటగిరి సమీపంలోని ఐలం కాలనీలో కాలనీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాల వ్యవస్థకు సోమవారం జూబ్లీహిల్స్ ఏసీపీ గిరి, ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వరరెడ్డి, డీఐ మధుసూదన్, సెక్టార్ ఎస్ఐ సోమశేఖర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను బాధ్యతగా కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చినందుకు సన్మానించారు. త్వరలోనే కాలనీ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సాహెర్ సొండ్ యజమాని లాయక్ అలీ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌యాదవ్, ఉపాధ్యక్షుడు విలాస్, ట్రెజరర్ సంతోష్, పవన్‌యాదవ్, దీపక్, గోవింద్, సుబ్బారావు, ముఖేష్, జియాద్దీన్ తదితరులు పాల్గొన్నారు. నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడానికి కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తాము కోరగానే స్పందించిన కాలనీ అసోసియేషన్‌ను పోలీసులు అభినందించారు.

లక్ష్మి సువర్చలకు బెస్ట్ టీచర్ అవార్డు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ (విద్యాశ్రమం) సీనియర్ ఇంగ్లిష్ టీచర్ కె.లక్ష్మి సువర్చలకు జాతీయ స్థాయిలో బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. భవన్స్ జిందాల్ అవార్డు 2023 నేషనల్ లెవల్ సీనియర్ కేటగిరిలో ఈ అవార్డు ఆమెను వరించింది. పాఠశాలలో విద్యార్థుల ఉన్నతికి ఆమె చేస్తున్న కృషికి గుర్తింపునకు గాను ఈ అవార్డు లభించగా స్కూల్ చైర్మన్ ఎస్.గోపాలకృష్ణన్, డైరెక్టర్ సి.రమాదేవి, ప్రిన్సిపాల్ జి.అరుణశ్రీలతో పాటు ఉపాధ్యాయులు ఆత్మీయ సత్కారం చేశారు. ఆమె ఈ అవార్డుకుగాను బంగారు పతకం, ప్రశంసాపత్రం, రూ.20 వేల నగదును కూడా అందుకున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో నాల్గవ కోనేరు లక్ష్మయ్య మెమోరియల్ నేషనల్ మూట్ కోర్ట్ పోటీలు–2024 ఉత్సాహంగా జరిగాయి. దేశవ్యాప్తంగా పలు న్యాయ కళాశాలలు, న్యాయ పాఠశాలల నుంచి 36 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఆక్టా–ఫైనల్ రౌండ్‌లకు 16 జట్లు అర్హత సాధించాయి. ఆల్ఫామెడ్ ఫార్ములేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ భీమిరెడ్డి కాసిరెడ్డి సహా ప్రముఖులు హాజరై విజేతలను సన్మానించారు. ఈ పోటీల్లో సవిత స్కూల్ ఆఫ్ లా విద్యార్థులు విజేతలుగా నిలవగా, పుణేలోని భారతి విద్యాపీ నుంచి న్యూ లా కాలేజ్ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. ఉత్తమ పరిశోధకుడిగా సవీత స్కూల్ ఆఫ్ లా నుంచి కెవిన్ జోయెల్ థామస్‌కు అవార్డు లభించగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ లా యూనివర్సిటీ నుంచి ప్రీతిసిన్హా, సనన్ వర్ష శర్మ వివిధ విభాగాల్లో ఉత్తమ మెమోరియల్‌గా గుర్తించబడ్డారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ ఈ పోటీలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థుల్లో మేథో పటిమను, ప్రతిభను ప్రదర్శించడానికి మంచి వేదికగా చెప్పారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

పంజగుట్ట: పేకాట ఆడుతున్న ఐదుగురిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ. 5,270 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం తెల్లవారుజామున బీఎస్ మక్తా, హరిగేట్‌లో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా కొందరు పేకాట ఆడుతున్నారు. ఈ సమాచారం అందుకున్న పంజగుట్ట పోలీసులు అక్కడకు వెళ్లి దాడి చేసి పేకాట ఆడుతున్న హకీగేట్‌కు చెందిన ఎస్.పవన్ కుమార్ (36), ఆర్.కృష్ణమూర్తి (36), ఆనంద్‌కుమార్ (38), రఘు (45), శేఖర్ (52)లను అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి 52 ప్లేయింగ్ కార్డులు, 5 మొబైల్ ఫోన్‌లు, రూ.5,270 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాదాపూర్ శ్రీచైతన్య కళాశాలలో ఆకస్మిక తనిఖీ

- పిల్లల భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదు
- వసతులపై ఆరా తీసిన మహిళా కమిషన్ చైర్మన్ నేరళ్ల శారద
- మీడియాలో కథనాలపై స్పందించిన వైనం
- శ్రీచైతన్య యాజమాన్యానికి సమన్లు జారీ



నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరళ్ల శారద

మాదాపూర్: పిల్లల భద్రతపై రాజీపడి ఎవర్నీ ఉపేక్షించేది లేదని తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్ నేరళ్ల శారద తెలిపారు. మాదాపూర్‌లోని శ్రీచైతన్య కాలేజీల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని రోజులుగా శ్రీచైతన్య మహిళా కాలేజీల్లో జరుగుతున్న విద్యార్థినులకు సంబంధించిన సమస్యలు పలు మీడియాల్లో రావడం నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. కాలేజీలోని విద్యార్థినుల హాస్టళ్లు, మెస్‌లను తనిఖీ చేశారు. నాసికరమైన ఆహారం, హాస్టళ్లలో సౌకర్యాలు సరిగ్గా లేవని కాలేజీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి విద్యార్థినులతో కొంతసేపు మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీచైతన్య యాజమాన్యానికి సమన్లను పంపారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని శ్రీచైతన్య కళాశాల ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్నారని వెంటనే ఆ కళాశాల ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు వెంటనే మూసివేయాలని అఖిల పక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకున్నా రూ.లక్షలు వసూలు చేస్తూ మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. 4 రోజుల క్రితం అయ్యప్ప సొసైటీలోని అక్షర క్యాంపస్‌లో ఫుడ్ పాయిజన్‌తో దాదాపు 120 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని అన్నారు. అయినా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం ఆయన ప్రశ్నించారు. అనంతరం ధర్నా చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేసి మాదాపూర్ పోలీసు స్టేషన్‌కి తరలించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ వలిగొండ నర్సింహ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వనర్ వీరబోయిన లింగయ్య యాదవ్, తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు వలమల్ల సూర్య ప్రకాశ్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నామ సైదులు మామిండ్ల రవి పాల్గొన్నారు.

కార్మికులను పర్మనెంట్ చేయాలంటూ ధర్నా



చిక్కడపల్లి: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలు, ఉద్యోగం, నివాసం, ఆరోగ్య సౌకర్యాలు అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు కార్మికులను మోసం చేస్తున్నారని, పనిఒత్తిడితో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ధర్నా అనంతరం రంగారెడ్డి జిల్లా జేసీఎల్ శ్యాంసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నేతలు ఎం.సాయిబాబు, భూపాల్, రమ, మల్లికార్జున్, ఈశ్వర్‌రావు, చంద్రశేఖర్, సీఎస్‌రావు, రాములు, రాజారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా కిషన్‌రాజ్ చౌహాన్



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ హైదరాబాద్ జిల్లా కమిటీని నియామకం చేస్తూ టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా కిషన్‌రాజ్ చౌహాన్, వైస్ చైర్మన్లుగా డాక్టర్ ఠాకూర్ శైఖదీప్‌సింగ్, అశోక్‌రెడ్డి, వెంకన్నగౌడ్, బండా తరుణ్, జి.రాజ్‌కుమార్, కన్వీనర్‌గా తిరుపతి, శ్రీధర్‌రాజు, శ్రీకాంత్, కృష్ణ, బండ్రు విజయ్ కుమార్, ప్రణీత్ సింగ్ పవార్, జాయింట్ కన్వీనర్లుగా సీహెచ్ స్రవంతి, మహమ్మద్ మస్సీ ఉర్ రెహమాన్, పవన్ కుమార్, నర్సింహులు, అధికార ప్రతినిధులుగా రాజేంద్ర, ఖాజా నసీరుద్దీన్ బి.చంద్రశేఖర్ నియమితులయ్యారు.


యూనానీ వైద్యం సర్వరోగనివారిణి



సాక్షి, సిటీబ్యూరో: మహ్మద్ ప్రవక్త సూచనల ప్రకారం వైద్య విధానాన్ని పాటిస్తే ఓ ఆరోగ్యకరమైన సమాజం ఉనికిలోని వస్తుందని పలు వైద్య సంస్థల ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గన్‌ఫౌండ్రీలోని మీడియా ప్లెస్ ఆడిటోరియంలో సోమవారం యూనానీ వైద్య ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ పాల్గొని మాట్లాడారు. సైన్స్ 21 దశాబ్దంలో కొత్త కొత్త అన్వేషణలు చేసింది. కానీ యూనానీ వైద్యం 1500 వందేళ్ల నుంచే అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు నయం చేసే పద్ధతులు ఉన్నాయన్నారు. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందినా ఇప్పటికీ ఎన్నో రకాల రోగాలు యూనానీ వైద్యం ద్వారానే నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో మౌలానా ఫైజొద్దీన్ నిజామీ, అబ్దుర్రవూఫ్, హకీమ్ గులామ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కనికరించని కార్పొరేట్

- ఆరోగ్య భద్రతను అంగీకరించని ఆస్పత్రులు
- బకాయిలు పెరిగిపోవడమే ప్రధాన కారణం
- ఏళ్లుగా రేట్లను సవరింపు మర్చిపోయిన ట్రస్ట్
- దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఓ ఏఆర్ సబ్-ఇన్‌స్పెక్టర్‌కు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తింది. సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. ఆరోగ్య భద్రత కార్డుపై అడ్మిట్ చేసుకోవడానికి యాజమాన్యం నిరాకరించింది. దీంతో మరో ఆస్పత్రికి తీసుకువెళ్లే లోపే ఆయన కన్నుమూశారు.

- ఓ పోలీసు అధికారి భార్యకు డెంగీ నిర్ధారణైంది. పంజగుట్టలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. ఆరోగ్య భద్రత పేరు చెప్పగానే బెడ్స్ ఖాళీ లేవంటూ యాజమాన్యం చెప్పేసింది. నాంపల్లి, సికింద్రాబాద్‌ల్లోకి ఆస్పత్రులకు తీసుకువెళ్లినా ఇదే పరిస్థితి..
- రాష్ట్ర పోలీసు విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రస్ట్ ద్వారా అందించే ఆరోగ్య భద్రత పథకానికి అనారోగ్యం వచ్చింది. దీని పేరు చెప్తే చాలు లిస్టెడ్ ఆస్పత్రులు సైతం చికిత్స చేసేది లేదంటూ వెళ్లగొడుతున్నాయి. కేవలం డబ్బు చెల్లిస్తేనే బెడ్స్ ఇస్తానంటూ స్పష్టం చేస్తున్నాయి. అనేక ఆస్పత్రులకు రూ.వందల కోట్ల బకాయిలు పెరిగిపోవడంతో పాటు రోగాలు, చికిత్సకు చెల్లించే మొత్తాలను ఏళ్లుగా సవరించకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ కారణాల నేపథ్యంలో పోలీసులతో పాటు వారి కుటుంబాలూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ఇది ఉందనే ధీమాతో మరోటి లేకుండా..

తెలంగాణ పోలీసు విభాగానికి అనుబంధంగా పని చేసే ప్రత్యేక ట్రస్ట్ ఆధీనంలో భద్రత, ఆరోగ్య భద్రత పథకాలు నడుస్తున్నాయి. వివిధ రకాలైన రుణాలతో పాటు ఇతర వెల్ఫేర్ స్కీమ్స్ భద్రత పరిధిలోకి వస్తే.. హెల్త్ స్కీమ్స్ ఆరోగ్య భద్రత కింద ఉంటున్నాయి. రాష్ట్రంలో ఉన్న దాదాపు 70 వేల మంది పోలీసుల నుంచీ ప్రతినెలా ఈ రెండు పథకాల కిందా నిర్ణీత మొత్తం వసూలు చేస్తున్నారు. ఆరోగ్య భద్రత కింద ఒక్కొక్కరి జీతం నుంచి రూ.200 చొప్పున కట్ చేస్తున్న పోలీసు విభాగం ఈ మొత్తాన్ని ట్రస్ట్‌కు అందిస్తోంది. ప్రతి ఉద్యోగి కుటుంబానికీ ఆరోగ్య భద్రత కార్డులనూ జారీ చేసింది. ఈ స్కీమ్ ఉందనే దీమాతో అనేక మంది పోలీసులు విడిగా ఎలాంటి ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తీసుకోలేదు. ఫలితంగా పోలీసులో, వారి కుటుంబీకులో అనారోగ్యానికి గురైనప్పుడు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ జాప్యం కారణంగా వ్యాధి ముదరడంతో పాటు కొన్నిసార్లు ప్రాణాలు సైతం గాల్లో కలిసిపోతున్నాయి.

చేర్చుకున్నా కవర్ కావంటారు..

కొన్నేళ్లుగా ఆరోగ్య భద్రత ట్రస్ట్ నుంచి హాస్పిటల్స్‌కు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగట్లేదు. దీంతో ఈ బకాయిలు రూ.వందల కోట్లకు చేరాయి. మరోపక్క ఏ వైద్యానికి ఎంత రేటు చొప్పున చెల్లించాలనేది సైతం ట్రస్టే నిర్ణయిస్తుంది. దాదాపు పదేళ్లుగా ఈ రేట్లను సవరించకపోవడంతో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తాము నష్టపోతామంటూ ఆస్పత్రుల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. మరోపక్క క్రమం తప్పకుండా ఆస్పత్రుల ప్రతినిధులతో సమావేశమయ్యే భద్రత ట్రస్ట్ సమకాలీన అవసరాలకు తగ్గట్టు కొత్త వ్యాధులూ ఈ స్కీమ్ కింద కవర్ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో కొన్నేళ్లుగా ఈ సమావేశాలు సైతం జరగట్లేదు. దీంతో చాలా వ్యాధులు, పరీక్షలు ఈ స్కీమ్ కింద కవర్ కావట్లేదు. ఇలాంటి అనేక కారణాల నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో పోలీసులకు ఆరోగ్య భద్రత సేవలు పూర్తిస్థాయిలో అందట్లేదు.

ఆ కోణంలోనూ తీవ్ర అన్యాయమే..

కేవలం ఆరోగ్య భద్రత, భద్రత విషయాల్లోనే కాదు.. పోలీసు సిబ్బంది అనేక అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు ఏడాది కాలంగా సరెండర్స్, అడిషినల్ సరెండర్స్, టీఏ, డీఏలు పూర్తిస్థాయిలో అందట్లేదు. కేవలం జీతం మినహా మరే ఇతర ప్రయోజనమూ వీరికి చేకూరట్లేదు. పోలీసుల హక్కుగా పొందాల్సిన జీపీఎఫ్ సహా ఇతర పథకాలకూ పెద్ద మొత్తంలో గండిపడుతోంది. ప్రభుత్వం విడుదల చేయాల్సిన బకాయిలు విడుదల చేయట్లేదు. మరోపక్క పోలీసుల జీతం నుంచి మినహాయించిన జీపీఎఫ్ తదితరాలను సైతం సక్రమంగా ఆయా విభాగాలకు జమ చేయట్లేదు. ఈ కారణంగా తమకు రావాల్సిన మొత్తాలు పొందలేక, రుణాలు మంజూరు కాకపోవడంతో కిందస్థాయి ఉద్యోగులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఇటీవల ఉగ్యోగ సంఘాల నేతలు తీసుకున్న విరాళం నిర్ణయమూ వివాదాస్పదమైంది. ఉద్యోగులతో చర్చించకుండా ఒక రోజు వేతనాన్ని వరద బాధితుల సహాయార్థం 'సీఎం రిలీఫ్ ఫండ్'కు ఇస్తున్నట్లు నేతలు ప్రకటించారు. ఆపై అలానే తీసుకువెళ్లి చెక్కునూ అందించారు. పీఆర్సీ లేదని, తమకు రావాల్సిన బకాయిలు రావట్లేదని అలాంటి సందర్భంలో తమను సంప్రదించకుండా ఎలా విరాళం ఇస్తారంటూ నేతల్ని ఉద్యోగులు నిలదీశారు.

నగరంలో నేడు

- తార్నాకలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ ఎదురుగా ఉన్న మర్రి కృష్ణ హాల్‌లో ఉదయం 10.45గంటలకు హెల్పేజ్ ఇండియా ఈవెంట్ జరుగుతుంది.
- వరల్డ్ వెజిటేరియన్ దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి నేషనల్ పార్క్(కేబీఆర్ పార్క్) వద్ద మధ్యాహ్నం 12 గంటలకు వరల్డ్ వెజిటేరియన్ అవేర్‌నెస్‌లో జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సుచిత్ర అకాడమీ, సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిర్వహించిన 'బాలికల సిబిఎస్ఈ క్లస్టర్-4 బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2024' ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఒలింపిక్ పతక విజేతల కోచ్ రమేష్ నాగపురి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను అభినందించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో దాదాపు 45 పాఠశాలల నుంచి వందల మంది విద్యార్థులు పోటీ పడ్డారు. అండర్-14 బాలికల విభాగంలో సైనిక్‌పురి భవన్స్ శ్రీరామకృష్ణ విద్యాలయం, అండర్-17లో శేరిలింగంపల్లి విద్యాంజలి ఉన్నత పాఠశాల, అండర్-19 విభాగంలో బొలారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి ఈ పోటీలు నిర్వహించామని సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ సహ వ్యవస్థాపకులు ప్రదీప్ రాజు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్, కామన్‌వెల్త్ గేమ్స్ పురుషుల సింగిల్స్ గోల్డ్ మెడలిస్ట్ ముహమ్మద్ హఫీజ్ బిన్ హషీమ్, ప్రఖ్యాత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జీవన్‌జీ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

3న జి-స్పార్క్ సదస్సు ప్రారంభం

- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ ప్రణాళిక ప్రకటన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రంగారెడ్డి, ఆర్.గోవింద్‌హరి

నాంపల్లి: ఇన్ఫెక్షన్ నివారణ, నియంత్రణ, యాంటీమైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్‌పై మూడు రోజుల గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ వచ్చేనెల 3న ప్రారంభమై 5వ తేదీన ముగుస్తుందని ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమి అధ్యక్షుడు, జి-స్పార్క్ చైర్మన్ డాక్టర్ రంగారెడ్డి బుర్రి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ సభ జరిగింది. జి-స్పార్క్ కో చైర్మన్ ఆర్. గోవింద్ హరితో కలిసి డాక్టర్ రంగారెడ్డి బుర్రి సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మూడు రోజుల పాటు జరిగే సదస్సు వివరాలను వెల్లడించారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలోని శిల్పకళా వేదికలో సదస్సు జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. జి-స్పార్క్ 2024ను ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమి ఆఫ్ ఇండియా(ఐఎఫ్‌సిఏఐ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ప్రగ్యాన్ సస్టైనబుల్ హెల్త్ అవుట్‌కమ్స్ ఫౌండేషన్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. వందకు పైగా సంస్థల ప్రతినిధులు హాజవుతున్నట్లు తెలిపారు. జి-స్పార్క్‌కు హాజరయ్యే నిపుణులు ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్(ఐపిసి), యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సు ద్వారా ఏఎంఆర్‌పై ఒక కార్యాచరణ ప్రణాళికను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ముగింపు సదస్సులో మహమ్మారి సంసిద్ధత, మహమ్మారి నివారణ తదితర అంశాలపై శ్వేత పత్రాన్ని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే జి-స్పార్క్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్‌ను ప్రకటిస్తారని తెలిపారు.

పోరాటాలే పీడీఎస్‌యూ ప్రత్యేకత

- బీజేపీ పాలనలో పేదలకు ఉన్నత విద్య దూరం
- స్వర్ణోత్సవ సభలో వక్తలు



పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలో అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: సమస్యలపై పోరాడి సాధించడమే పీడీఎస్‌యూ ప్రత్యేకత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్వర్ణోత్సవ సభ జరిగింది. ఆర్ట్స్ కాలేజీ నుంచి ఠాగూర్ ఆడిటోరియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి అమరులు జార్జిరెడ్డి, జంపాల, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీహరి, చేరాలు, కోలా శంకర్, చాంద్ పాషా, స్నేహలత, రంగవల్లి, రమణయ్య, సాంబయ్య తదితరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆజాద్ అమరవీరులకు సంతాపం ప్రకటించగా సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆడిటోరియంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షత జరిగిన స్వర్ణోత్సవ సభకు విశ్రాంత హైకోర్టు జడ్జి జీబీ కోల్సే పాటిల్, ప్రొ.హరగోపాల్, పీడీఎస్‌యూ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ పద్మ, సీపీఐఎంఎల్ నేత పోటు రంగారావు పాల్గొని ప్రసంగించారు. జడ్జి జీబీ కోల్సే పాటిల్ మాట్లాడుతూ విదేశీయుల మాదిరి మన దేశ పాలకులు కూడా ప్రజలను దోపిడీ, పీడనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అగ్రకుల ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ బ్రాహ్మణీయ భావజాలాన్ని కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ 70 ఏళ్ల తర్వాత కూడా విద్య కోసం నేటికీ పోరాడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో ఎన్ఈపీ-2020 వలన పేద కుటుంబాలకు విద్య దూరమవుతుందన్నారు. బహుజనులకు విద్య అందకుండా ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమరశీల స్ఫూర్తి పీడీఎస్‌యూ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులతో పాటు పీడీఎస్‌యూ నాయకులు అనిల్, నర్సింహరావు, పృథ్వీ, నరేందర్, భాస్కర్, అఖిల్, ప్రవీణ్, సాయికుమార్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బతికించండి.. లేదంటే చనిపోయేందుకు అనుమతించండి

- కండర క్షీణత వ్యాధిగ్రస్తుల ఆవేదన



మాట్లాడుతున్న బాధితులు

పంజగుట్ట: ప్రభుత్వం తమను ఆదుకోనైనా ఆదుకోవాలి.. లేకపోతే చనిపోయేందుకు అనుమతి అయినా ఇవ్వాలని కండర క్షీణత వ్యాధిగ్రస్తులు (తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్) ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గోడల మధ్య, కేవలం వీల్‌చైర్లకే పరిమితమై ఉన్న తమను ప్రత్యేక అవసరాలు ఉండే వారిగా గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు వెంకట్రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవి కుమార్ మాట్లాడారు. లోకంలో ప్రతి తల్లి తన బిడ్డలను నవమాసాలు మోస్తుందని, కానీ మా తల్లిదండ్రులు వారి ముసలి ప్రాయంలో కూడా జీవితాంతం తమను చంటి పిల్లల్లా సేవ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని అవయవాలు బాగుండి చిన్నచిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని తాము బతుకుతున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ వ్యాధిబారిన పడ్డవారు 3,500 మంది మాత్రమే ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. కండరాల క్షీణత అంటే దేహంలోని కండ రోజురోజుకీ క్షీణిస్తూ కదలికలు పూర్తిగా లేకుండా పోతున్నాయని, కండ పటుత్వం కోల్పోయి కూర్చోలేక, నిలబడలేక, పడుకోలేక, తినలేక, ఒక దోమ, చీమ కరుస్తున్నా తొలగించుకోలేక, బతికి ఉండి నరకం అనుభవిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అందరూ బ్యాటరీ వీల్‌చైర్‌లపై ప్రెస్‌క్లబ్ నుండి ఖైరతాబాద్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. తమకు ప్రతీ నెల రూ.20వేల పెన్షన్ లేదా ఒకరి సాయం లేకుండా బతకలేని, తమకు కేర్ టేకర్ అలవెన్స్ కల్పించాలని, విడతల వారీగా బ్యాటరీ వీల్‌చైర్లు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు, న్యూట్రీషన్ ఫుడ్ ఇవ్వాలని, డీఎస్ఏ టెస్టులు ఉచితంగా చేయాలని, మందులు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

హైడ్రా ఆపరేషన్ అడ్డుకోవడం తగదు

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణ కోసం హైడ్రా ఆపరేషన్ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని అబాసు పాలు చేసేందుకు మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు ఆరోపించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మాటమీద నిలకడ లేని అవకాశవాదిగా పేరు తెచ్చుకున్న హరీష్‌రావు, తెలంగాణ ఉద్యమ సమయంలో అగ్గి పెట్టె లేకుండా ఆత్మహత్య డ్రామాలు ఆడిన గతాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. గతంలో ఆత్మహత్యలకు పురి గొల్పిన విధంగానే అమాయక ప్రజలను ఆత్మహత్యల వైపుగా పురిగొల్పుతున్నాడని దుయ్యబట్టారు. సిద్దిపేట జిల్లాలో మల్లన్న సాగర్ ముంపు బాధితులపై చేసిన అకృత్యాలు ఘోరాలు తక్కువేమీ కాదన్నారు.సుందిళ్ల ప్రాజెక్టు ముంపు బాధితులకు బేడీలు వేసి జైలుకు పంపిన ఘటనను తెలంగాణ రైతులు మర్చిపోలేదన్నారు. అధికారంలో ఉంటే ఒక మాట, ప్రతిపక్షంలో ఉంటే మరొక మాటగా ప్రవర్తించవద్దని, ఇప్పటికైనా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రవర్తించాలని డాక్టర్ కేశవులు హెచ్చరించారు.

ఇళ్లను కూల్చొద్దంటూ ధర్నా

బహదూర్‌పురా: సీఎం డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు స్థానిక ప్రజలతో కలిసి బహదూర్‌పురా మండల కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. మూసీ నది సుందరీకరణతో మా ఇళ్లను కూల్చివేయడం తగదంటూ మాకు న్యాయం చేయాలని ధర్నా చేశారు. స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ హుస్సేనీపాషా, మహమ్మద్ సలీం, ఖాదర్ మోసే బాధితులకు అండగా ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం బహదూర్‌పురా పోలీసులు కార్పొరేటర్లను అరెస్టు చేశారు.

వ్యాసరచన పోటీల్లో శాంటా మారియా విద్యార్థుల ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: వ్యాసరచన పోటీల్లో శాంటా మారియా విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ హేమా సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. జాన్ లాక్ ఇనిస్టిట్యూట్ గ్లోబల్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారని, విద్యార్థుల స్వతంత్ర, తార్కిక ఆలోచనలు, విమర్శనాత్మక విశ్లేషణ, తత్వశాస్త్రం, రాజకీయ, ఆర్థిక, చరిత్ర, మానసిక, ధర్మ, న్యాయశాస్త్రం వంటి అనేక విషయాల్లో విద్యార్థులు వ్యాసాలు రాయడానికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. వీటిని ఆక్స్‌ఫర్డ్ వంటి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల సీనియర్ అకడమిక్‌లు పరిశీలిస్తారని తెలిపారు. శాంక్టా మారియా తరపున నిషి జూనియర్ కేటగిరీలో ప్రతిభ చూపగా, ఆన్య, రౌనక్‌లు మెరిట్ పురస్కారాలు పొందారని వివరించారు. పాఠశాలలో సోమవారం వారిని అభినందించారు.

క్యాన్సర్ పేషెంట్లకు ఇంటాస్ ఫౌండేషన్ సేవలు

సాక్షి, సిటీబ్యూరో: క్యాన్సర్ పేషెంట్లకు ఇంటాస్ ఫౌండేషన్ అప్నా ఘర్ పేరుతో ఉచిత సేవలు అందిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి లేదా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, ఆహారం అందజేస్తోంది. అలాగే అప్నా ఘర్ నుంచి ఆస్పత్రికి, ఆస్పత్రి నుంచి అప్నా ఘర్ వరకు రవాణా సౌకర్యాన్ని కూడా కల్పిస్తోంది. పేషెంట్స్‌తో పాటు వారి సంరక్షులకు కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. దక్షిణ భారత ప్రాంతీయ కోఆర్డినేటర్ సవితా కిని ఇటీవల హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ వద్ద ఉన్న అప్నా ఘర్‌ను సందర్శించి అక్కడ అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. దేశంలోని దాదాపు 40 ప్రాంతాల్లో అప్నాఘర్ పేరిట ఇంటాస్ ఫౌండేషన్ సేవలు అందిస్తోందని ఆమె తెలిపారు.

హజ్ యాత్రకు అందరూ ఎంపికయ్యే అవకాశం

- గతేడాది 11 వేల దరఖాస్తులు.. ఈ ఏడాది 8వేలు మాత్రమే..
- సోమవారంతో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ గడువు
- 2025 హజ్ యాత్రకు స్పందన కరువు

సాక్షి సిటీబ్యూరో: ఈసారి హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ యాత్రకు వెళ్లే అవకాశం దక్కనుంది. సోమవారంతో 2025 హజ్ యాత్రకు దరఖాస్తుల గడువు ముగిసింది. హజ్ కమిటీ చరిత్రలో అతితక్కువగా దరఖాస్తులు రావడం ఇదే మొదటిసారి ప్రతి సంవత్సరం హజ్ యాత్రకు వెళ్లడానికి పోటీ పడేవారు. దరఖాస్తులు వేలల్లో రావడంతో డ్రా పద్ధతిలో యాత్రికుల ఎంపిక చేసేవారు. 2025 హజ్‌యాత్రకు వెళ్లడానికి యాత్రికుల నుంచి స్పందన కరువైంది. ప్రతి సంవత్సరం 10 వేలకుపై దరఖాస్తులు వచ్చేవి. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా కేవలం 8వేల దరఖాస్తులు మాత్రమే అందాయని అధికారులు చెప్పారు. 2024 యాత్రలో 11,027 దరఖాస్తులు రాగా, 2023లో 10,368 దరఖాస్తులు అందాయని అధికారులు చెప్పారు. కానీ ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం హజ్ యాత్రకు అయ్యే ఖర్చులను విపరీతంగా పెంచింది. ప్రభుత్వ ఆధీనంలో యాత్రకు వెళ్లే యాత్రికులకు దాదాపు రూ.5-6 లక్షలు ఖర్చు అవుతుందని కేంద్ర హజ్ కమిటీ ప్రకటించారు. పెరిగిన ఖర్చులతో హజ్ యాత్రకు వెళ్లడం భారమైంది. దీంతో యాత్రకు వెళ్లడానికి రాష్ట్ర ముస్లింలు ఆసక్తి చూపడం లేదని పలు ముస్లిం సంఘాలు అంటున్నాయి.

అందరికీ యాత్రకు అవకాశం

హజ్ యాత్రకు ప్రతిఏటా దాదాపు 10 వేల కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటారు. కానీ ఇందులో వందల సంఖ్యాలో విత్ డ్రా చేసుంటారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారిలో దాదాపు 70-80 శాతం యాత్రికులే మిగులుతారు. దీంతో ఈసారి దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవకాశం దక్కనుందని అధికారులు చెబుతున్నారు. ప్రతిఏటా కేంద్ర హజ్ కమిటీ ద్వారా రాష్ట్రానికి 6,500 మందిని హజ్ యాత్రకు వెళ్లే అవకాశం దక్కుతుంది. యాత్ర ప్రారంభమయ్యే వరకు వెయిటింగ్ లిస్టులో ఉన్న యాత్రికులకు కూడా అవకాశం దక్కనుందని రాష్ట్ర హజ్ కమిటీ అధికారులు చీ. దరఖాస్తులు తక్కువ అందినా డ్రా పద్ధతిలోనే ఎంపిక జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. గతేడాది తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 6,500 మంది యాత్రికులు వెళ్లారు. ఈసారి సంఖ్య పెరగనుంది. దీంతో దరఖాస్తు చేసుకున్న వారిలో 80 శాతం అవకాశం దక్కనుంది.

రిటైర్డ్ అధికారులకు ఘనంగా వీడ్కోలు

బంజారాహిల్స్: సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందుతున్న 21 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీ సీవీ ఆనంద్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈమేరకు సోమవారం బంజారాహిల్స్ టీజీ ఐసీసీసీలోని సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యక్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ ఆనంద్ వారిని ఘనంగా సత్కరించారు. వారు ఇప్పటి వరకు అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ పరిమళ హనా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్.శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

గచ్చిబౌలి: రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కొండాపూర్‌లోని సైబర్ మిడోస్ విల్లాస్‌లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. సోమవారం రాత్రి మంత్రి నివాసానికి వెళ్లి ఆయన తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కుటుంబసభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నాయకులు కార్తీక్ రెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంప్రదాయాలు.. ఎన్నో రకాల సంస్కృతుల మేళవింపుకు కేరాఫ్ భాగ్యనగరం. ఉత్తరాది రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాల వరకూ దొరికే అన్ని రకాల ఆహార ఉత్పత్తులు ఇక్కడ దొరుకుతున్నాయి. దీనికి అనుగుణంగానే నగరజీవుల టేస్ట్‌లో కూడా చాలా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వారాంతం వస్తే చాలు కొత్త కొత్త రుచుల కోసం నగరాన్ని జల్లెడ పడుతున్నారు. ముఖ్యంగా లేట్ నైట్ వరకూ పలు ప్రాంతాల్లో స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు తెరిచి ఉంచుతుండటంతో ఆయా ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా.. ఉదయం, సాయంత్రం అనే బేధం లేకుండా స్ట్రీట్ ఫుడ్ సెంటర్ల దగ్గర క్యూ కడుతున్నారు. ఫ్యామిలీతో బయటకు వచ్చి.. వెరైటీ ఫుడ్ లాగించేసి ఇంటికి వెళ్లడం.. పైగా ఇన్‌స్టా వేదికగా ఇన్‌ఫ్లుయెన్సర్లు చెప్పే రివ్యూలను బట్టి ఎంత దూరమైనా వాటి కోసం అక్కడ వాలిపోతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ వైబ్స్



అందుకోకపోతే అధోగతే...

ఏఐలోనూ ప్రావీణ్యత సాధించాల్సిందే

అలక్ష్యం చేస్తే ఉద్యోగ భద్రతకు నో గ్యారెంటీ

గ్రేట్ లెర్నింగ్ 'అప్‌స్కిల్లింగ్ ట్రెండ్స్' రిపోర్ట్‌లో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్తులో వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోపోతే ఎదగడం అటుంచి ఉన్న పరిస్థితి నుంచి కూడా దిగజారతామని నగర వృత్తి నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నత విద్య వృత్తిపరమైన నైపుణ్యాల శిక్షణ కోసం ప్రముఖ గ్లోబల్ ఎడ్‌టెక్ కంపెనీ గ్రేట్ లెర్నింగ్ 'అప్‌స్కిల్లింగ్ ట్రెండ్స్' రిపోర్ట్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, నగరంలోని 85% మంది వృత్తి నిపుణులు తమ భవిష్యత్తును మెరుగుపరచడంలో నైపుణ్యం కీలకమని నమ్ముతున్నారు. అలాగే 74% మంది సాంకేతికత ఏఐలో పురోగతి తమ ప్రస్తుత పరిస్థితిని ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు. అలాగే గతేడాది 72% మంది తమ ఉద్యోగాలను నిలుపుకోవడంపై నమ్మకంతో ఉండగా, ఈ ఏడాది ఆ నమ్మకం 69%కి పడిపోయింది. గతేడాది వీరిలో అత్యధికులు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్‌లో నైపుణ్యం గురించి ఆలోచిస్తే, ఈ సంవత్సరం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యం అత్యధికులకు ప్రధానంగా మారింది.

6 నుంచి గర్బా దాండియా

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో దసరా వేడుకల్లో భాగంగా అక్టోబర్ 6 నుండి గర్బాదాండియా వేడుకలు నిర్వహిస్తున్నట్లు రామాయణమేళా చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డిలు వెల్లడించారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజస్థానీ ప్రగతిసమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో దసరా వేడుకలు, రామాయణమేళా వేడుకలు, గర్బాదాండియా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 6 నుంచి 10 వరకూ ప్రతిరోజు రాత్రి 8 గంటల నుండి 12 గంటల వరకూ కుంజ్ గుజరాత్, బీడ్స్ గ్రూప్, ముంబయ్ వారిచే ఈ వేడుకలు ఉంటాయన్నారు. దాండియా వేడుకల్లో విజేతలకు అవార్డులు అందజేస్తామన్నారు. అదేవిధంగా అక్టోబర్ 9న బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్త కార్యదర్శి డి.మోహన్, నిర్వాహకులు సుమిత్‌రాఠి, మనోజ్ జైస్వాల్, కేవి.రంగారెడ్డి, గిరిధర్‌లాల్ దాగా పాల్గొన్నారు.



రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్



రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవ్ రెండో రోజు సోమవారం నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తిలకించారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కళాకారుల నృత్యాలు వారి జీవనశైలిని తెలిపే చేనేత హస్తకళా వస్త్రాలు, అల్లిన బుట్టలు, హ్యాండ్ బ్యాగ్స్, తదితర ఉత్పత్తుల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా నిలిపిన గుడిసెలు, యూత్ ఎంగేజ్మెంట్ జోన్‌లో ఏర్పాటు చేసిన కుండల తయారీ, వెదురు గోడలు, చార్కోల్ రూఫింగ్ టెక్నిక్, ఇక్రా పద్ధతిలో గుడిసెల నిర్మాణాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. లోతుకుంట మోడల్ మిషన్ హైస్కూల్, తిరుమలగిరి, కార్ఖాన ప్రభుత్వ బాలుర ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎంఎస్ఆర్ ఎక్స్‌లెన్స్ స్కూల్, మల్కాజ్‌గిరి భాష్యం హైస్కూల్, శివశివాని డిగ్రీ కళాశాల, ఉప్పల్, కొంపల్లి, మన్సూరాబాద్ నుంచి ఏడువేల మంది విద్యార్థులు ప్రదర్శనను వీక్షించారు.



నగరవాసులను ఊరిస్తున్న వెరైటీలు

వైవిధ్యమైన కల్చర్‌కు వేదికగా భాగ్యనగరం

కిటకిటలాడుతున్న స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్

నైట్ లైఫ్ ఎంజాయ్ చేస్తున్న నగర యువత

ఫీల్ గుడ్.. స్ట్రీట్ ఫుడ్!

అర్ధరాత్రి వరకూ అందుబాటులో ఆహారం



స్ట్రీట్ ఫుడ్ అనగానే ఠక్కున గుర్తొచ్చే ప్లేస్ చార్మినార్. ఎంత రాత్రి అయినా సరే చార్మినార్ దగ్గరికి వెళ్తే చాలు ఎలాంటి ఫుడ్ కావాలంటే అలాంటి ఫుడ్ లాగించేయొచ్చు. మొఘల్ నుంచి నిజాం కాలం వరకూ ఏ రకం ఫుడ్ కావాలన్నా ఇక్కడ దొరుకుతుంది. పత్తర్ కా ఘోష్ చాలా ఫేమస్. ఒక్కసారైనా ఈ వంటకాన్ని టేస్ట్ చేయాలని అనుకుంటారు. హైదరాబాద్ కా ఫేమస్ హలీమ్, షావర్మా, కోవా జిలేబీ, కోవా గులాబ్‌జామ్, షాదూద్ మలాయ్, మాషా అల్లా ఫలూదా, టర్కిష్ మరగ్, సీక్ కబాబ్, ఫిర్నీ, హోటల్ షాబాద్‌లో నాస్తా, ఖట్టి కిచిడీ, కీమా, భాజీ గుర్దా, ఇరానీ చాయ్ ఇలా చెప్పుకొంటూ పోతే జాబితాకు ముగింపే ఉండదు. తెల్లవారుజాము వరకూ ఇక్కడి ఫుడ్ స్టాల్స్ కిటకిటలాడుతుంటాయి.

నైట్ లైఫ్‌కి ఐకాన్..

నైట్ లైఫ్‌కు హైదరాబాద్ ఐకాన్‌గా మారుతోంది. చాలా ప్రాంతాల్లో లేట్ నైట్ వరకూ ఫుడ్ స్టాళ్లకు అనుమతులు ఇస్తుండటంతో యూత్ కూడా వీకెండ్స్‌లో నైట్ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. నలుగురైదుగురు ఫ్రెండ్స్ కలిసి బైక్‌లు, కార్లలో నగరాన్ని రాత్రి వేళల్లో చుట్టేస్తున్నారు. ఉదయం సమయంలో ట్రాఫిక్‌తో విసిగిపోయిన వారు.. అర్ధరాత్రి ప్రశాంతమైన నగరాన్ని చూస్తూ మైమరిచిపోతున్నారు. మొజంజాహీ మార్కెట్, రాంకీబండి, సికింద్రాబాద్, లోయర్ ట్యాంక్‌బండ్, ఉప్పల్ భగాయత్.. నైట్‌లైఫ్‌కు కేంద్రాలుగా ఉంటున్నాయి. ఇక్కడ దొరికే స్ట్రీట్ ఫుడ్‌ను లొట్టలేసుకుంటూ తింటూ.. ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ లైఫ్‌టైం మెమరీస్ దాచిపెట్టుకుంటున్నారు.

స్ట్రీట్ ఫుడ్ అనగానే ఇప్పటికీ చార్మినార్ పేరే గుర్తొస్తుంది. కానీ ఇటీవల కాలంలో సచివాలయం చుట్టు పక్కల ఉన్న ప్రాంతాలు స్ట్రీట్ ఫుడ్ హబ్‌గా మారాయి. రాత్రి

ఫుడ్ హబ్‌గా సచివాలయం..

పొద్దుపోయే వరకూ ఇక్కడ ఫుడ్ లవర్స్ రోడ్డు పక్కన దొరికే తినుబండారాలను తెగ ఎంజాయ్ చేస్తున్నారు. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో.. విద్యుత్ కాంతుల్లోని సచివాలయం, అమర వీరుల జ్యోతి చుట్టు పక్కల ప్రదేశాలు సందర్శకులతో రద్దీగా మారతాయి.



చాట్ నుంచి చాక్లెట్ కేక్ వరకూ..

వెనీలా, చాక్లెట్ కప్ కేక్స్, మల్బరీ, స్ట్రాబెర్రీ చాక్లెట్, పానీపూరీ, చాట్, బ్రెడ్ ఆమ్లెట్, కారం, ఉప్పు చల్లిన మామిడి, స్వీట్ కార్న్, మసాలా కార్న్, ఉడకబెట్టిన మొక్కజొన్న, ట్విస్టెడ్ పొటాటో, వెజ్, చికెన్, ఫ్రైడ్ మోమోస్, స్టీమ్ మోమోస్, చైనీస్ ఫుడ్ ఇలా ఒక్కటేంటి.. నగరంలో వివిధ ప్రాంతాల్లో దొరికే అన్ని రకాల ఆహారం ఇక్కడ అందుబాటులో ఉంటుంది. స్మైలీ, ఎగ్ దోశ, ఎగ్ ఆమ్లెట్ షావర్మా, చికెన్ కబాబ్స్, క్రిస్పీ స్పైసీ చికెన్, సమోలీ, కుబూస్, రుమాలీ షావర్మా, చాట్, పానీపూరీ చాలా తక్కువ ధరకే దొరుకుతుంది. హుస్సేన్ సాగర్ అందాలను చూసుకుంటూ ఎంచక్కా ఫుడ్‌ను ఎంజాయ్ చేయొచ్చు.

అదిరే ఫుడ్ నెక్లెస్ రోడ్..!



నెక్లెస్ రోడ్డులో అలా కారులో, బైక్‌పై వెళ్తుంటే అక్కడక్కడా వచ్చే సువాసనలు చూస్తుంటేనే ఆ ఫుడ్ లాగించేయాలని అనిపిస్తుంది. ఎంచక్కా కారు లేదా బైక్ ఆపి చక్కగా ఆర్డర్ చేసుకుని, తింటుంటే ఆ మజానే వేరు. ఇక, నెక్లెస్ రోడ్డులోని ఈట్ స్ట్రీట్ ఫుడ్ గురించి వేరే చెప్పాల్సిన పనే లేదు. అక్కడ దొరకని ఫుడ్ అంటూ లేదంటే అతిశయోక్తి లేదు. ఫుడ్‌తో పాటు చిన్న పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు అనేక రకాలా ఆటవస్తువులు, మంచి ఎంటర్‌టైన్‌మెంట్ అందుబాటులో ఉంటుంది.

హైటెక్ సిటీ-మాదాపూర్..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అడ్డా అయిన హైటెక్ సిటీ, మాదాపూర్‌లో ఇటీవల స్ట్రీట్ ఫుడ్ కల్చర్ విపరీతంగా పెరిగిపోయింది. చాలా మంది ఐటీ ఉద్యోగులకు నైట్ డ్యూటీలు ఉంటాయి. అర్ధరాత్రి ఆకలిగా అనిపించినా.. కాస్త బోర్ కొట్టినా కొలీగ్స్‌తో కలిసి ఎంచక్కా స్ట్రీట్ ఫుడ్ స్టాళ్ల దగ్గరికి వచ్చి డిఫరెంట్ ఫుడ్ ఎంజాయ్ చేస్తున్నారు. రెగ్యులర్ టిఫిన్లయిన ఇడ్లీ, దోశతో పాటు స్నాక్ ఐటెమ్స్ అయిన సమోసా, మిర్చీ, కట్లెట్, పానీపూరీ ఆహారం ఏదైనా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా దొరుకుతుంది. హైదరాబాద్ యువతకు మాదాపూర్ స్ట్రీట్ ఫుడ్ ఫేవరెట్‌గా మారాయి.



అధిరోహించిన పిన్న వయస్కుడిగా యశ్వంత్

అక్కడ సిటీ సీపీ సీవీ ఆనంద్ ఫొటో ప్రదర్శన

మౌంటెనీర్ స్వస్థలం మహబూబాబాద్ జిల్లా

గోరిచెన్ శిఖరంపై కొత్వాల్ చిత్రం

ఇది అరుణాచల్‌ప్రదేశ్‌లోని మంచు పర్వతం



సాక్షి, సిటీబ్యూరో: అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఎత్తైన శిఖరం మౌంట్ గోరిచెన్‌ను అధిరోహించిన పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు మహబూబాబాద్ జిల్లా వాసి భూక్యా యశ్వంత్ నాయక్ (20). అంతేకాదు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ఫొటోను అక్కడ ప్రదర్శించారు. మౌంటెనీర్ అయిన యశ్వంత్ ఎవరెస్ట్ మినహా అన్ని శిఖరాలనూ అధిరోహించారు. ఆ శిఖరాన్ని సైతం త్వరలోనే అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆనంద్ 'సాక్షి'తో అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ తన పదహారో ఏట నుంచే పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్నాడు. భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌తో పాటు సిక్కింలోని ఇండియన్ హిమాలయ్ సెంటర్ ఫర్ అడ్వెంచర్ అండ్ ఎకో టూరిజం (ఐహెచ్‌సీఏఈ) శిక్షణ పొందాడు. పేద కుటుంబంలో పుట్టిన యశ్వంత్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన లక్ష్యంగా నిర్దేశించుకుని, ఆ దిశగా కృషి చేస్తున్నాడు. అందులో భాగంగా ఇప్పటికే అనేక శిఖరాలను అధిరోహించిన యశ్వంత్ ఆర్థిక సాయం కోసం అనేక మందిని సంప్రదించారు. సీవీ ఆనంద్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా పని చేస్తుండగా ఆయన్నూ కలిశారు. లక్ష్యాన్ని వివరించిన యశ్వంత్ తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ఆ పట్టుదల ఆకట్టుకుంది..

స్వతహాగా స్పోర్ట్స్ మెన్ అయిన ఆనంద్‌ను యశ్వంత్‌లోని పట్టుదల ఆకట్టుకుంది. ఓ చిన్న తండా నుంచి వచ్చిన ఈ యువకుడు సాధించే విజయం ఎందరికో స్ఫూర్తి అవుతుందని భావించారు. దీంతో రాష్ట్ర గవర్నర్ కార్యాలయంతో పాటు మరికొందరికి సిఫార్సు చేసి యశ్వంత్‌కు ఆర్థిక సాయం అందేలా చేశారు. అప్పటి నుంచి ఆనంద్‌ను శ్రేయోభిలాషిలా భావిస్తున్న ఈ యువకుడు పర్వతారోహణకు వెళ్లే ముందు ఆయన్ను కలిసి సలహాలు, సూచనలు తీసుకుంటారు. ఆ లక్ష్యం పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత కూడా ఆనంద్‌ను కలిసి తన అనుభవాలు, ఎదురైన సవాళ్లు వివరిస్తుంటారు.

16 రోజుల పాటు..

ఈ నేపథ్యంలోనే గత నెల 4 నుంచి 16 రోజుల పాటు సాగిన పర్వతారోహణలో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని అతి ఎత్తైన (సముద్ర మట్టానికి 21,300 అడుగులు) మౌంట్ గోరిచెన్‌ను అధిరోహించారు. ఆ శిఖరంపై జాతీయ పతాకం, సీవీ ఆనంద్ ఫొటోను ప్రదర్శించి తన అభిమానాన్ని చాటుకున్నారు. 'పర్వతారోహణలో అనేక సవాళ్లు ఎదురవుతూ ఉంటాయని' కొత్వాల్ సీవీ ఆనంద్ 'సాక్షి'తో అన్నారు. వాతావరణం అప్పటికప్పుడు మారిపోతుంది. దాన్ని అంచనా వేయగలగడమే కాదు.. సమయానుసారం నిర్ణయాలు కూడా తీసుకోవాలి. ఇలాంటి అనేక అంశాలను యశ్వంత్‌కు వివరిస్తుంటా. త్వరలోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నా' అని పేర్కొన్నారు.



భూక్యా యశ్వంత్ నాయక్

నేడు ప్రపంచ శాఖాహార దినోత్సవం

జంతువులకూ హక్కులున్నాయి..

శాఖాహారులుగా, వేగన్స్‌గా మారడానికి పెటా అవగాహన

నగరంలో పెరుగుతున్న పెట్ లవర్స్ కమ్యూనిటీ

సాక్షి, సిటీబ్యూరో: జంతువులకూ హక్కులున్నాయి. వాటి సంరక్షణ బాధ్యత కూడా మనదే అని నిత్యం నినదిస్తూనే ఉన్నారు జంతుప్రేమికులు. ఇందులో భాగంగా వెజిటేరియన్లుగా, వేగన్స్‌గా మారాలని నగరంలోని జంతు ప్రేమికులు ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నేడు (అక్టోబర్-1) ప్రపంచ శాఖాహార దినోత్సవం.. అంతేకాకుండా ఈ నెలంతా వెజిటేరియన్ అవేర్నెస్ మంత్‌గా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలువురు జంతు ప్రేమికులతో పాటు పెటా ఇండియా వంటి పలు సంస్థలు శాఖాహారులుగా మారాలని అవగాహన కల్పిస్తున్నాయి.

జంతు సంబంధిత ఉత్పత్తులకు స్వస్తి..

మనిషి మనుగడ సాగించడానికి జంతువుల మాంసం మాత్రమే తప్పనిసరి కాదు. శాఖాహారంలో ఎన్నో ప్రత్యామ్నాయ మార్గాలున్నాయని జంతు ప్రేమికులు నినదిస్తున్నారు. మనుషుల్లానే స్వేచ్ఛగా వాటి జీవితాన్ని కొనసాగించాల్సిన జీవజాతులు మనుషులకు ఆహారంగా మారుతున్నాయి. వాటికీ నొప్పి, ప్రేమ, ఆత్మీయత వంటి భావోద్వేగాలు ఉంటాయని, గాడి తప్పిన జీవవైవిధ్యంలో సమతుల్యతను కాపాడటానికి మిగిలిన జంతుజాలాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని పోరాటం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెలంతా ప్రజలను శాఖాహారులుగా మార్చడానికి అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

కఠినమైన వేగన్స్‌గా...

శాఖాహారులగానే కాకుండా ఇంకాస్త ముందడుగేసి కఠినమైనా వేగన్స్‌గా మారుతున్నారు పలువురు జంతు ప్రేమికులు. జంతువుల మాంసం మాత్రమే కాకుండా జంతువుల ద్వారా లభించే పాలు, గుడ్లు, నెయ్యి, తేనె తదితర ఉత్పత్తులు వాడకపోవడమే వేగనిజం. అంతేకాదు.. జంతువుల చర్మం, తదితర ఉత్పత్తుల నుంచి తయారు చేసిన వస్తువులను (లెదర్ బ్యాగులు, బెల్టులు, సౌందర్య ఉత్పత్తులు.. తదితరాలు) సైతం వినియోగించరు. ఇలాంటి వారి కోసం నగరంలో ప్రత్యేకంగా వేగన్ రెస్టారెంట్లు సైతం ప్రారంభించారు. ఈ వేగన్స్ అంతా ఒక కమ్యూనిటీగా మారి అప్పుడప్పుడూ వేగన్ మీట్‌లు, వేగన్ ఫెస్టులు నిర్వహిస్తుండటం విశేషం.

మాంసాన్ని త్యజించండి..

ప్రపంచ శాఖాహార దినోత్సవం నేపథ్యంలో పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్ (పెటా) ఆధ్వర్యంలో నగరం వేదికగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా నేడు నగరంలోని కేబీఆర్ పార్క్ వేదికగా మాంసాన్ని త్యజించి శాఖాహారిగా మారమని ప్రజలను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. మాంసం అంటే హింసించి చంపిన జంతువు దేహాన్ని తినడం. మనలాంటి భావోద్వేగాలున్న మూగజీవాలను సంరక్షించుకుందాం.

–అనుష్క యాదవ్, పెటా ఇండియా





అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

ఒంటరి పెద్దలకు పెళ్లి.. మనమే చేద్దాం మళ్లీ..

■ పంజగుట్టకు చెందిన సత్యనారాయణకు ముగ్గురు కూతుళ్లు. భార్య కేన్సర్‌తో చనిపోగా కూతుళ్లను పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. కూతుళ్లు ఇంట్లో ఉన్నంతకాలం ఒంటరితనం అంటే ఏమిటో తెలియని ఆయన.. వారంతా అత్తారిళ్లకు వెళ్లిపోయాక కొన్ని నెలల్లోనే మానసికంగా కుంగిపోయారు. తండ్రి పరిస్థితి చూసి తల్లడిల్లిన కూతుళ్లు.. తండ్రికి తగ్గ జోడీని తెచ్చి పెళ్లి చేశారు. ఇప్పుడు సత్యనారాయణ భార్యతో కలిసి హాయిగా శేష జీవితం వెళ్లదీస్తున్నారు.

■ అమెరికాలో నివసించే ఓ వివాహిత హైదరాబాద్‌లో ఉండే తన సోదరుడు చనిపోయాక ఒంటరిగా ఉండలేకపోతున్న తల్లి కష్టాలు చూసి చలించిపోయింది. వెంటనే నగరానికి వచ్చి దగ్గర బంధువులతో మాట్లాడటంతోపాటు ఎలాగోలా తల్లిని ఒప్పించి మరో పెళ్లి చేసింది. వారికి కావాల్సినవన్నీ సిద్ధం చేసి మళ్లీ అమెరికా వెళ్లిపోయింది.

ఈ రెండు ఉదంతాలు నవతరం పిల్లల ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలను దెబ్బతీసిన న్యూక్లియర్ ఫ్యామిలీస్ ఆ తర్వాత సీనియర్ సిటిజన్స్‌కు వృద్ధాశ్రమాలనే మలి మజిలీలుగా మార్చాయి. అయితే ఇటీవల ఆ తరహా ఆలోచనల నుంచి ఇతరత్రా పరిష్కారాలను వెదుకుతున్నారు.. అందులో భాగంగానే పెద్దల పెళ్లిళ్లు ఊపందుకుంటున్నాయి. ఈ ట్రెండ్ అనేక మంది ఒంటరి తల్లులకు జంటను తెచ్చిపెడుతోంది. తండ్రికి మళ్లీ పెళ్లి చేయడం ద్వారా ఆయన బాగోగులు దగ్గరుండి చూసుకోలేకపోతున్నామనే గిల్టీనెస్ పోగొట్టుకోవడంతోపాటు మరో ఒంటరి మహిళకు తోడు అందించామనే తృప్తి కూడా పొందుతున్నామని సత్యనారాయణ కుమార్తెలు 'సాక్షి'కి చెప్పారు.



వృద్ధాప్యంలో శాపంగా మారే ఒంటరితనానికి పెళ్లి/లివిన్ మించిన పరిష్కారమార్గం లేదని అర్థం చేసుకొని 14 ఏళ్ల క్రితం మా సంస్థను ప్రారంభించాం. ఇప్పటివరకు మేము కొన్ని వేల మంది ఒంటరి వృద్ధుల జీవితాల్లో తిరిగి ఆనందాన్ని తీసుకురాగలిగామని గర్వంగా చెప్పగలను.

\- రాజేశ్వరి, తోడు-నీడ సీనియర్ సిటిజన్స్ సేవా సంస్థ

ఎలాంటి ఆధారాల్లేవ్



చంద్రబాబు 'కొవ్వు' ప్రకటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం

లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు ఉందని సీఎం ఎలా చెబుతారు?

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ ఆరోపణల విషయంలో వాస్తవాలు నిర్ధారణ కాక ముందే కల్తీ జరిగినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రకటనలు చేయడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతు కొవ్వు ఉందని చెప్పేందుకు ముఖ్యమంత్రి వద్ద ఏం ఆధారాలున్నాయని సూటిగా ప్రశ్నించింది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ప్రెస్ ముందు అలా ఎలా మాట్లాడతారని నిలదీసింది. ప్రమాణాలకు అనుగుణంగా లేని నెయ్యిని వెనక్కి పంపించేశామని, అసలు ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనే లేదని టీటీడీ ఈవో చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేసింది. మరి అందుకు విరుద్ధంగా లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారని ముఖ్యమంత్రి రాజకీయ ప్రకటనలు ఎలా చేస్తారని విస్మయం వ్యక్తం చేసింది. అసలు దేని ఆధారంగా నెయ్యి కల్తీ అయినట్లు చెబుతున్నారు? లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఆధారాలు ఏమిటి? అని ప్రశ్నించింది. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఒకవైపు దర్యాప్తు కొనసాగుతుండగా మరోవైపు రాజ్యాంగపరమైన ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు రాజకీయ ప్రకటనలు చేయడం సరికాదని స్పష్టం చేసింది. అలాంటి ప్రకటనలు చేయడం వల్ల కోట్ల మంది ప్రజల మనోభావాలు ప్రభావితం అవుతాయని తేల్చి చెప్పింది. 'కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి..!' అని సీఎం చంద్రబాబు తదితరులను దృష్టిలో పెట్టుకుని ఘాటుగా వ్యాఖ్యానించింది. నెయ్యి కల్తీ జరిగిందంటూ రిపోర్టు ఇచ్చిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) తన నివేదిక తప్పు కావొచ్చునని స్పష్టంగా పేర్కొందని ప్రస్తావించింది. నెయ్యి కల్తీ జరిగిందన్న విషయం ప్రజల్లోకి వెళ్లింది గానీ తన నివేదికలో తప్పులు ఉండవచ్చని ఎన్‌డీడీబీ స్వయంగా చెప్పిన విషయం మాత్రం ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని వ్యాఖ్యానించింది. కల్తీపై ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికపై సెకండ్ ఒపీనియన్ (రెండో అభిప్రాయం) ఎందుకు తీసుకోలేదని టీటీడీని ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ ఒక్కటే అత్యున్నత ల్యాబ్ కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు ఎన్నో ఉన్నాయని టీటీడీకి గుర్తు చేసింది. ఎన్‌డీడీబీ నివేదికలో స్పష్టత లోపించిందని పేర్కొంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై దర్యాప్తు జరగాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. అయితే దర్యాప్తు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కొనసాగించాలా? లేక స్వతంత్ర సంస్థ ద్వారా దర్యాప్తు చేయాలా? అనే విషయంపై తమకు సహకరించాలని సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను అక్టోబర్ 3కి వాయిదా వేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెయ్యి కల్తీకి సంబంధించి ప్రకటనలు చేసే విషయంలో నియంత్రణ పాటించేలా మీ క్లయింట్‌లకు (రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ఈవో) చెప్పాలని టీటీడీ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకి ధర్మాసనం స్పష్టం చేసింది.

మా ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పండి..

తమ ప్రశ్నలకు లూథ్రా సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేస్తుండటంతో ధర్మాసనం జోక్యం చేసుకుంది. తమ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. 'లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. ముఖ్యమంత్రి ప్రకటనకు విరుద్ధంగా టీటీడీ ఈవో ప్రకటన ఉంది. కల్తీ నెయ్యి విషయంలో మీ (టీటీడీ) వైఖరి చాలా స్పష్టంగా ఉంది. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలకు ఎలాంటి ఆధారాల్లేవ్. దర్యాప్తునకు ఆదేశించినప్పుడు పదాల గారడీ ఎంత మాత్రం అవసరం లేదు...' అని ధర్మాసనం ఘాటుగా స్పష్టం చేసింది. సిట్ దర్యాప్తునకు ముందే ముఖ్యమంత్రి ప్రకటనలు చేశారని లూథ్రా తెలిపారు. సిట్ ఏర్పాటు తరువాత మాట్లాడలేదన్నారు. అసలు ఎంత మంది కాంట్రాక్టర్ల నుంచి నెయ్యిని సేకరిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ఐదుగురు కాంట్రాక్టర్ల వద్ద నుంచని లూథ్రా పేర్కొనడంతో.. వారి నుంచి సేకరించిన నెయ్యి మొత్తాన్ని కలిపేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కలిపేస్తామని లూథ్రా బదులివ్వడంతో మరి ఎవరు సరఫరా చేసిన నెయ్యి కల్తీ అయిందో ఎలా నిర్ధారిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. మొత్తం నెయ్యి నుంచి కల్తీ నెయ్యిని ఎలా వేరు చేస్తారని ప్రశ్నించింది. దీనికి లూథ్రా నేరుగా సమాధానం ఇవ్వకుండా.. గత 50 ఏళ్లుగా స్వామి ప్రసాదాల కోసం కర్ణాటక ప్రభుత్వానికి చెందిన నందిని నెయ్యిని ఉపయోగిస్తూ వచ్చామని, గత ప్రభుత్వ హయాంలోనే కాంట్రాక్టర్ మారారని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలోనే నెయ్యి నాణ్యతను పరిశీలించామన్నారు. దీంతో కల్తీ వ్యవహారం బయటపడిందన్నారు. అయితే ఎన్‌డీడీబీ నివేదికలో అది తప్పు అయ్యే అవకాశం కూడా ఉందని స్పష్టంగా పేర్కొన్నారని, అలాంటప్పుడు సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ చాలా పేరున్న ల్యాబ్ అని లూథ్రా చెప్పగా.. అది ఒక్కటే కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు చాలానే ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో దానినే కొనసాగించాలా? లేక దర్యాప్తును స్వతంత్ర సంస్థకు అప్పగించాలా? అనే విషయంపై చెప్పాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 3న మధ్యాహ్నం 3.30 గంటలకు చేపట్టనున్నట్లు ప్రకటించింది.

పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు...

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ సుబ్రమణియన్ స్వామి ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అలాగే లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో దర్యాప్తు, స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని అభ్యర్థిస్తూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి కూడా పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై ఇతర రాష్ట్రాలకు చెందిన సంపత్, శ్రీధర్, సురేష్ చవంకే వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నాలుగు వ్యాజ్యాలపై జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మధ్యాహ్నం విచారణ జరిపింది. పిటిషనర్ సుబ్రమణియన్ స్వామి తరపున సీనియర్ న్యాయవాది రాజశేఖర్‌రావు, సంపత్, శ్రీధర్ తరపున రాఘవ్ అవస్థీ, సురేష్ చవంకే తరపున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్, ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, టీటీడీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

బాబు ప్రకటనతో నిష్పాక్షిక దర్యాప్తు సాధ్యమేనా?

ముందుగా రాజశేఖర్ రావు వాదనలు వినిపిస్తూ.. 'తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు రాజకీయ ప్రకటన చేశారు. అయితే టీటీడీ ఈవో ఆ నెయ్యిని అసలు లడ్డూ తయారీలో ఉపయోగించలేదని పత్రికా ముఖంగా చెప్పారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న ముఖ్యమంత్రి లాంటి వ్యక్తులు ఎలాంటి ఆధారాలు లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రకటనలు చేస్తే దాని పర్యవసానాలు దారుణంగా ఉంటాయి. అవి ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. సీఎం ప్రకటనకు భిన్నంగా టీటీడీ ఈవో ప్రకటనలు ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై పర్యవేక్షణతో కూడిన విచారణ అవసరం. ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో దర్యాప్తు నిష్పాక్షిక, పారదర్శక దర్యాప్తు సాధ్యమేనా? ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ జోక్యాన్ని నిలువరించాలి. మా వ్యాజ్యంలో పలు కీలక ప్రశ్నలను వ్యక్తం చేశాం' అని నివేదించారు.

ఆ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదు...

అనంతరం ఏపీ ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ఈ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని సమర్థించేందుకే ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. స్వామి, వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాల్లోని అంశాలు ఒకే రకంగా ఉన్నాయన్నారు. నెయ్యి సరఫరాదారులకు టీటీడీ షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి దర్యాప్తు చేస్తోందని తెలిపారు. అనంతరం టీటీడీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ కల్తీ నెయ్యిని పరీక్షల నిమిత్తం ప్రఖ్యాత ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపామన్నారు. జూన్ నుంచి జూలై 4 వరకు సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లను ఎన్‌డీడీబీకి పంపలేదన్నారు. జూలై 6, జూలై 12న సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లనే ఎన్‌డీడీబీకి పంపామని లూథ్రా వెల్లడించారు.

నివేదిక జూలైలో వస్తే సీఎం సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడారు..?

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ప్రశ్నల వర్షం కురిపించింది. ఎన్‌డీడీబీ నివేదిక జూలైలో వస్తే ముఖ్యమంత్రి సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడినట్లని ప్రశ్నించింది. జూలైలో వచ్చిన నివేదికపై అప్పుడే ఎందుకు మాట్లాడలేదు? ఈ వ్యవహారంలో ప్రెస్ ముందుకెళ్లాల్సిన అవసరం ఏముంది? ముఖ్యమంత్రి స్వయంగా దర్యాప్తునకు ఆదేశించినప్పుడు మళ్లీ ప్రెస్ ముందుకు వెళ్లడం ఏమిటి? నెయ్యిలో జంతు కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. అసలు ఈ ప్రకటన చేయడానికి ఆయన వద్ద ఉన్న ఆధారాలు ఏమిటి? లడ్డూల తయారీలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని చెబుతున్నప్పుడు ఆ లడ్డూలను పరీక్షల నిమిత్తం ఎందుకు పంపలేదు? ప్రెస్ ముందుకు వెళ్లే ముందు లడ్డూలను పరీక్షించడం సరైనదని మీరు (సీఎం) భావించలేదా? జంతు కొవ్వు వాడారంటూ చేసిన ప్రకటన కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని తెలియదా? ప్రెస్ ముందుకెళ్లి ప్రకటనలు ఎందుకు చేయాలి? దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి. లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారనేందుకు ప్రస్తుతం ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. దర్యాప్తు జరుగుతుండగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు అలాంటి ప్రకటనలు చేయవచ్చా? దాని వల్ల సిట్ దర్యాప్తు ప్రభావితం కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

స్థానికతపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి

వైద్యవిద్యలో ప్రవేశాలపై సుప్రీం స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: స్థానికత వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని దేశ సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. అందుకు తగ్గ నిబంధనలను రూపొందించే హక్కు రాష్ట్రాలకే ఉందని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నీట్‌కు ముందు 4 సంవత్సరాలు స్థానికంగా చదివి ఉండాలని స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు విచారించిన కోర్టు.. దీనికి సంబంధించి మార్గదర్శకాలు రూపొందించి, ఆ మేరకు కోటా వర్తింపజేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో సవాల్ చేసింది. ఇటీవలి విచారణ సందర్భంగా.. కౌన్సెలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కారణంగా ఈ ఒక్కసారికి విద్యార్థులకు మినహాయింపు ఇస్తున్నామని తెలిపింది. కేవలం హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులను మాత్రమే కౌన్సెలింగ్‌కు అనుతించడం సరికాదని విద్యార్థుల తరపు న్యాయవాదులు సెప్టెంబర్ 27న సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం..అందరికీ స్థానికతపై లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతూ, తదుపరి విచారణను అక్టోబర్ 3కు వాయిదా వేసింది.

మాఫీ కాని రైతులు 5 లక్షల మంది!

రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాని వారిపై గ్రామాల్లో సర్వే పూర్తి

సర్కారుకు వ్యవసాయశాఖ నివేదిక.. రూ.2 లక్షలకు పైగా రుణం మాఫీపై కొరవడిన స్పష్టత

సాక్షి, హైదరాబాద్: మూడు విడతల్లో కూడా రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరించారు. రేషన్‌కార్డు లేకపోవడంతో 4 లక్షల మందికి పైగా రైతులకు మాఫీ కాలేదని గుర్తించారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్ల పేర్లలో తప్పుల వల్ల మాఫీ కాని మరో లక్ష మందిని కూడా నిర్ధారించారు. మొత్తం 5 లక్షల వరకు అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే వారి అకౌంట్లలో రుణమాఫీ సొమ్మును జమ చేస్తామని ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. అయితే ఎప్పుడు మాఫీ జరుగుతుందనే దానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. తాము వివరాలు సేకరించి నివేదిక ఇచ్చామని.. ప్రభుత్వం నిధులు ఎప్పుడు జమ చేస్తుందో తమకు తెలియదని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

మాఫీ జరగని అర్హులైన రైతుల గుర్తింపు

తెలంగాణలో భూమి ఉన్న ప్రతి రైతు రైతు కుటుంబం రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీకి అర్హులు. ఈ మేరకు ఇప్పటివరకు మూడు విడతల్లో ప్రభుత్వం రుణాలు మాఫీ చేసింది. సుమారు 22 లక్షల ఖాతాలకు సంబంధించిన రుణ బకాయి మాఫీ అయింది. అయితే ప్రభుత్వం రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తామని తొలుత చెప్పింది. కానీ కేవలం రూ.18 వేల కోట్ల లోపే మాఫీ అయిన సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరగని రైతుల కుటుంబాలకు సంబంధించి వ్యవసాయశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. అనంతరం రేషన్ కార్డు లేకపోవడం, ఆధార్.. బ్యాంక్ అకౌంట్లలో తప్పిదాలు, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. రుణమాఫీకి అర్హులైన 5 లక్షల మంది రైతులను గుర్తించారు.



అన్ని వివరాలూ అప్‌లోడ్

రైతు ఇంటిని సందర్శించి, రైతు వెల్లడించిన కుటుంబ సభ్యుల వివరాలను ఆధార్ నంబర్‌తో సహా సేకరించారు. కుటుంబ పెద్దతో ఫొటో తీసుకున్నారు. రైతుల నుంచి అఫిడవిట్లు తీసుకున్నారు. ఆ అఫిడవిట్లను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. డేటా సేకరణ సమయంలో అందుబాటులో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు రుణం పొందిన రైతుతో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని అన్ని బ్యాంకు బ్రాంచీల వారీగా కుటుంబ సభ్యులను నిర్ధారించి రుణం పొందిన రైతుల జాబితా ప్రదర్శించినట్లు చెప్పారు. రుణం పొందిన రైతు జీవిత భాగస్వామి వివరాలను కూడా నమోదు చేశామని చెబుతున్నారు. ఇదిలావుండగా, రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులకు మాఫీపై మాత్రం వ్యవసాయశాఖ అధికారులు స్పష్టత ఇవ్వడంలేదు. వీరికి సంబంధించిన వివరాలనూ వారు సేకరించలేదు. దీంతో ఆయా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



నైరుతి మురిపించెన్

- జూన్–సెప్టెంబర్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- సగటు వర్షపాతం 73.8 సెం.మీ. కాగా కురిసింది 96.26 సెం.మీ.
- ఈ సీజన్‌లో 30%.. గతేడాదితో పోలిస్తే 12% అధికం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మురిపించాయి. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షాలు కురిశాయి. నైరుతి సీజన్‌లో రాష్ట్రంలో సగటున 73.86 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా సీజన్ ముగిసే నాటికి 96.26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళికా విభాగం పేర్కొంది. ఈ మేరకు గణాంకాలు విడుదల చేసింది. ఈ గణాంకాల ప్రకారం ఈ సీజన్ సాధారణ వర్షపాతం కంటే 30 శాతం అధికంగా వర్షం కురిసింది. గతేడాది గణాంకాలతో పోలిస్తే ఈ ఏడా ది 12 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. ఆగస్టు మినహా జూన్, జూలై, సెప్టెంబర్‌లో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదైంది. దీంతో ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి, పత్తి పంటలు సాగైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా...

ఈ ఏడాది నైరుతి సీజన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా వర్షాలు కురిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో వర్షపాతం గణాంకాలను పరిశీలిస్తే 5 జిల్లాల్లో అత్యధిక వర్షాలు నమోదవగా 20 జిల్లాల్లో అధికం, 8 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గతేడాది 4–5 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదవగా ఈసారి ఒక్క జిల్లాలోనూ లోటు వర్షపాతం నమోదు కాలేదు. మండలాలవారీగా పరిశీలిస్తే... 100 మండలాల్లో అత్యధిక, 291 మండలాల్లో అధిక, 216 మండలాల్లో సాధారణ వర్షపాతం రికార్డయింది. కేవలం 5 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లు రాష్ట్ర ప్రణాళిక విభాగం పేర్కొంది.

అత్యధికం: నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్

అధికం: మహబూబాబాద్, సిద్దిపేట, వికారాబాద్, ఖమ్మం, ములుగు, సూర్యాపేట, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మెదక్, జగిత్యాల, నిర్మల్, మేడ్చల్–మల్కాజిగిరి, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి

సాధారణం: పెద్దపల్లి, యాదాద్రి భువనగిరి, కుమురం భీం ఆసిఫాబాద్, హనుమకొండ, కామారెడ్డి, జనగామ, ఆదిలాబాద్, మంచిర్యాల

నైరుతి సీజన్ వర్షపాతం సాధారణం, నమోదు వివరాలు (సెం.మీ.లలో)...

నెల	సాధారణం	నమోదు	గతేడాది
జూన్	12.94	15.90	7.26
జూలై	22.91	29.48	49.00
ఆగస్టు	21.74	20.99	7.99
సెప్టెంబర్	16.28	29.89	21.85
మొత్తం	73.86	96.26	86.10

రూ.2 వేల కోట్లే రికవరీ!

- మిల్లర్ల నుంచి ధాన్యం రికవరీకి సర్కారు తిప్పలు
- మిల్లుల్లో ధాన్యం లేకపోవడంతో డబ్బులు వసూలు చేస్తున్న ఏజెన్సీలు
- గడువు ముగిసినా రికవరీ కాని రూ.5 వేల కోట్ల ధాన్యం సొమ్ము
- 2022–23 రబీకి చెందిన ధాన్యం మిల్లర్లు అమ్ముకున్నారనే ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్

మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ చేయని రూ.7 వేల కోట్ల విలువైన 35 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యాన్ని రికవరీ చేసేందుకు సర్కారు నానా తిప్పలు పడుతోంది. 2022–23 రబీ సీజన్‌కు చెందిన ఈ ధాన్యాన్ని రికవరీ చేసేందుకు గ్లోబల్ టెండర్ల ద్వారా ఏజెన్సీలను పిలిచినా ఫలితం కనిపించడం లేదు. 35 ఎల్ఎంటీల ధాన్యానికి గాను 9 నెలల్లో కేవలం 10 ఎల్ఎంటీల ధాన్యం మాత్రమే రికవరీ అయినట్లు కాంట్రాక్టు సంస్థలు చూపిస్తున్నాయి. వాస్తవానికి రెండేళ్ల కిందటి ధాన్యం చాలా మిల్లుల్లో లేకపోవడంతో, రికవరీ ఏజెన్సీ సంస్థలు క్వింటాలుకు రూ.2,230 చొప్పున మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం సెప్టెంబర్ నెలాఖరు లోపు రికవరీకి గడువు విధించగా, ఇప్పటివరకు వచ్చిన మొత్తం రూ.2 వేల కోట్లేనని ఓ అధికారి తెలిపారు.

సీఎంఆర్ ఇవ్వకుండా ధాన్యం అమ్మివేత?

2022–23 రబీ సీజన్‌లో ఏకంగా 35 ఎల్ఎంటీల ధాన్యాన్ని మిల్లింగ్ చేయలేమని చేతులెత్తేసిన మిల్లర్లు.. ఆ ధాన్యాన్ని అమ్మేసుకున్నారనే ఆరోపణలున్నాయి. మిల్లింగ్ చేయకపోతే ధాన్యం మిల్లుల్లోనే నిల్వ ఉండాలి. కానీ విజిలెన్స్ తనఖీల్లో 80 శాతం మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేవని తేలింది. అయినప్పటికీ ధాన్యం రికవరీ చేసేందుకంటూ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈ మేరకు ఏజెన్సీలు క్వింటాలుకు రూ.2007 చొప్పున ప్రభుత్వానికి ఇచ్చేందుకు కాంట్రాక్టు పొందినప్పటికీ.. మిల్లుల నుంచి మాత్రం క్వింటాలు ధాన్యానికి రూ.2,230 వసూలు చేస్తున్నాయి. అయితే కొన్నిచోట్ల మిల్లర్లు ధాన్యం ఇస్తామన్నా తీసుకోకుండా కాంట్రాక్టు సంస్థలు డబ్బులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇప్పటివరకు 10 ఎల్ఎంటీల ధాన్యానికి సంబంధించి రూ.2 వేల కోట్ల వరకు వసూలైనట్లు తెలుస్తుండగా.. మిగతా 25 ఎల్ఎంటీల ధాన్యం విలువకు సమానమైన రూ. 5 వేల కోట్లు రికవరీ కావలసి ఉంది.

తమిళనాడు, దుబాయిలకు ఎగుమతి!

ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ (సీఎంఆర్) చేయకుండా మిల్లర్లు దేశ, విదేశాల్లో అమ్ముకున్నారని ఇటీవలి కొన్ని సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, మెదక్, నిజామాబాద్ జిల్లాల రైస్ మిల్లర్లు ధాన్యాన్ని పారా బాయిల్డ్ రైస్‌గా మిల్లింగ్ చేసి తమిళనాడు రాష్ట్రంలో విక్రయించినట్లు ఇటీవల ప్రభుత్వం గుర్తించింది. వరంగల్ జిల్లాకు చెందిన మణికంఠ కన్వేయర్స్ ద్వారా రైల్వే వ్యాగన్లలో ఆయా జిల్లాల నుంచి బియ్యం తరలించినట్లు విజిలెన్స్ విభాగం గుర్తించి మిల్లులకు నోటీసులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లా పెద్దపల్లి మిల్లర్లు ఈ అక్రమ దందాకు ప్రధాన సూత్రధారులుగా తేలింది. అలాగే తాజాగా ప్రభుత్వం కళ్లు కప్పి 40 కంటైనర్ల ద్వారా దుబాయికి ఎగుమతి చేస్తున్న రూ.7 కోట్ల విలువైన పారాబాయిల్డ్ రైస్‌ను గుజరాత్‌లో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు సీజ్ చేశారు. 20 శాతం పన్ను చెల్లింపు నుంచి తప్పించుకోవడానికి బాస్మతి ముసుగులో ఉప్పుడు బియ్యాన్ని ఎగుమతి చేసింది హైదరాబాద్‌కు చెందిన వ్యక్తే కావడం గమనార్హం.

ప్రతి సీజన్‌లోనూ సీఎంఆర్‌పై నిర్లక్ష్యమే

2022–23 యాసంగి సీజన్లో 65 ఎల్ఎంటీల ధాన్యాన్ని ప్రభుత్వం సీఎంఆర్ కోసం మిల్లులకు అప్పగించింది. ఇందులో సుమారు 20 ఎల్ఎంటీల వరకు పారాబాయిల్డ్ రైస్‌నే ఎఫ్‌సీఐకి అప్పగించారు. మిగతా ధాన్యాన్ని రా రైస్‌గా మిల్లింగ్ చేయలేమని మొండికేశారు. ఇదేవిధంగా 2018– 19 నుంచి 2022–23 వరకు ఏ సంవత్సరంలో కూడా ధాన్యం సీఎంఆర్ పూర్తిస్థాయిలో కాకపోవడం గమనార్హం.



తాత్కాలిక డీజీపీల నియామకంపై

తెలుగు రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ : తాత్కాలిక డీజీపీల నియామకంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఏడు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. దేశంలోని కొన్ని రాష్ట్రాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమిస్తున్నాయని ఈ ఏడాది ఆగస్టు 8న సావిత్రి పాండే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలకు తాత్కాలిక డీజీపీలు మాత్రమే ఉన్నారని పిటిషన్‌లో స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఏడు రాష్ట్రాలతో పాటు కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆరువారాల్లో అఫిడవిట్లు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 19 వరకు వాయిదా వేసింది.

బాలీవుడ్‌లో తెల్లరంగు హీరోల మధ్య మొదటిసారి ఒక నల్లరంగు హీరో జెండా ఎగరేశాడు. పంజాబీ హీరోల మధ్య మొదటిసారి ఒక బెంగాలీ సూపర్‌స్టార్ అవతరించాడు. దక్షిణాదిలో కమల్ హాసన్, చిరంజీవి డాన్స్‌ను అట్రాక్షన్‌గా పూర్తిగా మలచక ముందే 'డిస్కో డాన్సర్'తో మిథున్ చక్రవర్తి డాన్సింగ్ సూపర్‌స్టార్ అయ్యాడు. వెండితెర మెరుపులను పూర్తిగా నమ్మక 'మోనార్క్' బ్రాండ్‌తో హోటెలింగ్ సామ్రాజ్యాన్ని నిర్మించి స్థిరపడ్డాడు. ఇండస్ట్రీకి అతను 'మిథున్‌దా'! దాదాకు దాదాసాహెబ్ ఫాల్కే!!

దాదాకు ఫాల్కే


మిథున్ చక్రవర్తి

నటించిన తొలి సినిమాకే నేషనల్ అవార్డు వస్తుందా ఎవరికైనా?

మిథున్ చక్రవర్తికి వచ్చింది.

మృణాల్‌సేన్ దర్శకత్వంలో మిథున్ నటించిన బెంగాలీ చిత్రం 'మృగయా' (1976) అతనికి ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు తెచ్చి పెట్టింది. అందులో అతను నేర విచారణను ఎదుర్కొనే అమాయక గిరిజనుడిగా నటించాడు. ఈ అవార్డు అందుకోవడానికి ఢిల్లీ వెళ్లిన మిథున్, అవార్డు అందుకున్నాక బయటకు రాగానే జర్నలిస్టులు చుట్టుముట్టి ఇంటర్వ్యూ అడిగారు. 'ఇస్తాను.. ఇస్తాను.. ముందు నాకు భోజనం పెట్టించండి' అన్నాడు మిథున్.

జేబులో రూపాయి దారి ఖర్చులు లేని పేదరికం అతడి చేతి అవార్డు కంటే ఆకలి తీరడమే ముఖ్యమనిపించింది.

•••

మిథున్ చక్రవర్తికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. మిథున్ ఇప్పుడు వందల కోట్ల ఆస్తి కలిగిన వాడు. కాని అతను పుట్టిన ఇల్లు ఎలా ఉంటుంది అని నార్త్ కోల్‌కతాలో ఇప్పటికీ అలాగే ఉన్న ఆ ఇంటిని రెండో కొడుకు ఉష్మయ్ చక్రవర్తి సందర్శించాడు. 'ఇంటి వాకిలి లోనే మురుగునీటి కాలువ ఉంది. దానిని దాటి లోపలికి వెళితే ఆయన పెరిగిన ఇంట్లో కనీసం సూర్యకాంతి రావడం లేదు. ఈ చీకటి కొట్టం నుంచి వచ్చిన మా నాన్న అంత పెద్ద స్వప్నాన్ని కన్నాడా అని ఆయన పట్ల నా గౌరవం వంద రెట్లు పెరిగింది' అన్నాడతను.

•••

మిథున్ చక్రవర్తి అసలు పేరు వేరు. అదేంటనేది మనకు అక్కర్లేదు. కాని అతను కాలేజీ రోజుల్లో రాడికల్ స్టూడెంట్‌గా మారాడు. ఆ సమయంలో నక్సలైట్ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఈ ఉద్యమంలోనే అతడి సొంత తమ్ముణ్ణి పోగొట్టుకున్నాడు. ఇక కోల్‌కతాలో ఉండేందుకు ఏ మాత్రం వీలు లేని పరిస్థితి వచ్చింది. ఉద్యమంలో ఉన్నప్పుడు మిథున్ చక్రవర్తి వీధి నాటకాలు హుషారుగా వేసేవాడు. అది గమనించిన ఒక మిత్రుడు నువ్వు దాక్కున్నట్టు ఉంటుంది, నటన నేర్చుకున్నట్టు ఉంటుంది అని పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించాడు. అక్కడే అతను సొంతపేరు దాచి మిథున్‌గా మారాడు. కోర్సు పూర్తయిన వెంటనే సినిమా కూడా దొరికింది. విడుదలైంది. నేషనల్ అవార్డు తెచ్చిపెట్టింది. ఇక దిగుల్లేదు... బాలీవుడ్‌లో బతికి పోవచ్చు అని ముంబై చేరుకున్నాడు మిథున్. అక్కడ అతి కర్కశమైన జీవితం అతడికి ఎదురుపడింది.

•••

'నలుపు నలుపు అనేరు నలుగురు నవ్వేరు నలుపు నారాయణమూర్తే గాదా' అనే పాట మనం పాడుకుంటాం గానీ బాలీవుడ్ వాళ్లు విని అర్థం చేసుకునే అవకాశం లేదు. బాలీవుడ్‌లో హీరోలంటే తెల్లరంగు పంజాబీవారు. అంతే! దక్షిణాదిలో బాలచందర్ ఎలాగో అప్పటికే రజనీకాంత్‌ను ప్రవేశపెట్టాడు కాని బాలీవుడ్‌లో నల్లరంగు హీరో అసాధ్యం. మిథున్ నల్లగా ఉంటాడు. పైగా హిందీ కూడా సరిగ్గా రాదు. దానికి తోడు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు ఒకటి తెచ్చుకున్నాడు. ఇక ఎవరు రానిస్తారు? తిన డానికి తిండి, ఉండటానికి గది ఏమీ లేని దారుణమైన రోజులు చూశాడు. చాలారోజులు పార్కుల్లో పడుకున్నాడు. ఒక స్నేహితుడు మాతుంగాలోని జిమ్‌ఖానాలో మెంబర్‌షిప్ ఇప్పిస్తే ఉదయాన్నే కాలకృత్యాల కోసం అక్కడకు వెళ్లేవాడు. మిగిలిన సమయం అంతా రోడ్డు మీదే. ప్రసిద్ధ దర్శకుడు మన్‌మోహన్ దేశాయ్ దగ్గరకు వెళితే ఆయన తన జేబులో ఉన్న పది రూపాయల నోటు ఇచ్చి పంపించేయడం ఇప్పటికీ చెప్పుకుంటారు. మరో దర్శకుడు 'ఇతను కనుక హీరో అయితే నేను ఇండస్ట్రీ వదిలేసి పోతాను' అని ముఖానే చెప్పాడు. 1980ల కాలం అది. అప్పటికే అమితాబ్ సూపర్‌స్టార్ అయ్యాడు. యువ ప్రేక్షకుల కోసం రిషి కపూర్ లాంటి వారు ఉన్నారు. నెపొటిజం ఉంది. ఏ తలాతోకా లేని మిథున్ ఎలా హీరో అవుతాడు?


'డిస్కో డాన్సర్'గా...

•••

కాని దేవుడు కూడా ఏదో ఒక వేళలో ఎదురు పడతాడు. ఈసారి దేవుడు బి.సుభాష్ అనే పేరుతో వచ్చాడు. 'నేను నీతో సినిమా తీస్తాను. దాని పేరు డిస్కో డాన్సర్' అన్నాడు బి.సుభాష్. అప్పటికే బప్పి లాహిరి కూడా ఇండస్ట్రీకి వచ్చి మంచి అవకాశం కోసం చూస్తున్నాడు. బి.సుభాష్, మిథున్, బప్పి లాహిరి కలిసి 'డిస్కో డాన్సర్' తయారు చేశారు. డిసెంబర్ నెల 1982లో విడుదల అయిన ఆ సినిమా దేశమంతా అగ్గి పుట్టించింది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ కుర్రకారు నుంచి గృహిణుల వరకూ అందరి నోటా 'ఐయామే డిస్కో డాన్సర్' పాటే. ఏ పెళ్లిలో కాలేజీ ఫంక్షన్‌లో చూసినా ఆ పాటే. రష్యాలో ఆ సినిమా 1000 ప్రింట్లతో విడుదలై సూపర్ హిట్ అయ్యింది. ఆ రోజుల్లో 100 కోట్లు సంపాదించిన తొలి సినిమా అది. ఇప్పటి లెక్కల ప్రకారం 1200 కోట్లు! మిథున్ ఇప్పుడు సూపర్‌స్టార్ అయ్యాడు. ఆ తర్వాత బి.సుభాష్‌తోనే తీసిన 'కసమ్ పైదా కర్నేవాలేకీ', 'డాన్స్ డాన్స్' కూడా భారీ హిట్లే. అమితాబ్, జితేంద్ర, శశి కపూర్, వినోద్ ఖన్నా అందరూ ఇప్పుడు మిథున్ వైపు కళ్లప్పగించి చూస్తున్నారు. అమితాబ్‌కు ప్రధాన పోటీదారు వచ్చినట్టే.

•••

మిథున్ చక్రవర్తి బాలీవుడ్‌లో మాస్ పాత్రలు పోషించినా బెంగాలీలో తనకు నచ్చిన పాత్రలు పోషిస్తూ అక్కడా తన ప్రాభవం కాపాడుకున్నాడు. 'స్వామి వివేకానంద' (1998)లో రామకృష్ణ పరమహంసగా నటిస్తే దానికి మళ్లీ నేషనల్ అవార్డ్ వచ్చింది. మరోవైపు ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా తీసిన 'ప్యార్ ఝుక్తా నహీ' (1985) సంవత్సరాల తరబడి ఆడింది. ఇది తెలుగులో కృష్ణ, శ్రీదేవిలతో 'పచ్చని కాపురం' పేరుతో రీమేక్ అయ్యింది. పద్మినీ కొల్హాపురి, రంజిత, శ్రీదేవిలతో మిథున్ చేసిన సినిమాలు ప్రేక్షకులకు హిట్ జోడీగా నచ్చాయి.

•••

మిథున్ చక్రవర్తి ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా హిట్ అయ్యాడు. అమితాబ్ 'అగ్నిపథ్'లో వేసిన అయ్యర్ పాత్ర అతడికి చాలా పేరు తెచ్చింది. మణిరత్నం తీసిన 'గురు'లో పత్రికాధిపతిగా (గోయెంకా) నటించి ఆశ్చర్యపరిచాడు. 'ఓ మైగాడ్' (గోపాల గోపాల)లో స్వామీజీగా వేసిన పాత్ర మిథున్‌లోని మరో పార్శ్వాన్ని చూపింది. టెలివిజన్ షోస్ చేస్తూ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ మిథున్ అనుక్షణం బిజీగా ఉండటానికి ప్రయత్నిస్తాడు.

•••

ప్రారంభాలు మర్చిపోనివాడి గమనం స్థిరంగా ఉంటుంది. ఒకరోజు ఊటీలో షూట్ జరుగుతుంటే అక్కడొక మురికి కాలువ పారుతూ ఉంది. పక్కన ఉన్న నటిని పిలిచి 'నా ఫ్లాష్‌బ్యాక్ చెప్పమని అడుగుతావుగా. ఇదే నా ఫ్లాష్‌బ్యాక్' అన్నాడతను ఆ కాలువ చూపుతూ.

మురుగు నీటి నుంచి వెలిసిన వెండితెర వేల్పు మిథున్.

కుప్పతొట్టిలో ఉన్న అమ్మాయిని కూతురిగా

1996 డిసెంబర్ 1న కోల్‌కతాలో న్యూస్ పేపర్ చదువుతున్న మిథున్‌కి ఒక వార్త కలుక్కుమనిపించింది. తన భార్య యోగితా బాలి (ఒకప్పటి హీరోయిన్)ని పిలిచి ఆ వార్త చూపించాడు. అందులో కుప్పతొట్టిలో ఎవరో ఆడపిల్లను వదిలేసి పోయారు అని ఉంది. భార్యాభర్తలు ఇద్దరూ ఒకరిని ఒకరు చూసుకున్నారు. బాధపడ్డారు. ఆ పాపను తెచ్చి పెంచుకోవాలని వెంటనే నిశ్చయించుకున్నారు. ఒక ఎన్.జి.ఓ ద్వారా ప్రయత్నిస్తే కుప్పతొట్టిలో ఉండటం వల్ల పాప చాలా సీరియస్ కండిషన్‌లో ఉందని చెప్పారు. అయినా సరే మిథున్, యోగితా ఆ పాపను తెచ్చుకుని కంటికి రెప్పలా కాపాడారు. చట్ట ప్రకారం దత్తత తీసుకున్నారు. దిశానీ చక్రవర్తి అని పేరు పెట్టారు. అమెరికాలో చదివించారు. మిథున్‌కు ఎంతో ప్రాణం ఈ కూతురు.



నవ్వలేను... సంతోషంతో ఏడవలేను

'దాదాసాహెబ్ వచ్చిందన్న వార్త నన్ను చేష్టలుడిగేలా చేసింది. నేను నవ్వలేను... ఆనందంతో ఏడ్వలేను. ఫుట్‌పాత్ నుంచి వచ్చిన నేను ఇక్కడ దాకా చేరుకున్నానంటే ఈ పురస్కార ప్రకటన నాలో ఇంకా రిజిస్టర్ అవ్వాల్సి ఉంది. ఒకటి మాత్రం నిజం. నేను ఈ అవార్డు పొందానంటే ప్రతిభ, అంకితభావం ఉన్న ఎవరైనా పొందవచ్చు' అన్నారు మిథున్ చక్రవర్తి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటన తర్వాత! కేంద్ర సమాచార, ప్రసార శాఖామంత్రి అశ్విని వైష్ణవ్ 'ఎక్స్' వేదికగా ఈ వార్తను సోమవారం ప్రకటించారు. దాదాసాహెబ్ పురస్కారం సందర్భంగా మిథున్ చక్రవర్తికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. మెగాస్టార్ చిరంజీవి కూడా శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

చీరకట్టు చిరాకేం కాదు... చక్కదనానికి కేరాఫ్ అడ్రస్ అని నిరూపిస్తూ బెంగళూరులో శారీరన్‌ను నిర్వహించింది టాటా కంపెనీ ఎత్నిక్‌వేర్ విభాగం తనైరా. 2,500 మంది మహిళలు పాలుపంచుకున్న ఈ శారీ రన్‌లో వయసు తారతమ్యాలేవీ లేకుండా రంగు రంగుల, రకరకాల చీరలు ధరించిన మహిళామణులు చీరకట్టులోని సొగసును, పొందికను చీరకట్టు అందాన్ని గర్వంగా, హుందాగా ప్రదర్శించారు. బెంగళూరుకు చెందిన టాటా కంపెనీ ఎత్నిక్ వేర్ విభాగం తనైరా, జేజే యాక్టివ్ సంస్థలు ఆదివారం సంయుక్తంగా ఈ శారీరన్ కార్యక్రమాన్ని నిర్వహించాయి. తనైరా సీఈవో అంబుజ్ నారాయణ్, జేజే యాక్టివ్ కోచ్

చీరకట్టు... పరుగు పెట్టు



ప్రమోద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబుజ్ నారాయణ్ మాట్లాడుతూ...'చీరను స్త్రీత్వానికి, స్త్రీసాధికారతకు ముఖ్యంగా భారతీయతకు బలమైన, చైతన్యవంతమైన భావనకు ప్రతీకగా తనైరా భావిస్తుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని చీరను డిజైన్ చేయడం మాకెంతో ఆసక్తిని, ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ శారీరన్ కార్యక్రమం కేవలం చీర, చీరకట్టు రమ్యతను గురించి తెలియజేసేందుకు మాత్రమే కాదు అధునిక జీవన విధానానికి అనుగుణంగా మా నిబద్ధతను పునర్నిర్వచించుకోవడం కోసం కూడా. సంప్రదాయ చీరకట్టులోనూ చైతన్యవంతంగా, చురుగ్గా కనిపించవచ్చుననీ, తమ అస్తిత్వాన్ని వదులుకోకుండానే మనసుకు నచ్చినట్లుగా కూడా జీవించవచ్చునన్న సందేశాన్ని వ్యాప్తి చేయాలన్నదే ఈ శారీరన్‌ను నిర్వహించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం. అలాగే చీరకట్టు అనేది సాంస్కృతిక వారసత్వానికి, శక్తి సామర్థ్యాలకు వెన్నుదన్ను అని మా విశ్వాసం, నమ్మకం కూడా.

చిన్న స్థాయిలో స్థానికంగా మొదలైన మా కార్యక్రమం నేడు జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారటం సంతోషంగా ఉంది'' అన్నారు అంబుజ్ నారాయణ్.

సాగుబడి
హస్త కార్తె
అక్టోబర్ 10 వరకు

మధుమేహ వ్యాధిని సమర్థవంతంగా కట్టడి చేసే సరికొత్త వరి వంగడం సిద్ధమైంది. ఫిలిప్పీన్స్ లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఆర్ఆర్ఐ-ఇరి) శాస్త్రవేత్తలు పదేళ్ళు శ్రమించి ఈ అధునాతన వరి వంగడాన్ని రూపొందించారు. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ బాగా తక్కువ. అంటే.. ఈ అన్నం తిన్న వెంటనే కాకుండా నెమ్మదిగా జీర్ణమవుతుంది. ప్రొటీన్లు కూడా సాధారణ వరి బియ్యంతో పోల్చితే రెట్టింపు స్థాయిలో ఉంటాయని ఇరి శాస్త్రవేత్తలు తాజాగా ప్రకటించారు. వరి బియ్యాన్ని ఎక్కువగా తినే ఆసియా, ఆఫ్రికా దేశాల ప్రజల ఆరోగ్యంపై ఈ వరి వంగడం గొప్ప ప్రభావాన్ని చూపుతుందని, డయాబెటిస్‌కు చెక్ చెప్పేందుకు ఉపకరిస్తుందని చెబుతున్నారు. దీని గురించి పనస్.ఓఆర్‌జిలో ఇటీవల ఓ వ్యాసం ప్రచురితమైంది.



కొత్త వరి బియ్యం.. కోరకున్నా ఆరోగ్యం!

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఎక్కువ ప్రొటీన్ ఉండే సరికొత్త రకం వరి బియ్యాన్ని రూపొందించిన 'ఇరి'



ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు రూపొందించిన సరికొత్త ఆరోగ్యదాయకమైన వరి బియ్యం ప్యాకెట్

ప్రపంచవ్యాప్తంగా 54 కోట్ల మంది షుగర్ వ్యాధితో సతమతమవుతున్నారు. 2045 నాటికి వీరి సంఖ్య 79 కోట్లకు పెరుగుతుందని అంచనాలున్నాయి. ఈ ఉపద్రవాన్ని దీటుగా ఎదుర్కోవటంతో పాటు అధిక దిగుబడిని కూడా ఇచ్చే విధంగా అత్యంత మెరుగైన వరి వంగడాన్ని రూపొందించామని ఇరి శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

లాస్ బనోస్ పట్టణంలోని ఇరి, అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ, జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ ఫిజియాలజీ, బల్గేరియాలోని సెంటర్ ఆఫ్ ప్లాంట్ సిస్టమ్స్ బయాలజీల సుదీర్ఘ సంయుక్త పరిశోధనల ఫలితంగా ఈ వండర్ వంగడం అందుబాటులోకి రానుంది.

ఇరి జన్యునిధిలోని 380 రకాల వరి విత్తనాల్లోని తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఎక్కువ ప్రొటీన్ ఉన్న జన్యువులున్న వరి రకాలను గుర్తించడానికి, వాటిని అధిక దిగుబడినిచ్చే సాంబ మసూరి, ఐఆర్ 36 రకాలతో కలిపి సరికొత్త ఆరోగ్యదాయక వరి వంగడాన్ని రూపొందించడానికి శాస్త్రవేత్తలు దశాబ్దకాలం పనిచేశారు. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ 44% ఉంది. ప్రొటీన్ 15.99 ఉంది. సాధారణ వరి బియ్యంలో ఇందులో సగం ప్రొటీన్ మాత్రమే ఉంటుందని ఇరి తెలిపింది. అధిక ప్రొటీన్ కలిగి ఉండటం వల్ల ఈ బియ్యపు అన్నం నెమ్మదిగా జీర్ణమవుతుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రణలో ఉంచడానికిది తోడ్పడుతుందని భావిస్తున్నారు.

ఈ పరిశోధనల్లో కీలక పాత్ర పోషించిన ఇరి ప్రధాన శాస్త్రవేత్త, గింజ నాణ్యత, పోషకాల కేంద్రం అధినేత డా. నెసె శ్రీనివాసులు తెలుగు వారు కావటం మరో విశేషం. 'సాక్షి సాగుబడి'కి ఇచ్చిన ఈ-ఇంటర్వ్యూలో ఆయన ఏమంటున్నారంటే.. 'మధుమేహంతో బాధపడుతున్న వారు, త్వరలో మధుమేహ రోగులుగా మారబోతున్న వారికి ఉపయోగపడటంతో పాటు.. డయాబెటిస్ విస్తరణను సమర్థవంతంగా నిలువరించడానికి దోహదం చేస్తుందన్న భావనతోనే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్, ఎక్కువ ప్రొటీన్ ఉండే ఆరోగ్యదాయకమైన వరి వంగడాన్ని రూపొందించాం'.

వరి అన్నం రోజూ తినే ఆసియా, ఆఫ్రికా వాసుల ఆరోగ్యంపై ఈ వరి రకం గొప్ప మార్పు తెస్తుందని ఆశిస్తున్నాం అన్నారాయన. ఈ కొత్త వరి రకం ఇప్పటి వరకు ఇరి ప్రయోగ క్షేత్రాల్లో మాత్రమే సాగు చేశారు. భారత్ వంటి దేశాల్లో దీన్ని త్వరలో సాగు చేయటం ద్వారా పేదరికాన్ని, ఆకలిని, అనారోగ్యాలను అధిగమించేందుకు దోహదపడాలని ఇరి లక్ష్యంగా పెట్టుకుందని డా. శ్రీనివాసులు వివరించారు.

అయితే, తెల్ల వరి బియ్యం కన్నా చక్కెర కలిసిన పానీయాలు, అతిగా ప్రాసెస్ చేసిన ఆహారోత్పత్తులే డయాబెటిస్ తామరతంపరగా వ్యాపించడానికి కారణమవుతున్నాయని నార్త్ కరోలిన యూనివర్సిటీ ప్రొఫెసర్, న్యూట్రిషనల్ ఎపిడెమియాలజిస్ట్ డా. లిండ్సే స్మిత్ టెయిలీ అంటున్నారు.

ఇప్పటికే డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు వరి బియ్యాన్ని తక్కువగా తిన్నంత మాత్రాన పిండిపదార్థాలు తక్కువగా తీసుకోగలుగుతారు. అయితే, దీని ద్వారా టైప్ 2 డయాబెటిస్ సంక్షోభాన్ని పరిష్కరించలేం అన్నారామె. శీతల పానీయాలు, అతిగా ప్రాసెస్ చేసిన చిరుతిండ్ల వాడకాన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు సుగర్ టాక్స్ విధించాలి. ఆరోగ్యదాయకమైన ఆహారోత్పత్తులను అందుబాటులోకి తేవటానికి, పంచదార ఉత్పత్తి, వాడకాన్ని ప్రోత్సహించే ప్రచారాన్ని తగ్గించడానికి కొన్ని ప్రత్యేక చట్టాలను రూపొందించి అమలు చేసినప్పుడే డయాబెటిస్ సంక్షోభాన్ని నివారించగలుగుతామని డా. లిండ్సే స్పష్టం చేశారు.

సాధారణ వరి రకాల్లో కన్నా ఎక్కువ ప్రొటీన్, అతి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండే ఈ జన్యువులను ఆసియా, ఆఫ్రికాలలో విస్తారంగా సాగవుతున్న వరి వంగడాలకు జోడించడానికి, భవిష్యత్తు బ్రీడింగ్ పరిశోధనల్లో చేర్చడానికి డా. శ్రీనివాసులు బృందం కృషి చేస్తుందని ఇరి డైరెక్టర్ జనరల్ డా. యోన్నె పింటొ అన్నారు. ఈ సరికొత్త వరి రకాల ద్వారా ఆహార భద్రత, పౌష్టికాహార లక్ష్యాల సాధనకు మార్గం సుగమం అవుతుందని ఆశిస్తున్నానన్నారు.

కొత్త విత్తనాలను భారత ప్రభుత్వానికి ఇస్తాం!

అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థలో మా శాస్త్రవేత్తల బృందం రూపొందించిన పోషకాలతో కూడిన వరి వంగడం వరి బియ్యం తినే దేశాల్లోని ప్రజలకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అతి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (45%). సాధారణ వరి బియ్యంలో కన్నా రెట్టింపు ప్రొటీన్ (14–16%) కలిగి ఉండటం దీని ప్రత్యేకత. జన్యుమార్పిడి చేయకుండా, సంప్రదాయ బ్రీడింగ్ పద్ధతుల్లోనే దీన్ని రూపొందించాం. షుగర్ ఉన్న వారికి ఉపయోగపడే పోషకాలతో కూడిన ఈ వరి బియ్యపు అన్నం గ్లూకోజ్‌ను క్రమ క్రమంగా విడుదల చేస్తుంది. అధిక ప్రొటీన్‌తో పాటు లైసిన్ వంటి అత్యంత అవసరమైన అమినో ఆసిడ్ ఇందులో ఉంది. సన్న రకం సాంబ మసూరి బియ్యం మాదిరిగా అన్నం నాణ్యంగా, పొడిపొడిలాడుతూ ఉంటుంది. హెక్టారుకు 6.2 టన్నుల దిగుబడి వస్తుంది. దీర్ఘకాలిక పంట కాదు. స్వల్పకాలిక – మధ్యస్థానికి మధ్యలో ఉంటుంది. మేం రూపొందించిన కొత్త వరి విత్తనాలను, పేరెంట్ లైన్స్‌ను భారత ప్రభుత్వానికి అందజేస్తాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ పంట అనువుగా ఉంటుంది.

– డా. నెసె శ్రీనివాసులు, ప్రధాన శాస్త్రవేత్త, గింజ నాణ్యత, పోషకాల కేంద్రం అధిపతి, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ, ఫిలిప్పీన్స్



నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

చిరుధాన్యాల అన్నం తినలేకపోతున్నారా?

వరి లాంటి 'చిరు' బియ్యం తింటారా?


అరికెల బియ్యం

విడుదలకు సిద్ధమైన ఐఐఎంఆర్ రూపొందించిన మిల్లెట్ రైస్ టెక్నాలజీ

హైదరాబాద్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) అచ్చం వరి బియ్యం లాగా అప్పటికప్పుడు వండుకు తినటానికి వీలయ్యేలా చిరుధాన్యాల బియ్యాన్ని తయారు చేసే టెక్నాలజీని రూపొందించింది. బోలెడన్ని పోషకాలు, ప్రొటీన్, డైటరీ ఫైబర్ కలిగిన రాగి, జొన్న, సజ్జ, కొర్ర, అరిక, సామ, ఊద, అండుకొర్ర తదితర 11 రకాల చిరుధాన్యాలను మన దేశంలో రైతులు సాగు చేస్తున్నప్పటికీ ప్రజలు వీటిని పెద్దగా తినటం లేదు. వరి బియ్యం వల్ల డయాబెటిస్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతుండటం వల్ల చిరుధాన్యాలు/సిరిధాన్యాలను తింటే ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిసినా.. వాటిని అన్నం వండుకొని తినలేకపోతున్న వారెందరో ఉన్నారు. అన్నం మెతుకులు తింటేనే తిన్నట్టు ఉంటుంది అనుకుంటూ ఉంటారు. వీరితో కూడా సులువుగా చిరుధాన్యాల అన్నం తినిపించాలని ఐఐఎంఆర్ లక్ష్యంగా పెట్టుకుంది. ఐఐఎంఆర్‌లోని న్యూట్రిహబ్ వరి బియ్యం వంటి చిరుధాన్యాల బియ్యాన్ని తయారు చేసే సాంకేతికతను అభివృద్ధి చేసింది. డాక్టర్ బి. దయాకర్‌రావు సారథ్యంలోని న్యూట్రిహబ్ అభివృద్ధి చేసిన 70 సాంకేతికతల్లో అనలాగ్ రైస్ టెక్నాలజీ ఒకటి.


చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి రైస్ ప్యాకెట్‌తో ఐఐఎంఆర్ డైరెక్టర్ డా. తార సత్యావతి

చిరుధాన్యాలను పిండి చేసి, ఆ పిండిని తిరిగి వరి బియ్యం రూపంలోకి మార్చటమే ఈ టెక్నాలజీ ప్రత్యేకత. చిరుధాన్యాల్లో ఉన్న పోషకాలు, ప్రొటీన్లు, డైటరీ ఫైబర్ అన్నీ అలాగే ఉంచుతూ.. ఏ రకానికి ఆ రకం 'అనలాగ్ రైస్'ను తయారు చేస్తున్నట్లు ఐఐఎంఆర్ గత ఏడాదే ప్రకటించింది. అయితే, నిల్వ సామర్థ్యం వంటి సమస్యలపై ప్రయోగాలు కొనసాగాయి. అన్ని రకాల ప్రయోగాలను పూర్తిచేసుకున్న మిల్లెట్ అనలాగ్ రైస్ టెక్నాలజీ విడుదలకు సిద్ధమైంది.



ఈ ఏడాది అక్టోబర్ 17,18 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ న్యూట్రిసిరియల్ కాంక్లేవ్ 6.0లో ఈ టెక్నాలజీని అధికారికంగా విడుదల చేస్తామని ఐఐఎంఆర్ డైరెక్టర్ డా. సి. తార సత్యావతి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఆ తర్వాత నుంచి ఈ టెక్నాలజీని ఫీజు చెల్లించిన ఆహార కంపెనీలు, సంస్థలకు ఐఐఎంఆర్ బదలాయిస్తుంది. కాబట్టి, 2025లో మిల్లెట్ రైస్ మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తుందని చెప్పొచ్చు.

పాలేకర్ పది రోజుల శిక్షణపై అవగాహన సదస్సులు


డా. సుభాష్ పాలేకర్

సుభాష్ పాలేకర్ కృషి (ఎస్.పి.కె.) పద్ధతిపై 2025 ఫిబ్రవరిలో హైదరాబాద్ సమీపంలో 10 వేల మంది రైతులకు 10 రోజుల పాటు పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. సుభాష్ పాలేకర్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరంపై అవగాహన కల్పించేందుకు ఉత్తరాంధ్రలో 3 సదస్సులు జరగనున్నాయి. అక్టోబర్ 3న ఉ. 9.30కు శ్రీకాకుళం పి.ఎస్.కాలనీలోని నారాయణ తిరుమలలో (వివరాలకు.. 86394 56848).. 4న ఉ. 9.30కు విజయనగరం జిల్లా బొబ్బిలిలోని కోట దగ్గర శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో (వివరాలకు.. 99590 04530).. 5న ఉ. 9.30కు విశాఖ జిల్లా సింహాచలం కృష్ణాపురంలోని శ్రీ సింహాచల దేవస్థానం వారి కొత్త గోశాల (వివరాలకు.. 92466 27567)లో జరిగే సదస్సుల్లో సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారు.

4,5,6 తేదీల్లో తిరుపడి సిరి సంత

అక్టోబర్ 4,5,6 తేదీల్లో తిరుపతిలోని తీర్థకట్ట వీధిలోని త్యాగరాజ మండపంలో 9వ నెలవారీ తిరుపతి చేనేత / ఆర్గానిక్ మేళా 'తిరుపడి సిరి సంత'ను 'కనెక్ట్ 2 ఫార్మర్' సంస్థ నిర్వహించనుంది. వివరాలకు.. 84650 52294, 77997 73638.



రవీంద్ర జడేజా @300

భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు క్రికెట్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. ఈ మ్యాచ్‌తో అతను 300 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన ఏడో బౌలర్‌గా అతను నిలిచాడు. కుంబ్లే (619), అశ్విన్ (526), కపిల్ (434), హర్భజన్ (417), జహీర్ (311), ఇషాంత్ (311) అతనికంటే ముందున్నారు. టెస్టుల్లో కనీసం 3 వేల పరుగులు తీసి 300 వికెట్లు పడగొట్టిన 11 మంది అరుదైన ఆటగాళ్లలో అతనూ భాగమయ్యాడు. ఈ జాబితాలో బ్రాడ్, వార్న్, కపిల్, వెటోరీ, వాస్, పొలాక్, అశ్విన్, బోథమ్, ఇమ్రాన్, హ్యాడ్లీ ఉన్నారు. 74వ టెస్టులో ఈ ఘనత సాధించిన జడేజా వేగంగా దీనిని అందుకున్న వారిలో బోథమ్ (72) తర్వాత రెండో స్థానంలో నిలవడం విశేషం. 'భారత్ తరఫున ఎలాంటి ఘనత సాధించినా అది ఎంతో ప్రత్యేకం. చాలా సంతోషంగా అనిపిస్తోంది. ఇన్నేళ్లుగా టెస్టులు ఆడుతూ ఎట్టకేలకు ఇప్పుడు ఈ మైలురాయిని చేరుకున్నాను. ఇంత కాలం బాగా ఆడానని గర్వంగా చెప్పగలను. ఈ ఘనతను ఎప్పటికీ మర్చిపోలేను. కెరీర్ ఆరంభంలో పరిమిత ఓవర్ల ఫార్మాట్ ఆటగాడిగానే అంతా చూశారు. కానీ ఎర్రబంతితో ఎంతో సాధన చేసి ఆటను మెరుగుపర్చుకున్నాను. నా కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది' అని జడేజా వ్యాఖ్యానించాడు.

విజయం వేటలో... మెరుపు వేగంతో...

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285/9 డిక్లేర్డ్

8.22 రన్‌రేట్‌తో పరుగులు సాధించిన జట్టు

టీమిండియాకు 52 పరుగుల ఆధిక్యం

రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 26/2


యశస్వి జైస్వాల్

తొలి మూడు రోజుల ఆటలో రెండు రోజులు ఒక్క బంతి కూడా పడలేదు. మొదటి రోజు కూడా 35 ఓవర్లకే ఆట పరిమితమైంది. ఇలాంటి స్థితిలో మిగిలిన రెండు రోజుల్లో 'డ్రా'కే అవకాశం తప్ప మరో ఫలితం వస్తుందా అని సోమవారం ఉదయం అంతా ఊహించారు. కానీ భారత జట్టు మాత్రం భిన్నంగా ఆలోచించింది. మ్యాచ్‌లో ఆధిక్యం ప్రదర్శించి విజయంపై గురి పెట్టాలంటే అసాధారణంగా ఆడాలని నిశ్చయించుకుంది. బ్యాటర్లంతా ఒక్కసారిగా టి20 ఫార్మాట్‌కు మారిపోయారు. అంతే... 50, 100, 150, 200, 250... ఇలా అన్ని పరుగుల మైలురాళ్లను వేగంగా, తక్కువ బంతుల్లో అధిగమించిన జట్టుగా టీమిండియా చరిత్ర సృష్టించింది. రోహిత్‌తో మొదలు పెట్టి జైస్వాల్, గిల్, కోహ్లి, రాహుల్ ధాటిగా ఆడటంతో ఏకంగా 8.22 రన్‌రేట్‌తో భారీగా పరుగులు, ఆపై ఆధిక్యం కూడా వచ్చేశాయి. అనంతరం 45 నిమిషాల్లోనే బంగ్లాదేశ్‌ను ఒత్తిడిలోకి నెట్టి రెండు వికెట్లతో పైచేయి సాధించింది. చివరి రోజు బంగ్లా పోరాడుతుందా లేక భారత్ ఇదే ఊపులో మ్యాచ్ గెలిచేస్తుందా చూడాలి.

కాన్పూర్: వర్షంతో వృథా అయిన సమయాన్ని మర్చిపోయేలా గ్రీన్‌పార్క్ స్టేడియంలో భారత జట్టు అభిమానులకు ఒక్క రోజులో పూర్తి స్థాయిలో వినోదాన్ని అందించింది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మెరుపు బ్యాటింగ్‌తో జట్టు సత్తా చాటింది. సోమవారం భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 34.4 ఓవర్లలో 9 వికెట్లకు 285 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఫలితంగా భారత్‌కు 52 పరుగుల ఆధిక్యం లభించింది. యశస్వి జైస్వాల్ (51 బంతుల్లో 72; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (43 బంతుల్లో 68; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) విరాట్ కోహ్లి (35 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (36 బంతుల్లో 39; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిని ప్రదర్శించగా... షకీబ్, మిరాజ్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 2 వికెట్లకు 26 పరుగులు చేసింది. ఆ జట్టు మరో 26 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఉదయం 107/3తో ఆట కొనసాగించిన బంగ్లా తమ తొలి ఇన్నింగ్స్‌లో 74.2 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటైంది. మోమినుల్ హక్ (107 నాటౌట్; 17 ఫోర్లు, 1 సిక్స్) కీలక సెంచరీ సాధించారు. సోమవారం ఒక్కరోజే 18 వికెట్లు నేలకూలడం విశేషం.

మోమినుల్ మినహా...

రెండు రోజుల పాటు మైదానానికి దూరంగా ఉన్న తర్వాత ఎట్టకేలకు 107/3 స్కోరుతో బంగ్లాదేశ్ తమ ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. సోమవారం మరో 39.2 ఓవర్లు ఆడిన జట్టు మరో 126 పరుగులు జోడించి మిగిలిన 7 వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్లు ఆరంభం నుంచే ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ముష్ఫికర్ (11)ను బౌల్డ్ చేసి బంగ్లా పతనానికి బుమ్రా శ్రీకారం చుట్టాడు. బుమ్రా తర్వాతి ఓవర్లో దాస్ మూడు ఫోర్లు కొట్టి జోరు ప్రదర్శించినా... రోహిత్ అద్భుత క్యాచ్‌తో అతని ఇన్నింగ్స్ ముగిసింది. మరో ఎండ్‌లో మోమినుల్ మాత్రం పట్టుదలగా నిలబడి పరుగులు సాధించాడు. కొద్ది సేపటికే సిరాజ్ అసాధారణ క్యాచ్ షకీబ్ (9)ను పెవిలియన్ పంపించింది. 93, 95 పరుగుల వద్ద పంత్, కోహ్లి క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన మోమినుల్ ఆ తర్వాత కెరీర్‌లో 13వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. లంచ్ విరామం తర్వాత మిగిలిన 4 వికెట్లను పడగొట్టేందుకు భారత్ కు ఎక్కువ సమయం పట్టలేదు. ఖాలెద్‌ను అవుట్ చేసి జడేజా తన ఖాతాలో 300వ వికెట్‌ను వేసుకున్నాడు.


మోమినుల్



4 మూడు ఫార్మాట్‌లో కలిపి అంతర్జాతీయ క్రికెట్‌లో 27 వేల పరుగులు పూర్తి చేసుకున్న నాలుగో ఆటగాడిగా విరాట్ కోహ్లి నిలిచాడు. సచిన్ (34,357), సంగక్కర (28,016), రికీ పాంటింగ్ (27,483) ఈ జాబితాలో అతనికంటే ముందున్నారు. కోహ్లి ప్రస్తుతం 27,012 పరుగులు చేశాడు.

ధనాధన్...

దూకుడే మంత్రంగా భారత్ ఇన్నింగ్స్ సాగింది. మహమూద్ వేసిన తొలి ఓవర్లో జైస్వాల్ 3 వరుస ఫోర్లు బాదగా... ఖాలెద్ వేసిన తర్వాతి ఓవర్లో తాను ఎదుర్కొన్న తొలి రెండు బంతులను రోహిత్ శర్మ (11 బంతుల్లో 23; 1 ఫోర్, 3 సిక్స్‌లు) సిక్సర్లుగా మలిచాడు. అనంతరం మహమూద్ ఓవర్లో వీరిద్దరు 2 సిక్స్‌లు, 2 ఫోర్లతో 22 పరుగులు రాబట్టారు.

భారత్ రికార్డు స్కోరింగ్
50 పరుగులు - 3 ఓవర్లు
100 పరుగులు - 10.1 ఓవర్లు
150 పరుగులు - 18.2 ఓవర్లు
200 పరుగులు - 24.2 ఓవర్లు
250 పరుగులు - 30.1 ఓవర్లు

అయితే నాలుగో ఓవర్లోనే స్పిన్నర్ మిరాజ్ బౌలింగ్‌కు దిగి రోహిత్‌ను వెనక్కి పంపాడు. 31 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. మరో వైపు గిల్ కూడా కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. అయితే వేగంగా ఆడే క్రమంలో 32 పరుగుల వ్యవధిలో జైస్వాల్, గిల్, పంత్ (9) అవుటయ్యారు. ఈ దశలో కోహ్లి, రాహుల్ జోరు తగ్గకుండా బంగ్లా బౌలర్లపై ఆధిక్యం ప్రదర్శించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 59 బంతుల్లోనే 87 పరుగులు జోడించడం విశేషం. 33 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీని అందుకోగా, కోహ్లి ఆ అవకాశం చేజార్చుకున్నాడు. షకీబ్ ఓవర్లో రెండు వరుస సిక్సర్లతో ఆకాశ్‌దీప్ కూడా తానూ ఓ చేయి వేశాడు. 16 పరుగుల వ్యవధిలో తర్వాతి 4 వికెట్లు కోల్పోయిన తర్వాత భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం 11 ఓవర్లపాటు క్రీజ్‌లో బంగ్లా బ్యాటర్లు తడబడుతూనే ఆడారు. 7 ఓవర్లలో జట్టు 18 పరుగులు చేసింది. అయితే తర్వాతి ఓవర్ తొలి బంతికే జాకీర్ (10)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న అశ్విన్... తన తర్వాతి ఓవర్లో నైట్‌వాచ్‌మన్ మహమూద్ (4)ను బౌల్డ్ చేసి బంగ్లా ఆందోళనను మరింత పెంచాడు. అంతకుముందు 3 పరుగుల వద్ద షాద్‌మన్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో రాహుల్ వదిలేశాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: జాకీర్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్‌దీప్ 0; షాద్‌మన్ (ఎల్బీ) (బి) ఆకాశ్‌దీప్ 24; మోమినుల్ (నాటౌట్) 107; నజ్ముల్ (ఎల్బీ) (బి) అశ్విన్ 31; ముష్ఫికర్ (బి) బుమ్రా 11; లిటన్ దాస్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; షకీబ్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 9; మిరాజ్ (సి) గిల్ (బి) బుమ్రా 20; తైజుల్ (బి) బుమ్రా 5; మహమూద్ (ఎల్బీ) (బి) సిరాజ్ 1; ఖాలెద్ (సి అండ్ బి) జడేజా 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (74.2 ఓవర్లలో ఆలౌట్) 233. **వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-80, 4-112, 5-148, 6-170, 7-224, 8-230, 9-231, 10-233. **బౌలింగ్:** బుమ్రా 18-7-50-3, సిరాజ్ 17-2-57-2, అశ్విన్ 15-1-45-2, ఆకాశ్‌దీప్ 15-6-43-2, జడేజా 9.2-0-28-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) మహమూద్ 72; రోహిత్ (బి) మిరాజ్ 23; గిల్ (సి) మహమూద్ (బి) షకీబ్ 39; పంత్ (సి) మహమూద్ (బి) షకీబ్ 9; కోహ్లి (బి) షకీబ్ 47; రాహుల్ (స్టంప్డ్) దాస్ (బి) మిరాజ్ 68; జడేజా (సి) నజ్ముల్ (బి) మిరాజ్ 8; అశ్విన్ (బి) షకీబ్ 1; ఆకాశ్‌దీప్ (సి) ఖాలెద్ (బి) మిరాజ్ 12; బుమ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (34.4 ఓవర్లలో 9 వికెట్లకు డిక్లేర్డ్) 285. **వికెట్ల పతనం:** 1-55, 2-127, 3-141, 4-159, 5-246, 6-269, 7-272, 8-284, 9-285. **బౌలింగ్:** మహమూద్ 6-0-66-1, ఖాలెద్ 4-0-43-0, మిరాజ్ 6.4-0-41-4, తైజుల్ 7-0-54-0, షకీబ్ 11-0-78-4.

బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: షాద్‌మన్ (బ్యాటింగ్) 7; జాకీర్ (ఎల్బీ) (బి) అశ్విన్ 10; మహమూద్ (బి) అశ్విన్ 4; మోమినుల్ (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (11 ఓవర్లలో 2 వికెట్లకు) 26. **వికెట్ల పతనం:** 1-18, 2-26. **బౌలింగ్:** బుమ్రా 3-1-3-0, అశ్విన్ 5-2-14-2, ఆకాశ్‌దీప్ 3-2-4-0.


రాహుల్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, శంకర్, 'దిల్' రాజు, తమన్, అనంత శ్రీరామ్

నీలాంటివాడ్నే..!

''కళ్లజోడు తీస్తే నీలాంటివాడ్నే.. షర్ట్‌పైకి పెడితే నీలాంటివాడ్నే... టక్కు టై తీస్తే నీలాంటివాడ్నే...' అంటూ మొదలవుతుంది 'గేమ్ చేంజర్' సినిమాలోని 'రా మచ్చా మచ్చా' సాంగ్. హీరో రామ్‌చరణ్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'గేమ్‌చేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ క్రిస్మస్‌కి విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'రా మచ్చా మచ్చా..' పాట లిరికల్ వీడియోను సోమవారం సెయింట్ మార్టిన్స్ కాలేజీలో విద్యార్థుల సమక్షంలో రిలీజ్ చేశారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ పాటను అజీజ్ పాడగా, తెలుగు వెర్షన్‌కు అనంత శ్రీరామ్, తమిళంలో వివేక్, హిందీలో కుమార్ లిరిక్స్ రాశారు. గణేష్ ఆచార్య కొరియోగ్రఫీ అందించారు. 'రా మచ్చా మచ్చా..' పాట విడుదల కార్యక్రమంలో 'దిల్' రాజు, శంకర్, నటులు శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, తమన్, అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ''ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన జానపద కళాకారులు ఈ పాటలో భాగమయ్యారు.


● నాగచైతన్య, సాయి పల్లవి

వెయ్యి మందితో పాట

నాగచైతన్య హీరోగా నటిస్తున్న పాన్ ఇండియన్ సినిమా 'తండేల్' కోసం వెయ్యిమందితో ఓ పాటని చిత్రీకరించారు మేకర్స్. చందూ మొండేటి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో సాయి పల్లవి హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ పతాకంపై 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శివరాత్రి నేపథ్యంలో వచ్చే ఓ పాటని వెయ్యి మంది జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్స్‌పై చిత్రీకరించినట్లు చిత్రయూనిట్ పేర్కొని, ఆ పాటకు సంబంధించిన లుక్‌ని విడుదల చేసింది. ''ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా డి.మత్స్యలేశం గ్రామంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'తండేల్'. ఇద్దరు ప్రేమికుల జీవితాల్లో జరిగిన సంఘటనలు, భావోద్వేగాలు చాలా గ్రిప్పింగ్‌గా ఫిక్షనల్ స్టోరీ కంటే థ్రిల్లింగ్‌గా ఉండబోతున్నాయి. శైవ క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన పురాతన శివాలయం శ్రీకాకుళంలోని శ్రీ ముఖలింగం. అక్కడ జరిగే మహాశివరాత్రి ఉత్సవాల స్ఫూర్తితో ఈ పాటను చిత్రీకరించాం. దేవిశ్రీ ప్రసాద్ చక్కగా కంపోజ్ చేయగా, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు'' అని చిత్రబృందం పేర్కొంది.


● సత్యదేవ్, మనోజ్ మంచు, సత్యరాజ్, జెన్నీఫర్, డాలీ ధనంజయ

ఆ కష్టం నాకు తెలుసు - మనోజ్ మంచు

''జీబ్రా' సినిమా కోసం టీమ్ ఎంతలా కష్టపడ్డారో నాకు తెలుసు. సత్యదేవ్ అద్భుతమైన నటుడు. తన నటనకి నేను అభిమానిని. 'జీబ్రా' టీజర్ అదిరిపోయింది. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలి'' అని హీరో మనోజ్ మంచు అన్నారు. సత్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన చిత్రం 'జీబ్రా'. ప్రియా భవానీ శంకర్, జెన్నీఫర్ పిక్కినాటో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీలో నటుడు సత్యరాజ్ కీలక పాత్ర చేశారు. ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించిన ఈ మూవీ ఈ నెల 31న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ని హీరో నాని సోషల్ మీడియా వేదికగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన 'జీబ్రా' టీజర్‌లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా మనోజ్ మంచు హాజరయ్యారు. సత్యదేవ్ మాట్లాడుతూ-''జీబ్రా' నా కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుంది'' అన్నారు. ''జీబ్రా' కోసం తెలుగు నేర్చుకుని డబ్బింగ్ చెప్పాను'' అని డాలీ ధనంజయ తెలిపారు. ''ఈ మూవీలో నా పాత్ర పూర్తి వైవిధ్యంగా ఉంటుంది'' అని సత్య రాజ్ చెప్పారు. ''ప్రేక్షకులు మంచి కథని సపోర్ట్ చేస్తారనే నమ్మకంతోనే ఈ సినిమా చేశాం'' అన్నారు ఈశ్వర్ కార్తీక్. ''జీబ్రా' చాలా కొత్త కంటెంట్. సినిమా ఓ పండగలా ఉంటుంది'' అని నిర్మాతలు దినేష్ సుందరం, బాల సుందరం, ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. జెన్నీఫర్ పిక్కినాటో మాట్లాడారు.

నిర్మాతలకు వచ్చే ఆ కిక్కే వేరు - 'దిల్' రాజు

''కొత్త సినిమాలు బాగా ఆడినప్పుడు నిర్మాతలకు వచ్చే ఆ కిక్కే వేరు. 'కమిటీ కుర్రోళ్ళు' లాంటి చిత్రాలు సక్సెస్ చూసినప్పుడు ఇంకా చాలామంది నిర్మాతలు కొత్త తరహా సినిమాలు చేయడానికి ముందుకొస్తారు. అప్పుడే సినిమా ఇండస్ట్రీ అభివృద్ధి చెందుతుంది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర స్టూడియోస్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్స్ నటించిన ఈ చిత్రంతో యదు వంశీ దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ ఏడాది ఆగస్టు 9న విడుదలైన ఈ చిత్రం యాభై రోజులను పూర్తి చేసుకుంది. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 50 డేస్ సెలబ్రేషన్స్‌కి 'దిల్' రాజు హాజరయ్యారు. నిహారిక మాట్లాడుతూ-'' ఓ మంచి సినిమా తీస్తున్నామనుకున్నాం. కానీ, 50 రోజులు సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతుందనుకోలేదు. 'దిల్' రాజుగారు నాకు స్ఫూర్తి. ఆయనలా డిఫరెంట్, కమర్షియల్ సినిమాలు చేయాలని ఉంది'' అని తెలిపారు. ''నా తొలి సినిమా 50 రోజుల వేడుక జరుపుకోవడం హ్యాపీ'' అని పేర్కొన్నారు యదు వంశీ. ''సినిమాను సహజంగా తీసే యదువంశీకి ఇంకా మంచి పేరు రావాలి'' అని నిర్మాత ఫణి అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు నాగబాబు మాట్లాడారు.


● నిహారిక, 'దిల్' రాజు, యదు వంశీ

అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే!


● సప్తగిరి, బ్రహ్మానందం

విష్ణు మంచు హీరోగా రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ వంటి వారు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. మంచు మోహన్ బాబు ఈ చిత్రం నిర్మిస్తున్నారు. కాగా ప్రతి సోమవారం 'కన్నప్ప' నుంచి ఆయా పాత్రలను రివీల్ చేస్తున్నారు మేకర్స్. అందులో భాగంగా ప్రముఖ నటుడు బ్రహ్మానందం, సప్తగిరి పాత్రల ఫస్ట్ లుక్స్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో బ్రహ్మానందం పిలక పాత్రలో నటించగా, సప్తగిరి గిలక పాత్రను పోషించారు. 'చేపకు ఈత, పులికి వేట, కోకిలకి పాట.. నేర్పిన గుగ్గురువులు.. అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే..' అంటూ వీరి పాత్రలను పరిచయం చేసింది చిత్రయూనిట్. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమా డిసెంబరులో విడుదల కానుంది.

దక్షిణ కథ విని షాక్ అయ్యాను - సాయి ధన్సిక



''దక్షిణ' కథను ఓషో తులసీరామ్‌గారు నాకు చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఈ సినిమా చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. అమ్మాయిలందరూ స్ట్రాంగ్‌గా ఉండాలి. ఈ పాయింట్‌నే 'దక్షిణ' లో చెప్పాం'' అని నటి సాయిధన్సిక అన్నారు. 'మంత్ర, మంగళ' చిత్రాల ఫేమ్ ఓషో తులసీరామ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'దక్షిణ'. 'కబాలి' ఫేమ్ సాయి ధన్సిక ప్రధాన పాత్రలో, రిషవ్ బసు మరో లీడ్ రోల్‌లో నటించారు. అశోక్ షిండే నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకలో నటుడు శివాజీ మాట్లాడుతూ- ''మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న 'దక్షిణ' విజయం సాధించాలి'' అన్నారు. ''ఒక సూపర్ థ్రిల్లర్‌కు కావాల్సిన అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అని సాయిధన్సిక తెలిపారు. ''నా క్లోజ్ ఫ్రెండ్ అశోక్ ఈ సినిమాకు నిర్మాత. మా సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు ఓషో తులసీరాం. ''మంత్ర' తరహాలోనే 'దక్షిణ' పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను'' అని నటుడు, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ చెప్పారు.

నా కల నెరవేరింది - శివ శేషు



''జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు. ఓ సర్వే ప్రకారం ప్రపంచంలో 70శాతం మంది ఏదో ఒక సందర్భంలో ఆత్మహత్య ఆలోచన చేస్తున్నారు. అది సరికాదు అనే అంశాన్ని మా 'కలి' సినిమాలో చెబుతున్నాం'' అని డైరెక్టర్ శివ శేషు అన్నారు. ప్రిన్స్, నరేష్ అగస్త్య హీరోలుగా, నేహా కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కలి'. శివ శేషు దర్శకుడు. కె.రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో లీలా గౌతమ్ వర్మ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివ శేషు మాట్లాడుతూ-''దర్శకుడు కావాలనే నా కల 'కలి' తో నెరవేరింది. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఈ చిత్రంలో మంచి ప్రేమ కథ ఉంటుంది. అతి మంచితనం వల్ల శివరామ్(ఈ మూవీలో ప్రిన్స్ చేసిన పాత్ర) ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటాడు. ఆ కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. ఆ సమయంలో అతని ఇంటికి వచ్చే ఓ అపరిచిత వ్యక్తి(నరేష్ అగస్త్య) వల్ల శివరామ్ జీవితంలో ఎలాంటి ఘటనలు జరిగాయి? అనేది ఈ చిత్ర కథాంశం. మన పురాణాల్లోని కలి పురుషుడి పాత్రను స్ఫూర్తిగా తీసుకుని ఈ మూవీ చేశాను. ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్‌కు మంచి ప్రాధాన్యత ఉంటుంది'' అన్నారు.

వెతకక్కర్లేదు.. వచ్చేశాడు!


● శ్రీవిష్ణు

'రాజ రాజ చోర' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో శ్రీ విష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఈ వంశ ఖజానా వారసుడు దొరకడం అంత సులువు కాదు.. ఈ తరంలో వాడు ఎక్కడ ఉన్నాడో కూడా తెలియదు...', 'వెతకక్కర్లేదు..వచ్చేశాడు!', 'మా వంశాన్ని వెతుక్కుంటూ వచ్చేసరికి ఇంతకాలం పట్టింది' వంటి డైలాగ్స్ 'శ్వాగ్' సినిమా ట్రైలర్‌లో ఉన్నాయి. రీతూ వర్మ హీరోయిన్‌గా, మీరా జాస్మిన్, దక్ష నగార్కర్, శరణ్య ప్రదీప్ నటించిన ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,272	84,300
నిఫ్టీ ▽	368	25,811

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్డాక్	18,110	▽ 9
డోజోన్స్	42,171	▽ 142
ఎఫ్టీఎస్ఈ 100	8,237	▽ 84
డాక్స్	19,325	▽ 149
షాంఘై	3,337	△ 249
నికాయ్	37,919	▽ 1,910

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75,197
బంగారం (99.5 స్వచ్ఛత)	74,896
వెండి (కేజీ)	89,400

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.96	85.64
£	బ్రిటన్ పౌండ్		109.90	114.80
€	యూరో		91.20	95.69
¥	జపాన్ ఎన్ (100)		47.00	69.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		55.71	60.55
S$	సింగపూర్ డాలర్		63.00	67.69
SAR	సౌదీ రియాల్		21.45	23.00
UAE D	యూఏఈ దిర్హామ్		21.92	23.71
¥	చైనా యువాన్		11.06	12.89


మెగా ఐపీఓ వేవ్!

రూ. 1.5 లక్షల కోట్లు... 75 కంపెనీలు ● నిధుల వేట కోసం భారీ క్యూ..

- ఈ ఏడాది ఇప్పటికే లిస్టింగ్స్; రూ.64,000 కోట్లకు పైగా సమీకరణ
- 2021 నాటి ఆల్టైమ్ రికార్డును బ్రేక్ చేసే చాన్స్!

స్టాక్ మార్కెట్లో బుల్ రంకెల నేపథ్యంలో పబ్లిక్ ఆఫర్లు (ఐపీఓ) పోటెత్తుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే 62 కంపెనీలు దాదాపు రూ.64,513 కోట్ల భారీ మొత్తాన్ని సమీకరించాయి. ఇందులో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ (రూ. 6,550 కోట్లు), ఫస్ట్క్రై (రూ. 4,194 కోట్లు), ఓలా ఎలక్ట్రిక్ (రూ.6,146 కోట్లు), డిజిట్ ఇన్సూరెన్స్ (2,165 కోట్లు) తదితర దిగ్గజాలున్నాయి. గతేడాది మొత్తంమీద 57 కంపెనీలు కలిపి రూ.49,436 కోట్ల నిధులను మార్కెట్ నుంచి దక్కించుకున్నాయి. దీంతో పోలిస్తే ఈ ఏడాది 29 శాతం అధికం కావడం గమనార్హం. మరోపక్క, మరో 75 కంపెనీలు రూ.1.5 లక్షల కోట్ల నిధుల వేట కోసం ఆవురావురుమంటూ వేచిచూస్తున్నాయి. ఇందులో 23 కంపెనీలకు సెబీ గ్రీన్ సిగ్నల్ కూడా లభించింది. హ్యుందాయ్ ఇండియా, స్విగ్గీకి ఇప్పటికే సెబీ ఇప్పటికే ఓకే చెప్పగా... తాజాగా విశాల్ మెగామార్ట్, ఆక్మే సోలార్, మమతా మెషినరీకి కూడా ఆమోదం లభించింది. సెబీ లైన్ క్లియర్ చేసిన ఐపీఓల విలువ దాదాపు రూ.72,000 కోట్లు! మిగా 53 కంపెనీలు రూ.78 వేల కోట్ల నిధుల సమీకరణ బాటలో ఆమోదం కోసం వేచి చూస్తున్నాయి. కాగా, రూ. 1,19,882 కోట్ల నిధుల సమీకరణతో 2021 ఏడాది అత్యధిక ఐపీఓల రికార్డును దక్కించుకుంది. మార్కెట్ రికార్డు పరుగుల నేపథ్యంలో మూడేళ్ల తర్వాత పబ్లిక్ ఇష్యూలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఆమోదం లభించినవి డిసెంబర్లోపు గనుక ఐపీఓలను పూర్తి చేసుకుంటే 2024 గత రికార్డును బ్రేక్ చేసే చాన్సుంది!!







సెబీ ఆమోదం కోసం వేచి చూస్తున్న బడా ఐపీఓలు (అంచనా రూ. కోట్లలో)



ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ	10,000
హెగ్జావేర్ టెక్నాలజీస్	9,950
ఓయో	8,400
స్లాస్ బెంగళూరు	5,000
ఎస్ఎస్డీఎల్	4,500
టాటా ప్లే	2,500



మౌలికం మైనస్

- ఆగస్టులో 1.8 శాతం క్షీణత
- మూడున్నరేళ్ల తర్వాత నెగెటివ్లోకి..

న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పరిశ్రమల గ్రూప్ ఆగస్టులో తీవ్ర ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొంది. గ్రూప్ ఎటువంటి వృద్ధినీ నమోదుచేయకపోగా, 1.8 శాతం క్షీణ రేటును (2023 ఆగస్టుతో పోల్చి) నమోదుచేసుకుంది. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో (2021 ఫిబ్రవరిలో మైనస్ 3.3 శాతం) ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనడం ఇదే తొలిసారి. ఎనిమిది రంగాల్లో ఏకంగా ఆరు క్షీణ రేటును నమోదుచేసుకోవడం గమనార్హం. 2023 జూలైలో ఈ రంగాల వృద్ధి రేటు 6.1% కాగా, 2023 ఆగస్టులో వృద్ధి 13.4%. ఆగస్టు అధికారిక గణాంకాలను చూస్తే...

క్షీణతలో ఎనిమిది...: బొగ్గు (–8.1%), క్రూడ్ ఆయిల్ (–3.4 శాతం), సహజ వాయువు (– 3.6%), రిఫైనరీ ప్రొడక్టులు (– 1%), సిమెంట్ (–3%), విద్యుత్ (–5%) క్షీణత రేటును నమోదుచేసుకున్న జాబితాలో ఉన్నాయి.

వృద్ధిలో ఎరువులు, స్టీల్: ఎరువులు (3.2 శాతం), స్టీల్ (4.5 శాతం) ఈ విభాగంలో ఉన్నాయి. ఎరువుల రంగం 2023 ఆగస్టులో 1.8 శాతం వృద్ధి సాధిస్తే, స్టీల్ మాత్రం ఏకంగా 16.4 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది.

చిన్న మొత్తాల పొదుపు పథకాలపై

వడ్డీ రేట్లు యథాతథం

- పీపీఎఫ్లో 7.1 శాతం
- సుకన్య సమృద్ధిపై 8.2 శాతం



న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ఇప్పటి వరకు అమల్లో ఉన్న వడ్డీ రేట్లనే 2024 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి కొనసాగిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయకపోవడం వరుసగా ఇది మూడో త్రైమాసికం కావడం గమనార్హం. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ పథకాల వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం సమీక్షిస్తుంటుంది.

వివిధ స్కీమ్లపై వడ్డీరేట్లు ఇలా...

పథకం పేరు	అక్టోబర్–డిసెంబర్ కాలానికి వడ్డీ రేటు (%)
సేవింగ్స్ డిపాజిట్	4.0
ఏడాది టైమ్ డిపాజిట్	6.9
రెండేళ్ల టైమ్ డిపాజిట్	7.0
మూడేళ్ల టైమ్ డిపాజిట్	7.1
ఐదేళ్ల టైమ్ డిపాజిట్	7.5
ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్	6.7
సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్	8.2
మంత్లీ ఇన్కమ్ అకౌంట్	7.4
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.7
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.1
కిసాన్ వికాస్ పత్ర	7.5
సుకన్య సమృద్ధి యోజన	8.2

సెన్సెక్స్ 1,272 పాయింట్లు డౌన్

- 25,850 స్థాయి దిగువకు నిఫ్టీ
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు
- జపాన్ మార్కెట్ పతన ప్రభావం
- గరిష్ట స్థాయిల్లో లాభాల స్వీకరణ
- రూ.3.57 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి...



ముంబై: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, జపాన్ ఈక్విటీ మార్కెట్ భారీ పతనం నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 1,272 పాయింట్లు క్షీణించి 84,300 వద్ద ముగిసింది. నిఫ్టీ 368 పాయింట్లు పతనమై 25,811 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. మెటల్ మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెలువెత్తాయి. యూరప్ మార్కెట్ల నష్టాల ప్రారంభంతో అమ్మకాల ఉధృతి మరింత పెరిగింది. ఒక దశలో సెన్సెక్స్ 1,315 పాయింట్లు క్షీణించి 84,257 వద్ద, నిఫ్టీ 368 పాయింట్లు కుప్పకూలి 25,811 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ఆటో, బ్యాంకులు, రియల్టీ, ఫైనాన్షియల్, సర్వీసెస్, టెలికం షేర్ల పతనంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.28%, 0.07% ఒక శాతం నష్టపోయాయి. జపాన్ నూతన ప్రధాన మంత్రిగా షిగెరు ఇషిబా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవడంతో నికాయ్ ఇండెక్స్ 5% క్షీణించింది. చైనా ప్రభుత్వం వృద్ధికి ఊతమిచ్చే సంస్కరణలు చేపట్టడంతో షాంఘై సూచీ 7.5%, హాంకాంగ్ ఇండెక్స్ 2% చొప్పున లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 2% వరకు నష్టపోయాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప నష్టాలతో ట్రేడవుతున్నాయి.

→ సెన్సెక్స్ 1,272 పాయింట్లు పతనంతో ఒక్కరోజులో రూ.3.57 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.474 లక్షల కోటకు దిగివచ్చింది.

→ రిలయన్స్ 3%, యాక్సిస్ బ్యాంక్ 3% ఐసీఐసీఐ 2.50%, హెచ్డీఎఫ్సీ బ్యాంకు ఒక శాతం నష్టపోయి ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ కోల్పోయిన పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 730 పాయింట్లు కావడం గమనార్హం.

→ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3% నష్టపోయి రూ.2,954 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్లో 3.33% క్షీణించి రూ.2,950 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 66,820 కోట్లు తుడిచిపెట్టుకుపోయింది.

→ క్రూడాయిల్ ధరలు ఒడిదుడుకులు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణతో రూపాయి విలువ 10 పైసలు బలహీనపడి 83.79 స్థాయి వద్ద స్థిరపడింది.

లిస్టింగ్లో మన్బా ఫైనాన్స్ షేరు మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.120)తో పోలిస్తే 25% ప్రీమియంతో రూ.150 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ నష్టాల ట్రేడింగ్లో ఈ షేరుకు కొనుగోళ్లకు మద్దతు లభించింది. ఒక దశలో 31% ఎగసి రూ.157 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి అక్కడే ముగిసింది. మార్కెట్ విలువ రూ.791 కోట్లుగా నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్లో ..
ఆగస్టునాటికి ద్రవ్యలోటు రూ. 4,35,176 కోట్లు
డాక్టర్ రెడ్డీస్ చేతికి నికోటినెల్

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ రాష్ట్రంలో 633 ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టులు

తెలంగాణ రాష్ట్రంలో మెడికల్–హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్బీ).. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్/డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్లో, తెలంగాణ వైద్య విధాన పరిషత్, ఎంఎన్జే ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ అండ్ రీజనల్ క్యాన్సర్ సెంటర్లలో ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 633.
- **పోస్టుల వివరాలు:** డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్/డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్–445,తెలంగాణ వైద్య విధాన పరిషత్–185, ఎంఎన్జే ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ అండ్ రీజనల్ క్యాన్సర్ సెంటర్–02.
- **అర్హత:** డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఫార్మ్ డీ ఉత్తీర్ణతతో పాటు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి.
- **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 46 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు,ఎన్సీసీ,ఎక్స్ సర్వీస్మెన్లకు మూడేళ్లు వయోపరిమితి సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** నెలకు రూ.31,040 నుంచి రూ.92,050.
- **ఎంపిక విధానం:** రాతపరీక్షకు 80 మార్కులు, మిగిలినవి వెయిటేజీ కింద కలుపుతారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒప్పంద, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసినవారికి వెయిటేజీ కింద 20 పాయింట్లు కేటాయిస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్గొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.10.2024.
- **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.10.2024
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 23.10.2024 నుంచి 24.10.2024 వరకు
- **పరీక్ష తేది:** 30.11.2024.
- **వెబ్సైట్:** http:// https//mhsrb.telangana.gov.in

నాబార్డ్ ముంబైలో 108 గ్రూప్–సి పోస్టులు

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ (నాబార్డ్)లో.. గ్రూప్–సి కేటగిరీకి చెందిన ఆఫీస్ అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 108.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.35,000.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.10.2024.
- **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.10.2024.
- **వెబ్సైట్:** https://www.nabard.org

తెలంగాణ బీసీ సంక్షేమ గురుకులాల్లో అగ్రి బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు

మహాత్మా జ్యోతిబాపూలే బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్).. వనపర్తి, కరీంనగర్లోని అగ్రికల్చర్ కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **కాలేజ్, సీట్ల వివరాలు:** అగ్రికల్చరల్ కాలేజ్(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), వనపర్తి–18 సీట్లు(అగ్రిసెట్ కోటా). –అగ్రికల్చరల్ కాలేజ్(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), కరీంనగర్–18 సీట్లు(అగ్రిసెట్ కోటా).
- **అర్హత:** డిప్లొమా(అగ్రికల్చర్)/డిప్లొమా(సీడ్ టెక్నాలజీ)/డిప్లొమా(ఆర్గానిక్ అగ్రికల్చర్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్–2024 ర్యాంక్ సాధించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 2,00,000(పట్టణ ప్రాంతం), రూ.1,50,000 (గ్రామీణ ప్రాంతం) మించకూడదు.
- **వయసు:** 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** పీజేటీఎస్ఏయూ అగ్రిసెట్–2024 ర్యాంక్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.10.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 11.10.2024 నుంచి 12.10.2024 వరకు
- **వెబ్సైట్:** https://mjptbcwreis.telangana.gov.in

» జేఈఈ–మెయిన్తో ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశం
» జేఈఈ–అడ్వాన్స్డ్తో ఐఐటీల్లో అడ్మిషన్స్
» మెయిన్ విజేతల్లో 2.5 లక్షల మందికి అడ్వాన్స్డ్కు అర్హత
» త్వరలో జేఈఈ మెయిన్ తేదీలు వెల్లడయ్యే అవకాశం

జేఈఈ మెయిన్.. సిద్ధమవ్వండిలా!

జేఈఈ.. జాయింట్ ఎంట్రన్ ఎగ్జామినేషన్! జేఈఈ మెయిన్లో ప్రతిభ ఆధారంగా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, సీఎఫ్టీఐల్లో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీల్లో అడ్మిషన్స్కు జేఈఈ–అడ్వాన్స్డ్ ప్రామాణికం! దీంతో.. ఏటా లక్షల మంది ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులు ఈ పరీక్షలకు సన్నద్ధమవుతుంటారు. ఇంటర్లో చేరిన తొలిరోజు నుంచే జేఈఈ–మెయిన్, అడ్వాన్స్డ్ల్లో విజయం కోసం దీర్ఘకాలిక ప్రిపరేషన్ సాగిస్తున్న పరిస్థితి! త్వరలో జేఈఈ–మెయిన్ తేదీలు వెల్లడి కానున్న నేపథ్యంలో.. ఈ పరీక్ష విధానంతోపాటు సన్నద్ధత మెలకువలు..

జేఈఈ–మెయిన్, అడ్వాన్స్డ్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయం కోసం కనీసం ఏడాది ముందు నుంచే కృషి చేయాల్సిన ఆవశ్యకత నెలకొంది. సబ్జెక్ట్ టాపిక్స్ నుంచి టైమ్ మేనేజ్మెంట్ వరకూ.. అన్నింటిపైనా స్పష్టమైన అవగాహనతో ముందుకుసాగితే మంచి ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది.

మెయిన్ రెండు సెషన్లుగా

జేఈఈ–మెయిన్ పరీక్షను ఏటా రెండు సెషన్లుగా నిర్వహిస్తున్నారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి 2025 జనవరిలో తొలి సెషన్, 2025 ఏప్రిల్లో రెండో సెషన్ నిర్వహించే అవకాశం ఉంది. అంటే జేఈఈ–మెయిన్ అభ్యర్థులకు పరీక్ష సమయం సమీపిస్తోంది. తొలి సెషన్కు నాలుగు నెలల సమయం మాత్రమే ఉంది.

మే మొదటి వారంలో అడ్వాన్స్డ్

ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) క్యాంపస్ల్లో బీటెక్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. జేఈఈ–అడ్వాన్స్డ్. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి మే మొదటి వారంలో ఈ పరీక్ష జరిగే అవకాశం ఉంది. జేఈఈ–మెయిన్లో టాప్ 2.5 లక్షల మందిని జేఈఈ–అడ్వాన్స్డ్కు అర్హత కల్పిస్తారు. ఐఐటీలను లక్ష్యంగా చేసుకున్న విద్యార్థులు జేఈఈ–మెయిన్, అడ్వాన్స్డ్ రెండింటిలోనూ ఉత్తమ ప్రతిభ చూపాల్సి ఉంటుంది.

బోర్డ్ సిలబస్తో అనుసంధానం

జేఈఈ అభ్యర్థులు ముఖ్యంగా ప్రస్తుతం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో ఉన్న విద్యార్థులు.. బోర్డ్ సిలబస్, జేఈఈ–మెయిన్స్, అడ్వాన్స్డ్ పరీక్షల సిలబస్ను అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ముందుగా జేఈఈ–మెయిన్, బోర్డ్ పరీక్షలకు సమాంతరంగా ప్రిపరేషన్ సాగించాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత అడ్వాన్స్డ్కు ప్రిపరేషన్ ప్రారంభించవచ్చు. రెండింటిలోనూ ఉమ్మడిగా ఉన్న టాపిక్స్ను అధ్యయనం చేస్తూ.. ఆయా పరీక్షలకు ప్రత్యేకంగా ఉన్న టాపిక్స్కు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి. మెయిన్, అడ్వాన్స్డ్కు సంబంధించి అధికారిక వెబ్సైట్లో సిలబస్ను పరిశీలించి.. బోర్డ్ సిలబస్లో ఉన్న అంశాలతో సమన్వయం చేసుకుంటూ చదవాలి.

జేఈఈ–మెయిన్స్తో కలిసి సాగేలా

జేఈఈ–అడ్వాన్స్డ్ అభ్యర్థులు జేఈఈ–మెయిన్స్తోనూ కలిసి ఉమ్మడి ప్రిపరేషన్ సాగించాలని సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఏప్రిల్లో నిర్వహించే అవకాశం ఉన్న జేఈఈ–మెయిన్కు హాజరయ్యే విద్యార్థులు.. మెయిన్స్, అడ్వాన్స్డ్కు ఉమ్మడి అధ్యయనం చేయాలి. ప్రతి ఏటా జేఈఈ–మెయిన్ రెండో సెషన్ ముగిశాక జేఈఈ–అడ్వాన్స్డ్కు నెల రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంటోంది.

అన్వయ దృక్పథం

జేఈఈ అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్తో ప్రిపరేషన్ సాగించాలి. తొలుత కాన్సెప్ట్లపై స్పష్టమైన అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత వాస్తవ పరిస్థితుల్లో అన్వయం, అనంతరం ప్రశ్నల సాధన చేయాలి. ఇలా చేయడం ద్వారా పరీక్షలో అడిగే మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్, మ్యాచింగ్ టైప్ కొశ్చన్స్ వంటి వాటికి సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

మెయిన్ తొలి సెషన్

- జేఈఈ మెయిన్ తొలి సెషన్కు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా మెయిన్ పరీక్షపైనే పూర్తిగా దృష్టి పెట్టాలి. ఆ తర్వాత బోర్డ్ పరీక్షలకు సమయం కేటాయించాలి. బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత అడ్వాన్స్డ్కు పూర్తి స్థాయి సమయం కేటాయించాలి. ఒకవేళ జేఈఈ–మెయిన్ రెండో సెషన్కు కూడా హాజరయ్యే అభ్యర్థులు.. ఆ సమయంలో అడ్వాన్స్డ్ సిలబస్ను పరిగణనలోకి తీసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. అప్పటికే తాము పూర్తి చేసుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ వాటికి సంబంధించి ప్రాక్టీస్ కొశ్చన్స్, ప్రీవియస్ కొశ్చన్స్ను సాధన చేసేలా సమయ పాలన రూపొందించుకోవాలి.
- ప్రతి వారం వీక్లీ టెస్ట్లు, గ్రాండ్ టెస్ట్లకు హాజరవుతూ లోటుపాట్లు సరిచూసుకుని వాటిని సరిదిద్దుకోవాలి. ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రాసుకునే విధానం అలవర్చుకోవాలి. ఫలితంగా రివిజన్ విషయంలో సమయం ఆదా చేసుకోవచ్చు.

సబ్జెక్ట్ల వారీగా ముఖ్యాంశాలు

మ్యాథమెటిక్స్

కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్పై దృష్టిపెట్టాలి. దీంతోపాటు 3–డి జామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్ అల్జీబ్రా, ఇంటిగ్రేషన్, కాంప్లెక్స్ నెంబర్స్,పారాబోలా, ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలపై పట్టు సాధించాలి.

ఫిజిక్స్

ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్,మోడ్రన్ ఫిజిక్స్,ఆప్టిక్స్, ఎస్హెచ్ఎం అండ్ వేవ్స్కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్, సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్పై లోతైన అవగాహన ఏర్పరచుకోవాలి.

కెమిస్ట్రీ

కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్, ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌడ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్పై పట్టు సాధించాలి.

సమస్య సాధన

ప్రిపరేషన్ సమయంలోనే ఒక ప్రాబ్లమ్ లేదా ప్రశ్నను అంచెల వారీ సాధనపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. గత ఏడాది పరీక్షలో మూడు సబ్జెక్ట్ల నుంచి మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతోపాటు, ఇంటిజర్ వాల్యూ ఆధారిత ప్రశ్నలు కూడా అడిగారు. కాబట్టి బిట్స్ సాధనకు పరిమితం కాకుండా ఒక ప్రాబ్లమ్ను స్టెప్ వైజ్గా పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచిస్తున్నారు.

పాత ప్రశ్న పత్రాల ప్రాక్టీస్

జేఈఈ అభ్యర్థులు పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. దీని వల్ల ఆయా టాపిక్స్ నుంచి ప్రశ్నలు అడుగుతున్న తీరు, ఆయా అంశాలకు లభిస్తున్న వెయిటేజీని తెలుసుకోవచ్చు. ప్రశ్నలు అడిగే తీరును పరిశీలించడం ద్వారా ఒకే ఫార్ములా/కాన్సెప్ట్కు సంబంధించి ఎన్ని విధాలుగా ప్రశ్నలు అడుగుతున్నారో తెలుసుకునే అవకాశం లభిస్తుంది.



జేఈఈ–మెయిన్ పరీక్ష విధానం

జేఈఈ–మెయిన్లో బీటెక్ అభ్యర్థులకు పేపర్–1, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అభ్యర్థులకు పేపర్–2ఎ, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల అభ్యర్థులకు పేపర్–2బి నిర్వహిస్తారు.

పేపర్–1 ఇలా: బీటెక్/బీఈ ప్రోగ్రామ్లకు నిర్దేశించిన ఈ పేపర్కు సంబంధించి మొత్తం మూడు సబ్జెక్ట్లలో 90 ప్రశ్నలు–300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇందులో మ్యాథమెటిక్స్లో 30 ప్రశ్నలు–వంద మార్కులకు, ఫిజిక్స్లో 30 ప్రశ్నలు–వంద మార్కులకు, కెమిస్ట్రీలో 30 ప్రశ్నలు–వంద మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి సబ్జెక్టును సెక్షన్ ఏ, సెక్షన్ బీలుగా నిర్వహిస్తారు. సెక్షన్–ఎ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో(ఎంసీక్యూలతో)ఉంటుంది. సెక్షన్–బిలో న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలుంటాయి. ఛాయిస్ విధానం నేపథ్యంలో సెక్షన్–బిలో 10 ప్రశ్నల్లో అయిదింటికి సమాధానం ఇస్తే సరిపోతుంది. సెక్షన్–ఎలో 0.25 శాతం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

జేఈఈ–అడ్వాన్స్డ్ ఇలా

జేఈఈ అడ్వాన్స్డ్ను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. వీటిని పేపర్–1, పేపర్–2లుగా పేర్కొంటారు. ప్రతి పేపర్లోనూ మ్యాథమెటిక్స్,ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 17 ప్రశ్నలు చొప్పున 51 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో పేపర్కు 180 మార్కులు చొప్పున రెండు పేపర్లను కలిపి 360 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ఏటా అడ్వాన్స్డ్ పరీక్ష విధానంలో గత మూడేళ్లుగా ఎలాంటి మార్పులు జరగలేదు.

క్లుప్తంగా...

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులు మరోసారి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులు మరోసారి వాయిదా పడ్డాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)లు దాఖలు చేసిన రెండు కేసులపై ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఈ కేసులో మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించి జరిగిన విచారణకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. కవిత జైలు నుంచి బెయిల్‌పై విడుదలైనప్పటి నుంచి వర్చువల్‌గానే హాజరవుతున్నారు. కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు కూడా వర్చువల్‌గా హాజరై వాదనలు వినిపించారు. ఈ కేసులో తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా పడగా, సీబీఐ సప్లిమెంటరీ చార్జిషీట్‌కు సంబంధించిన కేసులో విచారణ అక్టోబర్ 4కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

సాహితీ గ్రూప్ ఎండీని అరెస్ట్ చేసిన ఈడీ

4 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రీలాంచ్ పేరుతో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడి మోసగించిన కేసులో సాహితీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా లక్ష్మీనారాయణను అరెస్టు చేసిన అధికారులు నాంపల్లి సెషన్స్ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో లక్ష్మీనారాయణను చంచల్‌గూడ జైలుకు ఈడీ అధికారులు తరలించారు. దర్యాప్తులో భాగంగా మరిన్ని కీలక అంశాలు తెలుసుకోవాల్సి ఉన్నందున ఆయనను తమ కస్టడీకి అనుమతించాలని ఈడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని లక్ష్మీనారాయణ తరఫు న్యాయవాదికి జడ్జి సూచించారు.

యూనిట్‌కు రూ.1.09 అదనపు సర్‌చార్జి

డిస్కంలకు అనుమతించిన ఈఆర్సీ

సాక్షి, హైదరాబాద్: ఓపెన్ యాక్సెస్ పద్ధతిలో బహిరంగ విపణి నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే వినియోగదారులపై యూనిట్‌కు రూ.1.09 పైసలు చొప్పున అదనపు సర్‌చార్జిని విధించడానికి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) అనుమతిచ్చింది. ఈ మేరకు అదనపు సర్‌చార్జి ఉత్తర్వులను సోమవారం జారీ చేసింది. 2024 అక్టోబర్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఈ చార్జీలు అమల్లో ఉండనున్నాయి. భారీ పరిశ్రమలు, ఇతర వినియోగదారులు పవర్ ఎక్స్ఛేంజీల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేస్తే వారికి సరఫరా చేసేందుకు తాము కొనుగోలు చేసిన విద్యుత్‌లో 66.05 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగిలిపోతుందని డిస్కంలు ఈఆర్సీకి నివేదించాయి. ఒక్కో యూనిట్‌కు రూ.1.6 పైసలు చొప్పున ఆయా వినియోగదారుల నుంచి మొత్తం రూ.10.59 కోట్ల అదనపు సర్‌చార్జీలను వసూలు చేసేందుకు అనుమతి కోరాయి. ప్రతిపాదనలను పరిశీలించిన ఈఆర్సీ యూనిట్‌కు రూ.1.09 పైసలు చొప్పున రూ.7.22 కోట్లు వసూలు చేసేందుకు అనుమతిచ్చింది.

ఆల్ నైన్స్‌కు అదే క్రేజ్

టీజీ 09 బి 9999కు రూ.20.1 లక్షలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీఏ ప్రత్యేక నంబర్లపై వాహనదారులు మళ్లీ క్రేజ్‌ను చాటుకున్నారు. సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఏలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ప్రత్యేక నంబర్లపై రూ. 47,12,265 ఆదాయం లభించినట్లు జేటీసీ రమేశ్ తెలిపారు. 'టీజీ 09 బి 9999 నంబర్‌ను లాట్ మొబైల్స్ సంస్థ రూ. 20,01,111 చెల్లించి సొంతం చేసుకుంది. అలాగే టీజీ 09 సి 0001' నంబర్ కోసం పోటీపడిన యోడ్‌స్టోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.10,27,777 చెల్లించి దక్కించుకుంది.



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

సంక్షేమం చట్టబండలు!

మల్కాజిగిరికి చెందిన 80 ఏళ్ల సుభద్రమ్మకు గంపెడు బలగం ఉంది. కానీ ఉద్యోగ, ఉపాధి అవసరాల దృష్ట్యా కుటుంబ సభ్యులంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఒంట్లో సత్తువ ఉన్నంతకాలం తన పని తాను చేసుకొంటూ నెట్టుకొచ్చిన సుభద్రమ్మ.. వయోభారంతో ఇబ్బందులకు గురవుతోంది. ఇలాంటి ఒంటరి వాళ్లే కాదు.. పిల్లలు చెంతనే ఉన్నప్పటికీ వృద్ధాప్యం వల్ల నిరాదరణకు గురవుతున్న ఎందరో దంపతులూ ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు.



సాక్షి, హైదరాబాద్: పెద్దల సంక్షేమపట్ల ప్రభుత్వం కూడా 'చిన్నచూపు'చూస్తోంది. వృద్ధుల సంక్షేమం, సంరక్షణ, సామాజిక భద్రత కోసం రూపొందించిన మెయింటెనెన్స్ చట్టం అమలుకు నోచుకోవడం లేదు. పెన్షన్ పథకం మినహా వృద్ధుల సంక్షేమ కార్యక్రమాలేవీ అమలు కావట్లేదు. ముఖ్యంగా వృద్ధుల ఆరోగ్య భద్రత కోసం ఇప్పటివరకు ఎలాంటి పాలసీని ప్రభుత్వం రూపొందించలేదు. నేషనల్ పాలసీ ఆఫ్ సీనియర్ సిటిజన్స్‌కు అనుగుణంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పాలసీని రూపొందించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఇప్పటివరకు కార్యారూపం దాల్చలేదు. మరోవైపు ప్రతి ఆసుపత్రిలో వృద్ధుల కోసం జీరియాట్రిక్ వార్డులను ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అమలుకు నోచడం లేదు.

వృద్ధాశ్రమాలు ఏవీ?..: సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 19 ప్రకారం ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం 150 మందికి ఆశ్రయం కల్పించేలా అన్ని వసతులతో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలి. కానీ ఆ దిశగా ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాలుగైదు జిల్లా కేంద్రాల్లో మొక్కుబడిగా ఏర్పాటు చేసినా కనీస సదుపాయాలు లేవని స్వచ్ఛంద సంస్థలు పెదవివిరుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో వృద్ధుల కోసం ప్రత్యేకంగా తాత్కాలిక వసతి గృహాలు, నైట్‌షెల్టర్స్‌ను ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. మరోవైపు 60 ఏళ్లు దాటిన పురుషులు, 58 ఏళ్లు దాటిన మహిళలకు రైలు ప్రయాణాల్లో 50 శాతం రాయితీ ఇచ్చే పథకాన్ని కేంద్రం ఎత్తేసింది. 2020 వరకు అమలైన ఈ పథకాన్ని కోవిడ్ కాలం నుంచి నిలిపేసింది.

డిజిటల్ కార్డులపై క్షేత్రస్థాయి పరిశీలన

- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా 238 ప్రాంతాల్లో 3 నుంచి 7వ తేదీ వరకు సాగనున్న ప్రక్రియ
- పట్టణ, నగర ప్రాంతాల్లో జనాభా ఆధారంగా ఎక్కువ టీమ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. పక్కన మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై క్షేత్రస్థాయి పరిశీలన సమర్థంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని, పూర్తిగా పట్టణ లేదా నగర ప్రాంతమైతే రెండు వార్డులు లేదా డివిజన్లు, పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో మొత్తంగా 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. వార్డులు లేదా డివిజన్లలో జనాభా ఎక్కువగా ఉంటే.. పరిశీలన బృందాల సంఖ్యను పెంచుకోవాలన్నారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు, సేకరించే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 119 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్న గ్రామాలు, వార్డులు లేదా డివిజన్ల ఎంపిక పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. ఎన్ని రోజుల పాటు చేపడతారని సీఎం ప్రశ్నించగా, మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఐదు రోజుల పాటు చేపడతామని అధికారులు తెలిపారు.

కుటుంబం ఫొటో దిగడం ఆప్షన్ మాత్రమే

కుటుంబ సభ్యులు అంతా సమ్మతిస్తే కుటుంబం ఫొటో తీయాలని, అదో ఆప్షనల్‌గా ఉండాలని, కుటుంబం సమ్మతి లేకుంటే ఆ ఫొటో తీసుకోవాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించి ఉమ్మడి జిల్లాలకు ఉన్న నోడల్ అధికారులు కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని, అప్పుడే పకడ్బందీగా కార్యక్రమం కొనసాగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం వద్దనున్న రేషన్‌కార్డు, పింఛను-స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రుణ మాఫీ, బీమా, ఆరోగ్యశ్రీ, కంటి వెలుగు తదితర డేటాల ఆధారంగా ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, పైలెట్ ప్రాజెక్టులో దానిని నిర్ధారించుకోవడంతోపాటు కొత్త సభ్యులను జత చేయడం, మృతి చెందిన వారిని తొలగించడం చేస్తామని అధికారులు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులు చేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దని హెచ్చరించారు. పైలట్ ప్రాజెక్టుతో బయటకు వచ్చిన సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ నివేదికపై చర్చించి లోపాలను సరిదిద్ది అనంతరం పూర్తిస్థాయి క్షేత్రస్థాయి పరిశీలన చేపడదామని ముఖ్యమంత్రి తెలిపారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, సీఎం కార్యదర్శులు సంగీత సత్యనారాయణ, మాణిక్ రాజ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాంకేతికతలో అంతర్జాతీయ స్థాయికి..

ఆమ్‌చామ్ హైదరాబాద్ చాప్టర్ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: సాంకేతికతలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాత్మక నిర్ణయాలు, వాణిజ్య సానుకూలత, ఆవిష్కరణలపై దృష్టి కేంద్రీకరించడం, పెట్టుబడుల ఆకర్షణ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం తదితరాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న టెక్ కంపెనీలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారుతోందన్నారు. 'ఆమ్‌చామ్ ఇండియా'హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఏఐ, ఐఓటీ, బ్లాక్ చెయిన్ వంటి ఎమర్జింగ్ టెక్నాలజీలపై దృష్టి కేంద్రీకరించడంతో 2024లో తెలంగాణ ఐటీ రంగం పురోభివృద్ధిని సాధించిందన్నారు. టీ-హబ్ సహకారంతో ఏఐ రంగంలో వృద్ధి సాధించగా, వ్యవసాయం, స్మార్ట్ సిటీలు, తయారీ రంగంలో ఐఓటీ ఆధారిత టెక్నాలజీ కీలకపాత్ర పోషించిందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిన్‌టెక్, ఆరోగ్యరక్షణ, విద్య తదితర రంగాల్లో పనిచేస్తున్న స్టార్టప్‌లలో ఏంజెల్ ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు పెరిగాయన్నారు. తెలంగాణలో పురుడు పోసుకున్న స్టార్టప్‌లు అంతర్జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించాయని శ్రీధర్‌బాబు చెప్పారు. సైబర్ సెక్యూరిటీ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. పలు సంస్థలతో ప్రభుత్వం కుదుర్చుకుంటున్న భాగస్వామ్యాలు టెక్నాలజీ పవర్ హౌజ్‌గా హైదరాబాద్ స్థానాన్ని పటిష్టం చేస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో దేశంలో ఏఐ టెక్నాలజీ సెంటర్‌గా హైదరాబాద్ రూపుదిద్దుకుంటుందని చెప్పారు.

సీబీఐ ఆపరేషన్ చక్ర-3

32 ప్రాంతాల్లో సైబర్ క్రైం నెట్‌వర్క్‌లపై దాడులు.. 170 మంది అరెస్టు

హైదరాబాద్‌తోపాటు పుణే, అహ్మదాబాద్, విశాఖలో సోదాలు

సాక్షి, హైదరాబాద్: సాంకేతికత సాయంతో అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న ఓ క్రైమ్ నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేసేందుకు సీబీఐ పలు నగరాల్లో ఏకకాలంలో 'ఆపరేషన్ చక్ర-3' చేపట్టింది. హైదరాబాద్‌తోపాటు పుణే, విశాఖపట్నం, అహ్మదాబాద్‌లలో ఆన్‌లైన్ నేరాలకు పాల్పడుతున్న 170 మందిని పట్టుకుంది. ఇందులో 26 మంది కీలక నిందితులు ఉన్నట్టు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. నాలుగు నగరాల్లో కలిపి 32 ప్రాంతాల్లో సోదాలు చేపట్టినట్టు పేర్కొంది. వ్యవస్థీకృత సైబర్ క్రైం నెట్‌వర్క్‌కు సంబంధించి అందిన సమాచారం మేరకు ఈ నెల 24న కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు ఆపరేషన్ చక్ర-3ను చేపట్టారు. ఈనెల 26 నుంచి ఆదివారం వరకు నాలుగు కాల్ సెంటర్లలో సోదాలు నిర్వహించారు. ఇందులో హైదరాబాద్‌లోని వయోజెక్స్ సొల్యూషన్స్, విశాఖలోని వీసీ ఇన్ఫో మెట్రిక్స్, అత్రియా గ్లోబల్ సర్వీసెస్, పుణేలోని రీజెంట్ ప్లాజాలోని కాల్ సెంటర్లలో తనిఖీ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. కీలక నిందితుల్లో పుణేలో 10 మంది, హైదరాబాద్‌లో ఐదుగురు, విశాఖపట్నంలో 11 మందిని అరెస్టు చేశామన్నారు. సోదాల్లో రూ.58.45 లక్షల నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలు సహా మొత్తం 951 వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ దర్యాప్తు సంస్థల నుంచి అందిన సమాచారం మేరకు సీబీఐ ఆపరేషన్ చక్ర-3 చేపట్టింది.

15 కేజీల గడ్డ తొలగింపు

మహిళకు శస్త్రచికిత్స చేసిన భద్రాచలం ఎమ్మెల్యే

భద్రాచలం అర్బన్: కొద్ది రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న ఓ మహిళకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం శస్త్రచికిత్స చేసి 15 కేజీల ఒవేరియన్ సిస్ట్ గడ్డ తొలగించారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన కుంజ రత్తమ్మ కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. రత్తమ్మకు పరీక్షలు నిర్వహించి స్కానింగ్ చేయగా కడుపులో ఒవేరియన్ సిస్ట్ ఉన్నట్లు తేలింది. దీంతో ఎమ్మెల్యే వెంకట్రావు గంటన్నర పాటు శ్రమించి రత్తమ్మకు శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. ప్రస్తుతం రత్తమ్మ ఆరోగ్యంగా ఉంది.



రత్తమ్మ కడుపులో నుంచి తీసిన గడ్డను చూపిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దసరాకు 6 వేల ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: దసరా పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రజలకోసం 6 వేల ప్రత్యేక బస్సులను తిప్పనున్నట్టు ఆర్టీసీ ప్రకటించింది. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి నేపథ్యంలో, ఈసారి పండగ సమయంలో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ మరింత ఎక్కువ ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. దీంతో గత దసరా సమయంలో నడిపిన ప్రత్యేక బస్సుల కంటే ఈసారి ఎక్కువ నడపాలని నిర్ణయించింది. గతేడాది 5265 ప్రత్యేక బస్సులు నడిపగా, అంతకు ముందు సంవత్సరం ఆ సంఖ్య 4280 మాత్రమే. అక్టోబరు 1 నుంచి 15 వరకు ఈ బస్సులు తిప్పుతారు. వీటిల్లో ముందస్తు రిజర్వేషన్ వసతి కల్పించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక బస్సులకు సంబంధించి తెలంగాణ పరిధిలో తిరిగేవాటిల్లో 25 శాతం అదనపు చార్జీ ఉంటుందని చెబుతున్నారు. అదే ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీ 50 శాతంగా ఉండనుంది. రెగ్యులర్ సర్వీసుల్లో మాత్రం ఎలాంటి అదనపు రుసుము ఉండదు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్‌నగర్, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఐటీ కారిడార్‌లో పనిచేసే ఉద్యోగులు, అక్కడి ప్రజల సౌకర్యార్థం గచ్చిబౌలి ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు బస్సులు నడపనున్నట్టు పేర్కొన్నారు. ఇలాంటి పెద్ద పండగల సమయంలో ప్రత్యేక బస్సులు తిప్పటంలో ఆర్టీసీ ఉద్యోగులకు మంచి అనుభవం ఉందని, ఈసారి మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నందున రద్దీ మరింత ఎక్కువ ఉండే అవకాశం ఉందన్నారు. దీంతో ఉద్యోగులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా గమ్యం చేర్చాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉద్యోగులకు సూచించారు. 12న దసరా పండగ ఉన్నందున, 9, 10, 11 తేదీల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, అవసరమైతే ఆయా రోజుల్లో మరిన్ని బస్సులు తిప్పాలని పేర్కొన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న రోజుల్లో టోల్‌ప్లాజాల్లో ఆర్టీసీ బస్సులకు ప్రత్యేక లేన్లు కేటాయించేలా ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మాట్లాడాలని పేర్కొన్నారు. ఈసారి కరీంనగర్, నిజామాబాద్ రూట్లలో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



నేటి నుంచి నల్లమల జంగల్ సఫారీ

9 నెలల పాటు పర్యటనకు అవకాశం.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సేవలు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో పర్యాటక ప్రియుల కోసం సఫారీ సేవలు మంగళవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. వన్యప్రాణులు ముఖ్యంగా పెద్దపులుల సంతానోత్పత్తికి జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలు అనుకూలం. ఈ క్రమంలో మూడు నెలలుగా అటవీ సరిహద్దు ప్రాంతంలో వాటి స్వేచ్ఛ దృష్ట్యా జనసంచారం ఉండకూడదని సఫారీ మూసివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్టోబర్ 1 నుంచి సఫారీ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నేచర్ గైడ్స్‌తో...: పర్యాటకులకు సలహాలు, సూచనలు చేసేందుకు ప్రతి వాహనం వెంట అనుభవజ్ఞులైన ఒక నేచర్ గైడ్ అందుబాటులో ఉంటారు. వర్షాకాలం కావడంతో అడవులు ఆకుపచ్చ రంగులో ఆహ్లాదంగా ఉండటంతోపాటు పెరిగిన వన్యప్రాణుల సంచారం కూడా సఫారీ ట్రిప్ పర్యాటకులను ఆకట్టుకునేలా ఉంటుంది.

రెండు రకాల ప్యాకేజీలు

ఆన్‌లైన్‌లో సఫారీ టూర్ బుక్ చేసుకున్న వారికి రూ.4,500 నుంచి 8,000 వరకు రెండు రకాల ప్యాకేజీలు ఉంటాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక టి, రెండు రోజుల పాటు మరో సఫారీ టూర్ ఉంటుంది. సఫారీ వాహనంలో ఏడుగురు మాత్రమే ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. పర్యాటకులు బస చేసేందుకు వనమాలిక ప్రాంగణంలో ఏసీ, నాన్ ఏసీ గదుల సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారు మొదటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు మన్ననూర్ వనమాలిక వద్దకు చేరుకోవాలి. అటవీశాఖ సిబ్బంది వారికి కాటేజీలను కేటాయించడంతో పాటు ఇతరత్రా ఏర్పాట్లు చేస్తుంది. మరుసటి రోజు ఉదయం అక్కడ ఏర్పాటు చేసిన పర్యాటక కేంద్రం, బయోల్యాబ్, ప్లాస్టిక్ రీసైక్లింగ్, వన్యప్రాణుల విడి భాగాల ప్రదర్శన కేంద్రం చూపిస్తారు. ఆ తర్వాత ఫర్హాబాద్ చౌరస్తా మీదుగా అటవీ ప్రాంతంలోకి వెళ్లి.. సహజ సిద్ధమైన ప్రకృతి రమణీయమైన ప్రదేశాలను వీక్షించే అవకాశం కల్పిస్తారు. అనంతరం తిరిగి మన్ననూర్‌లోని కాటేజీలకు చేరుకుంటారు. ఈ క్రమంలో వారికి కావాల్సిన భోజన ఏర్పాట్లను అటవీ శాఖ సిబ్బంది సమకూర్చుతుంది. రెండోరోజు ప్రతాపరుద్రుని కోట వరకు ట్రెక్కింగ్, అనంతరం ఉమామహేశ్వర క్షేత్రం దర్శించుకొని తిరిగి మన్ననూర్‌కు చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.



నల్లమలలోని వ్యూ పాయింట్. ఇన్‌సెట్‌లో జంగల్ సఫారీ వాహనం ఇదే

- సఫారీ టూర్ కోసం పర్యాటకులు https://amrabadtigerreserve.com / వెబ్‌సైట్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



బలగం తోడుగా 'శతాధిక' సంబురం



సాక్షి, హైదరాబాద్: ఆమె పేరు బైరి బాలమ్మగౌడ్. హైదరాబాద్‌లోని ఉప్పల్ చిలుకానగర్. వయసు నూటా రెండేళ్లు. ఆమెకు నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు.. చాలా పెద్ద బలగం. ఇంత వయసులోనూ ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా, ఇప్పటికీ చురుగ్గా ఉండటం ఆమె స్పెషాలిటీ. చిన్న ఊతకర్ర సాయంతో చక్కగా నడుస్తారు. స్నానంతో సహా తన పనులన్నీ స్వయంగా చేసుకుంటారు. చిన్నప్పటి నుంచి కష్టపడి పనిచేయడం, కుటుంబమంతా కలసి ఉన్న సంతోషమే తన ఆరోగ్య రహస్యమని ఆమె చెప్తుంటారు. ఆలేరు సమీపంలోని కొలనుపాకకు చెందిన బాలమ్మ కుటుంబం చాలా ఏళ్ల క్రితమే నగరానికి వలస వచ్చింది. కొడుకులు, కూతుళ్లు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆమె తరచుగా వారి ఇళ్లకు వెళ్లి వస్తుంది, వారూ తరచూ ఆమె వద్దకు వచ్చి ఉంటుంటారు. రికార్డుల ప్రకారం బాలమ్మ 1922వ సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన జన్మించారు. 2022 ఏప్రిల్ నాటికి ఆమెకు వందేళ్లు నిండటంతో.. కొడుకులు, కూతుళ్లు, వారి పిల్లలు కలసి వందేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలసి ఉంటే కలదు సుఖం మాత్రమేకాదు.. కలదు ఆరోగ్యం అన్నదానికి ప్రతీక ఆమె..

'శతమానం భవతి' సాకారమయ్యేలా..

ఓటరు లిస్టు ప్రకారం రాష్ట్రంలో వృద్ధుల సంఖ్య గణనీయంగానే ఉంది. 70ఏళ్ల నుంచి 90ఏళ్ల వరకు మధ్యవారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వందేళ్లకు చేరినవారు 3,055 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,284 మందికాగా, మహిళలు కొంత ఎక్కువగా 1,770 మంది ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

సైబర్ బానిసత్వంలో తెలుగు యువత!



థాయ్‌లాండ్, మయన్మార్, వియత్నాం, కంబోడియా వంటి దేశాలకు పర్యాటక వీసాలపై వెళ్లి తిరిగిరాని వారి సంఖ్య గణనీయంగా ఉందని కేంద్రం వెల్లడించింది. 2022- 2024 మధ్య కాలంలో దేశానికి తిరిగిరాని వారి సంఖ్య 29,446గా ఉందని వెల్లడించింది. ఇందులో గరిష్ట సంఖ్యలో యువతే ఉండగా, వీరంతా అధిక జీతాల ఆశతో విదేశాలకు వెళ్లి 'సైబర్ బానిసత్వం'లో చిక్కుకున్న వారేనని తెలిపింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ ఈ వివరాలను వెల్లడించింది.

సాక్షి, న్యూఢిల్లీ

ఆగ్నేయ ఆసియా దేశాలకు పర్యాటక వీసాలపై వెళ్లి తిరిగి రాని తెలుగుబిడ్డలు

- గడిచిన రెండేళ్లలో తెలంగాణ నుంచి 1,169మంది, ఏపీ నుంచి 602 మంది గాయబ్
- దేశవ్యాప్తంగా రెండేళ్లలో 29,466మంది తిరిగి రాలేదని వెల్లడించిన కేంద్రం
- అత్యధికంగా పంజాబ్‌లో 3,667..మహారాష్ట్రలో 3,233

తెలుగు రాష్ట్రాల నుంచి ఎక్కువే..

అధిక జీతాలు, ఉద్యోగ భరోసా వంటి వాగ్దానాలతో దేశ యువతకు గాలం వేస్తున్న పలు ఏజెన్సీలు, వ్యక్తులు వారిని ఆగ్నేయ ఆసియా దేశాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి సైబర్ మోసాలతోపాటు, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు వీరిని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ఫేక్ ఐడీలను సమకూర్చి ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్, ట్రేడింగ్, డేటింగ్, గేమింగ్ స్కామ్‌లను వీరితో చేయిస్తున్నారు. ఉద్యోగాల ఆశతో పర్యాటక వీసాలపై 2002-24 వరకు కంబోడియా, థాయ్‌లాండ్, మయన్మార్, వియత్నాం వంటి దేశాలకు వెళ్లిన వారి సంఖ్య 73,138 మంది ఉండగా ఇందులో 29,466 మంది తిరిగి రాలేదు. ఇందులో అత్యధికంగా పంజాబ్ నుంచి 3,667, మహారాష్ట్ర నుంచి 3,233, తమిళనాడు నుంచి 3,124 మంది ఉండగా, తెలంగాణ నుంచి 1,169, ఏపీ నుంచి 602 మంది ఉన్నారు. మొత్తం సంఖ్యలో 17,115 మంది 20-39ఏళ్ల మధ్య వారేనని కేంద్రం తెలిపింది. ఈ మొత్తం మందిలో 21,182 మంది పురుషులు ఉన్నారని, ఇందులోనూ అత్యధికంగా 20,450 మంది థాయ్‌లాండ్, 6,242 మంది వియత్నాం, 2,271 మంది కంబోడియా, 303 మంది మయన్మార్ దేశాలకు వెళ్లి తిరిగిరాని వారిలో ఉన్నారని వెల్లడించింది. తిరిగిరాని వారిలో అత్యధికంగా ముంబయి సబర్బన్ నుంచి 1,017 మంది ఉండగా, గోరఖ్‌పూర్ ప్రాంతం నుంచి 784, బెంగళూరు అర్బన్ నుంచి 700ల మంది ఉండగా, హైదరాబాద్ నుంచి 425 మంది ఉన్నారని కేంద్రం తెలిపింది. ఎయిర్‌పోర్టుల వారీగా చూస్తే మొత్తం తిరిగిరాని వారిలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి 4,699 మంది ఉండగా, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లిన వారిలో 1,577 మంది ఉన్నారని కేంద్రం వెల్లడించింది. దేశానికి తిరిగిరాని వ్యక్తుల అంశాలపై దర్యాప్తు చేయడంతోపాటు ఈ కేసుల పరిష్కారానికి కేంద్రం ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐటీ, ఇమిగ్రేషన్ మంత్రిత్వ శాఖలతో కలిపి ఒక ఉన్నతస్థాయి కమిటీని ఇదివరకే ఏర్పాటు చేయగా, ఈ కమిటీ తిరిగిరాని వ్యక్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించి వివరాలను సేకరించాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో కేంద్రం తన వద్ద సమాచారాన్ని వివిధ ప్రభుత్వ శాఖల సీనియర్ అధికారులతో పాటు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వంటి భద్రతాసంస్థలకు చేరవేసి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

చెత్తకుప్పలుగా విలువైన మందులు



సుమారు రూ.కోటిన్నర విలువ చేసే మందులను సెంట్రల్ డ్రగ్ స్టోర్ అధికారులు సంచుల్లో నింపి స్టోర్‌రూమ్ వెనుక పారవేశారు. ఇందులో జలుబు, జ్వరం, తలనొప్పి, ఇతర జబ్బులకు సంబంధించిన మందులు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గంగాస్తాన్‌లో సెంట్రల్ డ్రగ్‌స్టోర్ ఉంది. జిల్లాలోని 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు , ఒక ఏరియా ఆస్పత్రి , జిల్లా ఆస్పత్రికి ఇక్కడి నుంచి మందులు పంపిణీ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన మందులను ఇక్కడి సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌లో నిల్వ చేశారు. అయితే ఈ మందులను ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయలేదు. సుమారు ఏడాదిన్నర కాలంగా మందులు అలాగే ఉన్నాయి. కరోనా సమయంలో రోగులకు ఇవ్వాల్సిన మందులు కూడా ఇవ్వలేదు. వాటిని కూడా పంపిణీ చేయకుండా అలాగే నిల్వ ఉంచారు. దీంతో ఆ మందుల కాలపరిమితి దాటిపోయింది. రక్తపరీక్షల కోసం పంపిణీ చేసిన పరికరాలు, ఆస్పత్రిలో శుభ్రం చేసేందుకు వినియోగించే కెమికల్స్, ఇతర పరికరాలు ఇలా నిరుపయోగంగా పడి ఉన్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


పత్తి రైతు చిత్తు

రైతులను దళారులు దోపిడీ చేస్తున్నా పట్టించుకోని వ్యవసాయ శాఖ

పంట మార్కెట్‌కు వస్తున్నా సీసీఐ కేంద్రాల ఏర్పాటులో వైఫల్యం

పది రోజుల కిందట రూ.8,200 పలికిన క్వింటాలు పత్తి

ప్రస్తుతం మద్దతు ధర రూ.7,521 కన్నా తక్కువకే కొంటున్న వ్యాపారులు, దళారులు



సాక్షి, హైదరాబాద్: పది రోజుల కిందట క్వింటాలు పత్తి రూ.8,200 పలికింది. కానీ ఒకట్రెండు రోజులుగా ధరలు తగ్గుముఖం పట్టాయి. దళారులు రోజుకో రేటు ఖరారు చేస్తూ రైతుల్ని ఆగమాగం చేస్తున్నారు. పత్తి మార్కెట్లోకి వస్తున్న సమయంలో గిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. క్వింటాలు ధర రూ.7 వేల వరకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పత్తికి కాలం కలిసి రాలేదు. ఆశించిన దిగుబడి వచ్చే పరిస్థితి లేని సమయంలో పండిన పంటకన్నా కనీసం మంచి ధర వస్తే పెట్టుబడి దక్కుతుందని రైతులు భావించారు. కానీ దళారులు, వ్యాపారులు పత్తి ధరలను ఇష్టమొచ్చినట్లుగా ఖరారు చేస్తున్నారు. ప్రభుత్వం రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. కాటన్ కార్పొరేషన్ ఇండియా (సీసీఐ) పత్తిని కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిజానికి తేమ శాతం 12–13 శాతం ఉంటే ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న పత్తిలో 25 నుంచి 30 శాతం దాకా తేమ ఉంటోందని, రంగు మారిందన్న నెపంతో వ్యాపారులు, దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు.

ఈసారి సగం దిగుబడే..!

రాష్ట్రంలో ఈసారి పత్తి సాగు పడిపోయింది. సాధారణ సాగు విస్తీర్ణం 50.48 లక్షల ఎకరాలు కాగా..కేవలం 43.76 లక్షల ఎకరాలకే పరిమితమైంది. వాస్తవానికి పత్తి రైతును మొదట్నుంచీ కష్టాలే వెంటాడాయి. తొలుత విత్తనాలు వేసేందుకు అనువైన వర్షాలు పడలేదు. విత్తాక వర్షాలు పడకపోవడంతో మొలకలు రాక, వచ్చిన మొలకలు ఎండిపోయి రెండు మూడుసార్లు విత్తాల్సి వచ్చింది. ఈసారి పత్తి విత్తనాల ధరలు విపరీతంగా పెరగడంతో ఖర్చులు పెరిగాయి. ఎరువులు, డీజిల్ ధరలు కూడా పెరగడంతో పెట్టుబడి పెరిగింది. ఇక పైరు ఏపుగా పెరిగి పూతకు వచ్చిన దశలో భారీ వర్షాలు పడ్డాయి. దాంతో పత్తి పైర్లు నీట మునిగాయి. పూత, కాయ నేలరాలింది. చెట్టు కొమ్మలు నీటిలో వాలడంతో తెగుళ్ల సోకి పంట దెబ్బతింది. సాధారణంగా ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా, ఈసారి ఐదారు క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తుందని అంటున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా పత్తి దిగుబడులు 25 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితం అయ్యే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ వర్గాలు తెలిపాయి.

సీసీఐ కేంద్రాలు తెరవడంలో నిర్లక్ష్యం

తొలి పత్తి తీత పనులు ప్రారంభమై ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి పంట వస్తోంది. అక్టోబర్ నుంచి ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయాల్సిన సీసీఐ ఇప్పటివరకు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కనీసం ఎక్కడెక్కడ కేంద్రాలు పెట్టేదీ చెప్పలేదు. ఏటా వ్యాపారులు, దళారులు పత్తిని కొనుగోలు చేశాక సీసీఐ వచ్చి రైతుల నుంచి కాకుండా ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద కొనుగోలు చేస్తోందనే ఆరోపణలున్నాయి. పత్తి పంటకు గత మూడు సీజన్లుగా ఆశించిన ధర లేక రైతులకు గిట్టుబాటు కాలేదు. ఈ ఏడాదైనా కలిసొస్తుందని ఆశించిన రైతులకు ముందే భారీ వర్షాలు నష్టం చేకూర్చాయి. కనీసం పండిన పంటకైనా గిట్టుబాటు ధర లభిస్తే కాస్త ఊరట లభిస్తుందనుకుంటే, వ్యాపారుల ఇష్టారాజ్యం, సీసీఐ నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు తప్పట్లేదు. ఈ ఏడాది 350 వరకు పత్తి కొనుగోలు కేంద్రాలు పెట్టాలని నిర్ణయించామని, వచ్చే నెల నుంచి అవి అందుబాటులోకి వచ్చే అవకాశముందని మార్కెటింగ్‌శాఖ వర్గాలు అంటున్నాయి. సీసీఐ కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం చేస్తుండటంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మేసుకుంటున్నారు.

రికార్డు స్థాయిలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరిగిపోయిన నేపథ్యంలో జిల్లాల్లో విద్యుత్ ఆపరేషన్స్ విభాగం అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లాల ఎస్ఈలు, సీఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఖరీఫ్‌లో వరిసాగు రికార్డు స్థాయిలో జరుగుతుండటంతో ఎండా కాలం తరహాలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోయిందన్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 9,862 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు కాగా ఈ ఏడాది 9,910 మెగావాట్లకు పెరిగిందన్నారు. సీజన్ ముగిసేనాటికి గరిష్ట డిమాండ్ 10,000 మెగావాట్లు, వినియోగం 200 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని ఆయన అన్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో 15,370 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు కాగా, ఈ ఏడాది సెప్టెంబర్ 20న 15,570 మెగావాట్లకు పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

6,233 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలో 6,233 మంది ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగుల సర్వీసును మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 1,423 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 3,907 మంది పార్ట్‌టైమ్ ఉద్యోగులు, 901 మంది హానరోరియమ్ పద్ధతిలో కొనసాగనున్నారు.


మాటిచ్చాం.. నిలబెట్టుకున్నాం: బల్మూరి

సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన మాట ప్రకారం 55 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలను విడుదల చేసి 11,062 టీచర్ పోస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు తెలిపారు. మాటిచ్చాం, నిలబెట్టుకున్నామంటూ సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ప్రక్రియ పూర్తి చేసి నిలబెట్టుకున్నారని వెంకట్ వెల్లడించారు.

'అక్రమ నిర్మాణాలు, మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ వైఖరేంటి?'

సాక్షి, హైదరాబాద్: ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు, మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ వైఖరేంటో చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ డిమాండ్ చేశారు. రాజకీయ కుట్రలో భాగంగానే హైడ్రాపై మొసలి కన్నీరు కారుస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయపరమైన చిక్కులు, అడ్డంకులను ఎదుర్కొంటూ ఎలాంటి భేదం లేకుండా భావితరాలకు సుందరమైన నగరాన్ని అందించాలని, రేవంత్‌రెడ్డి కలలను నిజం చేస్తూ హైడ్రా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గతంలోనే సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పులున్నాయని, దానిపై ఎవరు మాట్లాడినా కోర్టు ధిక్కారం కింద సుమోటోగా కేసులు నమోదు చేయాలని సుధాకర్ తెలిపారు.

చార్మినార్, బుద్ధవిగ్రహం, టీ–హబ్‌లకు గులాబీ వెలుగులు



- రొమ్ము కేన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచడానికే పింక్ విద్యుత్ దీపాలు
- ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రఘురామ్

సాక్షి, హైదరాబాద్: రొమ్ము కేన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడానికి తమ ఫౌండేషన్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ పి.రఘురామ్ వెల్లడించారు. ఇందులో భాగంగా చార్మినార్, బుద్ధ విగ్రహం, టీ-హబ్, ప్రసాద్ ఐమాక్స్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, కిమ్స్ ఆసుపత్రులకు గులాబీ రంగులో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అవగాహనలో భాగంగా ప్రజల దృష్టిని ఆకర్షించడానికే ఆయా కట్టడాలకు పింక్ రంగు విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ రొమ్ము కేన్సర్ అవగాహన నెల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. అక్టోబర్ నెలను అంతర్జాతీయంగా రొమ్ము కేన్సర్ అవగాహన నెలగా గుర్తించారన్నారు. భారతదేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మహిళకు రొమ్ము కేన్సర్ నిర్ధారణ అవుతోందన్నారు. ఇన్ని చారిత్రక, ప్రముఖ కట్టడాలు ఒకే రాత్రి పింక్ రంగులో వెలిగిన నగరం ప్రపంచంలో ఒక్క హైదరాబాద్‌లో మాత్రమేనని ఆయన చెప్పారు. 'పెయింట్ ది సిటీ పింక్' ప్రచారంలో ముఖ్య ఉద్దేశం రొమ్ము కేన్సర్‌పై



పోరాడుతున్న మహిళలకు ధైర్యం, విజయం, ఆశకు సంకేతం ఇవ్వడమన్నారు. అలాగే 40 సంవత్సరాలు పైబడిన మహిళలు ప్రతి సంవత్సరం స్క్రీనింగ్ మామోగ్రామ్ చేయించుకోవాలని గుర్తు చేయడమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వైట్ హౌస్, బకింగ్‌హామ్ ప్యాలెస్, టవర్ ఆఫ్ లండన్, ఐఫిల్ టవర్ వంటి ప్రసిద్ధ కట్టడాలకు అక్టోబర్ నెలలో పింక్ రంగులో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తారన్నారు.

ప్రపంచ విషపూరిత నదుల్లో 23వ స్థానంలో మూసీ

- కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ విషపూరిత నదుల్లో హైదరాబాద్‌లోని మూసీ 23వ స్థానంలో ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మూసీ చుట్టుపక్కల ఉన్న బోర్ వాటర్ కూడా కలుషితమైందని, అందుకే దాని పక్కన ఉన్న ప్రజలను తరలించాలని ప్రభుత్వం చూస్తోందని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మూసీ పక్కన ఉంటున్న వాళ్ల శరీరంలో హెవీ మెటల్స్ ఉన్నట్లు తేలిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పక్కన తాను నివాసం ఉన్నానని, ఆ బాధలు ఏంటో తనకు తెలుసునని స్పష్టం చేశారు. ప్రజలు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పా? అని ప్రశ్నించారు. మూసీ, హైడ్రాపై కేటీఆర్, హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ చేయలేని పనిని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్నారు. కేటీఆర్ ఫామ్‌హౌస్ కట్టుకొని హాయిగా ఉండొచ్చునని, ఇటలీ నుంచి వచ్చే నీళ్ల కేటీఆర్ తాగుతున్నాడని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు శనిలాగా దాపురించారని శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు.



రైల్ బస్సు.. ప్రయాణం మిస్సు

ప్రకృతి అందాల నడుమ విశేష సేవలందించిన రైల్ బస్సు మూలనపడింది. బొబ్బిలి–సాలూరు మధ్య 21 కి.మీ. మేర ఒక ఇంజిన్, రెండు బోగీలతో నడిచే ఈ రైల్ బస్సును 1993లో ప్రారంభించారు. 15 గిరిజన గ్రామాల మధ్య ఇది నడిచేది. ఈ రైలు బస్సును నడపలేక రైల్వే అధికారులు మూలనపెట్టేశారు. ప్రస్తుతం ఇది విశాఖలోని రైల్వే స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలో ఇలా ఉండిపోయింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



'ఉద్యోగ' దీక్షబూని..

'కొడితే కొట్టాలిరా.. సిక్స్ కొట్టాలి.. పడితే పట్టాలిరా.. కొలువు పట్టాలి' అన్నట్టుగా ఉద్యోగ సాధన దీక్ష చేపట్టారు విజయనగరంలోని నిరుద్యోగులు. ప్రశాంత వాతావరణంలో తదేక దీక్షతో చదువుతూ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు. విజయనగరం కోటలోను, చుట్టుపక్కల గట్లు, చెట్ల కింద పదుల సంఖ్యలో నిరుద్యోగ యువత ఇలా చదువుతూ కనిపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ఇదేంటన్నా.. పోలీసన్నా

వాహన చోదకులు రహదారి నిబంధనలను అతిక్రమిస్తే.. అడ్డుకోవాల్సిన పోలీసులే నిబంధనల్ని అతిక్రమిస్తే ఏమనాలి. ఏమైనా అందామంటే.. వాళ్లు ఊరుకుంటారా. హెల్మెట్ ధరించకుండా మోటార్ సైకిల్‌పై నడపడమే కాకుండా.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ కొందరు పోలీసులు ఇలా ముందుకు సాగిపోతున్నారు. నిబంధనల్ని తోసిరాజని నెల్లూరు ఓ కానిస్టేబుల్ మాగుంట లేఅవుట్ ప్రాంతంలో కెమెరా కంటికి చిక్కారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా...

ఏపీటీపీసీ చైర్మన్‌గా బాబురావు బాధ్యతలు స్వీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీటీపీసీ) చైర్మన్‌గా వజ్జా బాబురావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ అధ్యక్షతన ఏపీటీపీసీ సర్వసభ్య సమావేశం నిర్వహించి 2021–22 సంవత్సరానికి సంబంధించిన వార్షిక లావాదేవీలను పరిశీలించి ఆమోదించారు. పరిశ్రమల శాఖ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కోస్ట్‌గార్డ్ కమాండర్‌గా డోనీ మైఖేల్ బాధ్యతల స్వీకరణ



సింథియా: తూర్పు సముద్ర తీరానికి కోస్ట్‌గార్డ్ కమాండర్‌గా ఏడీజీ డోనీ మైఖేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2023లో ఇండియన్ కోస్ట్‌గార్డ్ రీజియన్ ఈస్ట్‌కు కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఏడాది కంటే తక్కువ వ్యవధిలోనే తూర్పు సముద్రతీరానికి కోస్ట్‌గార్డ్ కమాండర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు సోమవారం విధుల్లో చేరారు.

పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందిస్తాం: దీపక్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన యువతను అందించడానికి ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పన, వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ(సీడ్ యాప్) సిద్ధంగా ఉందని చైర్మన్ దీపక్‌రెడ్డి తెలిపారు. సీడ్ యాప్ కార్యాలయంలో సోమవారం ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు తెలిపారు. సీడ్ యాప్ సంస్థ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

స్టీల్ ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీగా సక్సేనా బాధ్యతల స్వీకరణ




డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో సమావేశమైన ఏకే సక్సేనా

ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీగా మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (మొయిల్) సీఎండీ ఏకే సక్సేనా సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన స్టీల్ ప్లాంట్ డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ఆ తర్వాత బ్లాస్ట్‌ఫర్నేస్–2కు వెళ్లి అక్కడి అధికారులతో భేటీ అయ్యారు.

చేనేత సొసైటీల్లో ఎన్నికలకు కసరత్తు

సొసైటీ సభ్యుల జాబితాల సేకరణలో అధికారులు

- రాష్ట్రంలో 960 సొసైటీలు..
- బోగస్‌వి 200 పైనే.
- కార్యకలాపాల్లేని సొసైటీలు 600
- యాక్టివ్‌గా ఉన్నవి 100 నుంచి 150 మాత్రమే
- బోగస్ సొసైటీలను తొలగించాలని పలువురి డిమాండ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాల (సొసైటీ) ఎన్నికల కసరత్తును ప్రభుత్వం ప్రారంభించింది. అక్టోబర్ 21న షెడ్యూల్ విడుదల చేసి, డిసెంబర్ 6వ తేదీకి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఏ సొసైటీల పరిధిలో ఎంత మంది సభ్యులున్నారన్న వివరాలతో కూడిన జాబితాలను చేనేత జౌళి శాఖ సేకరిస్తోంది. ఆ జాబితాలను పరిశీలించి నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలను అధికారులు ఖరారు చేస్తారు. అయితే, ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పదేళ్లుగా సొసైటీలకు ఎన్నికలు జరగకపోవడంతో ఓటర్ల జాబితా ఖరారు, బోగస్ సొసైటీల వ్యవహారం వంటి అనేక సమస్యలు ఎన్నికలకు అవరోధంగా మారాయి. మరోవైపు వ్యవసాయ పరపతి సంఘాల ఎన్నికలు సైతం నిర్వహించాలనే ప్రతిపాదన ఉండటంతో చేనేత సొసైటీ ఎన్నికలు ముందు వెనుక అయ్యే అవకాశం ఉందని చేనేత జౌళి శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఓటరు జాబితాల కసరత్తు పూర్తి చేసి ఎన్నికలను మరో రెండు నెలల తర్వాత నిర్వహించాలనే ప్రతిపాదన కూడా ఉందని, ఇంకా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని ఆ అధికారి చెప్పారు. ఎన్నికలు నిర్వహిస్తారనే సంకేతాలతో చేనేత సొసైటీ ఎన్నికల బరిలో దిగి పదవులు దక్కించుకునేందుకు పలువురు సమాయత్తమవుతున్నారు. తమ సొసైటీల పరిధిలో సభ్యుల జాబితాలు, వాటిలో మార్పులు, సభ్యులను చేర్పించడం వంటి చర్యలు చేపట్టారు. మరోపక్క కృష్ణా జిల్లా పెడనలో రాష్ట్రంలోనే తొలిసారిగా పూర్తిగా మహిళలతోనే ప్రత్యేకంగా చేనేత సొసైటీ ఏర్పాటుకు సోమవారం శ్రీకారం చుట్టారు.

పేరుకే సొసైటీలు.. యాక్టివ్‌గా ఉన్నవి కొన్నే

అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో 960 చేనేత సొసైటీలు ఉన్నాయి. వాటిలో 200కు పైగా బోగస్‌వే. మిగతా వాటిలో 600కు పైగా సొసైటీలు రికార్డుల్లోనే ఉన్నాయి తప్ప కార్యకలాపాలు ఏమీ లేవు. వాస్తవంగా నిత్యం కార్యకలాపాలు సాగిస్తూ యాక్టివ్‌గా ఉండే సొసైటీలు 100 నుంచి 150 మాత్రమే ఉంటాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర రాయితీల కోసం మాస్టర్ వీవర్స్, చేనేత రంగంలో బడా వ్యాపారులు వారి వద్ద పనిచేసే వారిని, కుటుంబ సభ్యుల పేర్లను చేర్చి సొసైటీలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరు ఏకంగా పదుల సంఖ్యలో బోగస్ సొసైటీలు ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పుడు వీటన్నింటినీ రద్దు చేస్తారా లేదా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. ఇటువంటి సొసైటీలను తప్పించి, వ్యవస్థను ప్రక్షాళన చేశాకే ఎన్నికలు జరిపాలని అసలైన సొసైటీల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

సొసైటీ నుంచి ఆప్కో వరకు ఎన్నికలు ఇలా..

ప్రతి సొసైటీకి తొమ్మిది మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. వారిలో ఇద్దరు మహిళా డైరెక్టర్లు కచ్చితంగా ఉండాలి. తొమ్మిది మంది డైరెక్టర్లు వారిలో ఒకరిని అధ్యక్షులుగా, మరొకరిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు. ప్రతి జిల్లా పరిధిలోని సొసైటీల అధ్యక్షులందరూ కలిసి ఒక ఆప్కో డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. అన్ని జిల్లాల ఆప్కో డైరెక్టర్లు వారిలో ఒకరిని ఆప్కో చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎంపికయ్యే ఆప్కో చైర్మన్, డైరెక్టర్లు, సొసైటీ పాలకవర్గాల పదవీ కాలం ఐదేళ్లు ఉంటుంది. అదే ప్రభుత్వమే నామినేట్ చేస్తే ప్రతి ఆరు నెలలకు ఒకసారి వారి పదవిని పొడిగించాలి. చేనేత సొసైటీ ఎన్నికల్లో పోటీ చేసే వారి బ్యాంకు రుణాల కిస్తీల చెల్లింపులు మూడు నెలలకు మించి పెండింగ్‌లో ఉండకూడదు.

యూనియన్ పెన్షన్ స్కీమ్‌కు మేం వ్యతిరేకం

అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య



సమావేశంలో అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య నేతలు

సాక్షి, అమరావతి: కేంద్రం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య ప్రకటించింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు తమ సమాఖ్య దేశవ్యాప్తంగా పోరాటం చేస్తుందని ఏఐపీటీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కమలాకాంత్ త్రిపాఠి తెలిపారు. అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య(ఏఐపీటీఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం న్యూఢిల్లీలోని ఏఐపీటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఇందులో దేశంలోని 25 రాష్ట్రాల ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఏపీ నుంచి ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు హాజరయ్యారు. జాతీయ స్థాయిలో ఒకే దేశం ఒకే ఎన్నిక నినాదంతో ప్రధాని మోదీ ముందుకెళుతున్నారని, అలాగే ఒకే దేశం.. ఒకే పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు ఒకరకమైన పెన్షన్, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వేరే రకమైన పెన్షన్ విధానం ఇవ్వడం తగదని.. ఉద్యోగులకు ఏ రకమైన పెన్షన్ ఇస్తే ఎంపీలకు ఎమ్మెల్యేలకూ అదే రకమైన పెన్షన్ ఇవ్వాలని సమావేశంలో కోరినట్టు తెలిపారు.



"ఉలి దెబ్బలకు శిల శిల్పమైనట్లు.. కొయ్యకు ఉలితో రూపమిచ్చి జీవం పోస్తున్న వారి కళ అజరామరం.. దశాబ్దాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని వందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పెద్దవృక్షాల నుంచి చెక్కలను చెక్కితే నిజమైన దేవుడు ఇలానే ఉంటాడా అనేలా జీవం పోస్తారు. దేవుడి ప్రతిమలు, ప్రకృతి ఉట్టిపడే కొయ్యబొమ్మల తయారీలో వారి నైపుణ్యం జాతీయ స్థాయిలో బయట ప్రపంచానికి పరిచయమైంది. వీరు తయారు చేసిన బొమ్మలకు ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడడంతో చేతి నిండా పని దొరుకుతోంది. ఆధునిక కాలానికి అనుగుణంగా కళాకారులకు కాసింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉంది.

దైవ సంకల్పం మాధవ శిల్పం

రేణిగుంట: నిద్రలో కనేది కల.. నిద్ర లేపేది కళ.. కొయ్యబొమ్మల కళాకారులను కళ నిద్ర లేపుతూనే ఉంటుంది. అందుకు వారు తయారు చేసే బొమ్మలే తార్కాణం.. చెక్కకు జీవం పోయడంలో వారి అపార మేధో సంపత్తికి కొలమానం లేదు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని కుగ్రామమైన మాధవమాల కొయ్యబొమ్మలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతోంది. అనాదిగా ఇక్కడ కళాకారులు తయారు చేసిన కొయ్యబొమ్మలు జాతీయస్థాయి ప్రదర్శనల్లో పెట్టడం, ఈ బొమ్మలు ప్రపంచ ప్రాచుర్యం పొందాయంటే గర్వకారణం. కొయ్యబొమ్మల తయారీనే వృత్తిగా చేసుకుని ఇక్కడ వందలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. బాలాజీ ఉడ్ కార్వింగ్ ఆర్టిషన్స్ మ్యూచువలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరిట 2013లో కొయ్యబొమ్మల తయారీ కళాకారులతో సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంస్థ అధ్యక్షుడిగా లోకనాథాచారి, కార్యదర్శిగా రాజాచారి, సీఈఓగా తిరుపతికి చెందిన గోవిందయ్య, చీఫ్ ప్రమోటర్‌గా కృష్ణమూర్తి కొనసాగుతున్నారు. మాధవమాల, గోపాలపురం, పాతవీరాపురం, శ్రీకాళహస్తి, బీఎన్‌కండ్రిగ, తొట్టంబేడు, రేణిగుంట తదితర మండలాలకు చెందిన సుమారు 360 మందికి పైగా కొయ్యబొమ్మల కళాకారులను గుర్తించారు. వారితో సమావేశాలు జరిపి సంస్థలో పనిచేసేందుకు ఒప్పించారు. డీఆర్‌డీఏ, నాబార్డు సహకారంతో సంస్థలోని కొయ్యబొమ్మల కళాకారులను గ్రూపులుగా తయారు చేశారు. గ్రామంలో ఓ భవనం నిర్మించి అక్కడే కార్మికులు పని చేసుకునే సౌలభ్యం కల్పించారు.

టెక్నాలజీ మేళవిస్తే..!

వీరి హస్తకళా నైపుణ్యంతో ఎలాంటి టెక్నాలజీని వాడకుండా సంప్రదాయబద్ధంగా చెక్కుతుంటేనే ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తోంది. అయితే వీరి కళకు టెక్నాలజీని మేళవించి అందుకు సరిపడా యంత్ర పరికరాలు, వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తే మరింత మెరుగ్గా కొయ్యబొమ్మ కళకు అందం తెస్తామని కళాకారులు చెబుతున్నారు. దీనికితోడు తమకు విరివిగా రుణాలిచ్చి ముడి సరుకు కొనుగోలు భారం పడకుండా సాయపడాలని కోరుతున్నారు.

మాధవుని ప్రతిమల తయారీకే ప్రాధాన్యం

ఇక్కడి కళాకారులు ఒక అడుగు నుంచి 15 అడుగుల వరకు వివిధ రకాల దేవతల కొయ్యబొమ్మలను తయారు చేస్తారు. అవి దైవరూపాన్ని సాక్షాత్కరించి జీవం ఉట్టిపడేలా చెక్కడం వీరి ప్రత్యేకత. దీంతో పాటు ఆలయాల ధ్వజస్తంభాలు, రథాలు, ప్రధాన ద్వారాలు, తయారు చేసిన బొమ్మలను సంస్థ ద్వారా జైపూర్, ముంబై, కోల్‌కతా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో జరిగే ఎగ్జిబిషన్లకు పంపుతారు. అక్కడ నుంచి చైనా, జపాన్, లండన్, అమెరికా తదితర దేశాలకు బొమ్మలను ఎగుమతులు చేస్తారు. అమ్మకాలు జరిగిన బొమ్మలకు సంబంధించిన డబ్బును ఆన్‌లైన్ ద్వారా సంస్థ ఖాతాకు పంపుతారు. ఏడాదిలో సగటున టర్నోవర్ రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఈ పరిశ్రమ ద్వారా కార్మికులు ఆర్జిస్తున్నారు.

కొయ్యబొమ్మల తయారీకి ముడిసరుకుగా..

కొయ్యబొమ్మల తయారీకి ముడిసరుకుగా టేకు, వేప, చీమచింత, తుమ్మ, దిరసన, మామిడి కొయ్యలను వాడుతున్నారు. శ్రీకాళహస్తి, తిరుపతి టింబర్ డిపోల నుంచి ముడిసరుకును మార్కెట్ ధర ప్రకారం విక్రయిస్తారు. వీటిపై ఎలాంటి రాయితీ లేదు. ప్రధాన ముడి సరుకు అయిన కొయ్యలపై రాయితీ ఇచ్చి నాణ్యమైన కొయ్యను డీఆర్‌డీఏ సరఫరా చేస్తే వీరికి ప్రయోజనకరంగా ఉంటుంది.


కలంకారీతో మహిళలకు ఉపాధి..

గ్రామానికి చెందిన కొందరు మహిళలు కళంకారీ శిక్షణ తీసుకుని సంస్థ భవన ప్రాంగణంలో కళంకారీ వస్త్రాలను రూపొందిస్తున్నారు. మహిళలు సైతం గ్రూపులుగా ఏర్పడి వస్త్రాలను కళంకారీ రంగులు అద్దుతున్నారు. మున్ముందు గ్రామంలో కళంకారీని కూడా మరింత విస్తృత పరిచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

యంత్ర పరికరాలిస్తే బాగుంటుంది



మారుతున్న కాలానుగుణంగా విభిన్నశైలిలో ఆకట్టుకునే కొయ్యబొమ్మల తయారీకి టెక్నాలజీకి అనుగుణమైన ఆధునిక యంత్ర పరికరాలను మాకు అందిస్తే కళకు మరింత ప్రాచుర్యం తీసుకొస్తాం. అలాగే మార్కెటింగ్ సదుపాయాలను మరింత విస్తృత పరచాలి. కార్మికులకు ప్రభుత్వం నుంచి మరిన్ని సబ్సిడీ రుణాలు అందించాలి.
– వెంకటముని ఆచారి, కొయ్యబొమ్మల కళాకారుడు, మాధవమాల



శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూలైన్ ఏటీసీ వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,066 మంది స్వామివారిని దర్శించుకోగా 29,044 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా.. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

అప్పన్నకు ఆర్జిత సేవలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 28 రోజులకు గాను రూ.1,39,44,045 వచ్చినట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి పద్మారాధన

డాబా గార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

మల్లన్నకు సహస్ర దీపార్చన సేవ



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవ నిర్వహించింది. వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

మహానందీశుడికి పల్లకి ఉత్సవం



మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకి సేవ నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయశర్మ, హనుమంతు శర్మ, అర్చకులు శరభయ్య ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అలంకరించి పూజలు చేశారు.

మహాలక్ష్మి ఆలయంలో దసరా ఉత్సవాలు

నెల్లూరు (బృందావనం): కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 12 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థాన పాలకమండలి చైర్మన్ నరసింహం తెలిపారు. అమ్మవారి సన్నిధిలో ఆహ్వాన పత్రికలను పాలకమండలి సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అమ్మవారు రోజూ విశేషాలంకారాల్లో దర్శనమిస్తారని వివరించారు.

భక్తి పారవశ్యంలో మునిగిన ఎల్లార్తి

హొళగుంద: అనంతపురం జిల్లా ఎల్లార్తి షేక్ షావలి, షాషావలి తాతల 362వ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉరుసుతో పాటు తెల్లవారుజామున నిర్వహించిన గంధం వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున దర్గా పీఠాధిపతి నూర్‌బాబా గంధం మోసుకుని ఊరేగింపుగా దర్గాలకు చేరారు.

స్విమ్స్‌లో 4న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ (నర్సింగ్), ఏహెచ్ఎస్, పీజీ డిప్లొమా వంటి పలు కోర్సుల్లో 53 సీట్లు ఖాళీగా ఉన్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 4వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్ణీత ఫీజుతో స్విమ్స్ కమిటీ హాలు లో జరిగే స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఎమ్మెస్సీ నర్సింగ్‌లో 19, ఎమ్మెస్సీ క్లినికల్ వైరాలజీలో ఒకటి, ఎమ్మెస్సీ కార్డియాక్ క్యాథెటరైజేషన్ టెక్నాలజీలో ఒకటి, ఎమ్మెస్సీ కార్డియో పల్మనరీ పర్ఫ్యూషన్ టెక్నాలజీలో రెండు, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్ సైన్సెస్‌లో ఏడు, పోస్ట్ బేసిక్ డిప్లొమా ఇన్ నర్సింగ్ ప్రొగ్రామ్‌లో 23 ఖాళీలు ఉన్నట్లు వివరించారు.



డిగ్రీ పరీక్షలకు ఫీజు గడువు 21

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మొదటి, మూడు, ఐదో సెమిస్టర్‌లకు సంబంధించి నవంబర్, డిసెంబర్‌లో జరగనున్న పరీక్షల ఫీజును 21వ తేదీలోపు చెల్లించాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధరుసుంతో 31వ తేదీ వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు.

అనువాదానికి భాషాజ్ఞానం ప్రధానం

తిరుపతి సిటీ: అనువాద ప్రక్రియకు భాషాజ్ఞానం పూర్తిస్థాయిలో ఉండాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు చెప్పారు. అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాన్స్‌లేషన్ టెక్నిక్స్ అండ్ చాలెంజస్ అనే అంశంపై సోమవారం సంస్కృత వర్సిటీలో రెండు రోజులపాటు జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనువాదమనేది జ్ఞానాన్ని ఇతరులకు అందించే గొప్ప సాధనమని చెప్పారు.

ఏయూలో ల్యాబ్ ప్రారంభం

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలో దివీస్ ల్యాబొరేటరీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.28 లక్షలతో ఆధునికీకరించిన అనలిటికల్ కెమిస్ట్రీ ల్యాబొరేటరీని సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, దివీస్ ల్యాబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి.రమణ ప్రారంభించారు. ల్యాబ్‌లో ఆధునిక పరికరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ల్యాబ్‌ను ఆధునికీకరించి అందించిన దివీస్ యాజమాన్యాన్ని వీసీ ప్రశంసించారు. భవిష్యత్తులో ఇదే విధంగా సహకారం, తోడ్పాటును అందించాలని కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలో గ్రీన్ కెమిస్ట్రీ కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ ప్రయోగశాలల ఆధునికీకరణకు దివీస్ సహకరించాలని కోరారు. ఏయూ త్వరలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ సేవలను ప్రారంభించనుందని చెప్పారు.

ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలు

విశాఖ సిటీ: ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలున్నాయని అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైంటిస్ట్స్ (ఏఏపీఎస్) ఫెలో అవార్డు గ్రహీత డాక్టర్ బండి నగేష్ చెప్పారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం సౌజన్యంతో 'ఎంపవరింగ్ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్' అనే అంశంపై సోమవారం ఫార్మసీ కాలేజిలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.

ఆర్గానిక్ కెమిస్ట్రీ పుస్తకావిష్కరణ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం సహాయ ఆచార్యుడు వూసల క్రిస్టోఫర్ రచించిన 'కాంప్రహెన్సివ్ అప్రోచ్‌తో ఆర్గానిక్ కెమిస్ట్రీ' పుస్తకాన్ని సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని చెప్పారు. పుస్తక రచయిత క్రిస్టోఫర్‌ను అభినందించారు.

హెల్త్ సాక్షి ప్లస్
మంగళవారం ॥ 1-10-2024

వయసు పెరగడమన్నది అందరిలోనూ చాలా సహజంగా జరిగిపోతుంటుంది. చాలాకాలం పాటు యూత్‌ఫుల్‌గా కనిపించడం అందరూ కోరుకునేదే. అంతేగానీ... వయసు పెరగాలని ఎవరూ కోరుకోరు. కొందరు వయసుపరంగా చాలా పెద్దవారైనా... చాలా యూత్‌ఫుల్‌గా కనిపిస్తారు. వయసు చెప్పగానే ఆశ్చర్యపోయేంత యౌవనంతో ఉంటారు. ఇలా వయసు తగ్గి యౌవ్వనంతో కనిపించడంతో పాటు, క్యాన్సర్‌ను కూడా నివారించే ఆహారాన్ని కాదనుకునేవారెవరు? అలా వయసు తక్కువగా ఉన్నట్లు కనిపించేలా చేయడంతో పాటు క్యాన్సర్‌ను నివారించే పోషకాలను 'యాంటీ ఆక్సిడెంట్స్' అంటారు. యాంటీ ఆక్సిడెంట్స్ అంటే ఏమిటి, వాటితో ఉండే ఇతర ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం.



• యాంటీ ఆక్సిడెంట్స్ యౌ'వనం' వికసించేలా..!

వయసు పెరగడంతో శారీరకంగా కొన్ని మార్పులు వస్తాయి. ఉదాహరణకు చర్మం కాస్త వదులైపోవడం, కళ్ల కింద, నుదుటి మీద గీతల వంటివి. ఇలా వచ్చే మార్పులనే ఏజింగ్‌తో వచ్చే మార్పులంటారు. కొన్ని రకాల ఆహారాలతో ఈ ఏజింగ్ ప్రక్రియ వేగవంతవుతుంది. ఉదాహరణకు ఎక్కువ తీపి ఉండే పదార్థాలూ, బేకరీ ఐటమ్స్ వంటి జంక్‌ఫుడ్ తీసుకునేవారిలో ఏజింగ్ చాలా వేగంగా జరుగుతుంది. ఈ ఏజింగ్‌కూ, అలాగే కొందరిలో క్యాన్సర్‌కు దారితీసే ఫ్రీ-ర్యాడికల్స్ అనే పదార్థాలు కారణం. ఈ ఫ్రీ-ర్యాడికల్స్‌ను సమర్థంగా అరికట్టేవే యాంటీఆక్సిడెంట్స్.

దేహంలో ప్రతినిత్యం అనేక జీవక్రియలు జరుగుతూ ఉంటాయి. ఇవి జరిగేటప్పుడు కొన్ని కాలుష్య పదార్థాలు విడుదల అవుతాయి. వాటిని ఫ్రీరాడికల్స్ అంటారు. అవి కణాలను దెబ్బతీస్తాయి. ఫ్రీ-రాడికల్స్ అన్నవి దేహంలోని ఏ కణంపై ప్రభావం చూపితే ఆ కణం జీవిత కాలం తగ్గిపోతుంది. ఆ కణం కూడా గణనీయంగా దెబ్బ తింటుంది.


డా॥ శ్రీకృష్ణ ఆర్ బొడ్డు
సీనియర్ ఫిజీషియన్

యాంటీ ఆక్సిడెంట్స్ అంటే...?

ఆహారంలోని కొన్ని పోషకాలు... ఫ్రీ రాడికల్స్‌తో చర్య జరిపి, కణాలపై వాటి ప్రభావాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేవే యాంటీ ఆక్సిడెంట్స్. రసాయన పరిభాషలో చెప్పాలంటే ఫ్రీ-ర్యాడికల్స్‌లో ఉండే పదార్థాలు కణాల్లోని రసాయనాలతో ఆక్సిడేషన్ చర్య జరపడం ద్వారా కణాన్ని దెబ్బతీస్తాయి. యాంటీ ఆక్సిడెంట్స్ అనేవి ఆ ఫ్రీ-ర్యాడికల్స్‌ను అడ్డుకుని ఆహారంలో ఉండే కొన్ని పోషకాలు ఆక్సిడేషన్ కానివ్వకుండా ఆపుతాయి. అలా ఫ్రీర్యాడికల్స్‌ను నిర్వీర్యం చేస్తాయి. అంటే ర్యాడికల్స్ ద్వారా జరిగే ఆక్సిడేషన్‌ను తటస్థీకరణ (న్యూట్రలైజ్) చేస్తాయి. అందువల్ల ఫ్రీ-రాడికల్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు ఆగిపోతాయి. దాంతో ఫ్రీ-రాడికల్స్ కణాన్ని దెబ్బతీయడం సాధ్యం కాదు. మామూలు కణం క్యాన్సర్ కణంగా మారడమూ ఆగిపోతుంది. అలా ఫ్రీ-రాడికల్స్ కారణంగా కణంలో ఆక్సీకరణ జరగకుండా ఆపేస్తాయి కాబట్టే ఆహార పదార్థాల్లోని ఆ పోషకాలను 'యాంటీ ఆక్సిడెంట్స్' అంటారు.

యాంటీ ఆక్సిడెంట్స్‌తో లాభాలివి..

● యాంటీ ఆక్సిడెంట్స్ అనేవి జీవక్రియల ద్వారా కణంలో జరిగే విధ్వంసాన్ని (సెల్ డ్యామేజీని) ఆపేస్తాయి. సెల్ డ్యామేజ్ తగ్గడం వల్ల కణం చాలాకాలం ఆరోగ్యంగా ఉంటుంది. సాధారణంగా ఇలాంటి సెల్ డ్యామేజీలు కాలుష్యం వల్ల, పొగతాగడం, అత్యధిక శారీరక శ్రమ, అల్ట్రావయొలెట్ కాంతి వల్ల జరుగుతుంటాయి. ఫలితంగా చర్మం ముడుతలు పడటం వంటి వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తుంటాయి. యాంటీఆక్సిడెంట్స్ ఫ్రీ-ర్యాడికల్ వల్ల జరిగే అనర్థాలను నిరోధించడం వల్ల ఈ దుష్పరిణామాలన్నీ ఆగుతాయి లేదా తగ్గుతాయి. దాంతో చాలా కాలం పాటు వయసు పెరిగినట్లుగానే కనిపించదు. దాంతో చాలాకాలంపాటు యౌవనంగా కనిపిస్తారు.

● ఫ్రీ-రాడికల్స్ ఒక్కోసారి కణంలోని స్వరూపాన్నే పూర్తిగా మార్చివేస్తాయి. అప్పుడా మామూలు కణం కాస్తా... క్యాన్సర్ కణంగా మారిపోతుంది. యాంటీ ఆక్సిడెంట్స్ ఆ ప్రమాదాన్ని నివారిస్తాయి.

పోషకాల్లోని రకరకాల యాంటీ ఆక్సిడెంట్స్... వాటితో ప్రయోజనాలు

● బీటా-కెరోటిన్ అనే పోషకానికి యాంటీఆక్సిడెంట్ గుణం ఉంటుంది. ఇవి పసుప్పచ్చ, నారింజరంగులో ఉండే అన్ని పండ్లు, కూరగాయల్లో, ఆకుకూరల్లో బీటా కెరొటిన్ ఉంటుంది. ఇవి మన శరీరంలోని కణాల్లోని పైపొర (సెల్ మెంబ్రేన్)ను సురక్షితంగా కాపాడతాయి. దాంతో ఆ పొరను ఛేదించి ఏ హానికరమైన కాలుష్యాలూ కణంలోకి చేరలేవు. అందుకే పైన పేర్కొన్న రంగు పండ్లు తింటే క్యాన్సర్ నుంచి రక్షణతో పాటు కణం చాలాకాలం పాటు ఆరోగ్యంగా, యౌవనంతో ఉంటుంది.

● లైకోపిన్ అనే ఫైటో కెమికల్‌లో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఎరుపు రంగు పిగ్మెంట్ ఉండే ఆహారాల్లో లైకోపిన్ ఎక్కువగా ఉంటుంది. అయితే టొమాటోలో ఇది మరీ ఎక్కువ. పుచ్చకాయలోనూ ఎక్కువే. లైకోపిన్ జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడటమేగాక... పెద్దపేగు క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్‌ల నివారణకు తోడ్పడుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా ప్రోస్టేట్ క్యాన్సర్‌ను నివారించడంలో లైకోపిన్ చాలా సమర్థంగా పనిచేస్తుంది.

● అల్లిసిన్ అనే చాలా శక్తిమంతమైన ఫైటో కెమికల్‌లో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. అల్లిసిన్ రక్తంలోని కొలెస్టరాల్‌నూ తగ్గిస్తుంది. ఇది వెల్లుల్లి, ఉల్లిలో ఎక్కువగా ఉంటుంది.

● ఐసోథయనేట్స్, ఐసోఫ్లేవోన్స్ యాంటీ ఆక్సిడెంట్లు సోయా ఉత్పాదనల్లో, క్యాబేజీ, కాలిఫ్లవర్‌లలో పుష్కలంగా ఉంటాయి. అవి అనేక రకాల క్యాన్సర్‌లనుంచి శరీరాన్ని కాపాడతాయి.

● యాంథోసయనిన్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ద్రాక్షలో, బెర్రీ పండ్లలో ఎక్కువ. గుండె జబ్బులను యాంథోసయనిన్ నివారిస్తుంది.

● ఫ్లేవనాయిడ్స్ అన్నవి చాలా చిక్కటి ముదురు రంగులో ఉండే అన్ని రకాల పండ్లలోనూ, కూరగాయల్లోనూ లభ్యమయ్యే యాంటీఆక్సిడెంట్. వాటికి ఫ్రీ-రాడికల్స్‌ను న్యూట్రలైజ్ చేసే గుణం చాలా ఎక్కువ. అందుకే వాటిల్లో సహజసిద్ధమైన క్యాన్సర్ నిరోధక గుణాలు ఎక్కువ.

● పుల్లగా ఉండే నిమ్మజాతి పండ్లలో లభ్యమయ్యే విటమిన్-సి కూడా చాలా శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్. విటమిన్-ఇ కూడా ఒక యాంటీ ఆక్సిడెంట్స్.

చివరగా గుర్తుంచుకోవాల్సిందేమిటంటే... యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే ఆహారాలను తీసుకుంటే ఒక పక్కన మంచి యౌవ్వనాన్ని చాలాకాలం పాటు కాపాడుకోవడమే కాకుండా... ఎన్నో రకాల క్యాన్సర్లను సమర్థంగా నివారించినట్టూ అవుతుంది.

ఆస్తమానం ఒత్తిడి వద్దు!

తీవ్రమైన ఒత్తిడిలో పనిచేస్తూ, టార్గెట్లు ఛేదించడానికి శ్రమపడుతూ ఉండే వారిలో... ఒత్తిడి తీవ్రత పెరిగినప్పుడు ఆస్తమా రావడం కొందరిలో కనిపిస్తుంది. అందుకే ఈ అంశం అటు పరిశోధనల్లో, ఇటు వైద్యవర్గాల్లో చాలావరకు ఓ చర్చనీయాంశం (డిబేటబుల్ సబ్జెక్ట్)గా ఉంది. ఏతావాతా చెప్పదగిన అంశమేమిటంటే... ఆస్తమా లేనివారిలో అధిక ఒత్తిడి కొత్తగా ఆస్తమాను కలిగించదుగానీ... అప్పటికే ఆస్తమా సమస్య ఉన్నవారిలో ఒత్తిడి అనేది ఓ ట్రిగరింగ్ ఫ్యాక్టర్‌గా పనిచేసి ఆస్తమాను ప్రేరేపించగలదు. మిగతా ఆరోగ్యవంతులతో పోలిస్తే... తీవ్రమైన ఒత్తిళ్లను ఎదుర్కొనేవారిలో ఆస్తమా ఎటాక్స్ చాలా తరచుగా కనిపిస్తుంటాయి. పరిశోధకులు ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో ఆస్తమా లక్షణాలు కనిపించడాన్ని చాలా సందర్భాల్లో నమోదు చేశారు. ఇదే విషయాన్ని చాలా మంది ఇతర అధ్యయనవేత్తలూ రూఢి చేశారు.

ఉదాహరణకు పిల్లల్లోనైతే స్కూలు పరీక్షలు, ఎక్కడైనా నలుగురిలో మాట్లాడాల్సి రావడం, పెద్దల్లో కుటుంబాల్లో విభేదాలు, విపత్తుల్లో చిక్కుకుపోవడం, హింసకు లోనుకావడం వంటి సంఘటనల్లో ఒత్తిడి పెరిగితే అది ఆస్తమాను ట్రిగర్ చేయవచ్చు.



మొదట ఒత్తిడి అనేది యాంగ్జైటీని పెంచి అటాక్ వచ్చేందుకు అనువైన పరిస్థితులను కల్పిస్తుంది. అంటే ఆస్తమా అటాక్‌ను ప్రేరేపించే హిస్టమైన్, ల్యూకోట్రిన్ వంటి రసాయనాలను విడుదలయ్యేలయ్యేలా చేస్తుంది. ఆ ప్రభావంతో వాయునాళాలు సన్నబారిపోతాయి. ఇక మిగతా సాధారణ వ్యక్తులతో పోలిస్తే... ఒత్తిడీ, యాంగ్జైటీ వంటి సమస్యలతో బాధపడేవారిలో ఆస్తమా ఉన్నప్పుడు వారి పరిస్థితిని నియంత్రించడం మరింత కష్టమవుతుంది.


డాక్టర్ ఇ. రవీంద్రా రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్
పల్మనాలజిస్ట్

ఒత్తిడినీ, దాంతో వచ్చే ఆస్తమానూ అరికట్టడం ఎలా...?

● మొదట తమకు ఒత్తిడి కలిగిస్తున్న అంశాలేవో తెలుసుకోవాలి. ఉదాహరణకు ఆర్థిక సమస్యలా, కుటుంబ సభ్యులతో విభేదాలా, ఎవరూ సహాయసహకారాలు అందించకపోవడం, ఎప్పుడూ పనిలోనే ఉండాల్సి రావడం లేదా నిత్యం డెడ్‌లైన్స్‌తో సతమతమవుతుండటమా అనేది తొలుత గుర్తించాలి. సమస్యను గుర్తించాక... దాన్ని ఎదుర్కోవడమనేది తమ వల్ల అవుతుందా, ఎవరి సహాయమూ లేకుండానే సమస్యకు పరిష్కారం సాధ్యపడుతుందా లేదా ఎవరైనా వృత్తినిపుణుల సహాయం అవసరమా తెలుసుకొని, ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాలి.

● అన్ని పనులూ ఒకరే పూర్తి చేయలేరని గుర్తించాలి. తొలుత పనుల జాబితా రూపొందించి, ఎవరు చేయదగ్గపనుల్ని వారికి అప్పగించాలి. ఉదాహరణకు డెడ్‌లైన్‌లోపు ఒకరే ఆ పని చేయలేరనుకుంటే... దాన్ని విడదీసి తలా కాసింత బాధ్యత అప్పగించాలి. దీన్నే వర్క్‌ప్లేస్ స్ట్రాటజీ అంటారు. ఆఫీసు పనిచేసే సమయాల్లో ఈ వర్క్‌ప్లేస్ స్ట్రాటజీ అనుసరించాలి. అంతేకాదు... పని ఒత్తిడి అన్నది ఆఫీసులో ఒక్కరికే పరిమితమైనది కాదు... అది అక్కడ పనిచేసే అందరికీ వర్తించేదన్న విషయాన్ని గుర్తెరగాలి. దాంతో సగం ఒత్తిడి తగ్గుతుంది.

● ప్రతిరోజూ అలసట కలిగించని వ్యాయామాలు చేయాలి. వ్యాయామం మంచి స్ట్రెస్ బస్టర్. ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుంది.

● బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్, ప్రోగ్రెసివ్ మజిల్ రిలాక్సేషన్ విధానాల వంటివి అనుసరించాలి. యోగా, ధ్యానం వంటివీ ప్రాక్టీస్ చేయడం స్ట్రెస్‌ను చాలావరకు తగ్గిస్తుంది.

● అటాక్ వచ్చినప్పుడు వాడే మందులు, అటాక్ రాకుండా నివారించే మందులు ఎప్పుడూ దగ్గర ఉంచుకోవాలి .

● రోజూ కంటినిండా నిద్రపోవాలి.

● ఒత్తిడితో కూడిన అటాక్ వచ్చినప్పుడు 5 - 10 నిమిషాల్లో మీరు నార్మల్ స్థితికి రాకపోతే తక్షణం తప్పనిసరిగా వైద్యుల సహాయం తీసుకోవాలి.

చికిత్స : విండ్‌పైపులు (వాయునాళాలు) వాపునకు (ఇన్‌ఫ్లమేషన్‌కు) గురైనప్పుడు... ఆ వాపు వల్ల గాలి ప్రవహించే లోపలి దారి సన్నబారిపోవడంతో శ్వాసతీసుకోవడం కష్టమవుతుంది. దాంతో ఆయాసం, పిల్లికూతల వంటి లక్షణాలతో ఆస్తమా కనిపిస్తుంది. ఈ లక్షణాలు తగ్గాలంటే మొదట తక్షణమే వాయునాళాలను విప్పార్చే / విస్తరింపజేసే మందులను లేదా ఇన్‌హేలర్స్‌ను వాడాలి. అదే రాకముందు లేదా వచ్చి తగ్గాక డాక్టర్ సలహా మేరకు ... ఆస్తమా రాకుండా నివారించే ప్రివెంటివ్ మందులు / ఇన్‌హేలర్స్ వాడాలి. ఆస్తమా తీవ్రత చాలా ఎక్కువగా ఉంటే దాన్ని తగ్గించేందుకు అవసరాన్ని బట్టి డాక్టర్లు యాంటీ హిస్టమైన ఇంజెక్షన్స్ కూడా వాడవచ్చు.

అపోహ - వాస్తవం : ఇన్‌హేలర్ అలవాటు అవుతుందనీ, అది మంచిది కాదనే అపోహ కొంతమందికి ఉంటుంది. నిజానికి టాబ్లెట్లతో పోలిస్తే ఇన్‌హేలర్స్‌తో దేహంలోకి ప్రవేశించే మందు మోతాదు చాలా తక్కువ. దాంతో సైడ్‌ఎఫెక్ట్స్ కూడా చాలా తక్కువ. అందుకే ఇన్‌హేలర్స్ సురక్షితమని గుర్తించాలి. ప్రివెంటివ్ మందు ఉండే ఇన్‌హేలర్స్ వాడుతుంటే అటాక్ రాకుండా అవి ఆస్తమాను అదుపులో ఉంచుతాయి.

వణికిపోయే వేళ్ల జబ్బు..!

రోడ్డును తొలిచే దగ్గరో లేదా కొత్తగా ఇల్లు కట్టే చోట రాతిని బద్దలు చేయడానికి వాడే మెకానికల్ గడ్డపలుగు / గునపం లాంటివి వాడినప్పుడు అది దడదడలాడుతూ చేతులను వణికిస్తుంటుంది. ఆన్ చేసిన ట్రాక్టర్ స్టీరింగుపై చేతులు ఆన్చినా అదీ చేతుల్ని దడదడలాడిపోయేలా చేస్తుంది. ఇలాంటి పరికరాలు చాలాకాలం వాడుతూ ఉండే వృత్తుల్లో ఉన్నవాళ్లలో కొందరికి వచ్చే జబ్బు పేరే 'వైబ్రేషన్ ఇండ్యూస్‌డ్ వైట్ ఫింగర్ డిసీజ్'. కేవలం అలాంటి గడ్డపలుగు మాత్రమే కాదు... పవర్ డ్రిల్స్, జాక్ హ్యామర్స్, పెద్ద పెద్ద చెట్లను నరికేసే చైన్ సాల వంటి వాటిని వాడేవారిలోనూ ఇది రావడం సహజం. ఈ జబ్బుకు 'హ్యాండ్ ఆర్మ్ వైబ్రేషన్ సింట్రోమ్ (హావ్స్)' అనీ, డెడ్ ఫింగర్ అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇది 'రేనాడ్స్ డిసీజ్' అనే రక్తనాళాలలనూ, నరాలను దెబ్బతీసే ఒక కండిషన్ తాలూకు తర్వాతి రూపం (సెకండరీ ఫార్మ్) అని కూడా భావిస్తున్నారు. కొంతమంది వ్యక్తుల్లో 'వైట్ ఫింగర్ డిసీజ్'కు తోడ్పడే జన్యువును సైతం ఇటీవలే శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

ఈ 'వైబ్రేషన్ ఇండ్యూస్‌డ్ వైట్ ఫింగర్ డిసీజ్' ప్రధానంగా వేళ్లలోని రక్తనాళాలు, నరాలు, కండరాలూ, కీళ్లతో పాటు చేతులు, మణికట్టు వంటి వాటిపై తన దుష్ప్రభావం చూపుతుంది. మొదట్లో వేళ్ల చివర్లు తిమ్మిరిగా అనిపిస్తాయి. అటు తర్వాత అవి తెల్లగా పాలిపోయినట్లుగా అవుతాయి. జబ్బు తీవ్రత బాగా పెరిగినప్పుడు వేళ్లు వేళ్లన్నీ తెల్లగా మారిపోతాయి. అందుకే ఈ జబ్బుకు 'వైట్ ఫింగ్ డిసీజ్' అని పేరు. అయితే... అలా తెల్లగా మారిన కొద్దిసేపటి తర్వాత రక్తం వేళ్ల చివరికి వేగంగా ప్రవహించడం వల్ల అవి ఎర్రగా కూడా మారవచ్చు.



ఒకసారి వచ్చిందంటే... ఆ తర్వాత అత్యంత త్వరలోనే తాము చేసే పనిని మానేయాల్సిన (రిటైర్ అవ్వాల్సిన) పరిస్థితి ఉంటుంది. చికిత్సలో భాగంగా కొన్నిసార్లు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు వాడుతున్నప్పటికీ... దీనికి సరైన చికిత్స అంటూ నిర్దిష్టంగా ఏదీ లేదు. అందుకే తీవ్రంగా / విపరీతంగా కంపిస్తూ పనిచేసే ఉకపరణాలతో పనిచేసేవారు తమ పని గంటలను తగ్గించుకుంటూ రావడమే ఓ మంచి నివారణ చర్య.

• ఎండోస్కోపీ... కొలనోస్కోపీ!


బుల్లితెరపై మీ సినిమా!

జీర్ణవ్యవస్థలోని లోపలి భాగాలను చూడటానికి ఉపయోగపడేవే ఎండోస్కోపీ, కొలనోస్కోపీలు. సాధారణంగా ఎండోస్కోపీ అని ప్రాచుర్యంలో ఉన్న ఈ ప్రక్రియను డాక్టర్లు 'ఈసో ఫేగో గ్యాస్ట్రో డియోడనోస్కోపీ' (ఈజీడీ) అంటారు. దీనితో గొంతు చివరి భాగం, ఆహారనాళం మొదలుకొని... కడుపు, చిన్న పేగులు మొదలయ్యే వరకు అంటే... చిన్న పేగుల్లో కొంత భాగం (డియోడనమ్) వరకు కూడా చూడవచ్చు. ఇక కొలనోస్కోపీ ద్వారా మల ద్వారం మొదలుకొని.. పెద్దపేగు చివరి భాగం వరకూ చూడవచ్చు. ఇలా జీర్ణవ్యవస్థలో చాలా కొద్దిగా మినహాయించి... చాలా భాగాన్ని తెరపై స్పష్టంగా చూడటానికి అవకాశమిచ్చే ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షల గురించి తెలుసుకుని, వాటితో కలగే ప్రయోజనాలేమిటో చూద్దాం.

జీర్ణవ్యవస్థ పై భాగాల్లోని కండిషన్స్ కోసం ఎండోస్కోపీ, మలద్వారం మొదలుకొని, పెద్ద పేగుల వరకు కింది నుంచి తెలుసుకునేందుకు కొలనోస్కోపీ ఉపయోగపడతాయి. అవి తెలియజేసే విషయాలేమిటంటే...

ఎండోస్కోపీ ఎందుకు చేస్తారంటే?

● వాంతులు లేదా వికారంగా ఉన్నా ● పొట్టలో నొప్పి, మింగడంలో ఇబ్బందులు ఉన్నప్పుడు... ఆ సమస్యలు ఎందువల్ల వస్తున్నాయో తెలుసుకోడానికీ ● రక్తహీనత, పేగుల్లో రక్తస్రావం, మంట, విరేచనాలు, కొన్ని క్యాన్సర్లు ఉన్నప్పుడు జీర్ణవ్యవస్థలో ఆ సమస్య ఉన్న భాగానికి చెందిన ఓ చిన్న ముక్కను తీసి బయాప్సీ పరీక్ష కోసం పంపించడాకి ● ఆహారనాళం లేదా అన్నకోశం (స్టమక్)లో ఎక్కడైనా కండపెరిగితే, దాన్ని తొలగించాల్సి వచ్చినప్పుడు; చిన్నపిల్లలూ (కొందరు పెద్దవాళ్లు కూడా) ప్రమాదవశాత్తూ ఏదైనా మింగినప్పుడు అది జీర్ణవ్యవస్థలో లేదా పేగుల్లోకి చేరుకుని అక్కడ చిక్కుకుపోతే, ఆ వస్తువు (ఫారిన్ బాడీ)లను తొలగిం,దానికి (ఉదాహరణకు చిన్నారులు నాణేలు మింగడం) ; అలాగే ఇక ఏదైనా పరికరాన్ని ఉపయోగించి జీర్ణవ్యవస్థలో కొంతమేర చికిత్స చేయాల్సి వచ్చినప్పుడు గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు ఎండోస్కోపీ సహాయాన్ని తీసుకుంటారు.



ఎండోస్కోపీ ఎలా చేస్తారంటే...?

నోటిలో అనస్థీషియాను స్ప్రే చేసి ఒక ఫ్లెక్సిబుల్ ట్యూబ్‌ను జీర్ణవ్యవస్థలోకి పంపిస్తారు. దానికి చివరన ఒక కెమెరా ఉంటుంది. అది మొదట ఆహారనాళంలోకి, ఆ తర్వాత అన్నకోశం (స్టమక్)లోకి వెళ్తుంది. అక్కడి దృశ్యాలను మానిటర్‌పై డాక్టర్ స్పష్టంగా చూడగలుగడంతో పాటు ఆ దృశ్యాలను రికార్డు కూడా చేయగలరు.

ఎండోస్కోపీకి ఎలాంటి జాగ్రత్తలు అవసరమంటే...

● ఎండోస్కోపీ చేయడానికి ముందర ఆరు గంటల పాటు ఏదీ తినకుండా ఉండాలి. ● రక్తాన్ని పలచబార్చే మందులు ఉపయోగిస్తుంటే వాటిని ఆపాలి. ఎందుకంటే ఎండోస్కోపీ వల్ల ఎక్కడైనా ఒరుసుకుపోవడం జరిగితే.. దానివల్ల జీర్ణవ్యవస్థలో ఎక్కడైనా రక్తస్రావం జరగవచ్చు. అలాంటి ప్రమాదాలను నివారించడం కోసమే ఎండోస్కోపీ ప్రక్రియకు ముందర రక్తాన్ని పలచబార్చే మందులను ఆపాలంటూ డాక్టర్లు సూచిస్తారు.


డా॥ జానకి రామ ఎస్‌జే
సీనియర్ సర్జికల్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్

కొలనోస్కోపీ అంటే...?

ఎండోస్కోపీ ద్వారా చిన్న పేగు మొదటి భాగం వరకూ చూడవచ్చు. ఇక జీర్ణ వ్యవస్థలో ఆ తర్వాత వచ్చే మిగతా భాగాలను చూడటం కోసం ఉపయోగపడేదే కొలనోస్కోపీ. ఇది మలద్వారం నుంచి మొదలుకొని... పైన పెద్దపేగుల వరకు చూసేందుకు ఉపయోగపడుతుంది. అంటే... పైన ఆహార నాళం నుంచి పైప్ వేసినట్లుగానే... కింద మల ద్వారం నుంచి పైప్‌ను పంపించి చూసే ఈ పరీక్షను 'కొలనోస్కోపీ' అంటారు.

కొలనోస్కోపీ ఎవరెవరికి...?

● మలద్వారం నుంచి రక్తస్రావం అవుతున్నవారికి ● దీర్ఘకాలంగా మలబద్ధకం ఉన్నవారికి ● ఏదైనా దీర్ఘకాలిక సమస్య ఉన్నట్లైతే... వారికి.

కొలనోస్కోపీలో జాగ్రత్తలివి...

ఎండోస్కోపీలోలా కాకుండా కొలనోస్కోపీ చేయాల్సి వచ్చినప్పుడు కడుపునంతా ఖాళీ చేయాలి. ఈ పరీక్షను ఉదయం పూట నిర్వహిస్తే... ఎలాగూ పేషెంట్ రాత్రి భోజనం తర్వాత ఏమీ తినేందుకు అవకాశం ఉండదు కాబట్టి ఎలాంటి సమస్యా ఉండదు. కొలనోస్కోపీకి ముందు కూడా కేవలం నీరు, పాలు లేకుండా టీ, కాఫీ, కొన్నిసార్లు సాఫ్ట్‌డ్రింక్ వంటివి చాలా పరిమితంగా తీసుకొమ్మని డాక్టర్లు చెబుతారు. అయితే ఎర్రటి రంగులో ఉండే ద్రవాలను మాత్రం ఎట్టిపరిస్థితుల్లో తీసుకోవద్దని సూచిస్తారు. ఎందుకంటే... కొలనోస్కోపీలో అవి కనిపించినప్పుడు డాక్టర్లు దాన్ని రక్తంగా పొరబడే అవకాశముంది. గుండెజబ్బులు, డయాబెటిస్, రక్తపోటు వంటివి ఉన్నవారిలో వాటికి సంబంధించిన మందులు ఒక వారం ముందునుంచి నిలిపివేయాలని చెబుతారు. రక్తాన్ని పలచబార్చే ఆస్పిరిన్, వార్‌ఫేరిన్, క్లోపిడోగ్రెల్ వంటి మందుల మోతాదులను డాక్టర్ సలహా మేరకు మారుస్తారు.

కొలనోస్కోపీ ఎలా చేస్తారు...?

చాలా సార్లు మత్తు ఏమీ ఇవ్వకుండా చేస్తారు. చాలా కొద్ది మంది రోగులకు మాత్రమే మత్తు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులోనూ కెమెరాను అమర్చిన పైప్‌ను మలద్వారం ద్వారా పంపించి దాదాపు పెద్ద పేగు వరకూ చూస్తారు. ఈ పరీక్షకు దాదాపు 20 నిమిషాల సమయం పడుతుంది. ఈ పరీక్ష తర్వాత ఒక గంట పాటు కింది నుంచి చాలా సార్లు గ్యాస్ పోతుంటుంది.

ఎండోస్కోప్, కొలనోస్కోప్ సహాయంతో మనం దాదాపు మన జీర్ణవ్యవస్థను ప్రత్యక్షంగా చూడటానికి ఉపయోగపడటంతో పాటు... కొన్ని సార్లు చికిత్స ప్రక్రియకోసం కూడా ఉపయోగపడతాయి. అంటే ఇవి ఇటు వైద్య పరీక్షలకూ, అలాగే అటు వైద్య చికిత్సకూ ఇలా రెండు విధాలుగానూ ఉపయోగపడతాయి.

బిజినెస్ రీల్

రిలయన్స్ ఇన్‌ఫ్రాకు ఊరట

డీవీసీతో రూ. 780 కోట్ల ఆర్బిట్రేషన్ వివాదంలో సానుకూల ఉత్తర్వులు



న్యూఢిల్లీ: దామోదర్ వేలీ కార్పొరేషన్‌తో (డీవీసీ) నెలకొన్న రూ. 780 కోట్ల ఆర్బిట్రేషన్ వివాదంలో అనిల్ అంబానీ గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాకు ఊరట లభించింది. ఈ విషయంలో రిలయన్స్ ఇన్‌ఫ్రాకు సానుకూలంగా కలకత్తా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. వివరాల్లోకి వెడితే, పశ్చిమ బెంగాల్‌లోని పురూలియాలో రూ. 3,750 కోట్లతో 1,200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును నిర్మించే కాంట్రాక్టును రిలయన్స్ ఇన్‌ఫ్రా దాదాపు దశాబ్దం క్రితం దక్కించుకుంది. వివాదాలు, ఇతరత్రా కారణాల వల్ల ప్రాజెక్టు ఆలస్యం కావడంతో నష్టపరిహారం చెల్లించాలంటూ కంపెనీని డీవీసీ కోరింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా దీన్ని సవాలు చేయగా 2019లో ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌లో సానుకూల ఉత్తర్వులు వచ్చాయి. కంపెనీకి నిర్దిష్ట మొత్తం చెల్లించాలంటూ డీవీసీని ట్రిబ్యునల్ ఆదేశించింది. దీన్ని సవాలు చేసిన డీవీసీకి తాజాగా కలకత్తా హైకోర్టులో చుక్కెదురైంది.

ఎంవోఐఎల్ సీఎండీకి ఆర్ఐఎన్ఎల్ అదనపు బాధ్యతలు



న్యూఢిల్లీ: ఎంవోఐఎల్ (మంగనీస్ ఓర్ (ఇండియా) లిమిటెడ్) సీఎండీ అజిత్ కుమార్ సక్సేనాకు ఆర్ఐఎన్ఎల్ సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ స్టీల్ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంత్రిత్వ శాఖ నుంచి సెప్టెంబర్ 29న ఉత్తర్వులు వెలువడ్డాయని ఎంవోఐఎల్ సోమవారం తెలిపింది. ఆర్ఐఎన్ఎల్ సీఎండీ అతుల్ భట్ సెప్టెంబర్ 9 నుండి నవంబర్ 30 వరకు వ్యక్తిగత సెలవులో ఉన్నారు. నవంబర్ 30న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఉక్కు తయారీ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు (ఆర్ఐఎన్ఎల్) ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 7.5 మిలియన్ టన్నుల ప్లాంట్ ఉంది. ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రకారం ఆర్ఐఎన్ఎల్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఇది కనీస సామర్థ్యంతో నడుస్తూ నిరంతర నష్టాలను ఎదుర్కొంటోంది. సంస్థ మొత్తం బకాయిలు రూ. 35,000 కోట్లకుపైమాటే. ఇది బ్యాంకులచే నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడే ప్రమాదం ఉందని ఉక్కు మంత్రిత్వ శాఖ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-10-2024	
విశాఖ	535-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	28.45	2.84
NTPC	6.1	1.4
BRITANNIA	70.2	1.12
HINDALCO	7.85	1.05
TATASTEEL	1.56	0.94

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	-231.35	-3.88
TRENT	-273.6	-3.49
AXISBANK	-41.55	-3.26
RELIANCE	-94.35	-3.09
BEL	-9.05	-3.08

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,077
ఎన్ఎస్ఈ	1,17,551
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,41,227
ఎఫ్ఐఐ	- 9,791
డీఐఐ	+ 6,646

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.32	$ 68.18
బ్రెంట్	71.88	$ 71.54

కరెంట్ అకౌంట్ లోటు 9.7 బిలియన్ డాలర్లు

క్యూ1 జీడీపీలో 1.1 శాతం



న్యూఢిల్లీ: దేశానికి వచ్చీ-పోయే విదేశీమారక ద్రవ్యం మధ్య నికర వ్యత్యాసాన్ని ప్రతిబింబించే కరెంట్ అకౌంట్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) 9.7 బిలియన్ డాలర్ల లోటు (సీఏడీ- క్యాడ్)ను నమోదుచేసుకుంది. సంబంధిత త్రైమాసికం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఈ విలువ 1.1 శాతం. గత ఏడాది ఇదే త్రైమాసికంలో (2023 ఏప్రిల్-జూన్) మధ్య క్యాడ్ 8.9 బిలియన్ డాలర్లు (జీడీపీలో ఒక శాతం). ఇక 2024 జనవరి-మార్చి మధ్య కరెంట్ అకౌంట్- 4.6 బిలియన్ డాలర్ల మిగులును (ఈ వ్యవధి జీడీపీలో 0.5 శాతం) నమోదుచేసుకోవడం గమనార్హం.

క్యాడ్ పెరుగుదలకు కారణం?

వార్షికంగా (క్యూ1లో) కరెంట్ అకౌంట్ లోటు పెరగడానికి (8.9 బిలియన్ డాలర్ల నుంచి 9.7 బిలియన్ డాలర్లకు) వాణిజ్యలోటు (ఎగుమతులు-దిగుమతులు మధ్య నికర వ్యత్యాసం) కారణమని తాజా ఆర్‌బీఐ గణాంకాలు పేర్కొంటున్నాయి. 2023 క్యూ1లో వస్తు వాణిజ్యలోటు 56.7 బిలియన్ డాలర్లుకాగా, 2024 ఇదే కాలంలో ఈ విలువ 65.1 బిలియన్ డాలర్లకు ఎగసింది. నికర సేవల దిగుమతుల విలువ పెరగడం వల్ల (35.1 బిలియన్ డాలర్ల నుంచి 39.7 బిలియన్ డాలర్లకు) కరెంట్ అకౌంట్‌లోటు కొంత కట్టడి (9.7 బిలియన్ డాలర్లకు) జరిగిందికానీ, లేదంటే ఈ విలువ మరింత పెరిగేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కంప్యూటర్, బిజినెస్, పర్యాటక, రవాణా సేవల్లో తాజా సమీక్షా కాలంలో మెరుగుదల కనిపించింది.

కొన్ని ముఖ్యాంశాలు..

- ఎన్నికల అనిశ్చితి నేపథ్యంలో నికర విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్లు (ఎఫ్‌పీఐ) 2024-25 ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో కేవలం 0.9 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2023 ఇదే కాలంలో ఈ విలువ 15.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- ఏప్రిల్- జూన్ మధ్య విదేశీ వాణిజ్య రుణాలు (ఈసీబీ) 5.6 బిలియన్ డాలర్ల నుంచి 1.8 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.
- రెమిటెన్సులు (ఎన్ఆర్ఐలు దేశానికి పంపిన మొత్తాలు) మాత్రం 27.1 బిలియన్ డాలర్ల నుంచి 29.5 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సైతం 4.7 బిలియన్ డాలర్ల నుంచి 6.3 బిలియన్ డాలర్లకు ఎగశాయి.
- ఎన్ఆర్ఐ డిపాజిట్లు 2.2 బిలియన్ డాలర్ల నుంచి 4 బిలియన్ డాలర్లకు చేరాయి.

రెడ్డీస్ చేతికి నికోటినెల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ తాజాగా హేలియోన్ గ్రూప్ కంపెనీ నార్త్‌స్టార్ స్విట్జర్లాండ్ ఎస్ఏఆర్ఎల్ కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసినట్టు సోమవారం ప్రకటించింది. తద్వారా నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ విభాగంలో యూఎస్ వెలుపల కంపెనీ చేతికి నికోటినెల్ ఉత్పత్తులు వచ్చి చేరాయి. 30కిపైగా దేశాల్లో నికోటినెల్ ఉత్పత్తులు వివిధ పేర్లతో అమ్ముడవుతున్నాయి. నార్త్‌స్టార్ స్విట్జర్లాండ్‌ను కొనుగోలు చేస్తున్నట్టు డాక్టర్ రెడ్డీస్ ఈ ఏడాది జూన్ 24న ప్రకటించింది. ఈ డీల్ విలువ రూ.5,136 కోట్లు.

క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో రెడ్డీస్ షేరు ధర సోమవారం 0.05 శాతం ఎగసి రూ.6,757.90 వద్ద స్థిరపడింది.

డిజిటల్ గోల్డ్‌లో కనీసం రూ.10



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిజిటల్ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే తాజాగా ఫైనాన్షియల్ ఫిట్‌నెస్ యాప్ జార్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఫోన్‌పే యూజర్లు 24 క్యారెట్ల డిజిటల్ గోల్డ్‌లో ప్రతిరోజు రూ.10 మొదలుకుని రూ.5,000 వరకు జమ చేయవచ్చు. ఆటో సేవ్ మోడ్ ఎంచుకుంటే ప్రతిరోజు నిర్దిష్ట మొత్తం జమ అవుతుంది. ఇలా జమచేసిన మొత్తాన్ని కస్టమర్లు నగదు రూపంలో వెనక్కి తీసుకునే వెసులుబాటూ ఉంది. బంగారం రూపంలో మార్చుకోవచ్చు. లేదా జార్ ఎక్స్‌క్లూజివ్ జువెల్లరీ బ్రాండ్ అయిన **నెక్ ఆభరణాలను కొనుగోలు చేయవచ్చు.**

రూ.8,465 కోట్లు చెల్లించిన ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ 2016లో కొనుగోలు చేసిన స్పెక్ట్రంకు సంబంధించి ప్రభుత్వానికి రూ.8,465 కోట్లను చెల్లించినట్టు సోమవారం తెలిపింది. ఈ మొత్తం 9.3 శాతం వడ్డీ రేటును కలిగి ఉందని వెల్లడించింది. ఎయిర్‌టెల్ 2016 స్పెక్ట్రం వేలం ద్వారా 1800, 2100, 2300 మెగాహెట్జ్ బ్యాండ్స్‌లో 173.8 మెగాహెట్జ్ స్పెక్ట్రంను రూ.14,244 కోట్లకు కొనుగోలు చేసింది. 2012, 2015లో వేలం ద్వారా పొందిన స్పెక్ట్రం తాలూకు అన్ని మొత్తాలను క్లియర్ చేసే ప్రక్రియలో భాగంగా టెలికం విభాగానికి రూ.7,904 కోట్లను చెల్లించినట్టు ఎయిర్‌టెల్ ఈ ఏడాది జూన్‌లో వెల్లడించింది. 2012 వడ్డీ రేటు 9.75 శాతం, 2015 వడ్డీ రేటు 10 శాతం ఉందని తెలిపింది. 2012లో రూ.8.67 కోట్లు, 2015 వేలంలో రూ.29,129 కోట్ల విలువైన స్పెక్ట్రంను ఎయిర్‌టెల్ దక్కించుకుంది. 2015 వేలంలో పొందిన స్పెక్ట్రంకు సంబంధించి వాయిదా వేసిన బాకీల్లో ప్రభుత్వానికి రూ.8,024 కోట్లను చెల్లించినట్టు 2023 జూలై 31న కంపెనీ వెల్లడించింది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన స్పెక్ట్రం వేలంలో సంస్థ రూ.6,856.76 కోట్ల విలువైన ఎయిర్‌వేవ్స్ చేజిక్కించుకుంది.

2030 నాటికి భారత ఎకానమీ రెట్టింపు

- క్లైమేట్ టెక్నాలజీలోనూ లీడర్‌గా ఎదిగేందుకు అవకాశాలు
- నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2030 నాటికి రెట్టింపవుతుందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 2026-27 కల్లా మూడో అతి పెద్ద ఎకానమీగా ఆవిర్భవించాలన్న లక్ష్యం సాకారం అయ్యేందుకు సమగ్రమైన పటిష్ఠ వ్యూహాన్ని అమలు చేయాల్సి ఉంటుందన్నారు. వాతావరణ మార్పులకు సంబంధించి క్లైమేట్ టెక్నాలజీలో భారత్ అగ్రగామిగా ఎదిగేందుకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని సుబ్రహ్మణ్యం చెప్పారు. పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా (పీఏఎఫ్ఐ) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. భారత్ ప్రస్తుతం 3.7 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో అయిదో అతి పెద్ద ఎకానమీగా ఉంది. ప్రకృతి విపత్తులు, పేదరికం వంటి సవాళ్లను అధిగమించడంలో దేశం గత దశాబ్దకాలంగా గణనీయ పురోగతి సాధించిందని, 2047 నాటికి తలసరి ఆదాయం 18,000-20,000 డాలర్ల స్థాయికి పెరుగుతుందని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆర్థిక వ్యవస్థను పర్యావరణ అనుకూలమైనదిగా తీర్చిదిద్దే దిశగా తీసుకోతగిన చర్యలపై టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు.. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నట్లు ఆయన వివరించారు. గ్లోబలైజేషన్ నేపథ్యంలో పురోగమించాలంటే సరఫరా వ్యవస్థను సంస్కరించుకోవాలని సుబ్రహ్మణ్యం చెప్పారు.

డిపాజిట్ వృద్ధికి వినూత్న ప్రొడక్టులు

- ఎస్‌బీఐ బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి ప్రకటన
- రికరింగ్ డిపాజిట్/సిప్ కాంబోసహా విభిన్న సాధనాల రూపకల్పన



న్యూఢిల్లీ: డిపాజిటర్లను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినూత్న ప్రొడక్టులను ప్రవేశపెట్టడానికి కసరత్తు చేస్తోంది. రికరింగ్ డిపాజిట్- క్రమబద్ధ పెట్టుబడి ప్రణాళిక (ఎస్ఐపీ) కాంబో ప్రొడక్ట్‌సహా వినూత్నమైన ఉత్పత్తులను తీసుకురావాలని యోచిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్నందున కస్టమర్లు ఆర్థికంగా మరింత అవగాహనతో వ్యవహరిస్తున్నారని, వ్యవస్థలో డిమాండ్ ఉందని ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో వారు వినూత్న పెట్టుబడి సాధనాల కోసం వెతకడం ప్రారంభించారని కూడా తెలిపారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన తెలిపిన అంశాల్లో ముఖ్యమైనవి...

- ఆర్థిక అక్షరాస్యత మెరుగుపడటంతో నేడు కస్టమర్లు తమ పెట్టుబడులకు అధిక రాబడుల గురించి ఆలోచిస్తున్నారు. ఆ మేరకు పోర్ట్‌ఫోలియో రూపకల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.
- సహజంగానే ఎవరూ ప్రతి రూపాయినీ ప్రమాదకర లేదా ఊహాజనిత ఇన్వెస్ట్‌మెంట్‌లో ఉంచాలని కోరుకోరు. బ్యాంకింగ్ ప్రొడక్టులు ఎల్లప్పుడూ పోర్ట్‌ఫోలియోలో భాగమే. కాబట్టి మేము వారికి నచ్చే ఉత్పత్తులను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాము.
- మేము రికరింగ్ డిపాజిట్ వంటి కొన్ని సాంప్రదాయ ప్రొడక్టుల్లో ఆవిష్కరణను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాము. బహుశా మేము ఫిక్స్‌డ్ డిపాజిట్/రికరింగ్ డిపాజిట్- ఎస్ఐపీ రెండింటినీ కలపవచ్చు. డిజిటల్‌గా యాక్సెస్ చేయగల కాంబో ఉత్పత్తిగా దీనిని రూపొందిస్తున్నాము.
- తాజా ప్రొడక్టులు జెన్ జెడ్‌లో (12 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు) ప్రాచుర్యం పొందడానికి అనుగుణమైన ఆవిష్కరణలపై బ్యాంక్ ప్రధానంగా దృష్టి సారిస్తోంది.
- అంతేకాకుండా, డిపాజిట్ సమీకరణ కోసం బ్యాంక్ భారీ ప్రచార కార్యక్రమాన్ని కూడా చేపట్టింది.
- స్పష్టంగా చెప్పాలంటే మా కస్టమర్‌లకు తగిన డిపాజిట్ వడ్డీని చెల్లించాల్సిన అవసరం ఉంది. కానీ మేము రేటు యుద్ధంలో పోరాడటానికి ఇష్టపడము. చాలా బ్యాంకులు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయని నేను భావిస్తున్నాను. కస్టమర్‌కు సరైన రేటు.
- సరైన సేవలు అందించే సమతౌల్య చర్యను అందించాలన్నది బ్యాంక్ లక్ష్యం.
- కొత్త ఖాతాలను తెరవడంపై బ్యాంక్ దృష్టి సారిస్తోంది. రోజుకు దాదాపు 50,000 నుండి 60,000 సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలను తెరవడం లక్ష్యంగా పనిచేసింది.
- ఎస్‌బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో దాదాపు 50 శాతం డిజిటల్ ఛానెల్‌ల ద్వారానే తెరవడం జరుగుతోంది.
- వచ్చే 3-5 ఏళ్లలో రూ. లక్ష కోట్ల నికర లాభం మైలురాయిని దాటిన తొలి భారతీయ ఆర్థిక సంస్థగా అవతరించాలని ఎస్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో 21.59 శాతం వృద్ధితో రూ.61,077 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని బ్యాంక్ నమోదుచేసింది.
- భారత్ కార్పొరేట్‌రంగం నుంచి బ్యాంక్‌కు రూ.4 లక్షల కోట్ల పటిష్ఠ రుణ డిమాండ్ ఉంది. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రైవేట్ రంగం మూలధన వ్యయం పెరుగుతుంది.

బీమా పాలసీ వెనక్కిస్తే మెరుగైన ప్రయోజనాలు!

నేటి నుంచి కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ: జీవిత బీమా పాలసీని వెనక్కిచ్చేసినప్పుడు (సరెండర్) పొందే ప్రయోజనాలపై నూతన నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇందుకు బీమా సంస్థలు ఇప్పటికే సన్నద్ధం అయ్యాయి. బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) సవరించిన సరెండర్ వ్యాల్యూ నిబంధనలను ఈ ఏడాది ఆరంభంలోనే ప్రకటించడం గమనార్హం. జీవిత బీమా పాలసీల గడువు ముగిసే వరకు వేచి చూడకుండా, ముందస్తుగానే వైదొలగాలని భావించే వారికి మెరుగైన రాబడులు అందించడమే కొత్త నిబంధనల ఉద్దేశ్యం. జీవిత బీమా పాలసీని తీసుకున్న తర్వాత నుంచి ఎన్నేళ్ల పాటు ప్రీమియం చెల్లించారు, అప్పటి వరకు ఎంత బోనస్‌లు జమయ్యాయన్న తదితర అంశాల ఆధారంగా సరెండర్ వ్యాల్యూని బీమా సంస్థలు నిర్ణయిస్తుంటాయి. ఇలా సరెండర్ చేసే పాలసీలపై బీమా సంస్థలు తక్కువ ప్రయోజనాలనే పాలసీదారులకు చెల్లించేవి. దీనివల్ల పాలసీ సరెండర్‌పై పాలసీదారులు సరైన విలువను పొందలేకపోయేవారు. నూతన నిబంధనలతో పాలసీ కమీషన్‌లో మార్పులు చోటు చేసుకోవచ్చని, ప్రీమియం రేట్లలో హెచ్చుతగ్గులు ఉండొచ్చని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ డైరెక్టర్ గౌరవ్ దీక్షిత్ అభిప్రాయపడ్డారు.

ద్రవ్యలోటు 4,35,176 కోట్లు

ఆగస్టు నాటికి బడ్జెట్ లక్ష్యంలో 27 శాతానికి అప్



న్యూఢిల్లీ: ప్రభుత్వానికి వచ్చే ఆదాయం- చేసే వ్యయానికి మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆగస్టు ముగిసే నాటికి బడ్జెట్ (2024-25) లక్ష్యంలో 27 శాతానికి చేరింది. విలువలో 4,35,176 కోట్లుగా నమోదయినట్లు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాలు వెల్లడించాయి. 2024-25లో మొత్తం ద్రవ్యలోటును రూ.16,13,312 కోట్లకు కట్టడి చేయాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ నిర్దేశించుకున్న సంగతి తెలిసిందే. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువలో ఇది 4.9 శాతం. 2023-24లో జీడీపీలో ద్రవ్యలోటు 5.6 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్ స్పష్టం చేస్తున్నారు. ద్రవ్యలోటు ప్రభుత్వానికి రుణ సమీకరణ మొత్తం అవసరాలను సూచిస్తుంది. అధిక ప్రభుత్వ వ్యయాలు, సంకీర్ణ ప్రభుత్వ డిమాండ్లపై దృష్టి సారించినప్పటికీ మధ్యకాలానికి ద్రవ్యలోటును (ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం) తగ్గించడానికి భారతదేశం కట్టుబడి ఉందని ఫిచ్ రేటింగ్స్ ఇటీవలే దేశానికి కితాబునిచ్చింది. గత కొద్ది సంవత్సరాలుగా బడ్జెట్ లక్ష్యాలను భారత్ విజయవంతంగా చేరుకోగలుగుతోందని ఫిచ్ పేర్కొంది. అయితే తాను ఇస్తున్న ''బీబీబీ'' కేటగిరి సావరిన్ రేటింగ్ ఉన్న తోటి దేశాలతో పోల్చితే భారత్ ద్రవ్యలోటు, వడ్డీ, ఆదాయ-రుణ నిష్పత్తులు ఇప్పటికీ అధికంగానే ఉన్నాయని ఫిచ్ పేర్కొనడం గమనార్హం.

ఔషధ పరిశోధనకు ప్రోత్సాహం అవసరం

- విధాన సంస్కరణలు, మెరుగైన నియంత్రణలు
- నిధుల సాయం, ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాలి
- డెలాయిట్, అసోచామ్ నివేదిక సూచనలు



న్యూఢిల్లీ: దేశీయంగా ఫార్మాస్యూటికల్ పరిశోధన, అభివృద్ధి భవిష్యత్‌ను నిర్ణయించడంలో విధానపరమైన సంస్కరణలు, నియంత్రణలు కీలక పాత్ర పోషిస్తాయని డెలాయిట్, అసోచామ్ సంయుక్త నివేదిక తెలిపింది. ఈ దిశగా అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, మేధో సంపత్తి (ఐపీ) హక్కులను కాపాడడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం కీలకమని పేర్కొంది. ఫార్మాస్యూటికల్స్ పరిశ్రమలో పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ)కి ఇప్పటికీ విధానపరమైన సవాళ్లు నెలకొన్నట్టు తెలిపింది. నియంత్రణ కార్యాచరణను ఆధునికీకరించుకోవడం, అంతర్జాతీయ నియంత్రణ సంస్థలతో సమన్వయం నేపథ్యంలో.. ఫార్మాస్యూటికల్ ఆవిష్కరణల పరంగా భారత్ ప్రపంచ దిగ్గజంగా అవతరించేందుకు చక్కని స్థానంలో ఉన్నట్టు ఈ నివేదిక అభిప్రాయపడింది.

సవాళ్లు..

ఔషధ నియంత్రణల పరంగా తగినంత సామర్థ్యం లేకపోవడం, అత్యాధునిక పరీక్షా కేంద్రాల లేమి, తయారీ యూనిట్లలో క్వాలిటీ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు బలమైన కార్యాచరణ లేకపోవడం తదితర సవాళ్లు ఫార్మాస్యూటికల్ పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) విషయంలో నెలకొన్నట్టు ఈ నివేదిక ప్రస్తావించింది. ఏకరూప నియంత్రణ వాతావరణానికి వీలుగా కేంద్రం, రాష్ట్రాల విధానాల మధ్య సమన్వయానికి అవకాశాలున్నట్టు అభిప్రాయపడింది. వివిధ నియంత్రణ సంస్థల మధ్య సమన్వయ లోపం ఉన్నట్టు తెలిపింది. పాలనా సంబంధ సంక్లిష్టతలు, నియంత్రణలు కారణంగా ఔషధాల అనుమతులు, క్లినికల్ ట్రయల్స్ అనుమతులకు అదనపు సమయం తీసుకుంటున్నట్టు పేర్కొంది. ఫలితంగా అత్యున్నత నాణ్యతతో కూడిన క్లినికల్ పరిశోధనలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా నిలవలేకపోతున్నట్టు వివరించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చి చూస్తే నిబంధనల అమలుకు వ్యయాలు భారత్‌లో అధికంగా ఉండడం మరో సవాలుగా పేర్కొంది. ఇది సూక్ష్మ, చిన్న ఫార్మాస్యూటికల్ సంస్థలపై భారాన్ని మోపుతున్నట్టు తెలిపింది.

ఈ చర్యలు అవసరం..

అంతర్జాతీయంగా ఫార్మాస్యూటికల్ ఆర్‌అండ్‌డీలో భారత్‌ను మెరుగైన స్థానంలో నిలిపేందుకు స్పష్టమైన నియంత్రణలు, సరళీకృత ప్రక్రియలు అవసరమని ఈ నివేదిక సూచించింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా బలమైన వసతులతో కూడిన ఎకోసిస్టమ్‌తో ఆర్‌అండ్‌డీ కేంద్రంగా భారత్ అవతరించేందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అవసరమని అభిప్రాయపడింది. అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు, తక్కువ వ్యయాలతో కూడిన రోగుల డేటాబేస్ వినియోగించుకోవడం ద్వారా అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ కంపెనీలను భారత్ ఆకర్షించొచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయం కేవలం కొన్ని సంస్థలు, విద్యా కేంద్రాలకే పరిమితమైందని.. ఇదే మాదిరి పరిశోధన సాయం, ఆర్థిక ప్రోత్సాహకాలు ఫార్మాస్యూటికల్ డిపార్ట్‌మెంట్ నుంచి ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు ప్రత్యేకమైన కోర్సులను ప్రభుత్వం, విద్యా సంస్థలు కలసి రూపొందించాలని సూచించింది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో ఎస్‌బీఐ జట్టు

కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: సింగపూర్ ఎయిర్‌లైన్స్ భాగస్వామ్యంతో ఎస్‌బీఐ కార్డ్ 'క్రిస్ ఫ్లయర్' పేరుతో కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేసింది. సూపర్ ప్రీమియం కస్టమర్ల కోసం ఈ కార్డ్‌ను తీసుకొచ్చినట్టు ఎస్‌బీఐ కార్డ్ తెలిపింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తోపాటు స్కూట్ ఎయిర్‌లైన్, క్రిస్ షాప్ డాట్ కామ్, క్రిస్ ఫ్లస్ లైఫ్‌స్టయిల్ యాప్ తదితర సంస్థలతో కూడిన ఎస్ఐఏ గ్రూప్‌లో ఈ కార్డు దారులకు ప్రత్యేక ప్రయోజనాలు అందుతాయని పేర్కొంది. క్రిస్ ఫ్లయర్ ఎస్‌బీఐ కార్డ్, క్రిస్ ఫ్లయర్ ఎస్‌బీఐ కార్డ్ అపెక్స్ పేరుతో ఈ కార్డు రెండు రకాలుగా లభిస్తుందని తెలిపింది. కార్డుదారులు తమ ప్రయాణాలకు ఈ కార్డులతో చేసే వ్యయాలపై రివార్డులతోపాటు మైల్‌స్టోన్ ప్రయోజనాలు పొందొచ్చని ప్రకటించింది. వెల్‌కమ్ ఆఫర్ కింద క్రిస్ ఫ్లయర్ ఎస్‌బీఐ కార్డ్ కొనుగోలుపై 3,000 క్రిస్ ఫ్లయర్‌మైల్స్, క్రిస్ ఫ్లయర్ ఎస్‌బీఐ కార్డ్ అపెక్స్‌పై 10,000 క్రిస్ ఫ్లయర్ మైల్స్ లభిస్తాయని తెలిపింది.



విష్ణువర్ధన్ శుభారంభం

న్యూఢిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ప్లేయర్, టాప్ సీడ్ విష్ణువర్ధన్ శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్ 7–5, 6–1తో ఉదిత్ కాంబోజ్ (హరియాణా)పై గెలుపొందాడు. తొలి సెట్‌లో కాస్త పోటీ ఎదుర్కొన్న విష్ణు రెండో సెట్‌లో పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. గతంలో రెండుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన విష్ణు 2012 లండన్ ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడ్డాడు. డేవిస్‌కప్‌లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 37 ఏళ్ల విష్ణు 2010 గ్వాంగ్‌జూ ఆసియా క్రీడల్లో టీమ్ విభాగంలో కాంస్య పతకం... మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సానియా మీర్జాతో కలిసి రజత పతకం సొంతం చేసుకున్నాడు. మహిళల సింగిల్స్ విభాగంలో మాజీ చాంపియన్, టాప్ సీడ్ వైదేహి చౌధరీ (గుజరాత్) కూడా గెలుపు బోణీ చేసింది. శ్రైలీ ఠక్కర్ (గుజరాత్)తో జరిగిన మ్యాచ్‌లో వైదేహి 6–2, 6–4తో విజయం సాధించింది.

యువ భారత్ దీటైన జవాబు

తొలి ఇన్నింగ్స్‌లో ప్రస్తుతం 103/0 • ఆస్ట్రేలియా అండర్–19 జట్టు 293 ఆలౌట్



వైభవ్

చెన్నై: ఆస్ట్రేలియా అండర్–19 జట్టుపై వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత అండర్–19 జట్టు అనధికారిక టెస్టు సిరీస్‌ను కూడా మెరుగ్గా ఆరంభించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చెన్నై వేదికగా సోమవారం తొలి అనధికారిక టెస్టు ప్రారంభమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆ్రస్టేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 71.4 ఓవర్లలో 293 పరుగులకు ఆలౌటైంది. రిలే కింగ్‌సెల్ (77 బంతుల్లో 53; 9 ఫోర్లు, ఒక సిక్సర్), ఎయిడెన్ ఓ కానర్ (70 బంతుల్లో 61; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ శతకాలు సాధించారు. భారత జట్టు బౌలర్లలో సమర్థ్ నాగరాజ్, మొహమ్మద్ ఇనాన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 103 పరుగులు చేసింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (47 బంతుల్లో 81 బ్యాటింగ్; 13 ఫోర్లు, 2 సిక్సర్లు), విహాన్ మల్హోత్రా (21 బ్యాటింగ్, 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న యువ భారత్... ప్రత్యర్థి స్కోరుకు 190 పరుగులు వెనుకబడి ఉంది.

వైభవ్ రికార్డు అర్ధ శతకం

అంతర్జాతీయ క్రికెట్‌లో హాఫ్ సెంచరీ సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా యువ భారత్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ రికార్డుల్లోకెక్కాడు. వైభవ్ 13 సంవత్సరాల 187 రోజుల్లో ఈ ఘనత సాధించాడు. ఏ స్థాయి క్రికెట్‌లోనైనా ఇదే అతి పిన్న వయసులో అంతర్జాతీయ అర్ధసెంచరీ. అంతకుముందు ఈ రికార్డు బంగ్లాదేశ్ ప్లేయర్ నజ్ముల్ హసన్ షంటో (14 సంవత్సరాల 231 రోజులు) పేరిట ఉంది. శ్రీలంకపై నజ్ముల్ ఈ రికార్డు నమోదు చేశాడు.

సమిత్ ద్రవిడ్‌కు గాయం

భారత అండర్–19 జట్టులో సభ్యుడైన క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్ ద్రవిడ్ మోకాలి గాయం కారణంగా ఆ్రస్టేలియాతో అనధికారిక టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. రెండో మ్యాచ్ వరకూ అతడు కోలుకోవడం అనుమానమే. ప్రస్తుతం సమిత్ బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసం పొందుతున్నాడు. ఇటీవల యూత్ వన్డే సిరీస్‌కు కూడా గాయం కారణంగానే దూరమైన సమిత్... కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు భారత అండర్–19 జట్టు కోచ్ హృషికేశ్ కనిత్కర్ తెలిపాడు. అండర్–19 స్థాయిలో ఆడేందుకు సమిత్ ద్రవిడ్‌కు ఇదే చివరి అవకాశం కాగా... ఈ నెల 11న అతడు 19వ పడిలోకి అడుగు పెట్టనున్నాడు. దీంతో 2026లో జరగనున్న అండర్–19 ప్రపంచకప్‌లో ఆడే అర్హత కోల్పోయాడు.



లక్షిత, ప్రమోద్

భారత షూటర్లకు రెండు కాంస్యాలు

లిమా (పెరూ): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గౌతమి భానోత్–అజయ్ మలిక్ జోడీ... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో లక్షిత–ప్రమోద్ ద్వయం కాంస్య పతకాలు సాధించాయి. కాంస్య పతక మ్యాచ్‌ల్లో గౌతమి–అజయ్ 17–9తో అనామరియా తుర్క్–డార్కో తొమాసెవిచ్ (క్రొయేషియా)లపై... లక్షిత–ప్రమోద్ 16–8తో కనిష్క డాగర్–ముకేశ్ నీలవాలి (భారత్)లపై గెలిచారు.

విజేత భారత్



థింపూ (భూటాన్): దక్షిణాసియా అండర్–17 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు టైటిల్‌ను నిలబెట్టుకుంది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన భారత్ సోమవారం జరిగిన ఫైనల్లో 2–0 గోల్స్ తేడాతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. ఆట 58వ నిమిషంలో మొహమ్మద్ కైఫ్... 90+5వ నిమిషంలో మొహమ్మద్ అర్బాష్ ఒక్కో గోల్ చేసి భారత జట్టుకు టైటిల్‌ను అందించారు. 2022లో శ్రీలంక ఆతిథ్యమిచ్చిన టోర్నీలో భారత జట్టు ఫైనల్లో 4–0తో నేపాల్‌ను ఓడించి తొలిసారి చాంపియన్‌గా అవతరించింది.

రామ్‌కుమార్ గెలుపు



షాంఘై: భారత టెన్నిస్ ప్లేయర్ రామ్‌కుమార్ రామనాథన్ షాంఘై మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీ క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సంచలన విజయం సాధించాడు. ప్రపంచ 140వ ర్యాంకర్ ఉగో బ్లాంచెట్ (ఫ్రాన్స్)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 335వ ర్యాంకర్ రామ్‌కుమార్ 6–4, 4–6, 6–4తో గెలుపొంది రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 2 గంటల 7 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్ 10 ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. చివరి నిమిషంలో క్వాలిఫయింగ్‌లో ఆడే అవకాశం దక్కించుకున్న రామ్ చైనా ప్లేయర్ ఫాజింగ్ సన్‌తో జరిగే రెండో రౌండ్ మ్యాచ్‌లో గెలిస్తే మెయిన్ 'డ్రా'కు అర్హత సాధిస్తాడు.

శ్రీజ, మనిక ఓటమి



శ్రీజ

బీజింగ్: చైనా స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత స్టార్ ప్లేయర్లకు నిరాశ ఎదురైంది. మెయిన్ 'డ్రా' సింగిల్స్‌లో బరిలోకి దిగిన తెలంగాణ ప్లేయర్, ప్రపంచ 23వ ర్యాంకర్ ఆకుల శ్రీజ... ప్రపంచ 28వ ర్యాంకర్ మనిక బత్రా... ఆచంట శరత్ కమల్, మానవ్ ఠక్కర్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. శ్రీజ 10–12, 4–11, 5–11తో ప్రపంచ 12వ ర్యాంకర్ మియు హిరానో (జపాన్) చేతిలో... మనిక 3–11, 9–11, 9–11తో ప్రపంచ 9వ ర్యాంకర్ మిమా ఇటో (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యారు. శరత్ కమల్ 11–9, 13–15, 12–14, 9–11తో ఆ్రస్టేలియాకు చెందిన భారత సంతతి క్రీడాకారుడు, 16 ఏళ్ల ఆదిత్య సరీన్ చేతిలో అనూహ్యంగా ఓడిపోగా... మానవ్ 9–11, 9–11, 8–11తో జెంగ్ బెజున్ (చైనా) చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. మహిళల డబుల్స్‌లో సుతీర్థ ముఖర్జీ–ఐహిక ముఖర్జీ రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.



సచిన్ మళ్లీ బరిలోకి...

ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో భారత దిగ్గజం


ముంబై: 'మాస్టర్ బ్లాస్టర్' సచిన్ టెండూల్కర్ మళ్లీ బరిలోకి దిగనున్నాడు. అలాగని ఏ వ్యాఖ్యాతగానో మెంటార్‌గానో కాదు... ఎప్పట్లాగే ఇన్నింగ్స్ ఆరంభించనున్న భారత క్రికెట్ దిగ్గజం... ప్రపంచవ్యాప్త క్రికెట్ అభిమానుల్ని తన బ్యాటింగ్ మెరుపులతో అలరించనున్నాడు. అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్) ఈ ఏడాది చివర్లో జరగనుంది. ఈ ఆరంభ ఐఎంఎల్ టి20 టోర్నీలో మాస్టర్ బ్లాస్టర్ ఆడతాడని నిర్వాహకులు ప్రకటించడంతో సచిన్ అభిమానులు పండగ చేసుకోనున్నారు. ఆరు జట్లతో... టి20 ఫార్మాట్‌లో... ఈ లీగ్‌కు ఈ ఏడాదే శ్రీకారం చుడుతున్నారు. మూడు వేదికలు ముంబై, లక్నో, రాయ్‌పూర్‌లలో ఈ టోర్నీకి సంబంధించిన మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ లీగ్‌కు భారత మాజీ కెప్టెన్, దిగ్గజం సునీల్ గావస్కర్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. భారత్‌తో పాటు ఆ్రస్టేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లండ్, శ్రీలంకలకు చెందిన దిగ్గజ క్రికెటర్లు ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి కనబరచడంతో ఐఎంఎల్‌పై సర్వత్రా క్రేజ్ పెరిగింది. నిజానికి సచిన్, సన్నీలు ఈ టోర్నీలో స్టేక్ హోల్డర్లు. వీరికి చెందిన ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (పీఎంజీ) స్పోర్ట్స్, స్పోర్ట్‌ఫైవ్ మార్కెటింగ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ టోర్నీ జరుగుతుంది. ఆరు ఫ్రాంచైజీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తున్నారు. 'గత దశాబ్ద కాలంగా టి20 క్రికెట్ వేగంగా కొత్త పుంతలు తొక్కుతోంది. విశ్వవ్యాప్తంగా ఎంతోమంది కొత్త కొత్త అభిమానుల్ని సంపాదించుకుంది. వయోభేదం లేకుండా చాలామంది మ్యాచ్‌లు చూసేందుకు ఎగబడుతున్నారు. ఇప్పుడు పాతతరం క్రికెటర్లు ఈ ఫార్మాట్‌లో అలరించేందుకు సిద్ధమవుతున్నారు' అని సచిన్ టెండూల్కర్ అన్నాడు. నిజానికి క్రీడాకారులెవరూ సంపూర్ణంగా రిటైర్ కారని, అవకాశం వస్తే మళ్లీ మైదానంలోకి దిగేందుకు మనసారా ఆసక్తి చూపుతారని చెప్పారు. గావస్కర్ మాట్లాడుతూ 'ఐఎంఎల్ మళ్లీ తమ ఆరాధ్య క్రికెటర్లను అభిమానుల ముందుకు తెస్తోంది. వెటరన్, క్రేజీ క్రికెటర్ల మెరుపుల్ని ఆస్వాదించేందుకు సువర్ణావకాశం కల్పిస్తోంది' అని అన్నారు.

అడైర్ బ్రదర్స్ అదుర్స్

తొలిసారి దక్షిణాఫ్రికాపై ఐర్లాండ్ విజయం



రాస్ అడైర్



మార్క్ అడైర్

అబుదాబి: టి20 క్రికెట్ చరిత్రలో ఐర్లాండ్ జట్టు తొలిసారి దక్షిణాఫ్రికాపై విజయ సాధించింది. అడైర్ సోదరులు అదరగొట్టడంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన రెండో టి20లో ఐర్లాండ్ 10 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి సంచలనం సృష్టించింది. ఫలితంగా సిరీస్ 1–1తో సమంగా ముగిసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓపెనర్ రాస్ అడైర్ (58 బంతుల్లో 100; 5 ఫోర్లు, 9 సిక్సర్లు) సెంచరీతో చెలరేగగా... కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (31 బంతుల్లో 52; 7 ఫోర్లు, ఒక సిక్సర్) హాఫ్ సెంచరీతో మెరిశాడు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 185 పరుగులకే పరిమితమైంది. రీజా హెండ్రిక్స్ (32 బంతుల్లో 51; 6 ఫోర్లు, ఒక సిక్సర్), మాథ్యూ బ్రీట్జ్ (41 బంతుల్లో 51; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీలు చేశారు. కెప్టెన్ మార్క్‌రమ్ (8), ట్రిస్టన్ స్టబ్స్ (9), ముల్డర్ (8), ప్యాట్రిక్ క్రూగర్ (5) విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ 4 వికెట్లతో సత్తా చాటాడు. బ్యాటింగ్‌లో రాస్ అడైర్ సెంచరీతో కదంతొక్కితే.. బౌలింగ్‌లో అతడి సోదరుడు మార్క్ అడైర్ రాణించి ఐర్లాండ్‌కు అద్వితీయ విజయం అందించాడు. ఇరు జట్ల మధ్య బుధవారం తొలి వన్డే జరగనుంది.

జీఎంఆర్ గ్రూప్ చేతికి హాంప్‌షైర్ కౌంటీ జట్టు

- 53 శాతం వాటా కొనుగోలు
- రెండేళ్లలో పూర్తిగా హస్తగతం



లండన్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని జీఎంఆర్ గ్రూప్... ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ జట్టులో మెజారిటీ వాటాను కొనుగోలు చేసుకుంది. కౌంటీ జట్టు హాంప్‌షైర్ క్లబ్‌లో 53 శాతం వాటా కొనుగోలు చేసినట్లు సోమవారం జీఎంఆర్ సంస్థ ప్రకటించింది. దీంతో కౌంటీ జట్లలో విదేశీ యాజమాన్యం కలిగిన తొలి జట్టుగా హాంప్‌షైర్ నిలిచింది. ప్రస్తుతానికి సగానికి పైగా వాటా కొనుగోలు చేసుకున్న జీఎంఆర్ గ్రూప్... వచ్చే రెండేళ్లలో హాంప్‌షైర్ జట్టును పూర్తిగా హస్తగతం చేసుకోనుంది. ప్రస్తుతం హాంప్‌షైర్ క్లబ్‌కు జీఎంఆర్ గ్రూప్ రూ. 450 కోట్లు చెల్లించినట్లు సమాచారం. 'హాంప్‌షైర్ క్లబ్ యజమాని, జీఎంఆర్ గ్రూప్ మధ్య ఒప్పందం కుదిరింది. వచ్చే 24 నెలల్లో క్లబ్ పూర్తి యాజమాన్య హక్కులు జీఎంఆర్ గ్రూప్‌కు బదిలీ అవుతాయి' అని సోమవారం హాంప్‌షైర్ క్లబ్ అధికారిక వెబ్‌సైట్‌లో తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా యువతరంతో సంబంధాలు కొనసాగిస్తూ... నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు హాంప్‌షైర్ జట్టును కొనుగోలు చేసినట్లు జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ గ్రంధి కిరణ్ కుమార్ తెలిపారు. 'భారత్‌తో పాటు దుబాయ్, అమెరికాలో పెట్టుబడులు కొనసాగుతున్నాయి. యువతరం ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నాం. యువతను మరింత ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. క్రీడలను సంస్కృతిలో భాగం చేయడమే మా లక్ష్యం. భవిష్యత్ ప్రపంచ చాంపియన్‌లను సృష్టించడంపై దృష్టి పెడతాం' అని కిరణ్ కుమార్ అన్నారు. ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌లో 50 శాతా వాటా ఉన్న జీఎంఆర్ గ్రూప్‌నకు ఐఎల్‌టి20 లీగ్‌లో దుబాయ్ క్యాపిటల్స్, ఎస్‌ఎ20లో ప్రిటోరియా క్యాపిటల్స్‌లో కూడా వాటా ఉంది. అమెరికా మేజర్ లీగ్ క్రికెట్‌లోనూ జీఎంఆర్ గ్రూప్ పెట్టుబడులు పెట్టింది.

బంగ్లాదేశ్‌లో పర్యటనకు దక్షిణాఫ్రికా బోర్డు సై



జొహన్నెస్‌బర్గ్: బంగ్లాదేశ్‌లో దక్షిణాఫ్రికా జట్టు పర్యటనకు ఆ దేశ క్రికెట్ బోర్డు (సీఎస్‌ఏ) ఆమోదం తెలిపింది. దీంతో ఈనెలలో పర్యటించే సఫారీ జట్టు అక్కడ రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొంటుంది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చాక అక్కడ పరిస్థితులు మరింత దిగజారి హింసాత్మక ఘటనలకు దారితీశాయి. దీంతో మైనార్టీ ప్రజలు సహ పెద్ద సంఖ్యలో పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 3 నుంచి జరగాల్సిన మహిళల టి20 ప్రపంచకప్‌ను అక్కడి నుంచి యూఏఈకి తరలించారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పరిస్థితులు కాస్త మెరుగవడంతో క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్‌ఏ) తమ భద్రతా సంస్థ పరిశీలన అనంతరం పర్యటనకు సుముఖత వ్యక్తం చేసింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు అక్టోబర్ 16న ఢాకా చేరుకుంటుంది. అక్కడే సిరీస్‌లోని తొలి టెస్టును 21 నుంచి 25 వరకు ఆడుతుంది. అనంతరం చట్టోగ్రామ్‌కు వెళ్లి అక్టోబర్ 29 నుంచి నవంబర్ 2 వరకు రెండో టెస్టులో తలపడుతుంది. గత వారం సీఎస్‌ఏకు చెందిన బృందం బంగ్లాదేశ్‌లో పర్యటించింది. బోర్డు ఆపరేషన్స్ మేనేజర్, టీమ్ సెక్యూరిటీ మేనేజర్, కన్సల్టెంట్, క్రికెటర్ల సంఘం ప్రతినిధులతో కూడిన బృందం బంగ్లాదేశ్‌లోని తాజా పరిస్థితులపై బోర్డుకు నివేదిక ఇచ్చింది. దీనిపై సంతృప్తి చెందిన సీఎస్‌ఏ పర్యటనకు జైకొట్టింది.

పాక్‌లో పర్యటించడంపై ప్రభుత్వానిదే తుది నిర్ణయం

బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా



కాన్పూర్: వచ్చే ఏడాది పాకిస్తాన్‌లో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు టీమిండియా ఆ దేశానికి వెళ్లడంపై కేంద్ర ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకుంటుందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు పాకిస్తాన్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. అయితే సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో గత కొన్నేళ్లుగా భారత జట్టు పాకిస్తాన్‌లో పర్యటించడం లేదు. ఇరు జట్లు కేవలం ఐసీసీ టోర్నీల్లో మాత్రమే ముఖాముఖీ తలపడతున్నాయి. ఈ నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీ కోసం టీమిండియా పాకిస్తాన్ వెళ్తుందా అనే ప్రశ్నపై రాజీవ్ శుక్లా స్పందించాడు. 'ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు. అంతర్జాతీయ పర్యటనలకు సంబంధించిన తుది నిర్ణయం ప్రభుత్వానిదే. ఏ దేశంలో పర్యటించాలి, ఏ దేశంలో పర్యటించకూడదు అనే నిర్ణయం కేంద్రమే తీసుకుంటుంది. ప్రభుత్వ నిర్ణయమే శిరోధార్యం' అని రాజీవ్ శుక్లా పేర్కొన్నాడు. భారత జట్టు చివరిసారిగా 2008లో పాకిస్తాన్‌లో పర్యటించింది. ఆ తర్వాత ముంబై దాడుల కారణంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగలేదు. గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్ కోసం పాకిస్తాన్ జట్టు ఏడేళ్ల తర్వాత మన దేశానికి వచ్చింది. చాంపియన్స్ ట్రోఫీని పాకిస్తాన్‌లో కాకుండా... దుబాయ్, శ్రీలంక వంటి ఇతర వేదికల మీద నిర్వహించాలని ఐసీసీని బీసీసీఐ కోరే అవకాశం ఉంది. గత ఏడాది ఆసియా కప్ సమయంలోనూ ఇదే జరిగింది. హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించిన ఈ టోర్నీకి అసలు ఆతిథ్యమిచ్చింది పాకిస్తాన్ అయినా... టీమిండియా ఆడే మ్యాచ్‌లు మాత్రం శ్రీలంకలో నిర్వహించారు. మరోవైపు కాన్పూర్‌ను టెస్టు వేదికగా ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాజీవ్ శుక్లా స్పందించాడు. 'విమర్శకులు ఏదో ఒకటి అంటూనే ఉంటారు. కాన్పూర్‌కు మ్యాచ్ కేటాయించకపోయినా విమర్శిస్తారు. ఇప్పుడు కేటాయిస్తే ఇలా అంటున్నారు. ఈ మైదానానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. సుదీర్ఘ కాలంలో వరుసగా రెండు రోజులు వర్షం కారణంగా ఆట సాధ్యపడకపోవడం ఇదే తొలిసారి. ప్రపంచంలో ఎన్నో మైదానాల్లో వర్షం కారణంగా మ్యాచ్‌లు రద్దు అవుతూ ఉంటాయి. పర్యావరణ హితమైన ఈ మైదానాన్ని మరింత మెరుగు పరుస్తున్నాం' అని శుక్లా పేర్కొన్నాడు.

ఇండియన్ రైల్వేస్‌దే మురుగప్ప గోల్డ్ కప్



చెన్నై: భారత్‌లో అతి పురాతన హాకీ టోర్నమెంట్‌లలో ఒకటైన ఎంసీసీ–మురుగప్ప గోల్డ్ కప్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇండియన్ రైల్వేస్ జట్టు టైటిల్ నిలబెట్టుకుంది. 1901లో తొలిసారి మొదలైన ఈ టోర్నీ ఇప్పటి వరకు 95 సార్లు జరిగింది. ఫైనల్లో రైల్వేస్ జట్టు 5–3 గోల్స్ తేడాతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) జట్టుపై ఘన విజయం సాధించింది. రైల్వేస్ తరఫున యువరాజ్ వాల్మీకి (18వ, 58వ ని.లో) రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ముందుగా గుర్‌సాహిబ్‌జిత్ సింగ్ 7వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి జట్టుకు శుభారంభమిచ్చారు. రెండు నిమిషాల వ్యవధిలోనే సిమ్రన్‌జ్యోత్ సింగ్ (9వ ని.లో) ఫీల్డ్‌గోల్ చేసి రైల్వేస్ ఆధిక్యాన్ని డబుల్ చేశాడు. తర్వాత కాసేపటికి యువరాజ్ చేసిన గోల్‌తో 3–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఎట్టకేలకు ఐఓసీ ఆటగాడు తల్విందర్ సింగ్ (23వ ని.లో) చేసిన గోల్‌తో జట్టు ఖాతా తెరిచింది. ఆరు నిమిషాల వ్యవధిలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గుజిందర్ సింగ్ (ఐఓసీ) గోల్‌గా మలచడంతో రెండు క్వార్టర్లు ముగిసేసరికి ఐఓసీ 2–3తో రైల్వేస్ ఆధిక్యానికి గండికొట్టింది. కానీ మూడో క్వార్టర్ మొదలైన కాసేపటికే ముకుల్ శర్మ (35వ ని.లో), చివరి క్వార్టర్‌లో యువరాజ్ చేసిన గోల్స్‌తో రైల్వేస్‌కు విజయం ఖాయమైంది. ఐఓసీ తరఫున రాజ్‌బీర్ సింగ్ (58వ ని.లో) గోల్ చేసినా లాభం లేకపోయింది.



ఫిలిప్పీన్స్‌ను భీకర తుపాను క్రథోన్ వణికిస్తోంది. ఇలొకొస్ నార్టె ప్రావిన్స్‌లోని బకర్రాలో వరదల్లో చిక్కుకుపోయిన ప్రజలను తరలిస్తున్న సహాయక సిబ్బంది



గ్రీస్‌లో కార్చిచ్చు వ్యాపించింది. ఆదివారం కొరింతియా ప్రాంతంలోని అనో లౌట్రో గ్రామం వైపు దూసుకొస్తున్న మంటల దృశ్యమిది.



క్రథోన్ తుపానుతో ఓ వైపు వర్షం కురుస్తుండగా ఆకాశంలో ఆహ్లాదం కలిగిస్తున్న ఇంద్రధనుస్సు. తైవాన్ రాజధాని తైపీలోనిదీ దృశ్యం.

2.1 కిలోల గోల్డ్ కొట్టేశారు!

అనుపమ్ ఖేర్ బొమ్మ కరెన్సీతో బురిడీ

లబోదిబో మంటున్న గుజరాత్ వ్యాపారి

అహ్మదాబాద్: వీళ్లు అలాంటిలాంటి మోసగాళ్లు కాదు.. దొంగనోట్ల కట్టలు. అవీ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ బొమ్మతో ఉన్నవి అక్షరాలా రూ.1.30 కోట్లు..ఓ బడా బంగారం వ్యాపారికి అంటగట్టి ఏకంగా 2.1 కిలోల బంగారంతో ఉడాయించారు. ఇందుకోసమే ప్రత్యేకంగా వాళ్లు ఓ నకిలీ హవాలా ఆఫీసును సైతం ఏర్పాటు చేసుకున్నారు. మోసం తెలుసుకునేలోపే పత్తా లేకుండా పోయారు. బాలీవుడ్‌ను సైతం తలదన్నే ట్విస్టులున్న ఈ ఘటన గుజరాత్‌లో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అహ్మదాబాద్‌కు చెందిన బంగారం వ్యాపారి మెహుల్ ఠక్కర్‌కు ఇటీవల ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తన పేరు ప్రశాంత్ పటేల్ అని, స్థానికంగా ఉన్న ఫలానా నగల దుకాణం మేనేజర్‌ను అంటూ పరిచయం చేసుకున్నాడు. ఆ దుకాణం మెహుల్‌కు తెలిసిందే కావడంతో ఆయన నిజమేననుకున్నాడు. పటేల్ 2.1 కిలోల బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపగా, కొంత బేరసారాల తర్వాత రూ.1.60 కోట్లకు డీల్ కుదిరింది. అతడిచ్చిన సమాచారం మేరకు సెప్టెంబర్ 24వ తేదీన ఠక్కర్ తన మనుషులకు 2.1 కిలోల బంగారమిచ్చి పంపించారు. చెప్పిన ప్రకారం వాళ్లు ఓ హవాలా దుకాణానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ వీరి కోసం ముగ్గురు వ్యక్తులున్నారు. దుకాణంలోని నోట్ల లెక్కింపు మిషన్‌తో తీసుకువచ్చిన 26 బండిళ్లలో ఉన్న నోట్లను లెక్కించడం మొదలైంది. తాము రూ.1.30 కోట్లే తెచ్చామని, మిగతా రూ.30 లక్షలు పక్కనే మరో దుకాణం నుంచి తెస్తామంటూ ముగ్గురిలో ఇద్దరు బంగారం బిస్కెట్లను తీసుకుని వెళ్లారు. అయితే, ఆ నోట్లపై మహాత్మా గాంధీకి బదులు నటుడు అనుపమ్ ఖేర్ బొమ్మ ఉంది. రిజర్వు బ్యాంక్ ఇండియా స్థానంలో తప్పుగా 'రెసోల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని ఉంది. ఠక్కర్ సిబ్బంది ఇదంతా గమనించి, అనుమానించారు. ఇదేమని, అక్కడే ఉన్న మూడో వ్యక్తిని ప్రశ్నించారు. 'కౌంటింగ్ మిషన్ తెమ్మంటే తెచ్చానే తప్ప, వారెవరో, ఆ నోట్ల విషయమేంటో నాకూ తెలియదు'అంటూ అతడు చావు కబురు చల్లగా చెప్పాడు. బంగారం బిస్కెట్లతో వెళ్లిన పెద్దమనుషులు తిరిగి రాలేదు. దీంతో, సిబ్బంది ఆ విషయాన్ని ఠక్కర్ చెవిన వేశారు. ఆయన గుండె ఆగినంత పనైంది..! ఇదేమిటని ఆరా తీయగా ఆ హవాలా దుకాణాన్ని రెండు రోజుల క్రితమే ఎవరో తెరిచారని తేలింది. దీంతో, మెహుల్ ఠక్కర్ తననెవరో బకరాను చేశారని గ్రహించి, నవ్‌రంగ్‌పుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పక్షులకు చీమల గండం!

వాటి ఆహారం గుటకాయస్వాహా
పర్వత ప్రాంతాల్లో పెను సమస్య
పక్షిజాతుల వైవిధ్యానికి ముప్పు
దాంతో ఎత్తైన ప్రాంతాలకు వలసలు

పర్వత ప్రాంతాల్లోని పక్షి జాతుల మనుగడకు పెను ముప్పు ఎదురవుతోంది. ఎవరి నుంచో తెలుసా? చీమల నుంచి! వాటి దెబ్బకు తీవ్ర ఆహార కొరతతో పక్షులు అల్లాడుతున్నాయి. దీనివల్ల పర్వత ప్రాంతాల్లో పక్షి జాతుల వైవిధ్యం కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. దాంతో కష్టమే అయినా, విధిలేని పరిస్థితుల్లో చీమలు ఎక్కి రాని పర్వత పై ప్రాంతాలకు పక్షులు తమ ఆవాసాలను మార్చుకుంటున్నాయి. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) తాజా పరిశోధనలో ఈ మేరకు వెల్లడైంది. ఈ ధోరణి దేశవ్యాప్తంగా విస్తరించి ఉండటం విశేషమని అధ్యయనం పేర్కొంది.

భూమి ఉపరితలంపై 25 శాతం మాత్రమే ఉండే పర్వతాలు ఏకంగా 85 శాతం పక్షి, క్షీరద జాతులకు నిలయాలు. పర్వతాల్లోని పలు పక్షి జాతులు తరచూ పై ప్రాంతాలకు వలస వెళ్తుండటాన్ని పర్యావరణ శాస్త్రవేత్తలు గమనించారు. దీనికి వాతావరణ మార్పులు తదితరాలే ప్రధాన కారణాలని ఇప్పటిదాకా భావిస్తూ వచ్చారు. కానీ అది నిజం కాదని ఐఐఎస్‌సీ అధ్యయనం తేల్చింది. మన దేశంలో పర్వత ప్రాంతాల్లో నివసించే పక్షులకు ఓషియోఫైలా జాతి చీమలు పెద్ద ముప్పుగా మారినట్టు వెల్లడించింది. పర్వత ప్రాంతల్లో మొత్తం జీవావరణ వ్యవస్థనే అవి ప్రభావితం చేస్తున్నట్టు అధ్యయన బృందానికి సారథ్యం వహించిన సెంటర్ ఫర్ ఎకోలాజికల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమేశ్ శ్రీనివాసన్ తెలిపారు. వాటితో నెలకొన్న ఆహార పోటీని తట్టుకోలేక పక్షులే తమ ఆవాసాలను మార్చుకోవాల్సి వస్తోందని వివరించారు. ఓషియోఫైలా చీమలు దూకుడుకు పెట్టింది పేరు. కీటకాలు తదితరాలను తిని బతుకుతుంటాయి. ఇవి ప్రధానంగా పర్వతాల పాద ప్రాంతాల్లో విస్తారంగా ఉంటాయి. దాంతో అక్కడ కీటకాల కొరత నానాటికీ తీవ్రతరమవుతోంది. తమ ప్రధాన ఆహారమైన కీటకాల అలభ్యతతో పక్షులు అల్లాడుతున్నాయి. చీమల బెడదను తప్పించుకోవడానికి వాటి ఉనికి అంతగా ఉండని పర్వత పై ప్రాంతాలకు వలస పోతున్నాయి. ''ఫలితంగా ప్రధానంగా కీటకాలను తినే పక్షి జాతుల వైవిధ్యం 900 మీటర్లు, అంతకంటే ఎత్తైన పర్వత ప్రాంతాల్లోనే విస్తారంగా కన్పిస్తోంది. దేశవ్యాప్తంగా ఓషియోఫైలా చీమలుండే పర్వత ప్రాంతాలన్నింట్లోనూ ఈ ధోరణి కొట్టొచ్చినట్టుగా ఉంది. పళ్లు, పూలలోని మకరందం ప్రధాన ఆహారమైన పక్షి జాతులు మాత్రం పర్వత పాదప్రాంతాల్లో కూడా విస్తారంగా ఉండటం గమనించాం. ఆహారం విషయంలో ఓషియోఫైలా చీమలతో వాటికి పోటీ లేకపోవడమే అందుకు ప్రధాన కారణం'' అని శ్రీనివాసన్ వెల్లడించారు. పక్షి జాతుల పరిరక్షణ ప్రయత్నాలను ఈ అధ్యయన ఫలితాలు ఎంతగానో ప్రభావితం చేయనున్నాయి. వాటిని ఎకాలజీ లెటర్స్‌లో తాజాగా ప్రచురించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

45 రోజులుగా తిండీ, నిద్రా లేవు!

రుణ సంస్థ ఏరియా మేనేజర్ ఆత్మహత్య

తీవ్ర పని ఒత్తిడే కారణమంటూ సూసైడ్ నోట్

లక్నో: తీవ్ర పని ఒత్తిడికి తట్టుకోలేక ఓ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన తరుణ్ సక్సేనా(42) బజాజ్ ఫైనాన్స్‌లో ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఆయనపై అధికారుల ఒత్తిడి ఎక్కువైంది. టార్గెట్లు పూర్తి చేయకుంటే వేతనంలో కోత వేస్తామంటూ హెచ్చరిస్తున్నారు. వీటిని తాళలేని తరుణ్ సక్సేనా ఆదివారం రాత్రి భార్య, పిల్లలను వేరే గదిలో ఉంచి బయట గడియపెట్టారు. తన గదిలో ఉరి వేసుకుని తనువు చాలించారు. సోమవారం ఉదయం ఈ దారుణం వెలుగు చూసింది. తరుణ్ వద్ద ఐదు పేజీల సూసైడ్ నోట్ లభించింది. అందులో..'దాదాపు 45 రోజులుగా కంపెనీ అధికారులు టార్గెట్లు పూర్తి చేయాలంటూ తీవ్రంగా వేధింపులకు గురిచేస్తున్నారు. లేకుంటే వేతనం కోత వేస్తామన్నారు. చేస్తే చేయండి లేకుంటే ఉద్యోగం మానేయండి అంటున్నారు. అనేక కారణాలతో లక్ష్యాలను చేరుకోలేకపోయాను. తీవ్ర ఒత్తిడితో సరిగ్గా తిండీ నిద్రా కరువయ్యాయి. భవిష్యత్తు గురించి భయంగా ఉంది. ఏం చేయాలో అర్థం కాలేదు. అందుకే వెళ్లిపోతున్నాను'అని అందులో ఉంది. తమ ఏరియాలో వసూళ్లు చేయలేకపోయిన ఈఎంఐల మొత్తాన్ని తనతోపాటు సహచరుల వేతనాల నుంచి కట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు తరుణ్ సక్సేనా. తరుణ్ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. సంబంధిత బజాజ్ ఫైనాన్స్ సంస్థ ఈ ఘటనపై స్పందించాల్సి ఉంది. సెప్టెంబర్ మొదటి వారంలో ఎర్నెస్ట్ అండ్ యంగ్ సంస్థలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేసే అన్నా సెబాస్టియన్ పెరయిల్(26) అనే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. అన్నా బలవన్మరణానికి సంస్థ విధానాలే కారణమని ఆమె తల్లి అనితా ఆగస్టీన్ ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా చైర్మన్ రాజీవ్ మెమానీకి లేఖ రాశారు. అతిగా పనిచేయించడం గొప్పతనంగా భావిస్తూ సాటి మనిషి అనే విషయాన్ని మర్చిపోతున్న సంస్కృతిలో మార్పు రావాలన్నారు. ఉద్యోగంలో చేరిన నాలుగు నెలలకే తన కూతురు చనిపోయిందంటూ ఆమె..కనీసం ఆదివారం సెలవు కూడా లేకుండా నిర్విరామంగా పనిచేయించారని ఆరోపించారు.

నేపాల్‌లో వరదలు.. 200 దాటిన మృతులు

కొనసాగుతున్న రక్షణ, సహాయక చర్యలు

కఠ్మాండు: నేపాల్‌లో భారీ వర్షాలతో వరదలు, కొండచరియలు విరిగిపడిన మృతుల సంఖ్య 200 దాటింది. రాజధాని కఠ్మాండుతోపాటు చాలా ప్రాంతాల్లో రక్షణ, సహాయక కార్యక్రమాలు మూడో రోజు కొనసాగుతున్నాయి. వర్షాల సంబంధిత ఘటనల్లో ఇప్పటి వరకు 205 మంది చనిపోయినట్లు పోలీసు విభాగం తెలిపిందని మైరిపబ్లికా న్యూస్ పోర్టల్ పేర్కొంది. రాజధాని కఠ్మాండులో అత్యధికంగా 56 మంది మృతి చెందారని తెలిపింది. వివిధ ఘటనల్లో 130 మంది గాయపడ్డారని, మరో 24 మంది గల్లంతయ్యారని కూడా వివరించింది. ఇటీవలి కాలంలో ఎన్నడూ సంభవించనంతటి తీవ్ర వరదలతో కఠ్మాండు అతలాకుతలమైంది. చాలా చోట్ల ఆహారం, తాగు నీరు అందక జనం అల్లాడుతున్నారని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. సుమారు 1,100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 20 వరకు జలవిద్యుత్ ప్రాజెక్టులు వరదల కారణంగా దెబ్బతినడంతో కఠ్మాండుతోపాటు ఇతర ప్రధాన నగరాల్లో చీకట్లు అలుముకున్నాయి. కొండచరియలు విరిగిపడి ప్రధాన రహదారులు దెబ్బతినడంతో ఇతర జిల్లాలతోపాటు భారత్ నుంచి కూరగాయలు వంటి నిత్యావసరాలతో వచ్చిన వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. దీంతో, ధరలు ఆకాశాన్నంటాయి. రాజధానిని కలిపే రహదారులన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. కఠ్మాండు నుంచి బయటకు వెళ్లే దారి లేక వేలాదిగా జనం అక్కడే చిక్కుకుపోయారు. రహదారుల మరమ్మతు పనులు ముమ్మరం చేశామని హోం శాఖ తెలిపింది.


పితృ పక్షం సందర్భంగా సోమవారం బిహార్ రాష్ట్ర గయలోని దేవ్‌ఘాట్‌లో పిండ ప్రదానం చేస్తున్న ఓ విదేశీ భక్తురాలు


దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో సోమవారం 'మిస్ యూనివర్స్ కొరియా' పోటీల్లో హొయలొలికిస్తున్న 81 ఏళ్ల చోయి సూన్ హ్వా.

పూజారిని బలితీసుకున్న చిరుత

ఉదయ్‌పూర్‌లో మరో ఘటన • 11 రోజుల్లో 7వ మరణం

ఉదయ్‌పూర్: రాజస్థాన్‌లో మనుషుల రక్తం రుచి మరిగిన చిరుతపులుల దాడులు ఎక్కువయ్యాయి. ఉదయ్‌పూర్‌లోని ఓ గ్రామంలో చిరుతపులి దాడిలో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గోగుండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాథోడోం కా గూడలో సోమవారం ఈ దాడి ఘటన జరిగింది. రాత్రిపూట ఆలయంలో నిద్రించిన పూజారి విష్ణుగిరి మహరాజ్‌ను సోమవారం తెల్లవారుజామున చిరుత దాడిచేసి చంపేసి మృతదేహాన్ని అడవిలోకి లాక్కెళ్లింది. ఉదయం ఈ సమాచారం అందుకున్న ప్రజలు పోలీసుల సహకారంతో గ్రామ సమీపంలోని అడవిలో వెదికారు. కాగా, సోమవారం మధ్యాహ్నం ఆలయానికి 300 మీటర్ల దూరంలో ఉన్న అడవిలో మృతదేహం దొరికింది. చిరుతల దాడుల్లో గత 11 రోజుల్లో ఏడుగురు మృతి చెందారు. గత 10 రోజుల్లో చిరుతపులి దాడిలో 6 మంది చనిపోయారు. సెప్టెంబర్‌ను 18న పశువులను మేపడానికి వెళ్లిన బాలికపై చిరుత దాడి చేసి, హతమార్చింది. బాలిక మృతితో చిరుతదాడుల పరంపర మొదలైంది. చిరుత దాడులతో పోలీసులు అటవీ శాఖ అధికారులతో కలిసి పలు చోట్ల వలలు ఏర్పాటు చేశారు. ఆరు రోజుల్లో నాలుగు చిరుత పులులను పట్టుకున్నారు. ఆదివారం ఉదయం గోగుండా ప్రాంతంలోని బాగ్దాదా గ్రామంలో నాలుగో చిరుతపులి పట్టుబడింది. చిరుతల దాడులు పెరుగుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. త్వరగా పాఠశాలలను మూసివేయాలని, సాయంత్రం వేళల్లో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రావొద్దని, తప్పనిసరి పరిస్థితుల్లో గుంపులుగా మాత్రమే బయట తిరగాలని అధికారులు ప్రజలను హెచ్చరించారు. గ్రామస్తులు బయటకు వెళ్లేటప్పుడు కర్రలు లేదా ఆయుధాలను వెంట తీసుకెళ్లాలని కోరారు. అమాయకులు జంతువు దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనల్లో ఒకే చిరుతపులి ప్రమేయం ఉందా లేదంటే ప్రాంతాలవారీగా వేర్వేరు చిరుతలు దాడిచేస్తున్నాయా? అనేది తెలియాల్సి ఉందని అధికారి పేర్కొన్నారు.

మోదీపై ఖర్గే వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం: అమిత్ షా

న్యూఢిల్లీ: ప్రధాని మోదీని అధికార పీఠం నుంచి దింపేవరకు తాను చనిపోనని కశ్మీర్ ప్రచారసభలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించడాన్ని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. సోమవారం అమిత్ షా 'ఎక్స్'లో స్పందించారు. ''ఖర్గే అనవసరంగా తన వ్యక్తిగత, అనారోగ్య అంశాల్లోకి ప్రధాని మోదీని లాగారు. మోదీని కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ నేతలు ఎంతగా ద్వేషిస్తున్నారో నిన్నటి ఖర్గే ప్రసంగంతో తేటతెల్లమైంది'' అని అమిత్ అన్నారు. '' ఖర్గే ఆరోగ్యం విషయంలో మోదీ జీ, నేను ప్రార్థిస్తున్నాం. మీరు దీర్ఘాయుష్షుతో జీవించాలి. ఇంకెన్నో వసంతాలు చూడాలి. 2047లో వికసిత్ భారత్ ఆవిర్భావం సైతం మీరు కళ్లారా చూడాలి'' అని అమిత్ ట్వీట్‌చేశారు. మోదీపై విద్వేషం చిమ్మేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ కాంగ్రెస్ వదిలిపెట్టదని బీజేపీ నాయకురాలు నిర్మలా సీతారామన్ అన్నారు. '' ఖర్గే దయ వల్ల మోదీ ప్రధాని కాలేదు. ప్రజల ఆశీస్సులతో ఆయన మూడోసారి ప్రధాని అయ్యారు. ఖర్గే 100 ఏళ్లు జీవించాలి. ఆయన వందో బర్త్‌డే రోజు మోదీ పుష్పగుచ్ఛమివ్వాలని మేం కోరుకుంటున్నాం'' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ షెహనవాజ్ హుస్సేన్ అన్నారు. ఆదివారం కశ్మీర్‌లోని ఓ గ్రామంలో ఖర్గే ప్రసంగించడం తెల్సిందే. '' నాకిప్పుడు 83 ఏళ్లు. ఇంత తక్కువ వయసులో చనిపోను. మోదీని అధికార గద్దె నుంచి కిందకు దింపేదాకా చనిపోను' అని ఖర్గే అన్నారు.

మోదీ చక్రవ్యూహం పన్నారు: రాహుల్

చండీగఢ్: హరియాణా ఎన్నికల ప్రచారసభల్లో ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు గుప్పించారు. సోమవారం అంబాలా, కురుక్షేత్ర జిల్లాల్లో నరేన్‌గఢ్, థనేసర్‌లలో రాహుల్ ప్రసంగించారు '' మహాభారతంలో మాదిరి బీజేపీ సైతం చక్రవ్యూహం పన్నింది. దీని వెనుక మోదీ, అమిత్‌షా, గౌతమ్ అదానీ, అంబానీ, అజిత్ దోవల్, మోహన్ భాగవత్ ఉన్నారు. పేదల సొత్తు భారత్‌లోని ఓ పాతిక మంది పారిశ్రామికవేత్తల చేతుల్లోకి వెళ్లేలా చేయడమే ఈ చక్రవ్యూహం లక్ష్యం. అదానీ గురించే తీసుకోండి. పొలంలో పనిచేయరు. నాగలి దున్నరు. చిన్న వ్యాపారి దగ్గర పనిచేయరు. కానీ చక్కటి భోజనం చేస్తూ విలాసభవంతిలో సేదతీరుతారు. ఆయన బ్యాంక్ ఖాతాకు 24 గంటలూ ఆగకుండా సునామీలా సొమ్ము వచ్చి పడుతూనే ఉంటుంది. 'అభివృద్ధి' పేరిట పేద రైతుల భూములను లాక్కొంటారు. అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తల నుంచి కనీసం ఒక ఎకరం భూమినైనా ప్రభుత్వం సేకరించడం చూశారా?'' అని అన్నారు.

అమెరికా ఆయుధాలకు అదానీ లేబుల్

''ఇజ్రాయెల్, అమెరికా కంపెనీలు ఆయుధాలను తయారుచేస్తే వాటిని అదానీ డిఫెన్స్ సంస్థ కొని సొంత లేబుల్ అతికించుకుంటుంది. ఆ అయుధాలను భారత సైన్యం కొనుగోలుచేస్తుంది. అయుధాల అమ్మకంతో వచ్చిన సొమ్ములో కొంత రాజకీయపార్టీకి, మరి కొంత మోదీ మార్కెటింగ్ కోసం ఖర్చుచేస్తుంది'' అని అన్నారు.

అమెరికా విద్యార్థి వీసాలు.. నాలుగో ఏడాదీ మనోళ్లే టాప్

న్యూఢిల్లీ: అమెరికా విద్యార్థి వీసాలు అందుకున్న వారిలో వరుసగా నాలుగో ఏడాది కూడా భారతీయులే అగ్రస్థానంలో నిలిచారు. సంఖ్య కచ్చితంగా తెలియనప్పటికీ గతేడాది 1.4 లక్షలు కాగా, ఈసారి అంతకంటే ఎక్కువగానే ఉంటాయని అంచనా. విద్యార్థులు, నిపుణులైన ఉద్యోగులు, పర్యాటకులు..తదితర కేటగిరీలు కలిపి అదనంగా 2.50 లక్షల భారతీయ వీసా దరఖాస్తుదారులకు అపాయింట్‌మెంట్లు ఇచ్చినట్లు సోమవారం ఢిల్లీలోని అమెరికా ఎంబసీ ప్రకటించింది. వీరందరికీ ముందుగా నిర్ణయించిన ప్రకారమే ఇంటర్వ్యూలు, ఇతర ఏర్పాట్లకు స్లాట్లు నిర్ణయించినట్లు తెలిపింది. అంతేకాదు, వరుసగా రెండో సంవత్సరం భారతీయులకు 10 లక్షలకు పైగా నాన్ ఇమిగ్రాంట్ వీసా దరఖాస్తులను మంజూరు చేసినట్లు కూడా వివరించింది. 2024 సమ్మర్ వీసా సీజన్‌లో భారతీయ విద్యార్థులకు రికార్డు స్థాయిలో వీసాలను మంజూరు చేశామని, మొదటిసారి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ భారత్‌లోని ఐదు కాన్సులేట్ విభాగాల్లో ఏదో ఒకదాన్లో అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వగలిగామని అమెరికా ఎంబసీ ప్రకటించింది. వీసా ప్రక్రియను వేగవంతం చేస్తామంటూ ప్రధాని మోదీకి అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు సంతోషంగా ఉందని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి పేర్కొన్నారు.

అమెరికాను వణికిస్తున్న హెలెన్ తుపాను

107కు పెరిగిన మృతుల సంఖ్య

పెరీ(అమెరికా): హెల్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాలను అమెరికా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తోంది. దెబ్బతిన్న నీటి సరఫరా, రవాణా మార్గాలను పునరుద్ధరిస్తోంది. తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, జార్జియా, ఫ్లోరిడా, టేనస్సీ, వర్జీనియా రాష్ట్రాల్లో వరదల్లో చనిపోయిన వారి సంఖ్య 107కు పెరిగింది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. సెల్ టవర్లు కుప్పకూలి నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో చాలా మంది ఆచూకీ మొబైల్ సిగ్నల్స్ ద్వారా కనిపెట్టడం ఆలా కష్టమవుతోంది. సౌత్ కరోలినాలో 25 మంది, జార్జియాలో 17 మంది, ఫ్లోరిడాలో 11 మంది మరణించినట్లు ఆ రాష్ట్రాల గవర్నర్లు తెలిపారు. అమెరికా నైరుతి ప్రాంత రాష్ట్రాల్లో మొత్తంగా 93 మంది చనిపోయారని అధికారులు ప్రకటించారు. గరిష్టంగా దాదాపు రూ.2 లక్షల కోట్ల మేర ఆస్తినష్టం జరిగి ఉంటుందని ప్రముఖ బీమా సంస్థలు, వాతావరణ నిపుణులు అంచనావేస్తున్నారు. విధ్వంసాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తే నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సుమారు 20 లక్షల మందికిపైగా ప్రజలు అంధకారంలో మునిగిపోయారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అధ్యక్షుడు బైడెన్ యోచిస్తున్నట్లు అధ్యక్షభవనం వైట్‌హౌస్ తెలిపింది.

జూ కీపర్‌ను కొరికి చంపిన సింహం

అబూజా: నైజీరియాలోని ఓ జూలో ఆదమరిచి ఉన్న ఉద్యోగిని సింహం కొరికి చంపింది. ఒగున్ రాష్ట్రం అబియోకుటలో ఉన్న మాజీ అధ్యక్షుడు ఒబసాంజోకు చెందిన పార్కులో ఈ ఘటన చోటుచేసుకుంది. బబజీ దౌలే(35) అనే సుశిక్షితుడైన జూ కీపర్ అందులోని సింహానికి ఆహారం వేయడం వంటి పనులు చూస్తుంటారు. శనివారం సాయంత్రం కొందరు సందర్శకులు రావడంతో వారికి దౌలే సింహానికి ఆహారం వేసే విధానం చూపించాలనుకున్నారు. సింహం ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించడంతో సాధారణంగా మూసి ఉంచాల్సిన గేటును తెరిచే ఆహారం వేయడం ప్రారంభించారు. ఆ సింహం అనుకోకుండా ఆయనపై దాడి చేసి, మెడను నోట కరుచుకుంది. దీంతో, సెక్యూరిటీ గార్డులు సింహాన్ని కాల్చి చంపారు.

నైరుతిలో 8 శాతం అధికంగా వానలు: ఐఎండీ

న్యూఢిల్లీ: దేశంలో సోమవారంతో ముగిసిన నైరుతి సీజన్‌లో 934.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. దీర్ఘకాల సరాసరి వర్షపాతం కంటే ఇది 8% ఎక్కువని వివరించింది. మధ్యభారతంలో 19%, దక్షిణాదిన 14%, వాయవ్యంలో 7% అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపింది. అయితే, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో 14% తక్కువ వానలు పడ్డాయని పేర్కొంది.

సీసీటీవీలు, టాయ్‌లెట్ల ఏర్పాటులో... ఎందుకీ అలసత్వం?

మమత సర్కారుకు సుప్రీం తలంటు

న్యూఢిల్లీ: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీసీటీవీలు, టాయ్‌లెట్లు, ప్రత్యేక విశ్రాంతి గదుల ఏర్పాటులో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తోందంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వెలిబుచ్చింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలు దారుణంగా అత్యాచారానికి, హత్యకు గురైన ఉదంతాన్ని కోర్టు సుమోటోగా విచారణకు చేపట్టడం తెలిసిందే. ఈ సందర్భంగా వైద్యుల భద్రత తదితరాలకు సంబంధించి సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ధర్మాసనం గతంలో మమత సర్కారుకు పలు సూచనలు చేసింది. వాటి అమలు తీరు నత్తనడకన సాగుతోందంటూ సోమవారం తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చింది. ''ఏ పనీ కనీసం సగం కూడా పూర్తి కాకపోవడం దారుణం. ఎందుకింత అలసత్వం?'' అని ప్రశ్నించింది. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాల్సిందేనని బెంగాల్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్న సీనియర్ అడ్వకేట్ రాకేశ్ ద్వివేదికి స్పష్టం చేసింది. పనులు జరుగుతున్నాయని, వాటిని పూర్తి చేసేందుకు మరింత సమయం కావాలని ఆయన అభ్యర్థించారు. ''6,178 సీసీ కెమెరాలు బిగిస్తున్నాం. అన్ని పనులూ పాతిక శాతానికి పైగా పూర్తయ్యాయి. అక్టోబర్ 10 కల్లా వాటిని పూర్తి చేస్తాం'' అని చెప్పుకొచ్చారు. పనుల పూర్తికి అక్టోబర్ 15 దాకా గడువిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.

ప్రతాపరుద్రుడి మరణం... కాకతీయ వంశం అంతం

'ప్రతాపరుద్ర చరిత్ర' ప్రకారం ప్రతాపరుద్రుడికి విశాలాక్షి అనే భార్య ఉంది. లక్ష్మీదేవి అనే భార్య ఉన్నప్పటికీ వారికి సంతానం లేదని ఎలిగేడు శాసనం ద్వారా తెలుస్తోంది. అయితే ప్రతాపరుద్రుడికి వీరభద్రుడు, అన్నమదేవుడు అనే కుమారులు ఉన్నారని, వారు రాజ్యపాలన చేశారని కథనాలున్నాయి. కానీ అవి నిర్ధారణ కాలేదు. అందువల్ల ప్రతాపరుద్రుడితోపాటే కాకతీయ సామ్రాజ్యం, కాకతీయవంశం అంతరించిందని చెప్పవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ



కాకతీయులపై ఢిల్లీ దండయాత్రలు

ప్రతాపరుద్రుడు రాజ్యాన్ని సుస్థిర పరుచుకుంటుండగా ఉత్తర భారతదేశంలో అనేక మార్పులు సంభవించాయి.

ఖిల్జీ వంశం

మాలిక్ ఫిరోజ్.. ఖిల్జీ తెగకు చెందినవాడు. ఇతడి పూర్వీకులు తుర్కిస్తాన్ నుంచి అఫ్గానిస్తాన్ వచ్చారు. అక్కడి నుంచి ఢిల్లీ చేరి తురుష్క సుల్తాన్ల కొలువులో చేరారు. మాలిక్ ఫిరోజ్ (జలాలుద్దీన్ ఫిరోజ్ ఖిల్జీ) సుల్తాన్ల వద్ద ఉన్నత పదవులు పొందాడు. సుల్తాన్ వారసుల్ని చంపి క్రీ.శ.1290లో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. జలాలుద్దీన్ అల్లుడైన గర్షాస్ప్ మాలిక్(అల్లా ఉద్దీన్ ఖిల్జీ) తన మామను చంపి క్రీ.శ.1296లో ఢిల్లీ సుల్తానుగా ప్రకటించుకున్నాడు. తర్వాత దాదాపు ఉత్తర భారతం అంతటినీ జయించాడు. అనంతరం దక్షిణ భారతాన్ని జయించాలని సంకల్పించాడు. అప్పటికి దక్షిణాదిలో దేవగిరి, హోయసాల, కాకతీయ రాజ్యాలు బలంగా ఉండేవి. వింధ్య పర్వతాలను దాటి దక్షిణాపథంపై దండెత్తిన తొలి ముస్లిం పాలకుడు అల్లా ఉద్దీన్ ఖిల్జీ. చక్రవర్తి కాకముందే క్రీ.శ.1294లో దేవగిరి మీద దండెత్తి విజయం సాధించాడు.

చక్రవర్తి అయ్యాక జరిపిన దండయాత్రల్లో భాగంగా అల్లా ఉద్దీన్ క్రీ.శ.1303లో కాకతీయ సామ్రాజ్యంపై దండెత్తాడు. మాలిక్ ఫక్రుద్దీన్ జునా,ఝాజా నాయకత్వంలో అల్లా ఉద్దీన్ సైన్యం కాకతీయ రాజ్యంపై దండెత్తింది. ఇది తురుష్కుల మొదటి దండయాత్ర. ఖిల్జీ సైన్యాన్ని కాకతీయ సైన్యం ఉప్పరపల్లి వద్ద ఓడించింది. ఇది అల్లా ఉద్దీన్ తొలి పరాజయం. ముస్లింల ఓటమికి రేచర్ల ప్రసాదిత్యుడి కుమారుడు వెన్నమ కారణమని 'వెలుగోటి వంశావళి' తెలుపుతోంది. మనరస్గోదారి రాజు, అయన దేవులు ముస్లింల ఓటమికి కారకులని ఓరుగల్లు కోటలోని స్తంభ శాసనం తెలుపుతోంది. ప్రతీకారేచ్ఛతో అల్లా ఉద్దీన్ ఖిల్జీ రెండోసారి దండెత్తాడు. ఈసారి అతడి సేనలకు మాలిక్ కపూర్ నాయకత్వం వహించాడు. 25 రోజుల ముట్టడి తర్వాత ప్రజల కష్ట నష్టాలను చూడలేక ప్రతాపరుద్రుడు మాలిక్ కపూర్‌కి అపార ధనరాశులు, ఏనుగులు ఇచ్చి సంధి చేసుకున్నాడు. కప్పం చెల్లించి అల్లా ఉద్దీన్ ఖిల్జీని సార్వభౌముడిగా గుర్తించాడు. ఈ దండయాత్రతో దక్షిణ భారతదేశంలోని రాజ్యాలన్నీ ఢిల్లీ సార్వభౌమత్వాన్ని అంగీకరించాయి.

తిరుగుబాట్ల అణచివేత

ముస్లింల చేతిలో ప్రతాపరుద్రుడు ఓటమి పొందడంతో ఇదే అదనుగా కొందరు సామంతరాజులు తిరుగుబాటు చేశారు. వారిలో కాయస్థ మల్లిదేవుడు, నెల్లూరు రంగనాథుడు ముఖ్యులు. ప్రతాపరుద్రుడు మల్లిదేవుడిపై జుట్టయలెంక గొంకయరెడ్డి నాయకత్వంలో సేనను పంపాడు. అతడు మల్లిదేవుడిని ఓడించి చంపాడు.గొంకయరెడ్డిని ప్రతాపరుద్రుడు ఆ ప్రాంత పాలకుడిగా నియమించాడు. ఈ యుద్ధాలు, తురుష్కుల దండయాత్రలు (క్రీ.శ.1315 నాటికి) ఢిల్లీ సుల్తాన్‌కు కప్పం చెల్లించాల్సి రావడంతో ఖజానా ఖాళీ అయింది. కోశాగారాన్ని నింపడానికి ప్రతాపరుద్రుడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కడప, కర్నూలు, పల్నాడు ప్రాంతాల్లో అడవులను నరికించి భూములను వ్యవసాయ యోగ్యం చేయించాడు. చెరువులు, బావులు తవ్వించాడు. ఫలితంగా అనేక కొత్త గ్రామాలు, నగరాలు ఏర్పడ్డాయి. క్రమంగా రాజ్య ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

క్రీ.శ.1316లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ మరణించాడు. ఢిల్లీపై అధికారం కోసం కొంత కాలం అంతఃకలహాలు చేలరేగిన తర్వాత ఖిల్జీ మూడో కుమారుడైన ముబారక్ షా సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈ అంతఃకలహాలను అవకాశంగా తీసుకొని ప్రతాపరుద్రుడు కప్పం చెల్లించడం మానేశాడు. దీనికి ఆగ్రహించిన ముబారక్‌షా ఖిల్జీ కాకతీయ ప్రతాపరుద్రునిపై దండెత్తి కప్పం వసూలు చేశాడు. తెలుగుదేశంపై ఢిల్లీ సామ్రాజ్య అధికారాన్ని తిరిగి స్థాపించాడు. ఇది తురుష్కుల మూడో దండయాత్ర. ఇంతలో ముబారక్ షాను చంపి నాసిరుద్దీన్ ఖుస్రూ ఖాన్ క్రీ.శ.1320లో చక్రవర్తి అయ్యాడు.

తుగ్లక్ వంశం

ఢిల్లీ సుల్తాన్ల అధికారిగా, పంజాబ్ పాలకుడిగా ఉన్న ఘాజీ మాలిక్ ఖుస్రూ ఖాన్‌ను వధించి ఘియాజుద్దీన్ తుగ్లక్‌షా పేరుతో క్రీ.శ.1320లో ఢిల్లీ సింహాసనం అధిష్ఠించాడు. తన పెద్ద కుమారుడు ఫక్రుద్దీన్ మహ్మద్ (ఉలూఘ్ ఖాన్ /మహమ్మద్ బిన్ తుగ్లక్)ను క్రీ.శ. 1321లో ఓరుగల్లుపై దండయాత్రకు పంపాడు. ఉలూఘ్ ఖాన్ స్వయంగా ఓరుగల్లు కోటను ఆరు నెలలపాటు ముట్టడించాడు. కానీ కోట స్వాధీనం కాలేదు. సుల్తాన్ మరణించాడని ఉబైద్ దుష్ప్రచారం చేయడంతో ముస్లింసేనలో కలకలం రేగింది. సైన్యంలో చాలాభాగం పారిపోయింది. దీంతో ఉలూఘ్ ఖాన్ ముట్టడి ఆపివేశాడు. పారిపోతున్న ముస్లిం సైన్యంపై కాకతీయ సైనికులు దాడిచేసి కోటగిరి దాకా తరిమివేశారు. ఇది తురుష్కుల నాలుగో దండయాత్ర.

ఓడిపోయి దేవగిరికి చేరిన ఉలూఘ్ ఖాన్ ఢిల్లీ నుంచి వచ్చిన కొత్త సైన్యంతో క్రీ.శ.1323లో తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. ఉలూఘ్ ఖాన్ అంత తొందరగా తిరిగి దాడి చేస్తాడని ఊహించని ప్రతాపరుద్రుడు తగిన యుద్ధ సన్నాహాలు చేయలేదు. అయినప్పటికీ అయిదునెలలపాటు కోటను కాపాడగలిగాడు. ఇది తురుష్కుల అయిదో దండయాత్ర. లొంగిపోయిన ప్రతాపరుద్రుడిని ఖాదిర్‌ఖాన్, ఖ్వాజీ హాజీ అనే సేనానుల రక్షణలో ఉలూఘ్ ఖాన్ ఢిల్లీకి పంపాడు. కానీ ప్రతాపరుద్రుడు ముస్లిం సైనికుల అవమానాలను భరించలేక నర్మదానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రతాపరుద్రుడి మరణంతో కాకతీయ వంశం అంతమైంది. ఈ ప్రాంతం ఢిల్లీ సుల్తానుల రాజ్యంలో 23వ రాష్ట్రమైంది. క్రీ.శ.1325లో ఉలూఘ్ ఖాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ పేరుతో ఢిల్లీ సింహాసనం అధిష్ఠించి ప్రతినిధుల ద్వారా తెలంగాణను పాలించాడు.

మాదిరి ప్రశ్నలు

1. రుద్రమదేవికి ఎంతమంది కుమార్తెలు?
   1) 4 2) 2 3) 3 4) 5
2. నాయంకర వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించింది?
   1) గణపతిదేవుడు 2) రుద్రమదేవి
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రదేవుడు
3. దక్షిణాపథంపై దండెత్తిన తొలి ముస్లిం పాలకుడు?
   1) మహమ్మద్ బిన్ తుగ్లక్
   2) అల్లా ఉద్దీన్ ఖిల్జీ 3) ఘియాజుద్దీన్ ఖిల్జీ
   4) ఫిరోజ్‌షా తుగ్లక్
4. అల్లా ఉద్దీన్ ఖిల్జీ కాకతీయ సామ్రాజ్యంపై మొదటిసారి దండెత్తిన సంవత్సరం?
   1) క్రీ.శ.1300 2) క్రీ.శ.1303
   3) క్రీ.శ.1301 4) క్రీ.శ.1304
5. అల్లా ఉద్దీన్ సైన్యాన్ని కాకతీయ సైన్యం ఏ ప్రాంతం వద్ద ఎదిరించి ఓడించింది?
   1) పానగల్లు 2) ఏలకుర్తి
   3) పిల్లలమర్రి 4) ఉప్పరపల్లి
6. అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఓరుగల్లుపై రెండోసారి దండెత్తినప్పుడు సేనలకు నాయకత్వం వహించింది ఎవరు?
   1) మాలిక్ ఫక్రుద్దీన్ 2) ఝాజ
   3) మాలిక్ కపూర్ 4) ముబారక్ షా
7. అల్లా ఉద్దీన్ ఖిల్జీ మరణించిన సంవత్సరం?
   1) క్రీ.శ.1313 2) క్రీ.శ.1316
   3) క్రీ.శ.1314 4) క్రీ.శ.1317
8. ముబారక్‌షా ఖిల్జీ ప్రతాపరుద్రుడిపై దండయాత్రకు ఎవరి ఆధ్వర్యంలో సైన్యాన్ని పంపాడు?
   1) మాలిక్ కపూర్ 2) మాలిక్ ఫక్రుద్దీన్
   3) ఝాజ 4) ఖుస్రూ ఖాన్
9. ఓరుగల్లుపై నాలుగో దండయాత్ర చేసిన ఢిల్లీ సేనాధిపతి?
   1) ఖుస్రూఖాన్ 2) ఉలూఘ్ ఖాన్
   3) మాలిక్ కపూర్ 4) ఝాజ
10. ప్రతాపరుద్రుడు మరణించిన సంవత్సరం?
    1) క్రీ.శ.1320 2) క్రీ.శ.1321
    3) క్రీ.శ.1323 4) క్రీ.శ.1325
11. ప్రతాపరుద్రుడు ఏ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని చరిత్రకారుల అభిప్రాయం?
    1) గోదావరి 2) నర్మద
    3) కృష్ణా 4) తుంగభద్ర
12. ఉలూఘ్ ఖాన్ మరో పేరు?
    1) ఘియాజుద్దీన్ తుగ్లక్
    2) ముబారక్ షా 3) మహ్మద్ బిన్ తుగ్లక్
    4) ఫిరోజ్‌షా తుగ్లక్
13. రేచర్ల రెడ్ల వంశ మూలపురుషుడు?
    1) రేచర్ల బేతిరెడ్డి
    2) రేచర్ల బమ్మిరెడ్డి 3) రేచర్ల నాగిరెడ్డి
    4) రెండో కాటచమూపతి
14. పిల్లలమర్రి పట్టణాన్ని నిర్మించింది?
    1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల బమ్మిరెడ్డి
    3) రేచర్ల నాగిరెడ్డి 4) ఎవరూ కాదు
15. రేచర్ల రెడ్లలో మొదటి రాజు?
    1) రేచర్ల బేతిరెడ్డి
    2) రేచర్ల బమ్మిరెడ్డి 3) రేచర్ల నాగిరెడ్డి
    4) రెండో కాటచమూపతి
16. రెండో కాటచమూపతి రాజ్య రాజధాని?
    1) ఏలకుర్తి 2) పిల్లలమర్రి
    3) ఆమనగల్లు 4) పానగల్లు
17. రుద్రదేవుడు బేతిరెడ్డికి ఏ రాజ్యానిచ్చి సామంతుడిగా చేసుకున్నాడు?
    1) ఏలకుర్తి 2) పిల్లలమర్రి
    3) ఆమనగల్లు 4) దేవరకొండ
18. మొదటి ప్రతాపరుద్రుడని ఎవరిని పిలుస్తారు?
    1) రెండో ప్రోలరాజు 2) రెండో బేతరాజు
    3) జాయప సేనాని 4) రుద్రదేవుడు
19. రేచర్ల రెడ్డి రాజుల్లో ప్రసిద్ధుడు?
    1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల నామిరెడ్డి
    3) రేచర్ల రుద్రారెడ్డి 4) రెండో కాటచమూపతి
20. పిల్లలమర్రిలో ఎరకేశ్వర, కాచేశ్వర, నామేశ్వర దేవాలయాలను కట్టించినవాడు?
    1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల రుద్రారెడ్డి
    3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల నామిరెడ్డి
21. 'కాకతీయ రాజ్య భార ధౌరేయు' అని పేరొందింది ఎవరు?
    1) రేచర్ల రుద్రారెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
    3) రేచర్ల కాటిరెడ్డి 4) రేచర్ల లోకిరెడ్డి
22. భేతాళరెడ్డి అని మరోపేరు ఎవరికి ఉంది?
    1) మల్లారెడ్డి 2) చెవిరెడ్డి
    3) కాటిరెడ్డి 4) లోకిరెడ్డి
23. ఎవరి వంశస్థులు కాలక్రమంలో రేచర్ల పద్మనాయకులు అయ్యారు?
    1) మల్లారెడ్డి 2) కోటిరెడ్డి
    3) లోకిరెడ్డి 4) చెవిరెడ్డి
24. కింద పేర్కొన్న ఏ దేవాలయాలు అజంతా తర్వాత ప్రాచీనమైనవని చరిత్రకారుల అభిప్రాయం?
    1) పిల్లలమర్రి 2) పానగల్లు
    3) కొలనుపాక 4) ఓరుగల్లు
25. చెరకురెడ్డి వంశస్థుల తొలి రాజధాని?
    1) పిల్లలమర్రి 2) పానగల్లు
    3) జమ్ములూరు 4) కొలనుపాక
26. విరియాల వంశంలో సుప్రసిద్ధుడు?
    1) పోరంటి వెన్న 2) ఎర్రభూపతి
    3) ఎర్ర నరేంద్రుడు 4) దన్నసేనాని

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 2	5) 4
6) 3	7) 2	8) 4	9) 2	10) 3
11) 2	12) 3	13) 2	14) 1	15) 4
16) 1	17) 3	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 4	24) 1	25) 3
26) 3				

విమర్శ ప్రధానాంశంగా ఉండే ప్రక్రియ?

కావ్య ప్రక్రియలు – లక్షణాలు

నవల

క్రీ.శ. 19వ శతాబ్దిలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో ఎన్నో సృజనాత్మక వచన సాహితీ ప్రక్రియలు వచ్చాయి. ఆంగ్లం నుంచి పుట్టిన వాటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది 'నవల'. ఆధునిక సాహిత్య ప్రక్రియలో ఎక్కువ జనాదరణ పొందిన ప్రక్రియ కూడా ఇదే. ఈ ప్రక్రియ మొదటిసారిగా ఇటలీలో ప్రారంభమైంది.

- నవల అనే పదం Novel (నోవెల్) అనే ఆంగ్లపదం నుంచి వచ్చింది.
- తెలుగులో మొదట నవలను వచన ప్రబంధం అని, నవీన ప్రబంధం అని, గద్య ప్రబంధం అని వ్యవహరించేవారు.
- నరహరి గోపాల కృష్ణమచెట్టి నవలను మొదట నవీన ప్రబంధం అన్నారు.
- కందుకూరి వీరేశలింగం దీన్ని వచన ప్రబంధంగా పేర్కొన్నారు.
- తెలుగులో నవలా ప్రక్రియకు నామకరణం చేసినవారు – కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి.

నవల – నిర్వచనాలు:

- యథార్థ జీవితాన్ని యథార్థ దృష్టితో అధ్యయనం చేసి గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల. **– రిచర్డ్ క్రాస్**
- నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవల. **– కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి**
- సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ, ప్రజల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల. **–శ్రీ మొదలి నాగభూషణ శర్మ**

ముఖ్యమైన నవలలు:

- తొలి తెలుగు నవల – **రంగరాజ చరిత్ర**
- నరహరి గోపాలకృష్ణమచెట్టి రాసిన రంగ రాజ చరిత్ర అనే నవలకు సోనాబాయి పరిణయం అనే నామాంతరం ఉంది.
- సమగ్ర నవలా లక్షణాలతో వెలసిన మొదటి నవలగా కందుకూరి వీరేశలింగం రాసిన రాజశేఖర చరిత్ర ప్రసిద్ధికెక్కింది. దీనికి 'వివేక చంద్రిక' అనే పేరు కూడా ఉంది.

నవల పేరు– కర్తలు

రాజశేఖర చరిత్ర (1878), సత్యరాజా పూర్వదేశ యాత్రలు – కందుకూరి వీరేశలింగం
గణపతి (తొలి హాస్య నవల) – చిలకమర్తి లక్ష్మీనరసింహం
హిమబిందు – అడవి బాపిరాజు
మాతృమందిరం – వేంకట పార్వతీశ కవులు
మాలపల్లి – ఉన్నవ లక్ష్మీనారాయణ
మైదానం, దైవమిచ్చిన భార్య – గుడిపాటి వెంకటాచలం
వేయిపడగలు, ఏకవీర – విశ్వనాథ సత్యనారాయణ
బారిష్టరు పార్వతీశం – మొక్కపాటి నరసింహశాస్త్రి
రక్షాబంధనం, శ్మశాన వాటిక – శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
చదువు – కొడవటిగంటి కుటుంబరావు
అసమర్థుని జీవయాత్ర, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా– త్రిపురనేని గోపీచంద్
చివరకు మిగిలేది? – బుచ్చిబాబు
అల్పజీవి – రాచకొండ విశ్వనాథశాస్త్రి
కీలుబొమ్మలు – జి.వి. కృష్ణారావు
అంపశయ్య – నవీన్
తులసిదళం – యండమూరి వీరేంద్రనాథ్
కాలాతీత వ్యక్తులు – శ్రీదేవి
బలిపీఠం – ముప్పాళ్ల రంగనాయకమ్మ



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

తెలుగు (ఎస్జీటీ)

నాటకం

సాహిత్య ప్రక్రియల్లో అత్యంత శక్తిమంతమైన, విశిష్టమైన ప్రక్రియ 'నాటకం'. ఇది పాఠ కుల హృదయాలను రంజింపజేయడంలో ఉత్తమమైంది. తెలుగు నాటక రంగానికి మహోజ్వల చరిత్ర ఉంది. నాటకం దృశ్య ప్రక్రియకు చెందింది. ఇది లలిత కళలతో సమాహారకళగా ప్రసిద్ధికెక్కింది. క్రీ.శ. 19వ శతాబ్ది చివరి భాగంలో కోరాడ రామచంద్రశాస్త్రి రాసిన మంజరీ మధుకరీయం (1860)తో ఆధునిక తెలుగు నాటకం ప్రారంభమైంది.

నాటకం – నిర్వచనాలు:

- కావ్యేషు నాటకం రమ్యం **– భరతుడు (నాట్యశాస్త్రం)**
- నాటకాంతం హి సాహిత్యం **– అభినవ గుప్తుడు (అభినవ భారతి)**
- మంగళాది, మంగళమధ్య, మంగళాంతః నాటకం **– భారతీయ లాక్షణికులు**

నాటకం– లక్షణాలు:

1. నాంది 2. ప్రస్తావన
3. విష్కంభం 4. అంకవిభజన
5. పంచసంధులు 6. భరతవాక్యం

కథ- కథానిక

ప్రాచీన సంప్రదాయ ప్రక్రియ 'కథ' అయితే, ఆధునిక సంప్రదాయ ప్రక్రియ 'కథానిక'. క్రీ.శ. 19వ శతాబ్దిలో ఆంగ్లం నుంచి దిగుమతి అయిన వచన సాహితీ ప్రక్రియలో కథానిక ఒకటి. కథ, కథానిక పదాలను ప్రస్తుతం పర్యాయపదాలుగా వాడుతున్నారు. కథానిక ప్రస్తావన మొదట అగ్ని పురాణంలో కనిపిస్తుంది. 'షార్ట్ స్టోరీ' అనే పదానికి సమానార్థకంగా కథానిక, చిన్న కథ అనే పదాలు ప్రయోగంలో ఉన్నాయి. 1936లో ప్రతిభ అనే పత్రికలో వ్యాసం రాస్తూ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి తొలిసారిగా 'షార్ట్ స్టోరీ' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా 'కథానిక' పదాన్ని సూచించారు. ఆధునిక తెలుగు కథ 1910లో గురజాడ 'దిద్దుబాటు'తో ప్రారంభమైంది. మొదట దిద్దుబాటు కథను ఆంధ్రభారతి పత్రికలో ప్రచురించారు. ఆధునిక తెలుగు కథా రచయితలకు గురజాడ మార్గదర్శకుడు.

- కథానిక ప్రధాన లక్షణాలు సంక్షిప్తత, ఏకాగ్రత, సమగ్రత, నిర్బరత.
- శీలా వీర్రాజు అభిప్రాయం ప్రకారం 'కథానికకు శిల్పమే ప్రాణం'.

	కథ/ కథానిక పేరు	రచయితలు
1.	కాశీ మజిలీ కథలు	మదిర సుబ్బన్న దీక్షితులు
2.	విక్రమార్కుని కథలు	రావిపాటి గురుమూర్తి
3.	కాంతం కథలు	మునిమాణిక్యం నరసింహారావు
4.	అత్తగారి కథలు	భానుమతి రామకృష్ణ
5.	యజ్ఞం కథలు	కాళీపట్నం రామారావు
6.	మొగలాయి కథలు	సురవరం ప్రతాపరెడ్డి
7.	అమరావతి కథలు	సత్యం శంకమంచి
8.	గులాబీ అత్తరు	శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
9.	కలుపు మొక్కలు	శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
10.	ఓ పువ్వు పూసింది	గుడిపాటి వెంకటాచలం

గల్పిక

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో వచ్చిన వచన సాహితీ ప్రక్రియల్లో 'గల్పిక' ఒకటి. ఇది పరిమాణంలో కథానిక కంటే చిన్నది. దీంట్లో విమర్శ ప్రధానాంశంగా ఉంటుంది. సంఘటనకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

- మానవ జీవితంలోని ఒడుదుడుకుల్ని చిత్రించేది కథానిక అయితే ఒక వ్యక్తిని గానీ, ఒక వ్యవస్థను గానీ అవహేళన చేసేదే గల్పిక.
- గల్పికలో అనుభూతి చిత్రణ కంటే అనుభవ ప్రకటనకు, భావ దృష్టికి రచయితలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.
- ఒక వ్యక్తి అనుభవంలోని ఒక దశగానీ, ఒక సంస్థ పరిణామక్రమంలోని ఒక విశేషంగానీ గల్పికలో ప్రధాన వస్తువు.
- వ్యక్తిని గానీ, వ్యవస్థనుగానీ విమర్శించడం గల్పికలో సర్వసాధారణం.
- 1940 ప్రాంతంలో త్రిపురనేని గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు గల్పికలు రాసి ప్రసిద్ధి చెందారు.
- తెలుగులో గల్పిక ప్రక్రియకు ఆద్యుడు కొడవటిగంటి కుటుంబరావు. ఆయన రాసిన గల్పికలు యువ పత్రికలో ప్రచురితమయ్యాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మునిమాణిక్యం నరసింహరావు 'దీక్షితులు' నవలకు స్ఫూర్తి?
   1) విశ్వనాథ సత్యనారాయణ
   2) నాయని సుబ్బారావు
   3) చింతా దీక్షితులు
   4) అడవి బాపిరాజు
2. వచన ప్రబంధంగా చలామణీ అయిన సాహిత్య ప్రక్రియ?
   1) కథానిక 2) కథ
   3) వ్యాసం 4) నవల
3. ఖాకీవనం నవలా రచయిత?
   1) తల్లారజ్జల పతంజలి శాస్త్రి
   2) కె.ఎన్.వై. పతంజలి
   3) చాట్ల నారాయణ మూర్తి
   4) కాళీపట్నం రామారావు
4. ఐదు నుంచి పది అంకాల వరకు ఉండే దృశ్య రూపక భేదం?
   1) ఈహామృగం 2) నాటకం
   3) ప్రహసనం 4) వీధి
5. ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదితమైన తొలి నాటకం?
   1) మర్చంట్ ఆఫ్ వెనిస్
   2) జూలియస్ సీజర్
   3) రోమియో జూలియట్
   4) కామెడీ ఆఫ్ ఎరర్స్
6. ఒకే అంకంలో ఇమిడిపోయే సంభాషణాత్మక ప్రదర్శన యోగ్య సాహిత్య ప్రక్రియ?
   1) నాటకం 2) నవల
   3) కథానిక 4) ఏకాంకిక
7. పంచ సంధులుండే రూపక భేదాలు?
   1) నాటక, ప్రకరణాలు
   2) డిమ, సమవాకారాలు
   3) వ్యాయోగ, ఈహా మృగాలు
   4) భాణ, ప్రహసనాలు
8. ఏకాంశ వ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ?
   1) ఖండకావ్యం 2) గల్పిక
   3) కథానిక 4) ఏకాంకిక
9. తెలుగు కథానికకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టింది?
   1) దిద్దుబాటు 2) గాలివాన
   3) నేను 4) ప్రేమలేఖ
10. కథానిక ప్రధాన లక్షణాలు?
    1) విస్తృతి, సమగ్రత
    2) నిర్బరత, బహు సంఘటనాత్మకత
    3) వివరణాత్మకత, పాత్ర బాహుళ్యం
    4) సంక్షిప్తత, ఏకాగ్రత
11. 'మార్లీదుర్గంలో కుక్క' కథా రచయిత?
    1) గుడిపాటి వెంకటాచలం
    2) శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి
    3) పెద్దిభొట్ల సుబ్బరామయ్య
    4) విశ్వనాథ సత్యనారాయణ
12. గల్పిక ప్రధాన లక్షణం?
    1) వ్యంగ్యంతో కూడిన ఒక కొసమెరుపు ఉండటం
    2) సుదీర్ఘమైన వర్ణన ఉండటం
    3) అనేకానేక సంఘటనలు ఉండటం
    4) నిడివి ఎక్కువగా ఉండటం

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 2
5) 2	6) 4	7) 1	8) 3
9) 2	10) 4	11) 4	12) 1

మాదిరి ప్రశ్నలు

1. తెలుగులో మొదటగా నవలల పోటీలు నిర్వహించిన పత్రిక?
   1) వివేక వర్ధిని
   2) కృష్ణాపత్రిక
   3) గోలకొండ
   4) చింతామణి
2. తొలి తెలుగు మనోవైజ్ఞానిక నవల?
   1) కపాల కుండల
   2) చివరకు మిగిలేది
   3) అసమర్థుని జీవయాత్ర
   4) కీలుబొమ్మలు
3. కన్నడ భాషలో నవలా ప్రక్రియను ఏమని పిలుస్తారు?
   1) ఉపన్యాస్
   2) లలిత ప్రబంధ్
   3) ఉదినం
   4) కాదంబరి
4. ధర్మారావు, అరుంధతి పాత్రలు ఉన్న ప్రసిద్ధ నవల?
   1) వేయిపడగలు
   2) మాలపల్లి
   3) ఏకవీర
   4) అసమర్థుని జీవయాత్ర
5. మూడు మాండలికాల్లో రచనలు చేసిన ఏకైక నవలాకారుడు?
   1) దాశరథి రంగాచార్యులు
   2) పోరంకి దక్షిణామూర్తి
   3) మహీధర రామ్మోహనరావు
   4) సూర్యదేవర రామ్మోహనరావు
6. ధర్మవరం రామకృష్ణమాచార్యులకు 'ఆంధ్ర నాటక పితామహుడు' అనే బిరుదును ఎవరిచ్చారు?
   1) గద్వాల మహారాజు
   2) పిఠాపురం మహారాజు
   3) విజయనగర మహారాజు
   4) దేవరకోట మహారాజు
7. తెలుగులో ఆబాలగోపాలాన్ని అలరించిన చింతామణి నాటక కర్త?
   1) కందుకూరి వీరేశలింగం
   2) కాళ్లకూరి నారాయణరావు
   3) ధర్మవరం రామకృష్ణమాచార్యులు
   4) కొప్పరపు సుబ్బారావు
8. తెలుగులో తిరుపతి వేంకట కవులు అనగానే గుర్తుకు వచ్చే నాటకం?
   1) కురుక్షేత్ర సంగ్రామం
   2) బొబ్బిలి పట్టాభిషేకం
   3) బుద్ధ చరిత్రం
   4) పాండవోద్యోగ విజయాలు
9. తెలుగులో అత్తగారి కథల సృష్టికర్త?
   1) చింతా దీక్షితులు
   2) మునిమాణిక్యం నరసింహారావు
   3) మాలతీ చందూర్
   4) భానుమతీ రామకృష్ణ
10. శ్రీశ్రీ కలం నుంచి జాలువారిన చరమరాత్రి కథలు ఏ కోవకు చెందినవి?
    1) అభ్యుదయ కథలు
    2) విప్లవ కథలు
    3) చైతన్యస్రవంతి కథలు
    4) అధివాస్తవికత వాద కథలు

సమాధానాలు

1) 4	2) 3	3) 4	4) 1
5) 2	6) 1	7) 2	8) 4
9) 4	10) 3		

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం । 1-10-2024

గ్రూపులో సాధారణంగా పెరిగే ధర్మాలు ఏవి?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మూలకాల వర్గీకరణ - ఆవర్తన ధర్మాలు

అసంఖ్యాకంగా ఉన్న మూలకాల ధర్మాలను అర్థం చేసుకోవడానికి వాటి వర్గీకరణ చాలా అవసరం. ఈ దిశగా చేసిన ప్రయత్నాల్లో మొదటగా చెప్పుకోవాల్సింది 'డాబర్ నీర్ త్రికసిద్ధాంతం'. దీని ప్రకారం మూలకాలను వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు త్రికంలోని మధ్య మూలకం పరమాణుభారం మొదటి, మూడో మూలకాల పరమాణు భారాల సగటుకు దాదాపుగా సమానం.

డాబర్‌నీర్ త్రికాలకు ఉదాహరణలు:

- క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్ (Cl, Br, I)
- లిథియం,సోడియం,పొటాషియం(Li, Na, K)
- ఐరన్, కోబాల్ట్, నికెల్ (Fe, Co, Ni)

న్యూలాండ్, మెండలీఫ్ కూడా మూలకాలను వాటి పరమాణుభారాల ఆరోహణ క్రమంలో వర్గీకరించారు.

న్యూలాండ్ మూలకాలను వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు ప్రతి 8వ మూలకం, మొదటి మూలక ధర్మాన్ని పోలి ఉండటాన్ని గమనించి, ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దీన్నే 'న్యూలాండ్ అష్టక సిద్ధాంతం' అంటారు. దీన్ని భారతీయ సంగీతంలోని స్వరాలు 'స రి గ మ ప ద ని స'లతో పోల్చవచ్చు.

మెండలీఫ్ పూర్తిస్థాయిలో, క్రమ పద్ధతిలో వర్గీకరణ చేశాడు. ఇతడు మూలకాల ధర్మాలు వాటి పరమాణు భారాల ఆవర్తన ప్రమేయాలు అనే ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించాడు. పరమాణు భారాలను నిర్ణయించే సరైన పద్ధతులు లేనప్పటికీ కొన్ని మూలకాల ఉనికిని, వాటి ధర్మాలను ఊహించగలగడం మెండలీఫ్ గొప్పదనం. ఉదాహరణకు పరమాణుభారం 68 ఉన్న మూలకాన్ని ఊహించి, దానికి 'ఎకా అల్యూమినియం' అని పేరు పెట్టాడు. 1875లో డెబోస్బాడ్రన్ ఈ మూలకాన్ని కనుగొని 'గాలియం' అని పేరు పెట్టాడు. అదేవిధంగా పరమాణు భారం 44 ఉన్న మూలకాన్ని ఊహించి, 'ఎకా బోరాన్'గా నామకరణం చేయగా, దీన్ని నిల్సన్ కనుగొని 'స్కాండియం' అని పేరు పెట్టాడు.

మూలకాల ధర్మాలు వాటి పరమాణు సంఖ్య లేదా ఎలక్ట్రాన్ విన్యాసాల ఆవర్తన ప్రమేయాలు అని మోస్లే ప్రతిపాదించాడు. ప్రస్తుతం వినియోగిస్తున్న విస్తృత ఆవర్తన పట్టిక లేదా ఆధునిక ఆవర్తన పట్టికను ఈ ఆవర్తన నియమం ఆధారంగానే రూపొందించారు.

- ఆవర్తన పట్టికలోని నిలువు వరుసలను గ్రూపులుగా, అడ్డు వరుసలను పీరియడ్‌లుగా వ్యవహరిస్తారు.
- సుమారు 117 మూలకాలను 7 పీరియడ్‌లు, 16 గ్రూపులుగా విభజించారు.
- మొదటి పీరియడ్ అతి చిన్న పీరియడ్. దీనిలో హైడ్రోజన్, హీలియం అనే రెండు మూలకాలు మాత్రమే ఉన్నాయి. హైడ్రోజన్ పట్టికలోని మొదటి మూలకం. ఇది అత్యంత తేలికైంది.
- అత్యంత పొడవైన పీరియడ్ 6వది. దీంట్లో 32 మూలకాలున్నాయి.
- 7వది అసంపూర్తి పీరియడ్.
- ప్రతి పీరియడ్ జడవాయువుతో అంతమవుతుంది.

అవి: హీలియం (He), నియాన్ (Ne), ఆర్గాన్ (Ar), క్రిప్టాన్ (Kr), క్జినాన్ (Xe), రెడాన్ (Rn)

సాధారణంగా ఆవర్తన పట్టికలో ఎడమవైపు లోహాలు, కుడివైపు అలోహాలుంటాయి.

ఆవర్తన ధర్మాలు: ఒక నిర్దిష్ట వ్యవధిలో పునరావృతమయ్యే ధర్మాలను ఆవర్తన ధర్మాలు అంటారు.

అవి:

- పరమాణు పరిమాణం
- రుణ విద్యుదాత్మకత
- ఎలక్ట్రాన్ అఫినిటీ
- అయనీకరణ శక్మం
- ధన విద్యుదాత్మకత

పరమాణు పరిమాణం: కేంద్రకం నుంచి బాహ్య కక్ష్యలోని ఎలక్ట్రాన్ మేఘం వరకు ఉన్న మధ్య దూరాన్ని పరమాణు పరిమాణం అంటారు. దీన్ని ఆంగ్‌స్ట్రామ్ యూనిట్లలో కొలుస్తారు.

- పీరియడ్‌లో ఎడమ నుంచి కుడికి కేంద్రకావేశం పెరగడం వల్ల పరమాణు పరిమాణం తగ్గుతుంది.
- గ్రూపులో పై నుంచి కిందికి కక్ష్యల సంఖ్య పెరగడం కారణంగా (ఉల్లిగడ్డపై పొరలు పెరిగినట్లు) పరమాణు పరిమాణం పెరుగుతుంది.

రుణ విద్యుదాత్మకత (ఎలక్ట్రో నెగెటివిటీ): బంధంలోని పరమాణువు ఎలక్ట్రాన్ జంటను తనవైపు ఆకర్షించుకునే స్వభావాన్ని రుణ విద్యుదాత్మకత అంటారు.

- రుణ విద్యుదాత్మకతను పౌలింగ్ స్కేలు ద్వారా కొలుస్తారు.
- పీరియడ్‌లో ఎడమ నుంచి కుడికి రుణ విద్యుదాత్మకత పెరుగుతుంది.
- గ్రూపులో పై నుంచి కిందికి రుణ విద్యుదాత్మకత తగ్గుతుంది.
- రుణ విద్యుదాత్మకత గరిష్ఠంగా ఫ్లోరిన్‌కు, కనిష్ఠంగా సీజియంకు ఉంటుంది.
- రుణ విద్యుదాత్మకత కలిగిన మూలకాలు ఎలక్ట్రాన్‌లను గ్రహించి 'రుణ అయాన్‌లు లేదా ఆనయాన్'లను ఏర్పరుస్తాయి.

అయనీకరణ శక్మం: వాయుస్థితిలోని పరమాణు బాహ్య ఆర్బిటాల్ నుంచి ఒక ఎలక్ట్రాన్‌ను తీసివేయడానికి కావాల్సిన కనీస శక్తిని 'అయనీకరణ శక్మం' అంటారు. దీని ప్రమాణం ఎలక్ట్రాన్ వోల్ట్.

- సాధారణంగా పీరియడ్‌లో ఎడమ నుంచి కుడికి అయనీకరణ శక్మం పెరుగుతుంది. (కొన్ని మినహాయింపులుంటాయి)
- గ్రూపులో పై నుంచి కిందికి అయనీకరణ శక్మం తగ్గుతుంది. సాధారణంగా లోహాలకు అత్యల్ప అయనీకరణ శక్మం ఉంటుంది.

ఎలక్ట్రాన్ అఫినిటీ: వాయుస్థితిలో ఉన్న పరమాణు బాహ్య ఆర్బిటాల్‌లో ఒక ఎలక్ట్రాన్‌ను చేర్చినప్పుడు వెలువడే శక్తినే 'ఎలక్ట్రాన్ అఫినిటీ లేదా ఎలక్ట్రాన్ గ్రాహ్య ఎంథాల్పీ' అంటారు.

- గ్రూపులో పై నుంచి కిందికి ఎలక్ట్రాన్ అఫినిటీ తగ్గుతుంది. పీరియడ్‌లో పెరుగుతుంది (కొన్ని మినహాయింపులుంటాయి)
- ఆవర్తన పట్టికలో గరిష్ఠ ఎలక్ట్రాన్ అఫినిటీ ఉన్న మూలకం క్లోరిన్.

ధన విద్యుదాత్మకత: ఎలక్ట్రాన్‌లను కోల్పోయే స్వభావాన్ని ధన విద్యుదాత్మకత అంటారు.

- సాధారణంగా లోహాలకు ధన విద్యుదాత్మకత ఎక్కువగా ఉంటుంది.
- పరమాణువులు ఎలక్ట్రాన్‌లను కోల్పోయి 'ధనాత్మక అయాన్‌లు లేదా కేటయాన్'లుగా మారతాయి.

ఆక్సీకరణ, క్షయకరణ ధర్మాలు:

- ఒక సమ్మేళనానికి ఆక్సిజన్ కలపడం లేదా హైడ్రోజన్‌ను తీసివేయడం లేదా పరమాణువు నుంచి ఎలక్ట్రాన్‌లను తీసివేయడాన్ని 'ఆక్సీకరణం' అంటారు.
- ఒక సమ్మేళనానికి హైడ్రోజన్‌ను కలపడం లేదా ఆక్సిజన్‌ను తీసివేయడం లేదా పరమాణువులకు ఎలక్ట్రాన్‌లను కలపడాన్ని 'క్షయకరణం' అంటారు.
- ఆవర్తన పట్టికలో ఎడమవైపున్న మూలకాలు లేదా లోహాలు బలమైన క్షయకరణులుగా పని చేస్తాయి **ఉదా:** సీజియం, పొటాషియం. గ్రూపులో ఈ ధర్మం పెరుగుతుంది, పీరియడ్‌లో తగ్గుతుంది.

కార్బన్ మోనాక్సైడ్ (CO), కోక్ లాంటివి కూడా బలమైన క్షయకరణులుగా పని చేస్తాయి. ఇవి లోహశాస్త్రంలో ఎక్కువగా ఉపయోగపడతాయి. ఆక్సీకరణ ధర్మం గ్రూపులో తగ్గుతుంది, పీరియడ్‌లో పెరుగుతుంది. ఆవర్తన పట్టికలో కుడివైపున ఉన్న మూలకాలు (జడవాయువులు మినహా) బలమైన ఆక్సీకరణులు.

ఉదా: హాలోజన్‌లు (ఫ్లోరిన్, క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్).

మాదిరి ప్రశ్నలు

1.మెండలీఫ్ ఆవర్తన పట్టికను దేని ఆధారంగా రూపొందించాడు?
1) పరమాణు భారం
2) పరమాణు సైజు
3) పరమాణు సంఖ్య
4) పరమాణు ఘన పరిమాణం

2. సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ. మూలకాలను మొదటిసారిగా వర్గీకరించింది డాబర్‌నీర్
బి. పరమాణు సైజు ప్రమాణం ఆంగ్ స్ట్రామ్
సి. ఎకా అల్యూమినియంకు గాలియం అని పేరు పెట్టారు
డి. విస్తృత లేదా ఆధునిక ఆవర్తన పట్టికను పరమాణు సంఖ్య ఆధారంగా రూపొందించారు.
1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
3) ఎ, బి, సి మాత్రమే 4) ఎ, బి, సి, డి

3. గ్రూపులో పై నుంచి కిందికి పోయే కొద్దీ పరమాణు పరిమాణం?
1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
3) మారదు
4) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది

4. స్కాండియంను కనుగొన్నది?
1) డెబోస్బాడ్రన్ 2) నీల్సన్
3) డాబర్‌నీర్ 4) లోథర్ మేయర్

5. సరైన వాక్యాలు గుర్తించండి.
ఎ. ఒక సమ్మేళనానికి హైడ్రోజన్ కలపడాన్ని క్షయకరణమంటారు
బి. లోహాలు బలమైన క్షయకరణులు
సి.గ్రూపులో క్షయకరణ ధర్మం పెరుగుతుంది
1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
3) ఎ, బి, సి
4) ఏదీకాదు

6. నిశ్చితవాక్యం (A): ఆవర్తన పట్టికలో రసాయన మూలకాల ఎలక్ట్రాన్ అఫినిటీ ఎల్లప్పుడూ పై నుంచి కిందికి పెరుగుతుంది.
కారణం(R): పరమాణు వ్యాసార్థం సాధారణంగా పై నుంచి కిందికి పెరుగుతుంది.
1) A, R సరైనవి. R, A కు సరైన వివరణ.
2) A, R సరైనవి. R, A కు సరైన వివరణ కాదు.
3) A సరైంది, R సరైంది కాదు
4) A సరైంది కాదు, R సరైంది

7. సాధారణంగా ఒక ఎలక్ట్రోనెగెటివ్ మూలకం పరమాణువు అయాన్ అయితే?
1) అది ఒకటి లేదా అంత కంటే ఎక్కువ ఎలక్ట్రాన్‌లను కోల్పోతుంది
2) అది అయనీకరణం చెందుతుంది
3) దాని పరమాణు సంఖ్య పెరుగుతుంది
4) దాని ఎలక్ట్రాన్ల సంఖ్య పెరుగుతుంది

8. సరైన వాక్యాన్ని గుర్తించండి.
ఎ. ఒక పరమాణువు ఎలక్ట్రాన్‌లను గ్రహించినప్పుడు ఏర్పడే రుణ అయాన్ సైజు పెరుగుతుంది.
బి. ఒక పరమాణువు ఎలక్ట్రాన్లను కోల్పోయి అయనీకరణం చెందినప్పుడు దాని పరిమాణం తగ్గుతుంది.
సి. పరమాణువు ఎలక్ట్రాన్లను గ్రహించినా లేదా కోల్పోయినా దాని పరిమాణం మారదు
డి. లోహాలకు ఎలక్ట్రాన్‌లను గ్రహించే స్వభావం అధికంగా ఉంటుంది.
1) సి మాత్రమే 2) సి, డి మాత్రమే
3) ఎ, బి, సి మాత్రమే
4) ఎ, బి, సి, డి


9. గ్రూపులో సాధారణంగా పెరిగే ధర్మాలు ఏవి?
ఎ) పరమాణు పరిమాణం
బి) లోహ స్వభావం
సి) ఎలక్ట్రో నెగెటివిటి
డి) అయనీకరణ శక్మం
1) ఎ, బి 2) బి, సి
3) సి, డి 4) బి, సి, డి

సమాధానాలు:
1) 1; 2) 4; 3) 2; 4) 2; 5) 3; 6) 4; 7) 4; 8) 3; 9) 1.

If you plan carefully and save money..

BANK EXAMS

GENERAL ENGLISH



Directions (Q.No. 1 to 5): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase printed in ***BOLD*** *in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.*

1. Since the girl did not want to be disturbed while studying, she left the **phone off hooks.**
1) of hook 2) for the hook
3) off hooking 4) off the hook
5) No correction required

2. Since the officer was overburdened with work, her colleague decided to **gave her hand.**
1) giving hands
2) give her a hand
3) giving her handful
4) gave her hands
5) No correction required

3. Despite having passed out from school over ten years back, most schoolmates **has keep touch** with each other.
1) had kept in touch
2) keep touched
3) is keeping touch
4) are kept touched
5) No correction required

4. We must **take it granted** that he will not come for today's function.
1) have it granted
2) took it as granted
3) taking it granted
4) take it for granted
5) No correction required

5. The train will leave at 8.30 pm; we **have been** ready by 7.30 pm so that we can reach the station.
1) should have
2) are 3) must be
4) were 5) No correction required

Directions (Q.No. 6 - 15): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

One day an expert in time management was … (6)… to a group of business management students and to drive home a point he used an … (7)… they will never forget. As he stood in front of a group of brilliant students he said, "Okay it's … (8)… for a quiz." He then pulled out a one gallon jar and set it on the table in front of him. He also … (9)… a dozen fist sized rocks and carefully placed them one at a time into the jar. When the jar was filled to the top and … (10)… more rocks would fit inside, he asked, "Is the jar full?" Everyone in the class … (11)… said 'Yes!' The professor said nothing. He then … (12)… under the table and pulled out a bucket of gravel. He dumped some gravel into the jar and shook it … (13)… pieces of gravel to work themselves down into the spaces between the big rocks. He asked the group once more, "Is the jar full?" 'Probably not.' some answered. 'Good!' he said and began… (14)… sand to the contents in the jar. The sand fitted into the spaces between the rocks and gravel. He also poured water into the jar. "What was the point of this exercise?" he asked. "The point is that no matter how busy your schedule is you can always manage to fit something in," replied one student. 'No' said the professor, "The truth is if you don't fit in the rocks which symbolize the … (15) … things in your life like your family and your dreams first, you'll never have time for them."

6. 1) expressing 2) discussing
3) speaking 4) conveying
5) addressing

7. 1) illustration 2) emblem
3) expression
4) impression 5) imagination

8. 1) scheduled 2) time
3) opportunity 4) usual
5) ready

9. 1) ploughed 2) constructed
3) dug 4) produced
5) made

10. 1) any 2) much
3) some 4) few
5) no

11. 1) emphatically 2) positive
3) convince 4) forcibly
5) definite

12. 1) found 2) searching
3) gone 4) hid
5) reached

13. 1) resulting 2) while
3) causing 4) until
5) making

14. 1) filling 2) pushing
3) substituting 4) adding
5) stuffing

15. 1) important 2) necessarily
3) vitally 4) ideal
5) expensive

Directions (Q.No 16 to 25): In each of the following sentences, a word is italicized and it is followed by five words marked (1), (2), (3) (4) and (5). Choose from these words the one which is nearest in meaning to the italicized word, and indicate your choice.

16. Harish joined the ***ordnance*** factory.
1) Scheduled
2) Experimenting and observations
3) Arms and ammunitions
4) Laboratory 5) Hi-tech

17. Scientists carry out ***empirical*** methods.
1) Mathematical calculation
2) Experimenting and observations
3) Imagination 4) Impractical
5) Rough

18. We cannot enjoy with ***material*** things.
1) Physical 2) Unimportant
3) Unspiritual 4) Tiny
5) Great

19. If you plan carefully and save money, it ***accrues.***
1) Is payable regularly
2) Comes as a natural growth or development
3) Does not occur much
4) Loss 5) Mounts rapidly

20. The whole argument was ***fallacious.***
1) Misleading 2) Sound
3) Funny 4) Witty
5) Guiding

21. He spent his whole life caught up in ***spiritual*** matters.
1) Worldly 2) Criminal
3) Foolish 4) Sacred
5) Inconsequential

22. In spite of the restrictions many nations have been vigorously pursuing ***clandestine*** nuclear weapons programme.
1) Nefarious 2) Progressive
3) Systematic 4) Openly
5) Secretive

23. Mala is ***defiant*** in her behavior.
1) Disobedient
2) Complainant 3) Meek
4) Majestic
5) Magnanimous

24. Blue cross ***vehemently*** criticizes using animals in circus.
1) Weakly 2) Feebly
3) Gently 4) Softly
5) Strongly

25. He was known for his ***magnanimity.***
1) Small 2) Petty
3) Noble 4) Generosity
5) Fare

Directions (Q.No.26 to 30): In each of the following sentences a word or phrase is italicized and it is followed by five words marked (1), (2), (3) (4) and (5). Choose from these words the one which is most nearly opposite in meaning to the italicized word.

26. They were disturbed by his ***hostile*** attitude.
1) Friendly 2) Positive
3) Negative 4) Vibrant
5) Inimical

27. His ***repugnant*** attitude is not appreciable to anyone.
1) Amiable 2) Repulsive
3) Ambience 4) Apolitical
5) Amoral

28. People who are actually running the system often took ***myriad*** aspects into consideration.
1) Far sighted
2) Numerous 3) Few
4) Glassy 5) Smooth

Directions (Q. No. 29 to 31): Read each sentence to find out whether there is any grammatical error or idiomatic error in it. The error if any will be in one part of the sentence. The number of that part will be the answer. If there is no error, mark (5) as your answer. (Ignore punctuation errors if any.)

29. Honesty and integrity are (1)/ the qualities which cannot be (2)/ done away with (3)/ and hence assume a lot of importance. (4)/ No error (5)

30. Psychologists point out (1)/ that there are (2)/ human processes which does not involve (3)/ the use of words.(4)/ no error (5)

31. It is high time (1)/ that (2)/ we send (3)/ the answer. (4)/ No error (5)

KEY

1) 4; 2) 2; 3) 1; 4) 4; 5) 3; 6) 3; 7) 1; 8) 2; 9) 4; 10) 5; 11) 1; 12) 5; 13) 3; 14) 4; 15) 1 16) 3; 17) 2; 18) 1; 19) 2; 20) 1; 21) 4; 22) 5; 23) 1; 25) 4; 26) 1; 27) 1; 28) 3; 29) 5; 30) 3; 31) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

ఈసీజీసీ లిమిటెడ్‌లో 40 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని ఈసీజీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేడర్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 40.
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ (గ్రాడ్యుయేషన్) లేదా తత్సమానమైన అర్హత కలిగి ఉండాలి.
» వయసు: 01.09.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.53,600 నుంచి రూ.1,02,090.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్), డిస్క్రిప్టివ్ పేపర్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ/దరఖాస్తు సవరణ తేదీలు: 14.09.2024 నుంచి 13.10.2024 వరకు
» దరఖాస్తు ఫీజు చెల్లింపు తేదీలు: 14.09.2024 నుంచి 13.10.2024 వరకు
» ఆన్‌లైన్ రాతపరీక్ష తేది: 16.11.2024.
» రాతపరీక్ష ఫలితాల ప్రకటన తేదీలు: 16.12.2024 నుంచి 31.12.2024 మధ్య.
» ఇంటర్వ్యూ తేదీలు: జనవరి/ఫిబ్రవరి 2025.
» వెబ్‌సైట్: https://www.ecgc.in

ఐజీసీఏఆర్, కల్పకంలో 198 ట్రేడ్ అప్రెంటిస్‌లు

కల్పకం(తమిళనాడు)లోని ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్ (ఐజీసీఏఆర్).. ఏడాది ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 198.
» శిక్షణ కాలం: ఒక సంవత్సరం.
» అర్హత: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 13.10.2024 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» స్టైపెండ్: నెలకు రూ.7,700 నుంచి రూ.8,050.
» ఎంపిక విధానం: ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 14.09.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.10.2024
» వెబ్‌సైట్: https://www.igcar.gov.in